

'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 17 సంచిక: 10

మంగళవారం 2-4-2024

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



ముంబైకి మూడో ఓటమి

ఆరు వికెట్ల తేడాతో రాజస్థాన్ రాయల్స్ విజయం - 14లో



బంగారం మెరుపులు


న్యూఢిల్లీలో 10 గ్రాముల ధర రికార్డు స్థాయిలో రూ.68,420కి చేరిక -15లో



తిహార్ జైలుకు కేజ్రీవాల్

'మద్యం' కేసులో ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు ఈనెల 15 వరకు జ్యుడీషియల్ కస్టడీ విధిస్తూ కోర్టు ఉత్తర్వులిచ్చింది.

వివరాలు 6లో ▸



కఠిన చర్యలు తీసుకోబోం

ఆదాయ పన్ను బకాయిల కోసం ప్రస్తుత పరిస్థితుల్లో కాంగ్రెస్‌పై కఠిన చర్యలకు దిగబోమని సుప్రీంకు 'ఐటీ' తెలిపింది.

వివరాలు 6లో ▸

ఈసీ మందలింపు

మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత దిలీప్, కాంగ్రెస్ నేత శ్రీనేత్‌లను ఈసీ మందలించింది.

వివరాలు 6లో ▸

మేమంతా మీ వెంటే

ముఖ్యమంత్రి వైఎస్ జగన్ బస్సు యాత్రలో జనగర్జన

పెత్తందారులపై పోరుకు మేమంతా సిద్ధం అని నినాదాలు

- పోటెత్తిన ప్రజాభిమానం.. ఇసుకేస్తే రాలనంతగా జనం
- ఊరూరా గజమాలలతో ఘన స్వాగతం
- మహిళా కూలీలతో సీఎం జగన్ మాటామంతి
- సామాన్య జనంతో మాట కలిపి మమేకం
- సీఎంతో మాట్లాడేందుకు పోటీ పడిన అక్కచెల్లెమ్మలు
- బస్సు వెంట పరుగులు తీసిన యువకులు

10లో

ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయాన్నే ఠంఛన్‌గా పెన్షన్‌ను ఇంటికి పంపిన మనవడిని చూడటానికి అవ్వాతాతలు.. దశాబ్దాల సొంతింటి కల నెరవేర్చిన సోదరుడి కోసం అక్కచెల్లెమ్మలు.. అమ్మ ఒడి, విద్యా కానుక, విద్యా దీవెన పథకాలతో తమ చదువులకు భరోసా ఇచ్చిన మామయ్యతో మాట కలపడానికి విద్యార్థులు.. సొంతకాళ్లపై నిలబడ్డామని చెప్పడానికి యువతీ యువకులు.. ఇలా ఒక్కరేంటి అన్ని వర్గాల ప్రజలతో అనంతపురం-చెన్నై జాతీయ రహదారి కిక్కిరిసింది. ప్రియతమ నేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను దగ్గరి నుంచి చూడాలని, కరచాలనం చేయాలని, కుదిరితే మాట కలపాలని వేలాది మంది ప్రజలు పరితపించడం అడుగడుగునా కనిపించింది. సీఎం సైతం ప్రజలతో అదే రీతిలో మమేకమయ్యారు.



కదిరిలో జరిగిన ఇఫ్తార్ విందు కార్యక్రమంలో ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థన చేస్తున్న సీఎం జగన్

అడ్వాన్స్‌డ్ ఈద్ ముబారక్

11లో

ఇఫ్తార్ విందులో ముస్లింలకు ముందస్తు రంజాన్ శుభాకాంక్షలు తెలిపిన సీఎం జగన్



శ్రీ సత్యసాయి జిల్లా కదిరిలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు స్వాగతం పలుకుతున్న అశేష జనసందోహంలో ఓ భాగం

బోసి నవ్వులకు భరోసా ఏదీ?

చంద్రబాబు కుటిలత్వంపై సర్వత్రా విమర్శలు

12లో

- చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్న వృద్ధులు
- గంటలకొద్దీ క్యూలైన్లలో ఉన్న జ్ఞాపకాలతో ఆందోళనలో పెన్షనర్లు
- తీవ్ర నైరాశ్యంలో వృద్ధులు, దివ్యాంగులు

తిరుగుబాటుతో తత్తరపాటు

అవ్వాతాతలకు పింఛన్లపై ఆటంకాలు బాబు బృందం నిర్వాకమే

పింఛన్ల పంపిణీపై వలంటీర్లకు వ్యతిరేకంగా ఫిబ్రవరి 1న ఈసీకి అచ్చెన్న ఫిర్యాదు

- 4 నెలలుగా సుప్రీం, ఢిల్లీ హైకోర్టు, రాష్ట్ర హైకోర్టులో నిమ్మగడ్డ పిటిషన్లు.. ఫిబ్రవరి 23, 25న ఈసీకి సైతం ఫిర్యాదు
- నిమ్మగడ్డ - బాబు బంధం స్థానిక ఎన్నికల్లోనే బట్టబయలు
- బాబు బృందం ఫిర్యాదులతోనే ఇంటి వద్ద పింఛన్లకు ఈసీ బ్రేక్
- సీఎం జగన్ ప్రభుత్వానికి ఆపాదిస్తూ 'ఈనాడు' రోత కథనాలు
- గతంలో విమర్శించిన సచివాలయాల ఉద్యోగులతోనే పింఛన్లు పంచాలంటూ డిమాండ్
- లబ్ధిదారుల ఇళ్ల వివరాలకు వారూ ఎవరో ఒకరిపై ఆధారపడాల్సిందేగా?
- ఇవన్నీ ఆలోచించి నిర్ణయం తీసుకున్న అధికారులపై అభాండాలు



సాక్షి, అమరావతి: అవ్వాతాతలను అవస్థలకు గురి చేస్తూ ఇంటివద్ద పింఛన్ల పంపిణీకి అడ్డుపడ్డ పచ్చ ముఠా దీనిపై తీవ్ర స్థాయిలో ఆగ్రహావేశాలు వ్యక్తం కావడంతో తత్తరపాటుకు గురై రాష్ట్ర ప్రభుత్వంపై బురద జల్లేందుకు బరి తెగించింది. వలంటీర్లపై ఆది నుంచి విద్వేషాన్ని పెంచుకున్న టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు బృందం ఇన్నాళ్లూ సజావుగా సాగిన సామాజిక పింఛన్ల పంపిణీకి ఎన్నికల వేళ ఆటంకాలు కల్పించేందుకు సాహసించింది. గత నాలుగున్నరేళ్లకు పైగా రాష్ట్రంలో వలంటీర్ల ఆధ్వర్యంలో ప్రతి నెలా ఠంచన్‌గా లబ్ధిదారుల ఇంటివద్దే చిన్న అవాంతరం కూడా లేకుండా కోవిడ్ వేళ కూడా పెన్షన్లు అందచేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం కారణంగా ఇప్పుడు ఆ ప్రక్రియకు ఇబ్బందులు తలెత్తలేదన్నది నిజం. స్వతంత్ర సంస్థ ముసుగులో బాబు రాజకీయ ప్రయోజనాల కోసం

మిగతా 15వ పేజీలో ▸

పింఛన్లు అడ్డుకుని దొంగ ఏడుపు

ఇంటింటికి వెళ్లి ఇవ్వాలని సీఎస్‌ను కోరిన టీడీపీ నేతలు

వలంటీర్ల ద్వారా తాము వద్దనలేదని బాబు బుకాయింపు



ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డితో మాట్లాడుతున్న టీడీపీ నేతలు

సాక్షి, అమరావతి: ఐదేళ్లుగా పక్కాగా, ఠంచన్‌గా జరుగుతున్న ఇంటి వద్దే పింఛన్ల పంపిణీని అడ్డుకునే వరకు నిద్రపోని టీడీపీ నాయకులు ఇప్పుడు మొసలి కన్నీళ్లు కారుస్తుండటంపై లబ్ధిదారులు తీవ్రంగా మండిపడుతున్నారు. వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులకు వలంటీర్లు ప్రతి నెలా 1న ఇంటివద్దే పెన్షన్లు అందిస్తుండటాన్ని సహించలేని చంద్రబాబు దొడ్డిదారిన అడ్డుకున్నారు. రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ ద్వారా వలంటీర్లపై వరుసగా ఫిర్యాదులు చేశారు. దీంతో కోడ్ ముగిసేవరకు వలంటీర్లను ఈ ప్రక్రియకు దూరంగా ఉంచాలని ఎన్నికల కమిషన్ ఆదేశించడంతో ఇంటింటికీ పింఛన్ల పంపిణీకి అవాంతరాలు ఎదురయ్యాయి. కానీ, ప్రజాగ్రహంతో ఉలిక్కిపడ్డ టీడీపీ నేతలు నక్కా ఆనంద్‌బాబు, కన్నా లక్ష్మీనారాయణ, దేవినేని ఉమా తదితరులు

మిగతా 2వ పేజీలో ▸

ఇంకా చెప్పాలంటే...



చంద్రబాబూ.. పింఛన్లను ఆపడం

మీ తరం కాదు

పేదోళ్ల ఉసురు పోసుకుని నువ్వేమి బాగుపడతావ్?

- కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైరవీ చేసింది మీ వదిన పురందేశ్వరి కాదా?.. నిమ్మగడ్డ రమేష్, పురందేశ్వరి ఎవరో ప్రజలకు తెలియదా?
- వలంటీర్లను పక్కన పెట్టండని ఈసీ చెప్పగానే సంబరాలు చేసుకుంటారా?..
- 65 లక్షల మంది పింఛన్‌దారులు క్లైమా కొట్టేస్తారని బాబుకు కంగారు
- 2 నెలలు పింఛన్ ఆపితే సీఎం జగన్‌పై వ్యతిరేకత వస్తుందా?.. జగన్ అంటేనే నమ్మకం.. చంద్రబాబు అంటే అబద్ధాలు కోరు
- మాజీ మంత్రి పేర్ని నాని

16లో



అవ్వాతాతలపై బాబు కక్ష

వైఎస్సార్‌సీపీ నేతల ఆగ్రహం

- ఈసీ ఆదేశాలను పునఃసమీక్షించాలి: మంత్రి బొత్స
- బాబుకు అవ్వాతాతల శాపనార్థాలు: మంత్రి కారుమూరి
- చంద్రబాబు నరరూప రాక్షసుడు: ఎంపీ భరత్
- చంద్రబాబుది రాక్షసానందం: మంత్రి ఆదిమూలపు

12లో

21 కాదు..11

పేరే జనసేనది.. పోటీచేసేది టీడీపీనే అంటున్న జనసేన శ్రేణులు

ఇవి చంద్రబాబు-పవన్‌కళ్యాణ్ కుమ్మక్కు డ్రామాలంటూ మండిపాటు

- జనసేనకిచ్చిన మెజారిటీ సీట్లలో గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన వారే ఇప్పుడు జనసేన అభ్యర్థులుగా బరిలో..
- వీరు కూడా సీటు కేటాయింపు తర్వాత జనసేనలోకి చేరిక
- తాజాగా.. అవనిగడ్డ, పాలకొండ టీడీపీ నేతలు అలా జనసేనలో చేరి ఇలా టికెట్లు కైవసం
- గత ఎన్నికల్లో పోటీచేసిన.. లేదా గత ఐదేళ్లలో పార్టీకి పనిచేసిన వారికి దక్కింది సగం సీట్లే అంటున్న నేతలు
- బీజేపీకి కేటాయించిన పది సీట్ల పరిస్థితి కూడా ఇంతేనంటూ కమలదళంలో చర్చ



సాక్షి, అమరావతి: అంతన్నాడు.. ఇంతన్నాడే గంగరాజు.. అన్నట్లుగా ఉంది ఇప్పుడు జనసేన పరిస్థితి. తెలుగుదేశం పార్టీతో పొత్తుకు ముందు వరకు జనసేనకు 60, 50, 40 సీట్లంటూ ఊరించి చివరికి పవన్‌కళ్యాణ్‌కు టీడీపీ అధినేత చంద్రబాబు కేటాయించింది కేవలం 21 సీట్లేనని.. తీరా అభ్యర్థులను పూర్తిస్థాయిలో ఖరారు చేసేశాక చూస్తే అందులో టికెట్లు పొందిన అసలు సిసలైన జనసేన నేతలు కేవలం పదకొండు మందేనని ఆ పార్టీ నేతలు నిట్టూర్పు విడుస్తున్నారు. గత ఎన్నికల్లో టీడీపీ తరఫున పోటీచేసిన అభ్యర్థులే సరిగ్గా ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వచ్చేసరికి జనసేన పార్టీలో చేరి, ఆ పార్టీ తరఫున పోటీచేస్తుండడాన్ని చూసి ఇవేం పొత్తులురా బాబూ అంటూ జనసేన శ్రేణులు రుసరుసలాడుతున్నారు. నిజానికి.. రెండు పార్టీలు

మిగతా 2వ పేజీలో ▸



ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

మా బతుకులు మార్చిన సర్కారు



మాది అరకొర ఆదాయంతో జీవించే కుటుంబం. రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి. గత ప్రభుత్వాల నుంచి ఎలాంటి సాయం అందకపోవడంతో ఒడిదొడుకుల జీవనం గడపాల్సి వచ్చింది. ఈ ప్రభుత్వం వచ్చాక మా ఆర్థిక పరిస్థితి ఎంతో మారిపోయింది. మేము విశాఖ జిల్లా భీమిలి మండలం మజ్జివలసలో ఉంటున్నాం. డ్వాక్రా గ్రూప్ సభ్యురాలినైన నాకు వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.40 వేలు వచ్చింది. నా కుమారుడు శ్యామ్ సందీప్‌కు స్కూల్‌లో ట్యాబ్ ఇచ్చారు. కుమార్తె జెస్సికాకు అమ్మఒడి పథకం ద్వారా ఏడాదికి రూ.15 వేలు వంతున వచ్చింది. నా భర్త చంటికి సెర్ప్ ద్వారా ఆటో కొనుగోలుకు వడ్డీ లేని రుణం రూ.3.30 లక్షలు వచ్చింది. వాహనమిత్ర ద్వారా ఏటా రూ.10 వేలు వంతున లబ్ధి కలిగింది. మా అత్త సరస్వతికి పెన్షన్ కానుక అందుతోంది. పద్మనాభం మండలం కురపల్లిలో 78 గజాల ఇంటి స్థలం ప్రభుత్వం అందించింది. ప్రభుత్వం అందించిన ఆర్థిక సాయంతో దుస్తుల వ్యాపారం చేస్తున్నా. నెలకు రూ.10 వేల వరకు ఆదాయం లభిస్తోంది. ఇప్పుడు మేమంతా సంతోషంగా ఉన్నాం. ఇందుకు కారణమైన జగనన్న రుణం తీర్చుకుంటాం.

– పందిరి లక్ష్మి, మజ్జివలస

(గేదెల శ్రీనివాసరెడ్డి, విలేకరి, తగరపువలస)

ఒంటరి బతుక్కు అండగా నిలిచారు

నేను ఒంటరి మహిళను. రజక వృత్తి చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. ఏలూరు జిల్లా పోలవరం పంచాయతీ పరిధిలోని కొత్తపేటలో నివాసం ఉంటున్నా. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులు మావి. జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక నా బతుకు చిత్రం మారింది. జగనన్న ప్రభుత్వంలో అందుతున్న సాయంతో ఇప్పుడు నేను సంతోషంగా జీవిస్తున్నా. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏటా రూ.18,750 ఆర్థిక సహాయం అందుతోంది. రజకులకు ప్రభుత్వం అందిస్తున్న చేదోడు పథకం ద్వారా రూ.10 వేలు అందుతోంది. ఒంటరి మహిళ పింఛన్ రూ.3 వేలు ప్రతి నెలా వలంటీర్ ఇంటికి తీసుకువచ్చి ఇస్తోంది. దీంతోపాటు ఇంటి బయట బడ్డీ పెట్టుకుని ఇస్త్రీ పెట్టె కొనుక్కొని.. బట్టలు ఇస్త్రీ చేసుకుంటూ కొంత సంపాదిస్తున్నా. మాలాంటి పేదోళ్లకు,



భర్త లేని వారికి, ఒంటరి మహిళలకు జగనన్న అందిస్తున్న సాయం మరువలేనిది. ఆయన రుణం తీర్చుకోలేనిది. గత ప్రభుత్వ హయాంలో ఇటువంటి పథకాలు ఏవీ అందలేదు. జగనన్న రుణం తీర్చుకోలేనిది.

– ఉంగుటూరు లక్ష్మి, పోలవరం

(వ్యాఘ్రేశ్వరరావు, విలేకరి, పోలవరం రూరల్)

ఇప్పుడు హాయిగా జీవిస్తున్నాం

మాది కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం పెద్దిపాలెం గ్రామంలోని సాధారణ మధ్య తరగతి కుటుంబం. ఈ ప్రభుతం వచ్చాక వైఎస్సార్ ఆసరా పథకం కింద రూ.10,950, డ్వాక్రా రుణం రూ.లక్ష, స్త్రీనిధి కింద రూ.50 వేలు వచ్చింది. దీంతో మా గ్రామంలో నేను, నా భర్త రామచంద్రరావు దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు శివ, పవన్ అనే ఇద్దరు కుమారులున్నారు. వీరిద్దరికీ వివాహాలు కావడంతో వారు రోజువారీ పనులు చేసుకుంటూ వారి బతుకులు వారు బతుకుతున్నారు. మా మనవళ్లకు అమ్మ ఒడి కింద ఏటా రూ.15 వేలు వస్తోంది. డ్వాక్రా రుణంతో దుకాణం పక్కనే



చిన్న ఇల్లు కట్టుకొని కాపురం ఉంటున్నాం. ఈ ప్రభుత్వంలో వచ్చిన పథకాలతో ఆర్థిక ఇబ్బందులు తీరి ఆనందంగా జీవిస్తున్నాం.

– సాలారపు సత్యవతి, పెద్దిపాలెం

(ప్రగడ రామకృష్ణ, విలేకరి, ప్రత్తిపాడు రూరల్)

బాబు, పవన్ డబుల్‌గేమ్‌పై క్యాడర్ తిరుగుబాటు





యలమంచిలిలో ఒకరినొకరు తోసుకుంటున్న తెలుగు తమ్ముళ్లు, అవనిగడ్డ సమావేశంలో ఆవేదన వ్యక్తం చేస్తున్న జనసేన నేత బండ్రెడ్డి రామకృష్ణ

పలు నియోజకవర్గాల్లో నిరసనల మంట
- అవనిగడ్డలో అడ్డం తిరిగిన జనసేన
- యలమంచిలి టీడీపీ సమావేశం రసాభాస
- రాజంపేటలో బత్యాల బల ప్రదర్శన
- పాడేరులో గిడ్డి ఈశ్వరి ర్యాలీ

అవనిగడ్డ/ఎలమంచిలి/రాజంపేట/పాడేరు: పొత్తులో భాగంగా టికెట్ల కేటాయింపులో చంద్రబాబు నాయుడు, పవన్‌కళ్యాణ్ ఉమ్మడిగా ఆడుతున్న డబుల్‌గేమ్‌పై ఆయా నియోజకవర్గాల్లో అసమ్మతి జ్వాలలు రేగుతున్నాయి. అవనిగడ్డలో జనసేన నాయకులు ఎదురుతిరగగా, యలమంచిలిలో టీడీపీ రెండు వర్గాలుగా విడిపోయింది. రాజంపేట, పాడేరు నియోజకవర్గాల్లో ఆయా నేతలు ర్యాలీలు నిర్వహించారు. కృష్ణా జిల్లా అవనిగడ్డ నియోజకవర్గం జనసేన నేతలు మాజీ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ చేరికపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఆయనకు సీటు ప్రకటిస్తే మూకుమ్మడి రాజీనామాలు చేస్తామని, ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతిచ్చేది లేదని తెగేసి చెప్పారు. సోమవారం అవనిగడ్డలో జనసేన నాయకులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. బచ్చు వెంకటనాథ్ ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో జనసేన ఉమ్మడి కృష్ణా అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ మాట్లాడుతూ గత పదేళ్లుగా పార్టీ బలోపేతం కోసం కష్టపడిన నాయకులను కాదని ఈరోజు పార్టీలో చేరిన వారికి సీటు ఎలా ఇస్తారని మండిపడ్డారు. ఉమ్మడి కృష్ణా జిల్లా అధికార ప్రతినిధి రాయపూడి వేణుగోపాలరావు మాట్లాడుతూ బుద్ధప్రసాద్ ఎమ్మెల్యేగా ఉన్న సమయంలో జనసేన కోసం పోరాడిన తనపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు పెట్టించారని, నడిరోడ్డుపై నిలబెట్టి విమర్శలు చేసిన వ్యక్తికి నేడు సీటెలా ఇస్తారని ప్రశ్నించారు. బుద్ధప్రసాద్‌కు సీటు ప్రకటిస్తే ఎట్టి పరిస్థితుల్లోనూ మద్దతు ఇచ్చేది లేదని, వెంటనే మూకుమ్మడి రాజీనామాలు చేసేందుకు సిద్ధంగా ఉండాలని సమావేశంలో తీర్మానం చేశారు. ఎన్నికలకు ముందు పార్టీలు మారడం బుద్ధప్రసాద్‌కు అలవాటని, 2019లో కాంగ్రెస్ నుంచి టీడీపీలోకి, ఇప్పుడు జనసేనలోకి వచ్చారని కార్యకర్తలు మండిపడ్డారు. వైఎస్సార్‌సీపీ నుంచి జనసేనలో చేరిన వల్లభనేని బాలశౌరి మంత్రాంగం నడిపి బుద్ధప్రసాద్‌ను జనసేనలోకి తీసుకొచ్చారని, ఎంపీ సీటు కోసం ఆయన, ఎంఎల్‌ఏ సీటుకు బుద్ధప్రసాద్ పార్టీలు మారారని జనసైనికులు బాహాటంగానే విమర్శిస్తున్నారు. పార్టీ నాయకులు మత్తి వెంకటేశ్వరరావు, చిలకలపూడి పాపారావు, గుడివాక శేషుబాబుతో పాటు ఆరు మండలాలకు చెందిన జనసేన నాయకులు సమావేశంలో పాల్గొన్నారు.

సమాచారం ఇవ్వకుండా మీటింగా?

అనకాపల్లి జిల్లా యలమంచిలిలో టీడీపీ సీనియర్ నేత పప్పల చలపతిరావు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమావేశం రసాభాసగా ముగిసింది. నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జ్ ప్రగడ నాగేశ్వరరావు తెలియకుండా సమావేశం ఎలా నిర్వహిస్తారని ఆయన అనుచరులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. కోట్లు ఖర్చు పెట్టించి ఐదేళ్లుగా టీడీపీ కోసం కష్టపడి పనిచేయించుకుని, పొత్తు పేరుతో నాగేశ్వరరావుకు హ్యాండిచ్చారని వారు నిరసన వ్యక్తం చేశారు. అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సోదరుడు సీఎం రాజేష్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు బుద్ధ నాగ జగదీష్‌ల సమక్షంలోనే పప్పల చలపతిరావును వేదికపైకి రానీయకుండా నెట్టేశారు. దీంతో రెండు వర్గాల మధ్య వాగ్వాదం, తోపులాట, ఉద్రిక్తత చోటుచేసుకుంది. పార్టీ సీనియర్లకు వ్యతిరేకంగా కార్యకర్తలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. దీంతో సమావేశం ప్రారంభం కాకుండానే వాయిదా వేస్తున్నట్టు బుద్ధ నాగజగదీష్ ప్రకటించారు. పార్టీ అధిష్టానం నుంచి సానుకూల ప్రకటన రాకపోతే రెండ్రోజుల్లో 10 వేల మందితో సమావేశం ఏర్పాటు చేసి తమ సత్తా చూపుతామని ప్రగడ నాగేశ్వరరావు వర్గీయులు స్పష్టం చేశారు.

సుగవాసి వద్దే వద్దు

పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేట టికెట్ రాయచోటి వాసి సుగవాసి బాలసుబ్రమణ్యానికి కేటాయించడం టీడీపీలో చిచ్చు రేపింది. సోమవారం టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, టీడీపీ రాజంపేట ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు తన వర్గీయులతో బలప్రదర్శన చేపట్టారు. అన్నమయ్య జిల్లా రాజంపేటలోని తిరుపతి రహదారిలోని ఎస్ఆర్ కళ్యాణ మండపం నుంచి ర్యాలీ కొనసాగింది. చంద్రబాబునాయుడు నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ సుగవాసి వద్దు అంటూ నినాదాలు చేశారు. చెంగల్రాయుడు మాట్లాడుతూ తనే అభ్యర్థి అని, రాజంపేట నుంచి పోటీ చేసి గెలిచి వస్తే మంచి భవిష్యత్తు కలిప్తామని చంద్రబాబే చెప్పారని తెలిపారు. కానీ సుగవాసి బాలసుబ్రమణ్యానికి టికెట్ ఇచ్చినట్లు సమాచారం వచ్చిందన్నారు. ర్యాలీ పాతబస్టాండు, శివాలయం, ఆర్టీసీ బస్టాండు, మన్నూరు మీదుగా యల్లమ్మగుడి వరకు కొనసాగింది.

రమేష్‌నాయుడిని ఓడిద్దాం

అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరులో మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి తన అనుచరులతో సమావేశం నిర్వహించారు. టికెట్ దక్కలేదని ఆగ్రహంతో ఉన్న ఆమె సోమవారం కుమ్మరిపుట్టులోని తన నివాసంలో నియోజకవర్గంలోని ఐదు మండలాలకు చెందిన తన అనుచరులు, పార్టీ శ్రేణులతో సమావేశం నిర్వహించి ర్యాలీ చేశారు. ఈ సందర్భంగా టీడీపీ అభ్యర్థి రమేష్ నాయుడు వద్దు..గిడ్డి ఈశ్వరి ముద్దు అంటూ నినాదాలు చేశారు. పార్టీ అధిష్టానం పునరాలోచించి గిడ్డి ఈశ్వరికి టికెట్ కేటాయించాలని, లేని పక్షంలో రమేష్‌నాయుడును ఓడిస్తామని హెచ్చరించారు.

మరోసారి ఆ ఉత్తర్వులను పరిశీలించండి

- జూనియర్ కళాశాలల ప్రిన్సిపాళ్లుగా లైబ్రేరియన్లు, పీడీల నియామకంపై హైకోర్టు సూచన
- కోర్టు ముందు స్వయంగా హాజరైన ప్రవీణ్ ప్రకాశ్
- డిగ్రీ కళాశాలల్లో పదోన్నతిపై లైబ్రేరియన్లను ప్రిన్సిపాళ్లుగా నియమిస్తున్నాం
- అదే విధానాన్ని ఇంటర్, పాఠశాలల స్థాయిలో కూడా అమలు చేస్తున్నాం
- ప్రిన్సిపాళ్లు పాలనా వ్యవహారాలనే చూస్తారు • హైకోర్టుకు నివేదించిన ప్రవీణ్ ప్రకాశ్

సాక్షి, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో లైబ్రేరియన్లను, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపాళ్లుగా నియమించే విషయంలో జారీ చేసిన ఉత్తర్వులను మరోసారి సమగ్రంగా పరిశీలించి నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సోమవారం పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్‌కి స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 18కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తులు జస్టిస్ గుహనాథన్ నరేందర్, జస్టిస్ నూనెపల్లి హరినాథ్‌లతో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పనిచేసే 197 మంది లెక్చరర్లకు ప్రిన్సిపాళ్లుగా పదోన్నతి కల్పిస్తూ ఇంటర్ విద్య కమిషనర్ ఈ నెల 15న ఇచ్చిన ప్రొసీడింగ్స్‌ను సవాల్ చేస్తూ ప్రభుత్వ జూనియర్ కళాశాలల (లైబ్రరీ సైన్స్) సంఘం అధ్యక్షుడు కె.సంజీవరావు, మరికొందరు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. పదోన్నతుల విషయంలో లైబ్రరీ సైన్స్ చేసిన లెక్చరర్లను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోలేదని వారు కోర్టుకు నివేదించారు. వాదనలు విన్న సింగిల్ జడ్జి.. ఇంటర్ విద్య కమిషనర్ ఇచ్చిన ప్రొసీడింగ్స్ అమలును నిలిపేస్తూ ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ సూళ్లూరుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపల్ శ్యాంకుమార్.. ధర్మాసనం ముందు అప్పీల్ దాఖలుచేశారు. ఈ అప్పీల్‌పై ధర్మాసనం తాజాగా మరోసారి విచారణ జరిపింది.

సమాధానాలిచ్చిన ప్రవీణ్ ప్రకాశ్

గత విచారణ సమయంలో ధర్మాసనం ఇచ్చిన ఆదేశాల మేరకు ప్రవీణ్ ప్రకాశ్ స్వయంగా కోర్టు ముందు హాజరయ్యారు. ధర్మాసనం లేవనెత్తిన ప్రశ్నలకు ఆయనే స్వయంగా సమాధానాలు ఇచ్చారు. జీవో 76ను ఆయన సమర్థించారు. డిగ్రీ కళాశాలల్లో లైబ్రేరియన్లను పదోన్నతిపై ప్రిన్సిపాళ్లుగా నియమిస్తున్నామన్నారు. ఇదే విధానాన్ని ఇంటర్, పాఠశాల స్థాయిల్లో కూడా అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో పలు వర్సిటీలకు వీసీలుగా ఐఏఎస్ అధికారులు ఉన్నారని గుర్తు చేశారు. వారికి బోధనపై అవగాహన ఉండదని, అయితే పరిపాలన సౌలభ్యం నిమిత్తం ప్రభుత్వం వారిని నియమిస్తోందన్నారు. ప్రిన్సిపళ్లు ఆయా కాలేజీల పాలనా వ్యవహారాలు మాత్రమే చూస్తారన్నారు. ప్రిన్సిపాళ్లుగా నియమితులైన లైబ్రేరియన్లు, ఫిజికల్ డైరెక్టర్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తామని తెలిపారు. ధర్మాసనం జోక్యం చేసుకుంటూ.. సీనియారిటీ ఉందని పదోన్నతిపై నర్సింగ్ సూపరింటెండెంట్‌ను సర్జన్‌గా నియమించం కదా? అని ప్రశ్నించింది. లైబ్రేరియన్లకు పుస్తకాల్లో అంశాలపై ఏం అవగాహన ఉంటుందని నిలదీసింది. దీంతో లైబ్రేరియన్లను, ఫిజికల్ డైరెక్టర్లను ప్రిన్సిపాళ్లుగా నియమించే విషయంలో ఉత్తర్వులను మరోసారి సమగ్రంగా పరిశీలిస్తామని ప్రవీణ్‌ప్రకాశ్ తెలిపారు. వివరాలను కోర్టు ముందుంచడానికి కొంత సమయం ఇవ్వాలని కోరారు.

పెత్తందార్ల కోసం చంద్రబాబు కిరాయి రాజకీయం

- దళితులను కించపరచడమే పనిగా పెట్టుకున్నారు
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు



సాక్షి, అమరావతి: పెత్తందారుల కోసం పనిచేసే కిరాయి రాజకీయ నాయకుడు చంద్రబాబని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకర్‌రావు మండిపడ్డారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. పేదలందరూ కూలీలుగానే బతకాలన్న చంద్రబాబు అహంకారానికి చరమగీతం పాడే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని హెచ్చరించారు. పేద, బడుగు, బలహీన వర్గాలకు చట్టసభల్లో అడుగుపెట్టే అర్హత లేదని చెప్పే చంద్రబాబుకు.. ఆయన తనయుడు లోకేశ్‌కు అసలు రాష్ట్రాన్ని పాలించే అర్హత ఎవరిచ్చారని నిలదీశారు. ఎమ్మెల్యేగా గెలవలేని లోకేశ్‌ను దొడ్డిదారిన మంత్రి పదవిలో కూర్చోబెట్టి.. ఏపీకి గుదిబండలా మార్చి దోచుకుతిన్నారని దుయ్యబట్టారు. ఏనాడూ పేదలను పట్టించుకోని చంద్రబాబు కూటమితో జతకట్టి దళితులను కించపరచడమే ప్రచారంలో పనిగా పెట్టుకున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శింగనమల వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వీరాంజనేయులను టిప్పర్ డ్రైవర్, నిశానీ అంటూ ఎగతాళి చేయడం చంద్రబాబు కుల దురహంకారానికి నిదర్శనమన్నారు. కానీ, సీఎం జగన్.. అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తితో, మహాకవి శ్రీశ్రీ చెప్పినట్టుగా సహస్ర వృత్తులనూ చట్టసభల్లోకి తీసుకెళుతూ సమోన్నత గౌరవాన్నిస్తున్నారని కొనియాడారు. రూ.2.70 లక్షల కోట్లను నేరుగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అందించి పేద వర్గాల ఆత్మగౌరవాన్ని నిలబెట్టారని చెప్పారు. గతంలో చంద్రబాబు అంబేడ్కర్ విగ్రహాన్ని పెడతామని మోసం చేస్తే.. సీఎం జగన్ విజయవాడ నడిబొడ్డులో 125 అడుగుల అంబేడ్కర్ స్ఫూర్తిని ఆకాశాన నిలబెట్టారని కొనియాడారు. ఎస్సీలు రెడ్లను పెళ్లి చేసుకుంటే.. అసెంబ్లీ, పార్లమెంట్లకు వస్తారా అంటూ చంద్రబాబు మాట్లాడుతున్నారని, గతంలో ఎన్నడూ అగ్రవర్ణాలను వివాహమాడిన ఎస్సీలకు సీట్లివ్వలేదా అంటూ జూపూడి నిలదీశారు.

21 కాదు..11

▶ మొదటి పేజీ తరువాయి

మిత్రపక్ష పార్టీలే అయినప్పుడు పొత్తులో ఆ సీట్లు టీడీపీనే ఉంచుకుని జనసేనకు వేరే సీట్లు కేటాయించవచ్చు కదా అంటూ వారు మండిపడుతున్నారు. పొత్తులో జనసేనకు కేటాయించి నిన్నటివరకు అభ్యర్థులు ఎవరో తేలని అవనిగడ్డ, పాలకొండ నియోజకవర్గాల్లో సైతం తాజాగా సోమవారం టీడీపీ నేతలే జనసేనలో చేరి జనసేన అభ్యర్థులుగా పోటీచేసేందుకు సన్నద్ధమవ్వడంపై జనసేన నేతలు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. అలాగే.. జనసేనకు కేటాయించిన యలమంచిలి, భీమవరం స్థానాల్లో పార్టీ ఇప్పటికే అధికారికంగా ప్రకటించిన అభ్యర్థులు పంచకర్ల రమేష్, అంజిబాబు 2019 ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థులుగా పోటీచేశారని.. ఇప్పుడు పొత్తు తర్వాత వారు జనసేనలో చేరిన విషయాన్ని ఆ పార్టీ శ్రేణులు గుర్తుచేస్తున్నారు. చివరికి.. జనసేనకు కేటాయించిన అవనిగడ్డ, పాలకొండ సీట్లను సైతం టీడీపీకే చెందిన మండలి బుద్ధప్రసాద్, నిమ్మక జయకృష్ణలు సోమవారం పవన్ సమక్షంలో జనసేన తీర్థం పుచ్చుకుని ఆ టికెట్లను ఎగరేసుకుపోవడం నిజమైన పొత్తు రాజకీయాలు ఎలా అవుతాయని జనసేన నేతలు ప్రశ్నిస్తున్నారు.

అధినేతే మోసం చేస్తుంటే..

ఇక పొత్తులో జనసేనకు ఇప్పుడు కేటాయించిన 21 స్థానాల్లో కేవలం నెల్లిమర్ల, కాకినాడ రూరల్, నరసాపురం, తాడేపల్లిగూడెం, పోలవరం, తెనాలి, యలమంచిలి నియోజకవర్గాల్లో మాత్రమే గత ఎన్నికల్లో జనసేన తరఫున పోటీచేసిన వారే మళ్లీ ఇప్పుడు పొత్తులోనూ పోటీచేస్తున్నారు. అలాగే, పవన్‌కళ్యాణ్ పోటీచేసే పిఠాపురంతో పాటు నిడదవోలులో పోటీచేస్తున్న కందుల దుర్గేష్ కూడా గత ఎన్నికల్లో వేరే నియోజకవర్గాల నుంచి జనసేన తరఫునే పోటీచేశారు. ఇక గత ఎన్నికల్లో పోటీచేయక పోయినా ఇప్పుడు రాజానగరం, రాజోలు స్థానాల్లో పోటీచేస్తున్న జనసేన అభ్యర్థులు నాలుగైదేళ్లుగా పార్టీ కోసం పనిచేస్తున్నారని.. మిగిలిన స్థానాల్లో మాత్రం ఇప్పుడు కొత్తగా పార్టీలోకి చేరిన నాయకులేనని అంటున్నారు.

పొత్తులు కాదు.. కుమ్మక్కు రాజకీయాలు

ఇకపోతే.. 2019 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీచేసిన సమయంలో కూడా దాదాపు 60 చోట్ల పది వేలకు పైగా ఓట్లు వచ్చాయని.. అందులో చాలాచోట్ల అప్పుడు పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థులే ఐదేళ్లుగా అక్కడ పార్టీ కోసం పనిచేసుకుంటూ ఈ ఎన్నికల్లో మళ్లీ పోటీచేయాలని ఆశించారు. కానీ, పొత్తులో సొంత పార్టీ నాయకులకు అన్యాయం చేస్తూ అధినేత పవన్‌కళ్యాణ్ వ్యవహరిస్తున్న తీరుపట్ల జనసేన నేతలు, పార్టీ శ్రేణులు గుర్రుగా ఉన్నారు. అసలు టీడీపీ–జనసేన మధ్య ఉంది పొత్తులు అనేకంటే కుమ్మక్కు రాజకీయాలు అనడమే సరిగ్గా ఉంటుందని వారు ఆరోపిస్తున్నారు. చంద్రబాబు–పవన్ ఇద్దరూ కుమ్మక్కై చివరికి జనసేన అధినేత తన సొంత పార్టీ నాయకులనే మోసం చేస్తున్నట్లు స్పష్టంగా కనిపిస్తోందని ఆ పార్టీ నాయకులు మండిపడుతున్నారు.

కమలం నేతలూ ఆ భావనలోనే..

టీడీపీ–బీజేపీ–జనసేన పొత్తుపై కమలం పార్టీ నాయకులూ ఇదే భావనను వ్యక్తంచేస్తున్నారు. అసలుసిసలైన కమలనాథులకు ఈ ఎన్నికల్లో పోటీచేసే అవకాశం దక్కకపోగా.. 2019 ఎన్నికల్లో టీడీపీ ఓడిపోయాక పునరావాసం కోసం ఆ పార్టీ నుంచి బీజేపీలోకి జంప్ చేసిన నేతలనే ఇప్పుడు బీజేపీ అభ్యర్థులుగా నిలబెట్టేందుకే చంద్రబాబు ఈ పొత్తులను తనకు అనుకూలంగా ఉపయోగించుకుంటున్నారని బీజేపీ రాష్ట్ర కమిటీ నేతలు ఆరోపిస్తున్నారు. ఇదే విషయంపై ఆ పార్టీ రాష్ట్ర కమిటీ కీలకస్థానాల్లో ఉన్న తొమ్మిదిమంది జాతీయ నాయకత్వానికి లేఖ రాసిన విషయం తెలిసిందే.

పింఛన్లు అడ్డుకుని దొంగ ఏడుపులు

▶ మొదటి పేజీ తరువాయి

ఇంటివద్దే పింఛన్లు అందించేలా చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని కోరారు. ఐదో తేదీ లోపు పింఛన్ల పంపిణీని పూర్తి చేయాలని వినతిపత్రం సమర్పించారు. వలంటీర్లు అర్ధరాత్రి ఇళ్లకు వెళ్లి తలుపులు తడుతున్నారంటూ గతంలో ఇష్టానుసారంగా ఆరోపణలు చేసిన చంద్రబాబు ఇప్పుడు ఇంటి వద్ద పింఛన్లు ఇవ్వకపోవడం వెనుక వైఎస్సార్‌సీపీ కుట్ర దాగి ఉందంటూ ఎదురుదాడికి దిగారు. వలంటీర్లతో పింఛన్ల పంపిణీ చేపట్టవద్దంటూ తాము ఎవరినీ కోరలేదంటూ తనకు అలవాటైన రీతిలో బుకాయించారు. టీడీపీ బూత్ కన్వీనర్లతో నిర్వహించిన టెలీకాన్ఫరెన్స్‌లో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలతో సొంత పార్టీ నేతలే విస్తుపోయారు. పింఛన్లు అందకపోవటానికి సీఎం జగనే కారణమని ప్రచారం చేయాలని చంద్రబాబు వారికి సూచించారు.

కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల జీవితాల్లో వెలుగులు

- ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించిన ప్రభుత్వం
- నెలకు వేతనం రూ.50 వేలు • మార్చి 10న జాయినింగ్ ఆర్డర్స్ అందజేత
- వాటిని వైద్యాధికారులకు అందించి విధుల్లో చేరిన ఉద్యోగులు
- సీఎం వైఎస్ జగన్‌కు హెల్త్ అసిస్టెంట్ల కృతజ్ఞతలు



మినుములూరు పీహెచ్‌సీలో వైద్యాధికారికి జాయినింగ్ ఆర్డర్ ఇస్తున్న హెల్త్ అసిస్టెంట్

పాడేరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): వైద్యారోగ్య శాఖలో ఇన్నాళ్లూ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేసిన హెల్త్ అసిస్టెంట్ ఉద్యోగుల జీవితాల్లో రాష్ట్ర ప్రభుత్వం వెలుగులు నింపింది. వారిని రెగ్యులర్ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించింది. దీంతో వారి జీవితాల్లో, కుటుంబాల్లో సంతోషం వెల్లివిరిసింది. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ (ఐటీడీఏ) పరిధిలో 2006లో 49 మంది కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లుగా రూ.5 వేల వేతనానికి విధుల్లో చేరారు. 2012లో మరో 36 మంది వచ్చారు. గత టీడీపీ ప్రభుత్వం వీరి సమస్యలను ఏనాడూ పట్టించుకోలేదు. దీంతో వీరంతా 20 ఏళ్లుగా చాలీచాలని జీతాలతో, ఉద్యోగ భద్రత కరువై వెట్టిచాకిరి చేశారు. టీడీపీ ప్రభుత్వ హయాంలో వీరి వేతనాలు కేవలం రూ.25,400 మాత్రమే. దీంతో కుటుంబ పోషణ కూడా కష్టంగా మారింది. వేతనాల పెంపు కోసం ఎన్నోసార్లు ఆందోళన కార్యక్రమాలు చేపట్టినా టీడీపీ ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోలేదు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాకే న్యాయం

2019లో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక కొద్ది నెలలకే కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్ల వేతనాలను భారీ స్థాయిలో పెంచింది. రూ.25,400గా ఉన్న వేతనాన్ని సీఎం జగన్ ఏకంగా రూ.32,460కు పెంచారు. గత ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా 2014 కంటే ముందు ఉద్యోగంలో చేరిన కాంట్రాక్ట్ హెల్త్ అసిస్టెంట్లను ప్రభుత్వం రెగ్యులర్ చేసింది. ఇందులో భాగంగా ఈ ఏడాది మార్చి 10న పాడేరు ఐటీడీఏ పరిధిలో 11 మండలాల్లో పనిచేస్తున్న 85 మందికి రెగ్యులైజేషన్ ఆర్డర్లను అందజేశారు. దీంతో వారంతా సోమవారం ఆయా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యాధికారుల వద్దకు వెళ్లి వాటిని అందించారు. ఏప్రిల్ 1 నుంచి రెగ్యులర్ ఉద్యోగులుగా మారడంతో ఉద్యోగులు ఒకరినొకరు స్వీట్లు తినిపించుకుంటూ ఆనందం వ్యక్తం చేశారు. నెలకు సుమారు రూ.50 వేలు వేతనంగా అందుకోనున్నారు. సీఎం జగన్ వల్లే తమ జీవితాల్లో వెలుగులు నిండాయని, ఆయనకు రుణపడి ఉంటామంటున్నారు.

మంచినీటి చెరువుల్ని ముందే నింపండి

- 4న ప్రకాశం బ్యారేజీ ద్వారా కాలువలకు నీటి విడుదల
- 8న సాగర్ కుడి ప్రధాన కాలువ ద్వారా నీరిస్తాం
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి



సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని మంచినీటి చెరువుల్ని పూర్తిగా నింపేందుకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి కలెక్టర్లను ఆదేశించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి పింఛన్ల పంపిణీ, వడగాలులపై తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలు, తాగునీరు, ఉపాధి హామీ పనులు, విద్యుత్ సరఫరా తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో వీడియో సమావేశం నిర్వహించారు. ఈ నెల 4న ప్రకాశం బ్యారేజీ, 8న నాగార్జున సాగర్ నుంచి నీటి విడుదల చేస్తున్న దృష్ట్యా మంచినీటి చెరువుల్ని పూర్తిగా నీటితో నింపేందుకు చర్యలు తీసుకోవాలని జవహర్‌రెడ్డి కోరారు. ఈ నీటిని చేపల, రొయ్యల చెరువులకు మళ్లించకుండా చూడటంతోపాటు శివారు ప్రాంతాలకు సక్రమంగా మంచినీరు అందేలా చూడాలని ఆదేశించారు.

వడగాలులపై అవగాహన కల్పించండి

ఎండ వేడిమి, వడగాలులు తీవ్రమవుతున్న నేపథ్యంలో తీసుకోవాల్సిన ముందు జాగ్రత్త చర్యలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులను, కలెక్టర్లను జవహర్‌రెడ్డి ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి హామీ పనులను ఉదయం 10.30 గంటలలోపు పూర్తి చేసేలా, కూలీలు పని చేసే చోట తాగునీరు, తగిన నీడ ఉండేలా చూడటంతోపాటు మెడికల్ కిట్లను అందుబాటులో ఉంచాలన్నారు. వేసవి దృష్ట్యా పాఠశాలల నిర్వహణ విషయంలో విద్యాశాఖ అధికారులు తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్, జల వనరులు, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్ఎస్ రావత్, విద్యా శాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్‌ప్రకాశ్, సెర్ప్ సీఈవో మురళీధర్‌రెడ్డి, పంచాయతీరాజ్ శాఖ కమిషనర్ కె.కన్నబాబు, విపత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్.కూర్మనాథ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సాగర్ కుడి కాలువకు 5 టీఎంసీలు విడుదల చేయండి

- ఈ నెల 8 నుంచి తాగునీటి అవసరాల కోసం రోజుకు 5,500 క్యూసెక్కులు విడుదల చేయండి
- కృష్ణా బోర్డు చైర్మన్‌కు ఏపీ ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి లేఖ
- కేటాయించిన నీటి కంటే తెలంగాణ అక్రమంగా 7.391 టీఎంసీలు వినియోగించుకుందంటూ ఆక్షేపణ

సాక్షి, అమరావతి: గుంటూరు, పల్నాడు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లోని ప్రజల తాగునీటి అవసరాల కోసం నాగార్జున సాగర్ కుడి కాలువకు ఐదు టీఎంసీలు విడుదల చేయాలని కృష్ణా బోర్డును రాష్ట్ర ప్రభుత్వం కోరింది. ఈ నెల 8 నుంచి రోజుకు 5,500 క్యూసెక్కుల చొప్పున 11 రోజుల్లో ఐదు టీఎంసీలు విడుదల చేయాలని విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు కృష్ణా బోర్డు చైర్మన్ శివ్‌నందన్‌కుమార్‌కు ఈఎన్‌సీ సి.నారాయణరెడ్డి సోమవారం లేఖ రాశారు. తాగునీటి అవసరాల కోసం సాగర్ కుడి కాలువకు ఐదు టీఎంసీలను ఏప్రిల్‌లో విడుదల చేసేందుకు గతేడాది అక్టోబర్ 6న జరిగిన త్రిసభ్య కమిటీ భేటీలో అంగీకరించారని.. ఆ మేరకు నీటి విడుదల చేయాలని అక్టోబర్ 9న ఉత్తర్వులిచ్చారని లేఖలో గుర్తు చేశారు. సీఆర్పీఎఫ్ బలగాల పహారాలో కృష్ణా బోర్డు అధికారులు సాగర్ కుడి కాలువకు కేటాయించిన నీటిని విడుదల చేయాలని కోరారు. సోమవారం ఉదయం 6 గంటలకు సాగర్‌లో 513.4 అడుగుల్లో 137.5158 టీఎంసీలు నిల్వ ఉన్నాయని గుర్తు చేస్తూ.. 505 అడుగుల వరకూ నీటిని వినియోగించుకోవచ్చునని.. ఆ స్థాయిలో 14.182 టీఎంసీలు వాడుకునే అవకాశం ఉందన్నారు. ఉమ్మడి ప్రాజెక్టుల్లో ఏపీకి 45, తెలంగాణకు 35 టీఎంసీలను కృష్ణాబోర్డు కేటాయించిందని గుర్తు చేస్తూ.. అందులో ఏపీ 42.457 టీఎంసీలు వాడుకుంటే తెలంగాణ 42.391 టీఎంసీలు వినియోగించుకుందని ఎత్తి చూపారు. కేటాయించిన దాని కంటే తెలంగాణ సర్కార్ అక్రమంగా 7.391 టీఎంసీలు వాడుకుందంటూ ఆక్షేపించారు. అక్రమంగా నీటిని వాడుకోకుండా తెలంగాణను నియంత్రించాలన్నారు. పల్నాడు, గుంటూరు, ప్రకాశం, బాపట్ల జిల్లాల్లో అప్పుడే 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని.. ఎండలు మండుతున్న నేపథ్యంలో తాగునీటి అవసరాలు తీర్చడానికి సాగర్ కుడి కాలువ నుంచి నీటిని విడుదల చేయాలని కోరారు.



అనుకరించకుండా (వాళ్లు చేసింది చేయకుండా) నిరోధించుకోవడమే అత్యుత్తమ ప్రతీకారం.
– మార్కస్ అరేలియస్

సాక్షి
మంగళవారం, 2 ఏప్రిల్ 2024

రాజధానిలో ప్రతిపక్ష గర్జన

ఢిల్లీలోని రామ్‌లీలా మైదానంలో ఆదివారం జరిగిన ప్రతిపక్ష 'ఇండియా' కూటమి భారీ ర్యాలీ అనేక విధాల ప్రత్యేకమైనది. 'లోక్‌తంత్ర్ బచావో' (ప్రజాస్వామ్యాన్ని కాపాడండి) పేరిట సాగిన ఈ ర్యాలీకి నేతలే కాదు... ప్రజలూ పెద్దయెత్తున తరలిరావడం విశేషమైతే, ప్రతిపక్ష కూటమిని కొట్టి పారేస్తున్న విమర్శకులకు ఇది ఒక కనువిప్పు. అలాగే, క్రికెట్ లాగా ఈ ఎన్నికల్లో మ్యాచ్ ఫిక్సింగ్ చేయాలని ప్రధాని మోదీ ప్రయత్నిస్తున్నారంటూ ర్యాలీలో చేసిన ఆరోపణ ఓ సంచలనం. కీలక ప్రతిపక్ష నేతల్ని అరెస్టు చేయడం, పన్నుల భూతాన్ని పైకి తీసి పార్టీలను వేధించడం వగైరాలతో ఎన్నికల్లో ప్రతిపక్షాలకు సమాన అవకాశాలు లేకుండా చేస్తున్నారన్న వాదన కూడా జనసామాన్యంలోకి నెమ్మదిగా చొచ్చుకుపోతోంది. ఎన్నికల్లో తొలి ఓటు పడడానికి మరో మూడు వారాలైనా లేని పరిస్థితుల్లో... ప్రతిపక్ష కూటమి మొన్న జరిపిన మూడో ర్యాలీ అందరి దృష్టినీ ఆకర్షించింది అందుకే.

మార్చి 3న పాట్నాలో 'జన చేతన ర్యాలీ', మార్చి 17న ముంబయ్‌లో రాహుల్ 'భారత్ జోడో న్యాయ్ యాత్ర' తర్వాత ఇది మూడోది. తాజా సభను ఎన్నికల ముందు సహజంగా జరిపే అనేక ర్యాలీల్లో ఒకటిగా చూడలేం. ఎన్నికలనగానే సర్వసాధారణంగా ఉపాధి అవకాశాలు, ధరల పెరుగుదల, ఇటీవల కులగణన, విభిన్న వర్గాల మధ్య సామరస్యం లాంటి అంశాలను ప్రతిపక్షాలు భుజానికెత్తుకుంటాయి. కానీ, ప్రతిపక్షం ఈసారి ఏకంగా ఈ ఎన్నికలను జరిపే విధానంపైనే సందేహాలు వ్యక్తం చేయడం అసాధారణం. కేంద్రంలో గద్దె మీద ఉన్న బీజేపీ, దాని పెద్దలు ఈడీ, సీబీఐ, ఆదాయపన్ను శాఖ వగైరాలను గుప్పెట్లో పెట్టుకొని ఎన్నికల్లో ప్రతిపక్షాలను అణచివేయాలని చూస్తున్నారనేది ప్రధాన ఆరోపణ. ప్రతిపక్షాలకు చెందిన ఇద్దరు సీఎంల అరెస్టు సహా పలు ఘటనల్ని కూటమి అందుకు ఉదాహరణగా చూపిస్తోంది. అధికార, ప్రతిపక్షాలకు సమాన అవకాశాల్ని కల్పించాల్సిన ఎన్నికల వాతావరణాన్ని ఇలా నాశనం చేశారంటోంది. ఎన్నికలు స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా, దుర్నీతి లేకుండా జరిగేలా చూడాలనే వాదనను బలంగా ముందుకు తెచ్చింది.

సోరెన్, కేజ్రీవాల్‌ల సతీమణులు సహా మొత్తం 17 పార్టీలు పాల్గొన్న ర్యాలీ ఇది. కేవలం కేజ్రీవాల్‌కు సంఘీభావంగా కొలువు దీరారనే అపవాదు రాకుండా ఉండేందుకు వేదిక ముందున్న కటకటాల్లో కేజ్రీవాల్ బ్యానర్‌ను 'ఆమ్ ఆద్మీ పార్టీ' పెద్దమనసుతో తొలగించడం విశేషం. మమతా బెనర్జీ, స్టాలిన్ లాంటి వారు గైర్హాజరైనా కాంగ్రెస్ పార్టీ పెద్ద దిక్కు సోనియా స్వయంగా పాల్గొన్న ఈ సభలో పార్టీ అధ్యక్షుడు ఖర్గే, రాహుల్, ప్రియాంక, పలువురు ఇతర పక్షాల నేతలు నిప్పులు చెరిగిన తీరు వారి సమర్థకులకు ఉత్సాహజనకమే. అయితే, ఇంత చేసినా ఈ ర్యాలీ వెనుక అసలైన ఉద్దేశం పట్ల అనుమానాలు తొంగిచూస్తూనే ఉన్నాయి. ప్రజాస్వామ్యానికి కట్టుబడతామనీ, సమైక్యంగా ఉంటామనీ కూటమి పక్షాలు చెబుతున్నా వారి ఇమేజ్ ఎందుకో ఆశించినంతగా పెరుగుతున్నట్టు లేదు. ఇంకా ఏదో అపనమ్మకం, అనైక్యత, అస్పష్టత కొనసాగుతున్నాయి. కేరళలోని వయనాడ్‌లో కాంగ్రెస్ – ఎల్డీఎఫ్, పంజాబ్‌లో కాంగ్రెస్ – ఆప్... ఇలా 'ఇండియా' కూటమి భాగస్వాములే పరస్పరం తలపడడం ప్రతిపక్ష ప్రయోజనాలకే భంగకరం. ఈ పరిస్థితుల్లో... తొలి దశ ఓటింగ్ దగ్గరపడుతున్నందున జనానికి తమపై నమ్మకం పెరిగేలా ప్రతిపక్షాలు అడుగులు వేయడం కీలకం.

కేవలం మోదీని గద్దె దింపడమే కాదు... తమకంటూ స్పష్టమైన అభివృద్ధి అజెండా ఉందని కూటమి నమ్మకం కలిగించాలి. కలగూరగంప అంటూ అధికార పక్షం తక్కువ చేసి మాట్లాడుతున్న 'ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలు ఇకనైనా ఉద్యోగ కల్పన, ధరల నియంత్రణ, సంక్షేమం తదితర అంశాలపై కనీస ఉమ్మడి ప్రణాళికను ఓటరు దేవుళ్ళ ముందుంచాలి. కేజ్రీవాల్ సతీమణి సునీత పేర్కొన్న దేశమంతటా నిరంతర విద్యుత్ లాంటి అంశాలతో ప్రజానుకూల ఎన్నికల వాగ్దాన పత్రాన్ని ప్రకటించాలి. 'మోదీ గ్యారెంటీ'కి పోటీగా ఇప్పటికే ప్రకటించిన అయిదు గ్యారెంటీలను కాంగ్రెస్ జనంలోకి తీసుకెళ్ళకుంటే ప్రయోజనం లేదు. ఢిల్లీ ర్యాలీతో వచ్చిన సానుకూలతను సద్వినియోగం చేసుకోవాలంటే దేశం నలుమూలలా ఇలాంటి సభలతో, ఇదే ఊపును కొనసాగించడం ముఖ్యం. కూటమిలో మమత ఉన్నట్టా లేనట్టా అని చెవులు కొరుక్కుంటున్న సమయంలో ఢిల్లీ సభలో ఆమె పార్టీ నేత పాల్గొని, కూటమిలో తృణమూల్ ఉంది, ఉంటుందని తేల్చిచెప్పడం ఊరట.

దాదాపు 400 సీట్లలో బీజేపీతో ముఖాముఖి తలపడాలన్న కూటమి కల నెరవేరలేదు. బీజేపీ, దాని మిత్రపక్షాలు దాదాపు అభ్యర్థులందరినీ ఖరారు చేసి, ప్రచారం సాగిస్తున్నందున ఇప్పటికీ పోటీలో తమ అభ్యర్థుల్ని ఖరారు చేయని ప్రతిపక్ష కూటమి తక్షణమే కళ్ళు తెరవాలి. ఈ లోటుపాట్లు అటుంచితే, 'నియంతృత్వాన్ని గద్దె దింపండి, ప్రజాస్వామ్యాన్ని కాపాడండి' అంటూ ఎన్నికల సంఘం ముందు కూటమి తాజాగా ఉంచిన అయిదు డిమాండ్లు అసంబద్ధమైనవని అనలేం. ప్రతిపక్షాల ఆర్థిక మూలాలపై దెబ్బ కొట్టేందుకు ప్రభుత్వ సారథులు ప్రయత్నాలు సహా అనేకం అసత్యాలని అనలేం. అదే సమయంలో ఈ దొంగదెబ్బలను అడ్డుకొనేందుకు ఎన్నికల సంఘం తన పరిధిలో ఏమి చేయగలుగుతుందన్నదీ చెప్పలేం. అయితే, ప్రతిపక్షాల అనుమానాలు, ఆందోళనల్ని దూరం చేసి, నమ్మకం కలిగించాల్సిన బాధ్యత ఎన్నికల సంఘానిదే. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చాక రాజ్యాంగబద్ధంగా తనకున్న విశేషాధికారాలను సద్వినియోగం చేయడం దాని చేతుల్లోనే ఉంది. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్యంలో ఎన్నికలను నిజాయతీగా, నిష్పక్షపాతంగా నిర్వహించడమే దాని విధి. ఆ పని సవ్యంగా చేయడమే ప్రజాస్వామ్యానికి శ్రీరామరక్ష. ప్రతిపక్షాలు కోరుతున్నదీ అదే!

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, తిథి: బ.అష్టమి ప.3.27 వరకు, తదుపరి నవమి, నక్షత్రం: పూర్వాషాఢ రా.6.37 వరకు, తదుపరి ఉత్తరాషాఢ, వర్జ్యం: రా.2.20 నుండి 3.52 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.22 నుండి 9.10 వరకు, తదుపరి రా.10.54 నుండి 11.42 వరకు, అమృతఘడియలు: రా.1.50 నుండి 3.24 వరకు

సూర్యోదయం : 5.58
సూర్యాస్తమయం: 6.09
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

బైడెన్, ట్రంప్ మధ్యేనా పోరు?

విశ్లేషణ




ధ్రువ జయ్‌శంకర్

రానున్న అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ బైడెన్, ట్రంప్ మధ్యే పోరు ఉండబోతున్నట్టు కనబడుతోంది. ఆ ఇద్దరిలోనూ ప్రస్తుతానికైతే ప్రజాభిప్రాయ సర్వేలు ట్రంప్‌కు స్వల్పంగా ఎక్కువ ఆదరణ చూపుతున్నాయి. నవంబర్ నాటికి ఇది తలకిందులవుతుందని బైడెన్ వర్గం నమ్ముతోంది. ఎవరు గెలిచినా, అమెరికాకు ప్రధాన పోటీదారుగా చైనాను నిలపడంలో, అమెరికాకు ప్రయోజనం చేకూర్చని వాణిజ్య ఒప్పందాల విషయంలో ఇరువురిదీ ఒకే బాట. కాకపోతే వాతావరణ విధానం, వలసలు, సుంకాలు, ప్రజాస్వామ్యం వంటి అంశాల్లో ముఖ్యమైన తేడాలు ఉంటాయి. వాణిజ్యం, వలసల విషయంలో భారత్ నాటకీయ మార్పులను ఎదుర్కోవాల్సి ఉంటుంది; అదే సమయంలో ఏ ప్రభుత్వం ఏర్పడినా తనను తాను సర్దుబాటు చేసుకోగలుగుతుంది.

భారతదేశం ఎన్నికలకు సిద్ధమవుతున్న సమయంలో, అమెరికాలో కూడా ఎన్నికలు ముంచుకొస్తున్నాయి. ఇప్పటికైతే అధ్యక్ష అభ్యర్థులుగా ప్రస్తుత అధ్యక్షుడు, డెమొక్రాట్ అయిన జో బైడెన్, మాజీ అధ్యక్షుడు, రిపబ్లికన్ అయిన డోనాల్డ్ ట్రంప్ ఉండేట్టే కనబడుతోంది. బైడెన్ వృద్ధాప్యం సహా, ద్రవ్యోల్బణం, సరిహద్దు భద్రత, పశ్చిమాసియా విధానంపై ఆయన తీరు మీద ఓటర్లు అసంతృప్తిగా ఉండటంతో, ప్రజాభిప్రాయ సర్వేలు ప్రస్తుతానికి ట్రంప్‌కు స్వల్పంగా ఎక్కువ ఆదరణ ఉన్నట్టు చూపుతున్నాయి. అయితే ఆర్థిక వ్యవస్థ బలమైన పనితీరు, తక్కువ నిరుద్యోగం, రుణ విముక్తి, చట్టపరంగా ట్రంప్ ఎదుర్కొంటున్న కష్టాలు వంటివి... నవంబర్ నాటికి ప్రజలు ఎన్నికలకు వెళ్లే సమయానికి ఆటుపోట్లను తిప్పికొట్టగలవని బైడెన్ వర్గం నమ్ముతోంది.

ఈ ప్రారంభ దశలోనే, అమెరికా అధ్యక్ష ఎన్నికల ఫలితాలను అంచనా వేయడం నిష్ఫలమే అవుతుంది. అయినప్పటికీ కొన్ని రాష్ట్రాలలో తప్ప మిగిలిన అన్ని రాష్ట్రాలలో ఫలితం ఇప్పటికే తేలినట్టయింది. ఇక మొత్తం ఫలితం దాదాపు ఆరు కీలకమైన 'స్వింగ్ స్టేట్స్'(ఊగే రాష్ట్రాలు) ద్వారా, పది లక్షల కంటే తక్కువ ఓట్ల ద్వారా మాత్రమే నిర్ణయించబడుతుంది. పరిశీలకులు విధానపరమైన చిక్కులను అంచనా వేయడం ప్రారంభించడం వివేకం. అయితే విధానపరమైన నిర్ణయాలు అలాగే కొనసాగవచ్చు, కాకపోతే వాణిజ్యం, వలస విధానంలో కొన్ని నాటకీయ మార్పులు ఉండవచ్చు.

అనేక అంశాల విషయంలో– ట్రంప్, బైడెన్ హయాంలు రెండింటిలోనూ గత ఎనిమిది సంవత్సరాలుగా గణనీయమైన కొనసాగింపు ఉంది. ఒకటి: అమెరికా అగ్రగామి వ్యూహాత్మక పోటీదారుగా చైనా ఉంటుందని చాలావరకు అర్థమైపోయింది. దీనివల్ల ఇండో–పసిఫిక్ ప్రాంతంలో అమెరికా దేశీయ, ఆర్థిక, భద్రతా విధానాలలో మార్పులకు దారితీసింది. రెండు: నయా ఉదారవాదం లేదా ప్రపంచీకరణ స్ఫూర్తితో ఇకపై పరస్పర సంబంధం లేని మార్కెట్ ప్రాప్యతను అందించకూడదని అమెరికా విశ్వసిస్తోంది. అమెరికాకు అనుకూలంగా క్రీడా మైదానాన్ని మార్చని వాణిజ్య ఒప్పందాలు ఇకపై కుదిరే ప్రశ్నే లేదు. మూడు: అమెరికా పాలకవర్గం ప్రత్యక్ష, బహిరంగ సైనిక యాత్రలకు వ్యతిరేకంగా ఉంది. దీనిని విమర్శకులు 'ఎప్పటికీ సాగే యుద్ధాలు'గా అభివర్ణిస్తున్నారు. నాలుగు: సమస్యలు ఉన్నప్పటికీ, చాలావరకు ఇజ్రాయెల్, గల్ఫ్ అరబ్ దేశాలకు అమెరికా మద్దతుగా స్థిరంగా ఉంది.



కీలకమైన తేడాలు

అయితే పొత్తులు, వాతావరణ విధానం, వలసలు(ఇమ్మిగ్రేషన్), టారిఫ్‌లు, ప్రజాస్వామ్యం వంటి అంశాలపై బైడెన్, ట్రంప్ మధ్య కొన్ని ముఖ్యమైన తేడాలు ఉన్నాయి. ట్రంప్, అమెరికా మిత్రదేశాలను ఫ్రీలోడర్‌లుగా (ఇతరుల ఔదార్యాన్ని అవకాశంగా తీసుకునేవారు) విమర్శిస్తున్నప్పటికీ, బైడెన్ మాత్రం యూరప్, ఇండో–పసిఫిక్‌లో మిత్రులే ఫస్ట్ అనే విధానాన్ని అవలంబించారు. ట్రంప్ విజయం ఉత్తర అట్లాంటిక్ ట్రీటీ ఆర్గనైజేషన్ (నాటో), ఉక్రెయిన్‌కు అమెరికా మద్దతు విషయంలో ప్రత్యేక చిక్కులను కొనితెస్తుంది. డెమొక్రాటిక్ పునాదికి ముఖ్యమైన వాతావరణం, పర్యావరణ విధానాలపై బైడెన్ దేశీయ పరిశ్రమకు, క్రియాశీల వాతావరణ దౌత్యం కోసం భారీ రాయితీలకు మద్దతు ఇచ్చారు. ట్రంప్ ఆ సబ్సిడీలను రద్దు చేయకపోవచ్చు (ఇది రిపబ్లికన్ నియోజకవర్గాలకు ప్రయోజనం చేకూరుస్తుంది) కానీ ఆయన కచ్చితంగా అంతర్జాతీయ వాతావరణ ఒప్పందాలను వెనక్కి తీసుకుంటారు.

వ్యత్యాసం ఉన్న మరొక అంశం వలసలు. వీటిని రిపబ్లికన్లు అడ్డుకోవాలని కోరుకుంటారు. కానీ డెమొక్రాట్లు సులభతరం చేయాలని ఆశిస్తున్నారు. మెక్సికన్ సరిహద్దులో అక్రమ వలసలను అరికట్టడానికి రిపబ్లికన్ పాలనాయంత్రాంగం ఉద్దేశపూర్వకంగా క్రూరమైన విధానాన్ని అవలంబిస్తుంది. వాణిజ్య అసమతుల్యతలను ఎదుర్కోవడానికి సుంకాలు, ఇతర చర్యలను అమలు చేయడానికి ట్రంప్ సుముఖత వ్యక్తం చేశారు. చివరగా, బైడెన్ తన ప్రాపంచిక దృక్పథాన్ని ప్రజాస్వామ్యం వర్సెస్ నిరంకుశత్వాలను చూపుతుండగా, ట్రంప్ పాలనాయంత్రాంగం మాత్రం ప్రపంచ వ్యాప్తంగా ప్రజాస్వామ్యం, మానవ హక్కుల గురించి తక్కువ శ్రద్ధ చూపుతుంది.

ఆసియాతో సహా కొన్ని అమెరికన్ మిత్రదేశాలు, భాగస్వాములు ఇప్పటికే రెండవసారి ట్రంప్ అధ్యక్ష పదవికి సంబంధించిన చిక్కులను అంచనా వేస్తున్నారు. తన ఎజెండా విషయంలో ట్రంప్, ముఖ్యంగా సైనిక సహాయం, వాణిజ్యం, ఇమ్మిగ్రేషన్‌పై ఎక్కువ నిబద్ధతతో ఉంటారు; వాటి అమలులో గొప్ప వృత్తిపరతత్వం కూడా కనబరుస్తారు. 2016లో, ట్రంప్ ఏమాత్రం సన్నద్ధత లేకుండా ఎన్నికలలో విజయం సాధించడం పట్ల తనకు తానే ఆశ్చర్యపోయినట్లు కాకుండా, మళ్లీ అధికారంలోకి తిరిగి వచ్చినప్పుడు తన విజన్‌ని అమలు చేయడంలో మరింత నైపుణ్యం కలిగిన కార్య నిర్వహణ ఉండనుంది. రిపబ్లికన్ పార్టీకి చెందిన చాలా శ్రేణులు ఆయన వెనుకే ఉంటారు. మాజీ వాణిజ్య సంధానకర్త రాబర్ట్ లైట్ థైజర్, మాజీ జాతీయ భద్రతా సలహాదారు రాబర్ట్ ఓ'బ్రియన్, దేశీయ విధాన సలహాదారు స్టీఫెన్ మిల్లర్... వాణిజ్యం, విదేశాంగ విధానం, ఇమ్మిగ్రేషన్ విధానాన్ని రూపొందించడంలో కీలక పాత్రలు పోషిస్తున్న వారిలో ఉన్నారు. ట్రంప్ అధికారంలోకి వచ్చిన మొదటి రోజే కేటాయించాల్సిన చాలా ప్రభుత్వ కీలక పదవులకు సన్నాహాలు జరుగుతున్నాయి. సొంత పార్టీలోని ట్రంప్ విమర్శకులు సైతం పాలనా యంత్రాంగంలో చేరే అవకాశం గురించి ఆయన్ని సంప్రదిస్తున్నారు.

ఇండియాపై ప్రభావం ఉంటుందా?

ఎన్నికల ఫలితాల వల్ల భారతదేశానికి ఎలాంటి చిక్కులు ఎదురవుతాయి? రక్షణ లేదా సైనిక సహాయం కోసం వాషింగ్టన్‌పై ఆధారపడే అమెరికా మిత్రదేశాలు లేదా అమెరికన్ మార్కెట్ ప్రాప్యతపై ఆధారపడే ప్రధాన వాణిజ్య భాగస్వాములతో పోలిస్తే, ఎన్నికల ఫలితం న్యూఢిల్లీపై కాస్త తక్కువగానే ఉంటుంది. అనేక అంశాలలో, భారతదేశం తనను తాను భారాన్ని పంచుకునేందుకు సిద్ధంగా ఉన్న భాగస్వామిగా చూపించుకుంటూ, 2017–2021ల మధ్యలానే ట్రంప్ లావాదేవీలకు తనను తాను సర్దుబాటు చేసుకోగలుగుతుంది.

ఏది ఏమైనప్పటికీ, న్యూఢిల్లీ కనీసం రెండు అంశాలలో– వాణిజ్యం, వలసల విషయంలో నాటకీయ మార్పులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. అమెరికాతో భారతదేశ వాణిజ్య మిగులు దృష్ట్యా, సుంకాలను అంచనా వేయవలసి ఉంటుంది. పైగా కొన్ని కఠినమైన చర్చలు అనివార్యం అవుతాయి. అమెరికా సుంకాలకు వ్యతిరేకంగా రక్షణ కల్పిస్తూనే, చైనా నుండి రిస్క్ లేకుండా చూసుకోవడం గురించిన భాగస్వామ్య అవగాహన, ఇప్పటికే ప్రపంచంలోని ఇతర పెద్ద ఆర్థిక వ్యవస్థలైన భారతదేశం, జపాన్, బ్రిటన్, యూరప్‌ల మధ్య చర్చలను రేకెత్తిస్తోంది.

భారత్ విషయంలో వలస సమస్య మరింత నాటకీయంగా ఉంటుంది. చట్టపరమైన వలసదారులు– శాశ్వత నివాసితులు, అధిక నైపుణ్యం కలిగిన నిపుణులు, విద్యార్థులు, పర్యాటకులు, వ్యాపారవేత్తల ప్రాసెసింగ్‌లో మందగమనం కొనసాగవచ్చు. ఎక్కువ తనిఖీలను ఎదుర్కోవాల్సి రావొచ్చు. కఠినమైన నిర్బంధాలను ఎదుర్కొనే పత్రాలు లేని వలసదారుల సంఖ్య పెరగవచ్చు. ట్రంప్ విధానాల రూపురేఖలను ఇప్పటికే ఊహించవచ్చు. అయినప్పటికీ, ఆయన విజయం సాధించిన పక్షంలోనూ భారతదేశం చాలా ఇతర దేశాల కంటే ప్రత్యక్షంగా తక్కువ ప్రభావితం కావచ్చు.

వ్యాసకర్త 'ఓఆర్ఎఫ్ అమెరికా' ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్
('ది హిందుస్థాన్ టైమ్స్' సౌజన్యంతో)

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

పెద్ద జోక్



ఏప్రిల్ ఫూల్ అనేది విదేశీ భావన. భారతదేశంలో మనకు 'అచ్ఛే దిన్' (మంచి రోజులు) ఉన్నాయి.

– మహువా మొయిత్రా, తృణమూల్ నేత

మంచి సంగతి



బూస్ట్, హార్లిక్స్, బోర్న్‌విటా లాంటి వాటికి 'ఆరోగ్య డ్రింకులు' అనే పదాన్ని వాడటాన్ని 'బాలల హక్కుల సంరక్షణ జాతీయ కమిషన్' నిషేధించడం గొప్ప విజయం. ఎన్నో ఏళ్లుగా 'హెల్త్ డ్రింక్' అనే మాటతో అమాయక తల్లిదండ్రులు మోసపోతున్నారు. ఇప్పుడది సాగదు.

– రేవంత్ హిమత్‌సింగ్‌కా, ఫుడ్ యాక్టివిస్ట్

ఉత్కళ జలధి తరంగ...



అందరికీ 'ఉత్కళ దిబస' (ఏప్రిల్ 1 : ఒడిషా అవతరణ దినోత్సవం) శుభాకాంక్షలు. ఒడిషా, దాని క్రియాశీల జనాల ఘన సంస్కృతి, వారసత్వాన్ని ఈ రోజు గుర్తుచేస్తుంది. జాతీయ పురోభివృద్ధికి రాష్ట్రం ఎంతో తోడ్పడింది. ఒడిషా ప్రజల సమృద్ధి, విజయం కోసం ప్రార్థిస్తాను.

– నరేంద్ర మోదీ, ప్రధాని

ఇవి నయం కదా!



'జన్ ఔషధి' అమ్మే ఔషధాలను ఎంతమంది ప్రయత్నించారు? నేను ఈ మధ్యే నా మందులను ఈ అవుట్ లెట్ల నుంచి తీసుకుంటున్నాను; బిల్లు దాదాపు 80 శాతం తగ్గింది. ఔషధ ఫార్ములాలు అవే, నాణ్యత కూడా అదే. ఈ లెక్కన ఫార్మా కంపెనీలు ఎంత భారీ మార్జిన్లు పొందుతున్నాయో ఆశ్చర్యం కలుగుతుంది.

– సుకాంత్ సరీన్, సీనియర్ ఫెలో


స్వాగతించాల్సిన విజయం



టర్కీ స్థానిక ఎన్నికల్లో ప్రధాన ప్రతిపక్షం గెలుపొందడం పట్ల నాకు గర్వంగా ఉంది. గత దశాబ్దంగా స్వేచ్ఛ, న్యాయాలకు స్థానం లేకుండా పోయినప్పటికీ బ్యాలెట్లు ముఖ్యమైనవనీ, ప్రతిపక్షాలు ముఖ్యమైనవనీ అర్థమవుతోంది. ప్రజాస్వామిక మార్పునకు ఇంకా ఆశ ఉంది.

– ముస్తఫా అక్యోల్, టర్కీ రచయిత

సంకేతం ఇవ్వకుండా...



కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ, ప్రియాంక... అమేథీ, రాయబరేలీ (రెండూ ఉత్తరప్రదేశ్‌లోని నియోజకవర్గాలు) నుంచి పోటీ చేయవలసింది! అక్కడి నుంచి పోటీ చేయకపోవడం బలహీనతకు సంకేతంగా కనబడుతుంది. వాళ్లు అనుమానం లేకుండా గెలుస్తారు.

– ప్రశాంత్ భూషణ్, న్యాయవాది

వాటిని పట్టించుకోవా?



"పాలస్తీనా గురించి నీకు అంత పట్టింపు ఎందుకు సోదరా?" "వాళ్లు మన ముస్లిం సోదరులు, వాళ్ల బాధను నేను సహానుభూతి చెందగలను." "తాలిబన్లు మహిళలను రాళ్లతో కొట్టి చంపుతున్నారు, ఐసిస్ తీవ్రవాద దాడులు చేస్తోంది, అవెందుకు ఖండించవు?" "నేను ఇండియాలో ఉంటాను, వేరే దేశాల్లో ఏం జరుగుతున్నదో నాకు తెలీదు."

– ఒమర్ ఘాజీ, రచయిత

ఇన్ బాక్స్

సామాజిక వీరుడు

శతాబ్దాల క్రితమే సబ్బండ వర్ణాలను ఏకం చేసి రాజ్యాధికారాన్ని స్థాపించిన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్. వరంగల్ జిల్లా ఖిలాషాపూర్‌లో 1650 ఆగస్టు 18న పాపన్న పుట్టాడు. తండ్రి చిన్నప్పుడే మరణించడంతో తల్లి సర్వమ్మే సర్వస్వమై పాపన్నను పెంచింది. రాచరిక వ్యవస్థ నీడలో జమిందార్లు, జాగీర్దార్లు సాగిస్తున్న అరాచకాలను చూసి కుపితుడై, కుల వృత్తినికూడా వదిలిపెట్టి ప్రజల కోసం పోరుబాట పట్టాడు. అయితే అగ్రకుల పెత్తనాన్ని అణచాలంటే ఒక్కరితో సాధ్యం కాదని మొత్తం బహుజన కులాలను ఏకం చేశాడు. అందుకే స్నేహితులైన చాకలి సర్వన్న, మంగలి మాసన్న, కుమ్మరి గోవిందు, జక్కుల పెరుమాండ్లు, దూదేకుల పీర్ మహ్మద్, కొత్వాల్ మీర్ సాహెబ్‌లతో గెరిల్లా సైన్యాన్ని తయారు చేశాడు. అగ్రకుల భూస్వాములు, వ్యాపారుల గడీలపై, కోటలపై దాడి చేశాడు. సంపదను బహుజన పేదలకు పంచాడు. గడీల్లో బందీలుగా మగ్గుతున్న అణగారిన కులాల ప్రజలను విడిపించాడు.



సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్

12 మందితో ప్రారంభమైన పాపన్న గౌడ్ సైన్యం పన్నెండు వేలకు చేరింది. చిన్న చిన్న సంస్థానాలను ఆక్రమించి రాజ్యాన్ని విస్తరించాడు. ఖిలాషాపూర్‌లో పటిష్ఠమైన కోటను కట్టించాడు. వేలాదిమంది సైన్యంతో పాపన్న వరంగల్ కోటను స్వాధీనం చేసుకున్నాడు. అనంతరం భువనగిరి ఖిల్లాను తన ఖాతాలో వేసుకున్నాడు. చివరికి మొఘల్ చక్రవర్తులకు కప్పం కడుతూ గోల్కొండకూ పాలకుడయ్యాడు. అయితే 1709 కొన్ని కారణాల వల్ల తాడికొండలో మొఘల్ సైన్యానికీ, పాపన్న యోధులకూ మధ్య భీకర యుద్ధం జరిగింది. ఆ యుద్ధంలో ఓడి వెనుకకు తగ్గాడు. చివరికి మొగలాయీ సైన్యాలకు చిక్కి మరణ దండనకు గురయ్యాడు.

– సంపత్ గడ్డం, కామారెడ్డి జిల్లా
(నేడు సర్వాయి పాపన్న వర్ధంతి)

ఆ పార్టీల ఆట ముగిసింది!

ఆంధ్రప్రదేశ్ రాజకీయా లలో జాతీయ పార్టీల పాత్ర ఏమిటి? అంటే, శూన్యమనే సమాధానం చెప్పవలసి ఉంటుంది. అవును. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ సహా ఇతర పార్టీలు ఎన్ని ఉన్నా, రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర రాజకీయాలు రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు వైసీపీ–టీడీపీల చుట్టూనే తిరుగుతున్నాయి. రాష్ట్రంలో మూడో పార్టీగా పుట్టుకొచ్చిన జనసేన... స్థిరత్వం లేని చిల్లర పార్టీగానే మిగిలిపోయింది.

కాంగ్రెస్, బీజేపీ, కమ్యూనిస్ట్ పార్టీలు ఉనికిని కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నాయి. రాష్ట్ర విభజన తదనంతరం జరిగిన 2014 ఎన్నికల్లోనే హస్తం పార్టీ పూర్తిగా తుడిచి పెట్టుకుపోయింది. ఆ ఎన్నికల్లో టీడీపీ – జనసేన పొత్తు పుణ్యాన ఒకటో రెండో సీట్లతో ఉనికి చాటుకున్న బీజేపీ 2019 ఎన్నికలలో ఒంటరిగా బరిలో దిగి కాంగ్రెస్ సరసన చేరింది. నిజానికి కాంగ్రెస్ కంటే, మరో మెట్టు కిందకు చేరింది. చివరకు 'నోటా'తోనూ పోటీ పడలేకపోయింది.

వామపక్ష పార్టీలు, సీపీఐ, సీపీఎం పార్టీల సంగతి పక్కన పెడితే... ఏపీలో కాంగ్రెస్, బీజేపీల దీనస్థితికి కారణాలు ఏమిటని చూస్తే, ఇరు పార్టీల జాతీయ నాయకత్వం తీసుకున్న తప్పుడు నిర్ణయాలే అని చెప్పవచ్చు. రాష్ట్రంలో కాంగ్రెస్ చావుకు చాలానే కారణాలు కనిపిస్తాయి. నిజానికి, అడ్డగోలుగా రాష్ట్రాన్ని ముక్కలు చేయడం ఒక ప్రధాన కారణంగా కనిపించినా, అంతకు ముందే ఆ పార్టీ అధిష్ఠానం స్వహస్తాలతోనే స్వీయ మరణ శాసనాన్ని సిద్ధం చేసుకుంది. రాష్ట్రంలో ఒకటికి రెండుసార్లు కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకు రావడంతోపాటుగా, కేంద్రంలో పదేళ్ళ విరామం తర్వాత, 2004లో కాంగ్రెస్ పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడంలో, అలాగే తిరిగి 2009లో అటు కేంద్రంలో, ఇటు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీని మరోమారు అధికారంలోకి తీసుకురావడంలోనూ కీలక పాత్రను పోషించిన వైఎస్ రాజశేఖర రెడ్డి ఆకస్మిక మరణం తర్వాత, కాంగ్రెస్ అధిష్ఠానం తీసుకున్న తప్పుడు నిర్ణయం తెలుగు నాట కాంగ్రెస్ పార్టీని కనుమరుగు చేసింది.



ఇప్పుడు ఆ వివరాలలోకి వెళ్ళవలసిన అవసరం అంతగా లేకపోయినా, కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పుల్లోకెల్లా అతి పెద్ద తప్పు, మహానేత వైఎస్ వారసుడిగా ఎదిగివస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాజకీయ భవిష్యత్‌ను మొగ్గలోనే తుంచేసేందుకు కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన కుట్రపూరిత రాజకీయం ఆ పార్టీని తిరిగి కోలుకోలేని స్థాయిలో దెబ్బ తీసింది. వైఎస్సార్ మరణ వార్తను జీర్ణించుకోలేక ప్రాణాలు వదిలిన అభిమానులను ఓదార్చేందుకు కూడా జగన్‌ని అనుమతించక పోవడం కాంగ్రెస్ అధిష్ఠానం చేసిన ఇంకో తప్పు. పొమ్మనకుండా పొగబెట్టి, జగన్ వదిలి పోయేలా చేయడం, కాంగ్రెస్ పెద్దలు చేసిన తప్పుల పరంపరలలో మరొకటి. ఇప్పుడు వైఎస్ కుటుంబాన్ని చీల్చి వైఎస్సార్ ఆత్మ క్షోభించేలా చేసింది కాంగ్రెస్.


కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బీజేపీ పరిస్థితి కూడా అంతే. నిజానికి, ఓట్ల పరంగా చూస్తే, కాంగ్రెస్, కమ్యూనిస్టుల కంటే, బీజేపీ మరింత అధ్వాన్న స్థితిలో వుంది. అయితే, కేంద్రంలో అధికారంలో ఉండడం వల్లనైతే నేమి, బీజేపీ జాతీయ నాయకత్వం అనుసరిస్తున్న రాజకీయ ఆధిపత్య ధోరణి కారణంగా అయితేనేమి, రాష్ట్ర రాజకీయాల్లో కీలకంగా మారింది. అందుకే టీడీపీ–జనసేనలు దానితో పొత్తు పెట్టుకున్నాయి.

నిజానికి, చంద్రబాబు, పవన్ కల్యాణ్, పురందేశ్వరి త్రయానికి, మినహా మూడు పార్టీల్లోని నాయకులు, కార్యకర్తలు ఎవరికీ ఈ పొత్తు అంతగా ఇష్టం లేదు. ఆ యా పార్టీ కార్యకర్తల సోషల్ మీడియా పోస్టులు, టిక్కెట్ దక్కని నాయకుల వీరంగాలూ ఇందుకు నిదర్శనాలు. చంద్రబాబు మోదీ పట్ల చేసిన విమర్శలు గుర్తుకొచ్చిన బీజేపీ కార్యకర్తలకు పొత్తు మింగుడుపడటం లేదు. 'రాజకీయాల్లో ఆత్మహత్యలే కాని, హత్యలు ఉండవు' అంటారు. ఈ పార్టీలు చేసిన తప్పులనే మళ్లీ మళ్లీ చేస్తూ ఉండడంతో అవి ఆత్మహత్యలవైపు ప్రయాణిస్తున్నాయని చెప్పవచ్చు.

– రాజనాల బాలకృష్ణ, సీనియర్ జర్నలిస్ట్
మొబైల్: 99852 29722

ఓర్పు – నేర్పు

మంచి ఏదో, చెడు ఏదో తెలుసుకోగలిగిన వివేకవంతుడు మానవుడే. ఇతడు సద్గుణాలను గుర్తించగలడు. వాటిని అలవరచుకోగలడు కూడా. ఒక మనిషిలో ఎన్నెన్ని సద్గుణాలు ఉండటానికి అవకాశమున్నదో ప్రత్యక్షంగా చూపించిన మహనీయుడే శ్రీరామచంద్రుడు. రావణుని లోని దుర్గుణాలను దరిచేరనీయరాదు. శ్రీరాముడిలోని గుణాలను ఆదర్శంగా గ్రహించి, వాటిని అలవరచుకునేందుకు కృషి చేయాలి. **'రామాదివత్ వర్తితవ్యం న రావణాదివత్'** అంటూ మన వాఙ్మయం ఉద్బోధిస్తున్నది.



జ్యోతిర్మయం

మనిషి అలవరచుకోవలసిన సద్గుణాలలో ముఖ్యమైనది ఓర్పు. వదలవలసిన దుర్గుణాలలో మొదటిది కోపం. మనిషి, తన ఇష్టానికి వ్యతిరేకంగా ఎవరు ప్రవర్తించినా, నియంత్రణ కోల్పోయి ఆగ్రహావేశాలకు లోనవుతాడు. యుక్తాయుక్త విచక్షణను కోల్పోతాడు. ఆ తర్వాత పూడ్చుకోలేనంత కష్టానికి, నష్టానికి గురవుతాడు. అయితే కోపానికి వశమయ్యే సందర్భాలు ఏర్పడినపుడే నేర్పుతో వ్యవహరించాలి. ఓర్పును అలవరచుకోవాలి. రాక్షస స్త్రీలు, రావణుడు తనను మాటిమాటికీ మాటలతో, చేష్టలతో బాధించినపుడే సీతమ్మతల్లి ఓర్పును వహించినది.

శాంతిని కాంక్షించే గాంధీజీ యొక్క అహింసా విధానం అతణ్ణి మహాత్ముణ్ణి చేసింది. లోకానికి ఆదర్శంగా నిలబెట్టింది. అందుకే త్యాగరాజులవారు ఎంతవారికైనా **'శాంతము లేక సౌఖ్యము లేదు'** అని పేర్కొన్నారు. ఆలోచన లేకుండా ఆవేశంతో తొందరపాటుతనంతో చేసే పనుల వల్ల ఆపదలు సంభవిస్తాయనీ, ఆలోచనతో సావధాన చిత్తులై పనులు చేసే వారికి సంపదలు తమంతటతామే వరిస్తాయనీ భారవి తెలిపాడు.

ఒకే సమయంలో ఓర్పుతో అనేక కార్యాలను సక్రమంగా నిర్వర్తించగలిగే నేర్పును అలవరచుకోవాలి. ప్రతికూల పరిస్థితులు ఎదురైనప్పుడు ఓర్పును కలిగియుండాలి. ఆ యా సందర్భాలను, పరిస్థితులను మనకు అనుకూలంగా మరల్చుకునే నేర్పును ఓర్పుతో అలవరచుకునే దిశగా ప్రయత్నాలు ప్రారంభం కావాలి.

– సముద్రాల శఠగోపాచార్యులు

క్లుప్తంగా...

ముగిసిన సుదర్శన నారసింహ మహాయజ్ఞం



సింహాచలం: సింహాచలంలోని శ్రీవరాహ లక్ష్మీ నృసింహస్వామి క్షేత్రంలో ఏడు రోజులుగా నిర్వహిస్తున్న సుదర్శన నారసింహ మహా యజ్ఞం సోమవారం ముగిసింది. ఉదయం 9.13 గంటలకు మహా పూర్ణాహుతి నిర్వహించారు. తదుపరి శాంతి కల్యాణం వైభవంగా జరిపారు. విశాఖ శ్రీశారదాపీఠాధిపతులు స్వరూపానందేంద్ర సరస్వతి, స్వాత్మానందేంద్ర సరస్వతి మహా పూర్ణాహుతి కార్యక్రమానికి హాజరయ్యారు. లోక కల్యాణార్థం మహా యజ్ఞం నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు. సింహాచలం దేవస్థానం ఈవో ఎస్.శ్రీనివాసమూర్తి పాల్గొన్నారు.

కూటమిని తన్ని తరిమేయాలి

- భద్రాచలం రోడ్డులో వెలసిన మావోయిస్టు పోస్టర్లు



ఎటపాక (అల్లూరి సీతారామరాజు జిల్లా): ఫాసిస్టు విధానాలను అవలంబిస్తున్న బీజేపీని.. దాంతో అంట కాగుతున్న పార్టీలను తన్ని తరిమేయాలని, వారి బారి నుంచి దేశాన్ని కాపాడాలని మావోయిస్టులు పిలుపునిచ్చారు. ఎటపాక మండలంలోని గన్నవరం, గౌరీదేవి పేట, నందిగామ, మురుమూరు గ్రామాల పరిధిలోని భద్రాచలం – కూనవరం ప్రధాన రహదారిపై సోమవారం మావోయిస్టు పోస్టర్లు వెలిశాయి. దగాకోరు పార్లమెంట్ ఎన్నికలు బహిష్కరించాలని భారత కమ్యూనిస్టు మావోయిస్టు పార్టీ చర్ల శబరి ఏరియా కమిటీ పేరుతో కరపత్రాలు, పోస్టర్లు ప్రదర్శించారు. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ విధానాలను అమలు చేసే ప్రజా వ్యతిరేక కాంగ్రెస్ పార్టీని సైతం వ్యతిరేకించండంటూ పోస్టర్లలో రాశారు. ఈ పోస్టర్లను కల్వర్టులు, బ్రిడ్జిపై, చింతచెట్లకు అంటించారు.


కుర్చీ కోసమే మూడు పార్టీల పొత్తు

- జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ



మంగళగిరి: కుర్చీ కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని, రాష్ట్రాభివృద్ధి కోసం కాదని జై భారత్ నేషనల్ పార్టీ అధ్యక్షుడు జేడీ లక్ష్మీనారాయణ విమర్శించారు. పట్టణంలోని ఐబీఎన్ భవన్ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం విలేకరులతో లక్ష్మీనారాయణ మాట్లాడారు. పొత్తు పెట్టుకున్న మూడు పార్టీలకు రాష్ట్ర అభివృద్ధిపై ఏ మాత్రం చిత్తశుద్ధి లేదన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న చిలకలూరిపేట సభలో ప్రత్యేక హోదా, విభజన హామీలు, రైల్వేజోన్, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ, పోలవరం నిర్మాణంపై ఎందుకు అడిగి సాధించలేకపోయారని నిలదీశారు. ప్రస్తుతం రాష్ట్రంలో పార్టీలు విలువలు లేని రాజకీయాలు చేస్తున్నాయని, రాత్రి పార్టీ మారితే పొద్దున టికెట్ ఇస్తున్నారన్నారు. విలువలు కలిగిన రాజకీయాలు, రాష్ట్ర అభివృద్ధి కోసం తమ పార్టీ మద్దతుతో ఏర్పడిన యునైటెడ్ ఫ్రంట్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ఏపీ యునైటెడ్ ఫ్రంట్ కో కన్వీనర్ భాగ్యారావు, ప్రబుద్ధా రిపబ్లిక్ పార్టీ అధ్యక్షుడు దాసరి చెన్నకేశవులు, తెలుగు ప్రజాపార్టీ అధ్యక్షుడు కటికల శివ భాగ్యారావు, నవరంగ్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షేక్ జలీల్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీకి జంగా రాజీనామా



దాచేపల్లి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సభ్యత్వానికి, బీసీ సెల్ రాష్ట్ర అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తున్నట్లు ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి చెప్పారు. దాచేపల్లి మండలం గామాలపాడులోని ఆయన స్వగృహంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి రాజీనామా ప్రకటించారు. త్వరలో టీడీపీలో చేరబోతున్నట్లు ఆయన తెలిపారు. కాగా, ఎమ్మెల్సీ పదవికి మాత్రం జంగా రాజీనామా చేయలేదు.

నేను అప్లికేషన్ పెట్టి సంపాదించుకున్న సీటు కాదిది: సుజనా చౌదరి

సాక్షి, అమరావతి: 'ఇది నేను అప్లికేషన్ పెట్టి సంపాదించింది కాదు' అని విజయవాడ పశ్చిమ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి సుజనా చౌదరి చెప్పారు. సోమవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఈ సందర్భంగా విలేకరుల ప్రశ్నకు బదులిస్తూ.. కూటమి అభ్యర్థిగా తనను ఎంపిక చేశారని చెప్పారు. మూడు పార్టీల నాయకులు కలిసికట్టుగా పనిచేస్తామన్నారు. జనసేన తరఫున టికెట్ ఆశించిన పోతిన మహేష్‌తో వాళ్ల అధినేత పవన్‌కళ్యాణ్ మాట్లాడారని, ఆయన కూడా తన విజయానికి పనిచేస్తారని తెలిపారు.

పరారీలో టీడీపీ నేత మాండ్ర శివానందరెడ్డి

పోలీసుల్ని ఏమార్చి పరారైన టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి

- అసైన్డ్ భూముల గోల్‌మాల్ వ్యవహారంపై కేసులు
- బుద్వేల్ వద్ద 26 ఎకరాలు చేజిక్కించుకున్న వైనం
- ప్రీలాంచ్ ఆఫర్ల పేరుతో అడ్వాన్స్‌లు వసూలు
- అరెస్ట్ చేసేందుకు నంద్యాల జిల్లా అల్లూరులో హైదరాబాద్ పోలీసుల యత్నం
- నోటీసులు ఇవ్వమని డిమాండ్ చేసిన ఈ మాజీ పోలీసు అధికారి
- అధికారులు ఆ పనిలో ఉండగా కారులో ఉడాయింపు
- భార్య, కుమారుడిని అదుపులోకి తీసుకున్న పోలీసులు



సాక్షి, నంద్యాల/సాక్షి, హైదరాబాద్: టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జి మాండ్ర శివానంద రెడ్డిని ఓ భూ వివాదం కేసులో అరెస్టు చేసేందుకు తెలంగాణ పోలీసులు ప్రయత్నించారు. ఆయన వారి కళ్లుగప్పి పరారయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన భార్యను, కుమారుడిని హైదరాబాద్‌లో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అసైన్డ్ భూముల కొనుగోలు పంచాయితీకి సంబంధించి భాగస్వాముల వివాదాలతో హైదరాబాద్ నగర నేర పరిశోధన విభాగం (సీసీఎస్)లో కేసులు నమోదయ్యాయి. వీటిని దర్యాప్తు చేస్తున్న నేపథ్యంలో మాజీ పోలీసు అధికారి అయిన శివానందరెడ్డి నిబంధనలకు విరుద్ధంగా అసైన్డ్ భూములు కొనుగోలు చేయడం, వాటిలో నిర్మాణాల పేరుతో ప్రీలాంచ్ ఆఫర్లు ఇచ్చి అడ్వాన్సులు వసూలు చేయడం వంటి పలు విషయాలు వెలుగులోకి వచ్చాయి. దీంతో శివానందరెడ్డిని అరెస్టు చేసేందుకు హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు సోమవారం నంద్యాల జిల్లా అల్లూరు గ్రామంలో ఆయన ఇంటికి వచ్చారు. భూ కబ్జాకు సంబంధించిన కేసులో విచారణకు సహకరించాలని ఆయన్ని కోరారు. నోటీసులు ఇవ్వకుండా తాను సహకరించనని మాండ్ర చెప్పారు. దీంతో పోలీసులు నోటీసులను సిద్ధం చేసే పనిలో నిమగ్నమయ్యారు. ఈ సమాచారం తెలుసుకున్న టీడీపీ శ్రేణులు శివానందరెడ్డి ఇంటికి చేరుకుని పోలీసులతో వాగ్వాదానికి దిగారు. ఈ సమయంలోనే శివానందరెడ్డి పోలీసుల కళ్లుగప్పి కారులో పరారయ్యారు. ఆయన్ని వెంబడించేందుకు ప్రయత్నించిన పోలీసుల్ని టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. పోలీసులు బయటికి వెళ్లకుండా ఆయన అనుచరులు గేట్లు మూసేశారు. దీంతో మాండ్ర తప్పించుకుని పారిపోయారు. దీంతో హైదరాబాద్‌లో ఉన్న సీసీఎస్ పోలీసులు నగరంలోని తారామతి బారాదారి వద్ద ఉన్న వెస్సెల్లా మెడోస్‌లోని శివానందరెడ్డి ఇంటిపై దాడిచేశారు. ఆయన భార్య ఉమాదేవిని, కుమారుడు కనిష్కరెడ్డిని, ప్రశాంత్‌రెడ్డిని అదుపులోకి తీసుకుని సీసీఎస్ కార్యాలయానికి తరలించారు. పరారీలో ఉన్న శివానందరెడ్డి కోసం పోలీసులు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌తో పాటు కర్ణాటకలోను ముమ్మరంగా గాలిస్తున్నారు. శివానందరెడ్డి తమ విధులకు ఆటంకం కలిగించి పరారయ్యారని సీసీఎస్ పోలీసులు బ్రాహ్మణకొట్కూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో శివానందరెడ్డి సెల్ఫీ వీడియో విడుదల చేశారు. తాను భూ కబ్జాలకు పాల్పడలేదని, కేసుకు సంబంధించిన పూర్తి సమాచారం ఇస్తే విచారణకు సహకరిస్తానని అందులో పేర్కొన్నారు.

భాగస్వాముల విభేదాలతో..

ఈ నేపథ్యంలో ఈ భూముల కోసం టి.జె.ప్రకాష్, కోనేరు గాంధీ, ఎస్.దశరథరామారావు రంగంలోకి దిగారు. అసైనీలుగా ఉన్న గుంటి నర్సింహులు తదితరులతో 69,200 చదరపు గజాల స్థలంపై అవగాహన ఒప్పందాలు (ఎంఓయూలు) చేసుకున్నారు. వీరికి చెల్లింపులు చేయడానికి గూడూరు కృష్ణ, రవి రాంబాబు, ఎంసీహెచ్ రాఘవరావు తదితరుల నుంచి 2014, 2018ల్లో పెట్టుబడులు తీసుకున్నారు. ఆ సందర్భాల్లో సర్వే నంబర్లు 282, 289ల్లో ఉన్న స్థలం నుంచి కొంతభాగం వీరికి ఇచ్చేలా, అది అసైన్డ్ భూమి కావడంతో గరిష్ఠంగా ఆరునెలల్లో ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు పొందేలా ఒప్పందాలు చేసుకున్నారు. 2022 నాటికీ ఈ తంతు పూర్తిగాకపోవడంతో భాగస్వాముల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో గూడూరు కృష్ణ, రవి రాంబాబు, ఎంసీహెచ్ రాఘవరావు తదితరులు సీసీఎస్‌లో ఫిర్యాదు చేయడంతో 2022 అక్టోబర్ 18న ప్రకాష్, గాంధీ, దశరథ్‌లపై నాలుగు కేసులు నమోదయ్యాయి

బుద్వేల్‌లోని అసైన్డ్ భూములు కేంద్రంగా..

సీఐడీలో సైబర్ క్రైమ్ ఎస్పీగా పనిచేస్తూ వాలంటరీ రిటైర్‌మెంట్ తీసుకున్న శివానందరెడ్డి 2019లో తెలుగుదేశం పార్టీ తరఫున నంద్యాల ఎంపీ అభ్యర్థిగా పోటీచేసి ఓడిపోయారు. ఇప్పుడు టీడీపీ నంద్యాల పార్లమెంట్ ఇన్‌చార్జిగా ఉన్న ఆయన హైదరాబాద్ బుద్వేల్‌లోని అసైన్డ్ భూములు కేంద్రంగా పాల్పడిన నేరం బయటపడింది. రాజేంద్రనగర్ శివారులో ఉన్న ఈ ప్రాంతంలోని 282, 283, 284, 289 సర్వే నంబర్లలో 480 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీన్ని 1986లో అప్పటి ప్రభుత్వం అసైన్డ్ ల్యాండ్‌గా ప్రకటిస్తూ దళితులకు పంపిణీ చేసింది. అనంతర పరిణామాల నేపథ్యంలో 1997లో అప్పటి ప్రభుత్వం ఈ భూముల్ని వెనక్కి తీసుకుంది. దీన్ని సవాల్ చేస్తూ అసైనీలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. సుదీర్ఘ న్యాయపోరాటం తర్వాత అక్కడున్న అసైనీలతోపాటు అప్పటికే ఆ స్థలాల్లో ఉంటున్న వారికీ న్యాయం చేయాలని ఆదేశాలొచ్చాయి. 2008లో వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ప్రభుత్వం ఒక్కో అసైనీకి 800 చదరపు గజాలు కేటాయిస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. వారికి విక్రయించే హక్కుల్ని మాత్రం ఇవ్వలేదు. దీంతో అసైనీలు విక్రయహక్కుల కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. మొత్తం మీద ఒక్కో అసైనీకి 800 చదరపు గజాల చొప్పున 66 మందికి, ఆ స్థలంలో ఉంటున్న ఒక్కొక్కరికి 400 చదరపు గజాల చొప్పున 82 మందికి ఇచ్చే ప్రయత్నాలు జరిగాయి.

హైకోర్టును ఆశ్రయించిన శివానందరెడ్డి, భార్య, కుమారుడు

తమపై సీసీఎస్ పోలీసులు బలవంతపు చర్యలు తీసుకోకుండా ఆదేశాలివ్వాలని కోరుతూ శివానందరెడ్డి, ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు కనిష్కరెడ్డి సోమవారం తెలంగాణ హైకోర్టును ఆశ్రయించారు. వారు లంచ్ మోషన్ రూపంలో దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ బి.విజయ్‌సేన్‌రెడ్డి విచారణ చేపట్టారు. శివానందరెడ్డిపై దాఖలైన కేసు వివరాలు తెలుసుకుని రావాలంటూ ప్రభుత్వ న్యాయవాదిని ఆదేశిస్తూ.. విచారణను మంగళవారానికి వాయిదా వేశారు. విచారణ జరిగే వరకు శివానందరెడ్డిని అరెస్టు చేయవద్దని స్పష్టం చేశారు. ఒకవేళ ఇప్పటికే అరెస్టు చేస్తే.. వ్యక్తిగత బాండ్లపై విడుదల చేయాలని పేర్కొన్నారు. పిటిషనర్లు సీసీఎస్ పోలీసులకు అందుబాటులో ఉండాలని, మంగళవారం ఉదయం సీసీఎస్‌కు హాజరుకావాలని న్యాయమూర్తి ఆదేశించారు.

వీటి దర్యాప్తులో ఆయన పాత్ర వెలుగులోకి..

ఈ నాలుగు కేసుల దర్యాప్తులో శివానందరెడ్డితో పాటు ఆయన భార్య ఉమాదేవి, కుమారుడు డైరెక్టర్లుగా ఉన్న కంపెనీ పాత్ర వెలుగులోకి వచ్చింది. 2015–16లో రంగంలోకి దిగిన శివానందరెడ్డి తాను బయటకు రాకుండా టి.జె. ప్రకాష్, కోనేరు గాంధీ, ఎస్.దశరథరామారావులను ముందుపెట్టి కథ నడిపారు. ఆ భూముల్ని తన కంపెనీ పేరుతో రాయించుకోవడంతోపాటు రాత్రికిరాత్రే అనుమతి జీవోలు తెప్పించుకున్నారని వెలుగులోకి వచ్చింది. పట్టాలు కూడా అసైనీలకు ఇవ్వకుండా, లేఔట్ కూడా వేయకుండా వారిని భయపెట్టి రిజిస్ట్రేషన్లు కూడా పూర్తిచేసినట్లు సీసీఎస్ పోలీసులు గుర్తించారు. గజం కనిష్ఠంగా రూ.12 వేల నుంచి రూ.15 వేలకు సొంతం చేసుకున్నట్లు బయటపడింది. ఈ విషయాలు వెలుగులోకి రావడంతో కేసులు మరో మలుపు తిరిగాయి. ఈ వ్యవహారంలో అప్పటి కొందరు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తేలింది. జనవరిలో కోర్టు అనుమతితో సీసీఎస్ పోలీసులు శివానందరెడ్డికి చెందిన వెస్సెల్లా గ్రూప్ కార్యాలయాల్లోను, ఆయన ఇంట్లోను సోదాలు చేశారు. పలు కీలక డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 26 ఎకరాల అసైన్డ్ భూముల్ని చేజిక్కించుకున్న శివానందరెడ్డి.. వెస్సెల్లా గ్రూప్ పేరిట 400 చదరపు గజాలు (5 వేల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా), 800 చదరపు గజాల (10 వేల చదరపు అడుగుల బిల్టప్ ఏరియా) విస్తీర్ణంలో లగ్జరీ విల్లాలు నిర్మిస్తామని ప్రచారం చేయడమేగాక ప్రీ లాంచ్ ఆఫర్ల పేరుతో చదరపు అడుగుకి రూ.10 వేల చొప్పున అనేకమంది నుంచి అడ్వాన్సులు సైతం వసూలు చేశారని ఈ డాక్యుమెంట్ల ఆధారంగా గుర్తించారు.

మల్లన్న సేవలో హైకోర్టు న్యాయమూర్తి



జస్టిస్ ఏవీ రవీంద్రబాబు దంపతులకు స్వాగతం పలుకుతున్న దేవస్థానం అధికారి

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబ సమేత మల్లికార్జున స్వామిని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఏవీ రవీంద్రబాబు దంపతులు సోమవారం దర్శించుకున్నారు. ఆలయం వద్దకు విచ్చేసిన న్యాయమూర్తి దంపతులకు అధికారులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అనంతరం జస్టిస్ రవీంద్రబాబు దంపతులు మల్లికార్జున స్వామి వారికి రుద్రాభిషేకం, భ్రమరాంబదేవికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం అమ్మవారి ఆశీర్వచన మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలుకగా, అధికారులు స్వామి, అమ్మవార్ల శేష వస్త్రం, జ్ఞాపిక, లడ్డూ ప్రసాదంతో సత్కరించారు.

వేగ జ్యూయలర్స్ వార్షికోత్సవ లక్కీ డ్రా విజేతలు

ఏప్రిల్ ఒకటి నుంచి 30 వరకు ప్రత్యేక ఆఫర్లు



విజయవాడ: లబ్బీపేటలోని వేగ జ్యూయలర్స్ ప్రథమ వార్షికోత్సవ లక్కీడ్రా విజేతలను సోమవారం ప్రకటించారు. ఖాతాదారులను ప్రోత్సహించేందుకు వేగ జ్యూయలర్స్ సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ మార్చి ఒకటి నుంచి 31వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ఇచ్చారు. ఈ ఆఫర్ల కాలంలో లక్కీ డ్రాను ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో మార్చి 31తో ఆఫర్లు ముగియడంతో షోరూమ్ నందు సోమవారం ఖాతాదారుల సమక్షంలో లక్కీ డ్రా తీశారు. విజయవాడకు చెందిన వసంత ఆదిశేషమ్మ, గుంటూరుకు చెందిన ఎస్.రోషిణి, వి.వెంకట రమణ లక్కీడ్రా విజేతలుగా నిలిచారు. వేగ జ్యూయలర్స్ డైమండ్ నెక్లెసులు సొంతం చేసుకున్నారు. వీరిని సంస్థ అధినేతలు వనమా నవీన్, వనమా సుధాకర్ అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉగాది పర్వదినం, వివాహ శుభముహూర్తాలను పురస్కరించుకుని ఏప్రిల్ ఒకటి నుంచి 30వ తేదీ వరకు ప్రత్యేక ఆఫర్లు ప్రకటిస్తున్నట్లు తెలిపారు. బంగారం కొనుగోలుపై ప్రతి గ్రాముకు రూ.250, అలాగే పాత బంగారం మార్పిడిపైన అదనంగా రూ.50 తగ్గింపును, డైమండ్ జ్యూయలరీ క్యారెట్ ధర రూ.54,000లకు అందిస్తామని చెప్పారు. పోల్కీ జ్యూయలరీపైన ఎలాంటి తయారీ, తరుగు చార్జీలు ఉండవని ప్రకటించారు.

వైఎస్సార్‌సీపీకి అండగా నూర్‌బాషా దూదేకులు

నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ



గంగుల ప్రభాకర్‌రెడ్డితో ఎస్ఎస్ బాజీ

ఆళ్లగడ్డ: రాష్ట్రవ్యాప్త నూర్‌బాషా దూదేకులు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి అండగా ఉంటారని నూర్‌బాషా దూదేకుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్ఎస్ బాజీ తెలిపారు. స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నూర్‌బాషా దూదేకుల సంఘం నేత, రాష్ట్ర జలవనరుల సలహాదారు గంగుల ప్రభాకర్‌రెడ్డిని కలుసుకుని నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గంగుల బిజేంద్రారెడ్డి గెలుపునకు తమ సంఘం తరఫున సంపూర్ణ మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా బాజీ మాట్లాడుతూ తమను వివిధ రకాలుగా కులం పేరుతో కించపరుస్తున్నారని, దీనిపై తగు చర్యలు తీసుకోవాలని సుమారు 20 ఏళ్లుగా పోరాటాలు చేస్తూనే ఉన్నా ఎవరూ పట్టించుకోలేదన్నారు. అయితే సీఎం వైఎస్ జగన్‌ను కలుసుకుని విషయం చెప్పగానే.. వెంటనే స్పందించి విధివిధానాలు రూపొందించారని, ఈ నెల 12 నుంచి తమను ఎవరైన కులం పేరుతో హేళన చేసినా, కించపరుస్తూ మాట్లాడినా కేసు పెట్టేలా ప్రత్యేక జీవో విడుదల చేసినట్టు తెలిపారు. అలాగే ముస్లిం మైనార్టీలకు అందజేస్తున్న షాదీ తోఫా రూ.లక్ష తమకూ అందేలా చర్యలు తీసుకున్నారని కొనియాడారు.

ఓట్లు కావాలంటే హామీపత్రం రాసివ్వండి

నూజివీడులో టీడీపీ అభ్యర్థి పార్థసారథిని నిలదీసిన వృద్ధురాలు



సారథిని నిలదీస్తున్న వృద్ధురాలు తులశమ్మ

నూజివీడు: 'మీరు ఇచ్చే హామీలు నెరవేరుస్తామని హామీపత్రం రాసివ్వండి. లేకపోతే మీకు ఓటు వేయం...' అంటూ ఏలూరు జిల్లా నూజివీడు నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి కొలుసు పార్థసారథిని ఓ వృద్ధురాలు నిలదీశారు. ఇందుకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. కె.పార్థసారథి శనివారం నూజివీడులోని 10వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తుండగా... స్థానికులు తమ గృహాలు చెరువు పోరంబోకు స్థలంలో ఉన్నాయని, వాటికి పట్టాలు ఇప్పించాలని కోరారు. దీనిపై పార్థసారథి మాట్లాడుతూ తాము అధికారంలోకి రాగానే నివేశన స్థలాలకు పట్టాలు ఇప్పిస్తామని, లేనిపక్షంలో పొజిషన్ సర్టిఫికెట్లు అయినా ఇస్తామని హామీ ఇచ్చారు. ఇంతలో స్థానికంగా నివాసం ఉంటున్న తులశమ్మ అనే వృద్ధురాలు జోక్యం చేసుకుని 'నోటి మాట చెబితే కుదరదు. రాతపూర్వకంగా హామీపత్రం రాసివ్వాలి. లేకపోతే ఓట్లు వేయం' అని చెప్పారు. దీంతో తులశమ్మతో టీడీపీ నేతలు వాగ్వాదానికి దిగారు.

వైఎస్సార్‌సీపీలో భారీగా చేరికలు



తణుకులో వైఎస్సార్‌సీపీలో చేరిన 27వ వార్డు మహిళలతో మంత్రి కారుమూరి



చింతరేవులో పార్టీలో చేరిన వారిని కండువా కప్పి ఆహ్వానిస్తున్న చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు



కైకలూరు ఎమ్మెల్యే డీఎన్నార్ సమక్షంలో పార్టీలో చేరిన జనసేన, టీడీపీ నాయకులు



భీమవరంలో వైఎస్సార్‌సీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిస్తున్న ప్రభుత్వ విప్ గ్రంధి శ్రీనివాస్



పోలవరంలో కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే తెల్లం బాలరాజు

తణుకు అర్బన్/మొగల్తూరు/కైకలూరు/భీమవరం/పెనుగొండ/పాలకొల్లు అర్బన్/పోలవరం రూరల్/బుచ్చిరెడ్డిపాళెం రూరల్: ఏలూరు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు కొనసాగుతున్నాయి. రాష్ట్ర మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు సమక్షంలో సోమవారం తణుకు 27వ వార్డు టీడీపీ మాజీ కౌన్సిలర్ మెర్ల అనంతలక్ష్మి పద్మావతి, ఆమె కుటుంబ సభ్యులు మెర్ల వెంకట్రావు, మెర్ల రాంబాబు తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. అదేవిధంగా టీడీపీకి చెందిన 80మంది కాపు నాయకులు కూడా తమ కుటుంబ సభ్యులతో కలిసి కారుమూరి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు నమ్మి వాసు, మహిళా నాయకురాలు తిరునాల శకుంతల ఆధ్వర్యాన టీడీపీ నాయకులు వర్థినీడి సూర్యచంద్రరావు, ఉజ్జిన సిద్దయ్య, వీర్ని సూర్యప్రకాశరావు, వారి కుటుంబ సభ్యులతో పాటు ఏరపాటి రమణమ్మ, పాలాటి లక్ష్మి తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారిని మంత్రి కారుమూరి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు.

- పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం చింతరేవు ప్రాంతానికి చెందిన బీజేపీ నాయకుడు తిరుమాని ఏడుకొండలు తన అనుచరులతో కలిసి వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి నరసాపురం ఎమ్మెల్యే అభ్యర్థి ప్రసాదరాజు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.
- ఏలూరు జిల్లా కైకలూరు నియోజకవర్గం ముదినేపల్లి మండల ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ ఆధ్వర్యంలో జనసేన మండల గౌరవ అధ్యక్షుడు పోకల దేవేంద్ర గోపాలకృష్ణ, మండల కార్యదర్శి నాగదేశి గణేష్‌బాబు, నాయకులు నర్రా ప్రభు, కారుమంచి యుగంధర్, ముదినేపల్లి మండల టీడీపీ నాయకులు అల్లాడి సతీష్‌బాబు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి కైకలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.
- పశ్చిమ గోదావరి జిల్లా భీమవరం మండలం కొవ్వాడ అన్నవరం గ్రామానికి చెందిన సుమారు వంద మంది టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట నియోజకవర్గం తూర్పుపాలెంలో మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు చెరుకువాడ శ్రీరంగనాథరాజు సమక్షంలో ములపర్రు గ్రామానికి చెందిన కాపు సంఘ నాయకులు, మారెమ్మ గద్దెకు చెందిన శెట్టి బలిజ నాయకులు భారీగా వైఎస్సార్‌సీపీలో చేరారు.
- పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు మండలం వాలమర్రులో సర్పంచ్ గంటా సత్యనారాయణ, ఉప సర్పంచ్ దాసరి రమేష్ నాయకత్వంలో దళిత యువకులు సరిపల్లి సుదీప్, సరెళ్ల నివాస్, సరిపల్లి రమేష్, దాయం ఏసురత్నం, సబ్బితి భరత్‌కుమార్, సరెళ్ల శివాజీతో పాటు 30కుటుంబాలవారు పాలకొల్లు నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- ఏలూరు జిల్లా పోలవరం మండలం పట్టిసం పంచాయతీ పరిధిలోని బంగారం పేటతోపాటు పోలవరానికి చెందిన టీడీపీ, జనసేన నాయకులు దత్తి దేవి, కొవ్విడి పోశయ్య, కోటాబత్తుల రాంబాబు తమ అనుచరులతో కలిసి ఎమ్మెల్యే బాలరాజు, ఎమ్మెల్యే అభ్యర్థి తెల్లం రాజ్యలక్ష్మి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.
- శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాళెం మండలానికి చెందిన పలువురు టీడీపీ నాయకులు, కార్యకర్తలు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. పెనుబల్లి గ్రామ టీడీపీ ఉప సర్పంచ్ గుమ్మ భాస్కర్ తన అనుచరులు 200 మందితో, కోవూరు నగర పంచాయతీకి చెందిన గిలకా కల్యాణ్, కనపరెడ్డి వేణు తమ అనుచరులు 200 మందితో కలిసి ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పంచేడు గ్రామానికి చెందిన గారితోటి విజయ్, బి.కామేశ్వరరావు కూడా ఎమ్మెల్యే సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.

ఈశాన్యం ఎవరి వశం!

క్రమంగా విస్తరిస్తున్న బీజేపీ

- 11 సీట్లలో 2019లో 5 కైవసం
- ఈసారీ వాటిని నిలుపుకునే చాన్స్
- తగ్గుతూ వస్తున్న కాంగ్రెస్ ప్రభ
- ఒక్క సీటే రావచ్చంటున్న సర్వేలు
- పలు రాష్ట్రాల్లో స్థానిక పార్టీల హవా



సెవెన్ సిస్టర్స్‌గా పేరొందిన ఈశాన్య రాష్ట్రాల్లో లోక్‌సభ స్థానాలు తక్కువగానే ఉన్నప్పటికీ, దేశ రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్నాయి. ఈ ఏడు రాష్ట్రాలతో పాటు సిక్కింను సోదర రాష్ట్రంగా వ్యవహరింటారు. భూటాన్, మయన్మార్, బంగ్లాదేశ్, నేపాల్, చైనాలతో సుదీర్ఘ సరిహద్దును పంచుకుంటున్న ఈశాన్య రాష్ట్రాల్లో అభివృద్ధి ఇప్పుడిప్పుడే జోరందుకుంటోంది. ఇక్కడ ప్రాంతీయ పార్టీలదే హవా. కొన్నేళ్లుగా జాతీయ పార్టీలు వాటికి తీవ్రంగా పోటీ ఇస్తున్నాయి. గత రెండు లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ మెరుగైన ఫలితాలతో ఈశాన్యంలో పాగా వేసింది. అయితే ఇటీవలి మణిపూర్ మారణ కాండ నేపథ్యంలో సమీకరణాలు మారుతున్నాయి...

మణిపూర్.. కాంగ్రెస్‌కు షాక్

మణిపూర్లో అసెంబ్లీతో పాటు లోక్‌సభ స్థానాల్లోనూ పట్టు నిలుపుకుంటూ వస్తున్న కాంగ్రెస్‌కు 2019లో తొలిసారి షాక్ తగిలింది. ఇక్కడి రెండు సీట్లలో ఓటమి పాలైంది. ఒకటి బీజేపీ, మరోటి ప్రాంతీయ పార్టీ నేషనల్ పీపుల్స్ ఫ్రంట్ (ఎన్పీఎఫ్)కు గెలుచుకున్నాయి. 2022 అసెంబ్లీ ఎన్నికల్లో కాషాయ జెండా ఎగిరింది. 60 సీట్లకు గాను బీజేపీ 32 స్థానాలు కైవసం చేసుకుని సొంతంగా మెజారిటీ దక్కించుకుంది. ప్రాంతీయ పార్టీలైన ఎన్పీఎఫ్, ఎన్పీపీ, లోక్ జనశక్తి పార్టీలతో కలిసి బీరేన్ సింగ్ సీఎంగా ఎన్డీఏ సర్కారు కొలువుదీరింది. గతేడాది కుకీ, మెయితీ తెగల మధ్య చెలరేగిన ఘర్షణలు దేశమంతటా ప్రకంపనలు సృష్టించాయి. అత్యాచారాలు, సజీవ దహనాలతో మణిపూర్ అట్టుడికింది. ఇప్పటికీ పరిస్థితులు నివురుగప్పిన నిప్పులా ఉన్నాయి. ప్రభుత్వం అల్లర్ల బీజేపీ నివారణలో విఫలమైందని, మోదీ కనీసం ఒక్కసారైనా పర్యటించలేదంటూ విపక్షాలు దుమ్మెత్తిపోస్తున్నాయి.



నోట్: ఈశాన్య రాష్ట్రాల్లో 14 లోక్‌సభ సీట్లున్న అసోంపై విడిగా కథనం అందిస్తాం

మేఘాలయ... బీజేపీకి అందని ద్రాక్ష

ఇక్కడా ప్రాంతీయ పార్టీల హవాయే సాగుతోంది. కాంగ్రెస్ పోటీ ఇస్తున్నా బీజేపీ పెద్దగా సోదిలో లేదు. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అంతే. 2019 లోక్‌సభ ఎన్నికల్లో కాంగ్రెస్, ఎన్పీపీ చెరో సీటు గెలవగా బీజేపీ ఖాతా తెరవలేదు. ఈసారి కూడా అదే ఒరవడి కొనసాగేలా కన్పిస్తోంది. ఇక మిజోరంలో ఏకైక లోక్‌సభ స్థానం ఎంఎన్ఎఫ్, కాంగ్రెస్ మధ్య చేతులు మారుతోంది. 2019లో ఎంఎన్ఎఫ్ గెలిచింది. నాగాలాండ్‌లో ఏకైక లోక్‌సభ సీటును 2004, 2014ల్లో నాగాలాండ్ పీపుల్స్ పార్టీ గెలుచుకుంది. 2019లో నేషనలిస్ట్ డెమొక్రటిక్ ప్రోగ్రెసివ్ పార్టీ గెలిచింది. ఈసారి ఎన్పీపీ కూడా గట్టి పోటీ ఇస్తోంది.

2019లో ఏ పార్టీకి ఎన్ని?
మొత్తం సీట్లు 11
అరుణాచల్ ప్రదేశ్ - 2 (బీజేపీ 2)
మణిపూర్ - 2 (బీజేపీ 1, ఎన్పీఎఫ్ 1,)
మేఘాలయ - 2 (కాంగ్రెస్ 1, ఎన్పీపీ 1)
మిజోరం - 1 (ఎంఎన్ఎఫ్ 1)
నాగాలాండ్ - 1 (ఎన్డీపీపీ 1)
త్రిపుర - 2 (బీజేపీ 2)
సిక్కిం - 1 (ఎస్‌కేఎం 1)

త్రిపుర.. కమ్యూనిస్టుల కోట బద్దలు

ఈ కమ్యూనిస్టుల కంచుకోటలో ఎట్టకేలకు కాషాయ జెండా ఎగిరింది. 1998 నుంచి 2018 దాకా రాష్ట్రాన్ని సీపీఎం నేత మాణిక్ సర్కార్ ఏలారు. 2018 అసెంబ్లీ ఎన్నికల్లో 60 ఎమ్మెల్యే సీట్లలో 36 స్థానాలు దక్కించుకుని బిప్లవ్ కుమార్ దేవ్ తొలి బీజేపీ ముఖ్యమంత్రిగా పగ్గాలు చేపట్టారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ రెండు సీట్లలోనూ బీజేపీ చేతిలో సీపీఎం ఓటమి చవిచూసింది. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో కాస్త ప్రభావం చూపుతున్నా లోక్‌సభ పోరులో మాత్రం పూర్తిగా వెనకబడింది.

అరుణాచల్‌లో బీజేపీ పాగా

కాంగ్రెస్ కంచుకోట అయిన ఈ రాష్ట్రంలో ఎట్టకేలకు కమలనాథులు పాగా వేశారు. ఇక్కడ లోక్‌సభతో పాటు అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతున్నాయి. 2004 నుంచి 2014 దాకా రాష్ట్రంలో కాంగ్రెసే అధికారాన్ని చేజిక్కించుకుంది. లోక్‌సభ ఎన్నికల్లో మాత్రం రెండు సీట్లనూ 2004లో బీజేపీ, 2009లో కాంగ్రెస్ నెగ్గాయి. 2014లో చెరో సీటు దక్కించుకున్నాయి. 2019 మాత్రం మోదీ సునామీ ఈశాన్యాన్ని కూడా ముంచెత్తింది. దాంతో అరుణాచల్ పూర్తిగా బీజేపీ ఖాతాలో చేరింది. రెండు లోక్‌సభ సీట్లతో పాటు అసెంబ్లీలోనూ ఎన్డీఏ పాగా వేసి కాంగ్రెస్ (యూపీఏ) సుదీర్ఘ పాలనకు తెరదించింది. 60 సీట్ల అరుణాచల్ అసెంబ్లీలో ఎన్డీఏ భాగస్వాములు బీజేపీ 41 సీట్లు, జేడీయూ 7, నేషనల్ పీపుల్స్ పార్టీ 5 గెలుచుకున్నాయి. పెమా ఖండూ సీఎంగా తొలిసారి పూర్తి మెజారిటీతో బీజేపీ సర్కారు కొలువుదీరింది. ఈసారి అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ పోలింగ్‌కు ముందే ఖాతా తెరిచింది. సీఎం పెమా ఖండూతో సహా 10 మంది అభ్యర్థులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. 2019లో కూడా ఖండూతో పాటు ముగ్గురు బీజేపీ అభ్యర్థులు ఏకగ్రీవంగా గెలిచారు. ఈసారి మొత్తం 60 సీట్లలోనూ బీజేపీ బరిలో ఉంది.

సిక్కింలో లోకల్ హవా

ఈ బుల్లి రాష్ట్రంలో కూడా లోక్‌సభతో పాటు అసెంబ్లీకి ఎన్నికలు జరుతున్నాయి. ఇక్కడ లోకల్ పార్టీలదే పూర్తి హవా. దేశంలోనే అత్యంత సుదీర్ఘకాలం సీఎం పదవిలో కొనసాగిన రికార్డు దక్కించుకున్న (1994 నుంచి 2019 వరకు, 5 సార్లు) పవన్ కుమార్ చామ్లింగ్‌కు గత ఎన్నికల్లో షాక్ తగిలింది. ప్రేమ్ సింగ్ తమాంగ్ నేతృత్వంలోని సిక్కిం క్రాంతికారి మోర్చా (ఎస్‌కేఎం) చేతిలో చామ్లింగ్ పార్టీ సిక్కిం డెమొక్రటిక్ ఫ్రంట్ (ఎస్డీఎఫ్) ఓటమి చవిచూసింది. లోక్‌సభ సీటు కూడా ఎస్‌కేఎం వశమైంది. దాంతో ఈసారి పోరు ఆసక్తికరంగా మారింది.

సర్వేలు ఏమంటున్నాయి...

అరుణాచల్, త్రిపురల్లోని 4 సీట్లూ బీజేపీవేనని, మణిపూర్‌లో బీజేపీ, కాంగ్రెస్ చెరోటి, మిజోరంలో జెడ్‌పీఎం, నాగాలాండ్‌లో ఎన్డీపీపీ, సిక్కింలో ఎస్‌కేఎం, మేఘాలయలో ఎన్పీపీకి 2 సీట్లు దక్కుతాయని సర్వేలు అంచనా వేస్తున్నాయి. అదే జరిగితే బీజేపీ ఈశాన్యంలో తన 5 సీట్లను నిలబెట్టుకోనుంది. కాంగ్రెస్ ఒక స్థానాన్ని చేజార్చుకోనుంది.

రెండు విడతల్లో పోలింగ్

అసోం మినహా ఈశాన్య రాష్ట్రాల్లో 11 లోక్‌సభ స్థానాలున్నాయి. అరుణాచల్‌ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, త్రిపురలో రెండేసి, మిజోరం, నాగాలాండ్, సిక్కింలో ఒక్కో సీటు ఉన్నాయి. అరుణాచల్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర వెస్ట్, ఇన్నర్ మణిపూర్ నియోజకవర్గాల్లో తొలి విడత (ఏప్రిల్ 19) ఎన్నికలు జరగనున్నాయి. త్రిపుర ఈస్ట్, ఔటర్ మణిపూర్‌లో రెండో దశలో (ఏప్రిల్ 26) పోలింగ్ నిర్వహించనున్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్



ఎన్నికల విచిత్రం

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి లోక్‌సభ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న బాలీవుడ్ నటి కంగనా రనౌత్ సోమవారం స్థానికంగా పర్యటించారు. ఓ టీ కొట్టు వద్ద ఇలా చాయ్ చేయడంతో పాటు కప్పుల్లో పోసి అందరికీ అందించి సందడి చేశారు.

ఎలక్షన్ బీట్

ఛింద్వారాలో కాంగ్రెస్‌కు షాక్

భోపాల్(మధ్యప్రదేశ్): లోక్‌సభ ఎన్నికల వేళ సీనియర్ నేత, మాజీ సీఎం కమల్ నాథ్ కంచుకోట ఛింద్వారాలో కాంగ్రెస్‌కు ఎదురుదెబ్బ తగిలింది. ఛింద్వారా మేయర్ విక్రమ్ అహాకే అధికార బీజేపీలో చేరారు. ఛింద్వారాలో కమల్ నాథ్ కుమారుడు నకుల్ నాథ్ కాంగ్రెస్ తరఫున పోటీ చేస్తున్న విషయం తెలిసిందే. గత వారం, కమల్ నాథ్ సన్నిహితుడిగా పేరున్న ఛింద్వారాకే చెందిన అమర్వాడా కాంగ్రెస్ ఎమ్మెల్యే కమ్లేశ్ షా బీజేపీలో చేరారు. 2019 లోక్‌సభ ఎన్నికల్లో మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఏకైక ఎంపీ నకుల్ నాథ్. ఈ స్థానం నుంచి గతంలో కమల్ నాథ్ తొమ్మిది పర్యాయాలు విజయం సాధించారు. కమల్ నాథ్ ప్రస్తుతం ఛింద్వారా ఎమ్మెల్యేగా ఉన్నారు.

రాహుల్ వ్యాఖ్యలపై ఈసీకి ఫిర్యాదు

న్యూఢిల్లీ: ఢిల్లీలో ఆదివారం జరిగిన ఇండియా కూటమి ర్యాలీలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చేసిన మ్యాచ్ ఫిక్సింగ్ వ్యాఖ్యలపై కఠిన చర్యలు తీసుకోవాలని బీజేపీ సోమవారం ఎన్నికల కమిషన్‌ను కోరింది. కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పూరి నేతృత్వంలోని బీజేపీ బృందం రాహుల్‌పై ఈసీకి ఫిర్యాదు అందజేసింది. ఆదివారం ర్యాలీలో రాహుల్ మాట్లాడుతూ.. 'ఈసారి లోక్‌సభ ఎన్నికలకు మ్యాచ్ ఫిక్సింగ్ జరిగింది. ఎన్నికల కమిషన్‌లో కేంద్రం తన వాళ్లను నియమించుకుంది. ఎన్నికల తర్వాత రాజ్యాంగం కూడా మారిపోతుంది' అని అన్నారని మంత్రి గుర్తు చేశారు. కేంద్ర హోం మంత్రి అమిత్ షాపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేసిన కర్ణాటక సీఎం సిద్ధరామయ్య కుమారుడు యతీంద్రపై ఎఫ్ఐఆర్ నమోదుకు ఆదేశించాలని కూడా ఈసీని కోరినట్లు తెలిపారు.

ఘోష్, శ్రీనేత్‌లకు ఈసీ చీవాట్లు

న్యూఢిల్లీ: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు బీజేపీ నేత దిలీప్ ఘోష్, కాంగ్రెస్ నాయకురాలు సుప్రియా శ్రీనేత్‌లను కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం గట్టిగా మందలించింది. ఇకపై వారి ప్రసంగాలను నిశితంగా గమనిస్తామని హెచ్చరించింది. నియమావళిని పాటించేలా చూడటంతోపాటు మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయకుండా శ్రేణులను అప్రమత్తం చేయాలని పార్టీలకు సూచించింది. బీజేపీ అభ్యర్థి, బాలీవుడ్ నటి కంగనా రనౌత్‌పై సుప్రియ, పశ్చిమబెంగాల్ సీఎం మమతా బెనర్జీపై ఘోష్ అనుచిత వ్యాఖ్యలు చేయడం తెలిసిందే.

రూ.25 కోట్లు ఇస్తామన్నారు: ఆప్ ఎమ్మెల్యే

న్యూఢిల్లీ: బీజేపీలో చేరితే రూ.25 కోట్లు ఇస్తామంటూ ఆ పార్టీ నేతలు ఆశ చూపారని ఢిల్లీకి చెందిన ఆప్ ఎమ్మెల్యే రితురాజ్ ఝా సోమవారం ఆరోపించారు. మరో 10 మంది ఆప్ ఎమ్మెల్యేలను కూడా తీసుకురావాలని అడిగారన్నారు. ఢిల్లీలో ఆప్ ప్రభుత్వాన్ని నాశనం చేయాలని బీజేపీ భావిస్తోందని ఆయన ఆరోపించారు. ''ఆదివారం దరియాపూర్‌లో కొందరు వ్యక్తులు నన్ను కలిశారు. ఆప్‌ను వీడి బీజేపీలో చేరితే నాకు రూ.25 కోట్లు ఇస్తామని చెప్పారు. మరో 10 మంది ఎమ్మెల్యేలను తీసుకు రావాలని, తలా రూ.25 కోట్లు ముట్టజెబుతామని, నాకు మంత్రి పదవి ఇస్తామని చెప్పారు'' అన్నారు.

ఐదున కాంగ్రెస్ మేనిఫెస్టో

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీ ఈ నెల ఐదో తేదీన లోక్‌సభ ఎన్నికల మేనిఫెస్టో విడుదల చేయనుంది. ''ప్రజలతో విస్తృత సంప్రదింపుల అనంతరం మేనిఫెస్టో రూపొందించాం. 5న విడుదల చేస్తాం. ఆరో తేదీ జైపూర్, హైదరాబాద్‌లలో భారీ సభలు నిర్వహించనున్నాం' అని ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం వెల్లడించారు.

మైసూరు మహారాజుకు సొంతిల్లు లేదట!

బెంగళూరు: బీజేపీ టికెట్‌పై మైసూరు-కొడగు లోక్‌సభ స్థానంలో పోటీ చేస్తున్న మైసూరు రాచ కుటుంబ వారసుడు యదువీర్ కృష్ణదత్త చామరాజ ఒడయార్‌కు సొంతిల్లు కూడా లేదట! తనకు భూములు, వాహనం కూడా లేవని ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. రూ.5 కోట్ల విలువైన ఆస్తులున్నాయని, భార్యకు రూ.1.04 కోట్ల ఆస్తి, కుటుంబంలోని మరో సభ్యునికి రూ.3.64 కోట్ల ఆస్తి ఉందని తెలిపారు. తన బంగారు, వెండి ఆభరణాల విలువ రూ.3.39 కోట్లు కాగా, తన భార్యకు రూ.1.02 కోట్ల విలువైన నగలున్నాయని పేర్కొన్నారు.

పేదలకు ఫారిన్ విస్కీ, బీరు ఉచితం

మహారాష్ట్రలో ఏజీఎంపీ అభ్యర్థి విచిత్ర హామీ

చంద్రాపూర్: ఎన్నికల్లో ఉచిత హామీల జాబితాలోకి తాజాగా మద్యం కూడా వచ్చి చేరింది! తనను గెలిపిస్తే పేదలకు ఎంపీ నిధులతో బీరు, ఫారిన్ విస్కీ సరఫరా చేస్తానని మహారాష్ట్రలో చంద్రాపూర్ అభ్యర్థి, అఖిల భారతీయ మానవతా పార్టీ నేత వనితా రౌత్ వింతైన హామీలిస్తున్నారు. ఊరూరా బార్ తెరిపిస్తానని, ఎంపీ నిధులతో ఉచితంగా బీరు, విదేశీ విస్కీ సరఫరా చేస్తానని చెప్పుకుంటున్నారు. మద్యానికి రేషనింగ్ విధానాన్ని అమలు చేస్తానని, మందు బాబులతోపాటు విక్రేతలకు కూడా లైసెన్సు ఉండాలన్నారు. రోజంతా శారీరక కష్టం చేసే పేదలు, చీపుగా దొరికే లిక్కర్ మితిమీరి తాగి ఆరోగ్యం చెడగొట్టుకుంటున్నారు. అందుకే, అలాంటి వారికోసం విదేశీ విస్కీ, బీరు అందజేయాలనుకుంటున్నానన్నారు. యుక్త వయస్కులకే మందు తాగేందుకు లైసెన్సు ఇవ్వాలన్నారు. మద్యం తాగడం పట్ల సమాజంలో అపోహలను తొలగిస్తానని వనిత చెప్పారు. కాగా, 2019 లోక్‌సభ ఎన్నికల్లోనూ పోటీ చేసిన వనిత, ఇలాంటి హామీలనే ఇవ్వడంతో అధికారులు డిపాజిట్ సొమ్మును తిరిగి ఇవ్వలేదు. అయినప్పటికీ, ఆమె తీరు మాత్రం ఈసారి కూడా మారలేదు.

డీఎంకే రెండు నాల్కల ధోరణి: మోదీ

సాక్షి, న్యూఢిల్లీ: కచ్చతీవు ద్వీపాన్ని కాంగ్రెస్ హయాంలో శ్రీలంకకు అప్పగించారంటూ ఆరోపించిన ప్రధాని నరేంద్ర మోదీ, ఈ అంశంపై డీఎంకేపైనా సోమవారం విమర్శల వాన కురిపించారు. ''దీనిపై ఓవైపు నిరసనలు చేసి, మరోవైపు శ్రీలంకకు ఇవ్వడంలో అభ్యంతరం లేదనడం ద్వారా తమిళనాడు ప్రయోజనాలను డీఎంకే పణంగా పెట్టింది. తద్వారా రెండు నాల్కల ధోరణి బయట పెట్టుకుంది'' అని తూర్పారబట్టారు.

అరుణాచల్‌లోని మరో 30 ప్రాంతాలకు చైనా పేర్లు

బీజింగ్: అరుణాచల్ ప్రదేశ్‌లో మరో 30 ప్రాంతాలకు చైనా తమ పేర్లతో జాబితా విడుదల చేసింది. అరుణాచల్‌ను జాగ్నాన్ అని చైనా పిలుస్తుండటం, అది దక్షిణ టిబెట్ భాగమని వాదిస్తుండటం తెలిసిందే. చైనా తాజా చర్యను భారత్ తోసిపుచ్చింది. ''అరుణాచల్ భారత్‌లో విడదీయరాని భాగం. కొత్త పేర్లు పెట్టినంత మాత్రాన అది మారదు'' అని వ్యాఖ్యానించింది.

వినువీధిలో కనువిందు చేస్తున్న మదర్ ఆఫ్ డ్రాగన్స్



హేలీ తరహా తోకచుక్క ఒకటి ప్రస్తుతం వినువీధిలో కనువిందు చేస్తోంది. దీని పేరు 12పీ/పోన్స్-బ్రూక్స్. పెద్ద తోకను తలపించే ధూళి మేఘంతో మెరిసిపోతుంది గనుక ఖగోళ శాస్త్రవేత్తలు దీన్ని మదర్ ఆఫ్ డ్రాగన్స్ అనే ముద్దుపేరుతో పిలుచుకుంటారు. హేలీ మాదిరిగానే ఇది దాదాపుగా 71 ఏళ్లకు ఓసారి భూమిపై నుంచి కన్పిస్తుంది. ఈ తోకచుక్క ప్రస్తుతం భూమికి అతి సమీపంగా సాగిపోయే క్రమంలో ఉత్తరార్ధ గోళం నుంచి స్పష్టంగా కన్పిస్తోంది. ఏటా నవంబర్ చివరి నుంచి డిసెంబర్ మధ్య దాకా సాగే అంతరిక్షంలో జరిగే వార్షిక ఉల్కా పాతాలకు ఇదే మూలకారణం. అందుకే దీన్ని 'డెవిల్ కామెట్' అని కూడా పిలుస్తుంటారు. ఈ తోకచుక్క మంచు, ధూళి, రాళ్లమయం. సూర్యునికి సమీపంలోకి వచ్చినప్పుడల్లా మంచు వాయువుగా మారి ఉపరితలం మీది ధూళితో కలిసి మేఘంలా మారి బయటికి వెళ్లిపోతుంది. ఆ క్రమంలో దానికి అతి పెద్ద తోకలా కన్పిస్తుంటుంది. ధూళి మేఘం ఆకృతిని బట్టి ఈ తోకచుక్క భూమి నుంచి ఒక్కోసారి అతి ప్రకాశవంతంగా, మరోసారి కనీకనిపించనట్టుగా దర్శనమిస్తుంది. దీన్ని పరిశోధించి తోకచుక్కలకు, సౌరవ్యవస్థ వికాస క్రమానికి సంబంధించి మరిన్ని ఆసక్తికరమైన కొత్త సంగతులు కనిపెట్టే పనిలో సైంటిస్టులు ప్రస్తుతం బిజీగా ఉన్నారు.

\- సాక్షి, నేషనల్ డెస్క్

ఎన్నికల వేళ కఠిన చర్యలు తీసుకోబోం

కాంగ్రెస్‌కు ట్యాక్స్ డిమాండ్ నోటీసులపై సుప్రీంకోర్టుకు తెలిపిన ఐటీ శాఖ

న్యూఢిల్లీ: సార్వత్రిక ఎన్నికల వేళ కాంగ్రెస్‌కు సుప్రీంకోర్టులో భారీ ఊరట లభించింది. తుది తీర్పు వచ్చేదాకా రూ.3,500 కోట్ల ఆదాయ పన్ను చెల్లింపుల బకాయిల కోసం ఆ పార్టీపై కఠిన చర్యలకు దిగబోమని ఐటీ విభాగం సోమవారం కోర్టుకు తెలిపింది. దాంతో విచారణను జులై 24వ తేదీకి ధర్మాసనం వాయిదా వేసింది. కాంగ్రెస్‌కు ఐటీ శాఖ అంతటి భారీ ఐటీ డిమాండ్ నోటీసులను ఎందుకు జారీచేయాల్సి వచ్చిందో సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అంతకుముందు కోర్టుకు వివరించారు. ''కట్టాల్సిన దాంట్లో 20 శాతం చెల్లించాలన్న ఆఫర్‌ను కాంగ్రెస్ సద్వినియోగం చేసుకోలేదు. అందుకే 2021కు సంబంధించి రూ.135 కోట్లను రికవర్ చేశాం. నిబంధనల ప్రకారమే పాత రూ.1,700 కోట్ల కోసం నోటీసులు ఇచ్చాం'' అని తెలిపారు.

కోర్టులో ఉపశమనంపై కాంగ్రెస్ హర్షం వెలిబుచ్చింది. ''పన్నుల పేరిట ఉగ్రవాదానికి పాల్పడుతున్న ఏ రాజకీయ పార్టీనీ మేం గతంలో కోర్టుల వేదికగా ఎదుర్కోలేదు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని పరిరక్షించినందుకు సుప్రీంకోర్టుకు ధన్యవాదాలు. కోర్టు జోక్యంతో ఇప్పుడు ఎన్నికల్లో రాజకీయ పార్టీల మధ్య ఇప్పుడు సరైన పోటీ వాతావరణం మళ్లీ నెలకొంది'' అని పేర్కొంది.

తిహార్ జైలుకు కేజ్రీవాల్

15దాకా జ్యుడీషియల్ కస్టడీ • జైలు వద్ద ఆప్ కార్యకర్తల నిరసన

న్యూఢిల్లీ: ఢిల్లీ ఎక్సయిజ్ పాలసీ విధానంలో అక్రమాల కేసులో ఈడీ అరెస్ట్ చేసిన ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను ఢిల్లీ కోర్టు ఈనెల 15వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. మార్చి 21న ఈడీ అరెస్ట్‌చేశాక మార్చి 28వ తేదీదాకా ఈడీ కస్టడీకి అప్పగిస్తూ ఢిల్లీ సిటీ కోర్టు స్పెషల్ జడ్జి కావేరీ బవేజా ఉత్తర్వులు జారీచేయడం తెల్సిందే. తమ విచారణలో కేజ్రీవాల్ ఏమాత్రం సహకరించట్లేదని, మరికొంతకాలం తమ కస్టడీకి అప్పగించాలని ఈడీ కోరడం, అందుకు కోర్టు సమ్మతిస్తూ ఏప్రిల్ ఒకటో తేదీదాకా కస్టడీని పొడిగించడం తెల్సిందే. ఏప్రిల్ ఒకటిన కస్టడీ గడువు ముగియడంతో సోమవారం ఆయనను జడ్జి బవేజా ఎదుట ఈడీ అధికారులు హాజరుపరిచారు. విచారణకు సహకరించని ఆయనను 15 రోజులపాటు జ్యుడీషియల్ కస్టడీకి తరలించాలని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు వాదించారు. ఈ వాదనతో ఏకీభవిస్తూ ఏప్రిల్ 15వ తేదీదాకా జ్యుడీషియల్ కస్టడీకి పంపుతూ జడ్జి ఉత్తర్వులు ఇచ్చారు. కేజ్రీవాల్‌ను రౌజ్ అవెన్యూ కోర్టుకు తీసుకొచ్చినపుడు ఆప్ మంత్రులు ఆతిశీ, సౌరభ్ భరద్వాజ్, కేజ్రీవాల్ భార్య సునీత అక్కడికొచ్చారు. '' కస్టడీలో ఈడీ 11 రోజులపాటు ప్రశ్నించింది. ఇంక ప్రశ్నించాల్సింది ఏమీ లేదు. ఆయనను ఇంతవరకు కోర్టు దోషిగా ప్రకటించలేదు. మరి అలాంటపుడు జైలుకు ఎందుకు పంపించారు?. లోక్‌సభ ఎన్నికల కోసమే బీజేపీ ఆయనను జైలుకు పంపింది'' అని సునీతా ఆరోపించారు. పార్టీలో సునీతా అత్యంత 'క్రియాశీలక' పాత్ర పోషించనున్నట్లు ఆప్ వర్గాలు సోమవారం వెల్లడించాయి. ఆదివారం ఢిల్లీలో రాంలీలా మైదాన్‌లో విపక్షాల ప్రజాస్వామ్య పరిరక్షణ ర్యాలీలో పాల్గొనడం ద్వారా సునీతా ఒక రకంగా రాజకీయ అరంగేట్రం చేసినట్లేనని ఆప్ వర్గాలు చెబుతున్నాయి. '' ఢిల్లీ లిక్కర్ స్కామ్ ఉదంతంలో కేజ్రీవాల్ కీలక పాత్రధారి. లబ్ధిదారులకు లాభం చేకూరేలా మద్యంపాలసీ రూపకల్పన, అమలులో ఈయన ప్రత్యక్ష పాత్ర పోషించారు. మద్యం పాలసీని అమలుచేయకముందే క్విడ్ ప్రో ద్వారా తమకు రావాల్సిన నగదును కిక్‌బ్యాక్ రూపంలో పొందారు'' అని ఈడీ తన రిమాండ్ దరఖాస్తులో ఆరోపించింది.



రౌస్ అవెన్యూ కోర్టులో కేజ్రీవాల్

మూడు పుస్తకాలు, ఔషధాలు, లాకెట్..

జడ్జి ఉత్తర్వుల అనంతరం కేజ్రీవాల్‌ను తిహార్ జైలుకు తరలించారు. కేజ్రీవాల్‌ను జైలుకు తరలిస్తున్నారన్న వార్త తెలిసి ఆప్ కార్యకర్తలు భారీ సంఖ్యలో తిహార్ జైలుకు చేరుకుని 'నేనూ కేజ్రీవాల్' అని టీ-షర్ట్‌లు ధరించి, ఆప్ జెండాలు పట్టుకుని ఆందోళన చేపట్టారు. రెండో నంబర్ జైలులో కేజ్రీవాల్‌ను ఉంచే అవకాశముంది. వైద్య పరీక్షలు చేస్తున్నాం. తర్వాత ఆయనను ఒంటరిగా ఒక గదిలో ఉంచనున్నారు. గదిలో ప్రతిరోజూ 24 గంటలపాటు సీసీటీవీ పర్యవేక్షణ కొనసాగనుంది. అనారోగ్యం దృష్ట్యా సంబంధిత ఔషధాలు, ప్రత్యేక ఆహారాన్ని ఆయనకు అందించనున్నారు. మతవిశ్వాసాన్ని గౌరవిస్తూ ఒక లాకెట్ ధరించేందుకు ఆయనకు అనుమతి లభించింది. భగవద్గీత, రామాయణం, నీరజా చౌదరి రాసిన ' హౌ ప్రైమ్ మినిస్టర్స్ డిసైడ్ పుస్తకాలనూ అనుమతించారు.

ఉదయం ఆరున్నరకు దినచర్య మొదలు

కేజ్రీవాల్ దినచర్య మిగతా విచారణఖైదీల్లాగే ఉదయం ఆరున్నర గంటలకు మొదలుకానుంది. ఉదయం చాయ్, బ్రెడ్ అల్పాహారంగా ఇవ్వనున్నారు. కోర్టులో కేసు విచారణ ఉంటే కోర్టుకు తీసుకెళ్తారు. లేదంటే 10.30 నుంచి 11 మధ్యలో లంచ్ వడ్డిస్తారు. పప్పు, కూరగాయలు లేదంటే ఐదు చపాతీలు లేదా అన్నం వడ్డిస్తారు.తర్వాత మూడు గంటల దాకా గదిలోనే ఉంచుతారు. మూడున్నరకు టీ, బిస్కెట్లు అందిస్తారు. నాలుగు గంటలకు తమ లాయర్లను కలిసేందుకు అనుమతిస్తారు. 5.30గంటలకే డిన్నర్ వడ్డిస్తారు. ఏడింటికల్లా గదికి పంపించి తాళం వేస్తారు. టీవీ సదుపాయం కల్పిస్తారు. వైద్య, సహాయక సిబ్బంది 24 గంటలూ అందుబాటులోఉంటారు. వారానికి రెండుసార్లు కుటుంబసభ్యులను కలవొచ్చు. ఆప్ నేత సంజయ్ సింగ్‌ను గతంలో ఈ సెల్‌లోనే ఉంచారు. ఇటీవల ఐదో నంబర్ జైలుకు మార్చారు. ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాను ఒకటో నంబర్ జైలులో, బీఆర్ఎస్ నేత కె.కవితను ఆరో నంబర్ మహిళా జైలులో ఉంచారు.

శిథిలాల దిబ్బగా అల్ షిఫా ఆస్పత్రి

డెయిర్ అల్ బలాహ్: నిత్యం వేలాది మందికి వైద్య సేవలందించే గాజాలోనే అతిపెద్ద ఆస్పత్రి అల్-షిఫా శిథిలాల దిబ్బగా మారిపోయింది. దాదాపు రెండు వారాల పాటు ఆస్పత్రిపై యథేచ్ఛగా దాడులు కొనసాగించిన ఇజ్రాయెల్ ఆర్మీ(ఐడీఎఫ్) ఆస్పత్రి పరిసరాల నుంచి సోమవారం వైదొలిగింది. ఆస్పత్రి భవనాన్ని నామరూపాల్లేకుండా నేలమట్టం చేయడంతో పాటు పరిసరాల్లోని పలు భవంతులను కూడా కూల్చివేసిందని స్థానికులు తెలిపారు. అక్కడంతా మృతదేహాలే పడున్నాయన్నారు. వాటినుంచి దుర్గంధం వెదజల్లుతోందని చెప్పారు. ఐడీఎఫ్ నిరంతర దాడుల నేపథ్యంలో రోగులను అల్-అహ్లి ఆస్పత్రికి తరలించారు. దక్షిణ గాజాలోని నాసిర్ ఆస్పత్రిని ప్రారంభించాలని గాజా ఆరోగ్య శాఖ అంతర్జాతీయ సమాజానికి విజ్ఞప్తి చేసింది.

200 మంది మిలిటెంట్లు హతం

ఆస్పత్రిలో దాగున్న సుమారు 200 మంది మిలిటెంట్లను హతం చేయడంతోపాటు హమాస్ కీలక నేతలు సహా 900 మంది మిలిటెంట్లను పట్టుకున్నట్లు ఐడీఎఫ్ తెలిపింది. పెద్ద సంఖ్యలో ఆయుధాలను, కీలక డాక్యుమెంట్లు, నిఘా సామగ్రిని స్వాధీనం చేసుకున్నామని చెప్పింది. దాడులు ప్రారంభమైన సమయంలో ఆస్పత్రిలో సుమారు ఆరువేల మంది ఉన్నారని, వీరిలో ఎక్కువ మంది తలదాచుకునేందుకు వచ్చిన సామాన్య పౌరులేనని చెప్పింది. ఆస్పత్రి కేంద్రంగా హమాస్ మిలిటెంట్లు కార్యకలాపాలు సాగిస్తున్నందునే దాడులు జరిపినట్లు చెప్పుకుంది. హమాస్, ఇస్లామిక్ జిహాద్ మిలిటెంట్లు తిష్ట వేసినందునే ఆస్పత్రి వార్డుల్లో కూడా దాడులు జరపాల్సి వచ్చినట్టు తెలిపింది. ఇవి ముందుందూ కొనసాగుతాయని చెప్పింది.

సిరియాలోని ఇరాన్ ఎంబసీపై ఇజ్రాయెల్ దాడులు

ఏడుగురి దుర్మరణం

డమాస్కస్: సిరియా రాజధాని డమాస్కస్‌లోని ఇరాన్ రాయబార కార్యాలయంపై సోమవారం ఇజ్రాయెల్ విమానం ద్వారా బాంబుదాడి చేసింది. ఈ దాడిలో రాయబార కార్యాలయంలోని కాన్సులర్ విభాగాన్ని నేలమట్టం చేసింది. రెవల్యూషనరీ గార్డ్స్ సీనియర్ కమాండర్, బ్రిగేడియర్ జనరల్ మహ్మద్ రెజా జహేదీ మృతి చెందారు. ఇరాన్ రాయబారి హుస్సేన్ అక్బరీ మొత్తం ఏడుగురు చనిపోయారని వెల్లడించారు. ఇజ్రాయెల్ దాడిని ఖండించారు. ఇజ్రాయెల్.. లక్ష్యం దిశగా పలు మిస్సైళ్లను సంధించిందని.. తమ ఎయిర్ డిఫెన్స్ వీటిలో కొన్నింటిని ధ్వంసం చేసిందని, మిగతావి ఇరాన్ రాయబార కార్యాలయాన్ని నేలమట్టం చేశాయని సిరియా రక్షణ శాఖ తెలిపింది.

బంగ్లాదేశ్‌లో జోరుగా... 'బాయ్‌కాట్ ఇండియా'

భారత ఉత్పత్తులకు వ్యతిరేకంగా ఉద్యమం

మద్దతిస్తున్న విపక్ష బీఎన్పీ • ఉద్యమాన్ని తప్పబడుతున్న ప్రధాని హసీనా

ఢాకా: బంగ్లాదేశ్‌లో షేక్ హసీనా నాలుగో విడత ప్రధానమంత్రిగా పగ్గాలు చేపట్టాక సామాజిక మాధ్యమాల్లో భారత వ్యతిరేక ప్రచారం ఊపందుకుంది. చీరలు, సుగంధ ద్రవ్యాలు వంటి భారత ఉత్పత్తుల్ని బాయ్‌కాట్ చేయాలన్న ప్రచారానికి ప్రతిపక్ష నేతలు మద్దతిస్తున్నారు. భారత ఉత్పత్తులతో నిండిపోయే ఢాకా మార్కెట్‌లో కొంత కాలంగా వంటనూనె, ప్రాసెస్డ్ ఫుడ్స్, కాస్మెటిక్స్, దుస్తులు వంటి వాటి విక్రయాలు పడిపోయాయి. హసీనాను, ఆమె అవామీ లీగ్ పార్టీని అతిపెద్ద భారత ఉత్పత్తులుగా ప్రతిపక్ష బీఎన్పీ నేతలు అభివర్ణిస్తుండగా ప్రధాని హసీనా భారత వ్యతిరేక ప్రచారాన్ని తిప్పికొడుతున్నారు. తనకెంతో ఇష్టమైన చీరలతోనే ప్రత్యర్థి వాదనను ఆమె ఎదుర్కొంటున్నారు. భారత ఉత్పత్తుల్ని బాయ్‌కాట్ చేయాలని ప్రతిపక్ష బీఎన్పీ నేతలు నిజంగా భావిస్తున్నట్లయితే పార్టీ ఆఫీసు ఎదురుగా వాళ్ల భార్యల చీరలకు ఎందుకు నిప్పుపెట్టడం లేదు? అని ప్రశ్నించారు. బీఎన్పీ నేతలు, వారి భార్యలు భారత్‌లో చీరలు కొనుక్కొచ్చి, బంగ్లాదేశ్‌లో అమ్ముకుంటున్నారన్నారు. 'గరం మసాలా, అల్లం, వెల్లుల్లి, ఉల్లి తదితర ఎన్నో దినుసుల్ని భారత్ నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. బీఎన్పీ నేతలు భారత సుగంధ ద్రవ్యాలు వాడకుండా వంట చేయగలరా?' అని హసీనా నిలదీశారు. అలా తినగలమని వారు సమాధానం చెప్పగలరా అని అన్నారు. ప్రజల నుంచి దూరమైన ఆ పార్టీ భారత వ్యతిరేక ప్రచారాన్ని ఎగదోస్తోందని హసీనా అన్నారు.



భారత చీరలంటే తనకిష్టమంటూ చీరను ప్రదర్శిస్తున్న హసీనా

భారత వ్యతిరేక ఆన్‌లైన్ ప్రచారం యూరప్, అమెరికాల్లో ఉన్న బంగ్లాదేశీయులతో ముందుగా మొదలైంది. పారిస్‌లో ఉంటున్న పినాకీ భట్టాచార్య బాయ్‌కాట్ ఇండియా ప్రచారంలో కీలకంగా ఉన్నారు. మొదట్లో ప్రతిపక్ష బీఎన్పీ నేతలు ఇందులో లేరు. తర్వాతర్వాత ప్రజల్లో మద్దతు సంపాదించేందుకు వారూ ఈ ప్రచారంలో తోడయ్యారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
మంగళవారం । 2 । ఏప్రిల్ । 2024



దుర్గమ్మ సేవలో..

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గమ్మను అంజనా సిన్హా ఐపీఎస్ సోమవారం దర్శించుకున్నారు. అర్చకులు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలు బహూకరించారు.



దుకాణాల్లో తనిఖీలు

గవర్నర్‌పేట, మాచవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆయుధాలు, మందుగుండు సామగ్రి దుకాణాలను డీసీపీ అధిరాజ్‌సింగ్ రాణా సోమవారం తనిఖీ చేశారు. -8లో▸



రామ్మోహన్‌మిశ్రాకు స్వాగతం

గన్నవరం: రాష్ట్ర ఎన్నికల సాధారణ పరిశీలకులు రామ్మోహన్ మిశ్రాకు సోమవారం గన్నవరం విమానాశ్రయంలో జిల్లా ఉన్నతాధికారులు స్వాగతం పలికారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
విజయవాడ	6.25	4.43
జగ్గయ్యపేట	6.28	4.47
మచిలీపట్నం	6.24	4.41
గుడివాడ	6.25	4.43

మా ఉసురు తగులుతుంది..



నాకు 95ఏళ్లు. ఐదుగురు కొడుకులు చనిపోయారు. కూతురు వద్ద ఉంటున్నా. ప్రతి నెలా మొదటి తేదీన తెల్లవారక ముందే వలంటీర్ వచ్చి అమ్మమ్మా అంటూ పింఛన్ డబ్బు నా చేతిలో పెట్టేవాడు. ఆ డబ్బే నాకు ఆధారం. అయితే ఈరోజు రాలేదని మా అమ్మయిని అడిగితే 'వలంటీర్లు రారంట.. పింఛన్ కోసం మూడు నెలల వరకు ఇబ్బందులు తప్పవని అంటున్నారు' అని చెప్పింది. గతంలో చంద్రబాబు పాలనలో ఇలానే పింఛన్ సొమ్ము కోసం పడిగాపులు పడేవాళ్లం. మళ్లీ అలాంటి రోజులు వస్తే మేం భరించలేం. మాలాంటి ముసలోళ్ల ఉసురు తగులుతుంది.

– వంగూరి మార్తమ్మ, వృద్ధురాలు, కె.పొన్నవరం, పెనుగంచిప్రోలు మండలం

మాకు చాలా కష్టం..



గత ఐదేళ్లుగా పింఛన్ కోసం ఎదురుచూడలేదు. ప్రతినెల ఒకటో తేదీన తెల్లవారుజామున మా ఇంటికి తీసుకువచ్చి ఇచ్చేవారు. ఈ రోజు వలంటీర్లు రాకపోతే ఆందోళనకు గురయ్యా. దివ్యాంగుడనైన నేను తిరువూరు మండలం రోలుపడిలోని మా నివాసానికి 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామ సచివాలయానికి వెళ్లి పింఛన్ సొమ్ము తీసుకోవాలంటే చాలా ఇబ్బంది. కరోనా కష్టకాలంలో కూడా ప్రభుత్వం అందించిన ఆర్థికసాయం, మందులు, నిత్యావసర సరుకులను వలంటీర్ తెచ్చి ఇచ్చేవారు. ఇంతవరకు ఏనాడూ సచివాలయానికి వెళ్లవలసిన అవసరం రాలేదు. వలంటీర్లను కొనసాగించేలా చర్యలు తీసుకోవాలి.

– మేకల రాజేంద్ర, దివ్యాంగుడు, రోలుపడి, తిరువూరు మండలం

పిడుగు పడ్డట్టు ఉంది



ప్రతి నెలా ఒకటో తేదీనే వలంటీర్ మా ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల మూడో తేదీన పింఛన్ ఇస్తారని ముందుగానే చెప్పారు. ప్రతిపక్షాల ఫిర్యాదు మేరకు వలంటీర్ల సేవలు నిలిపివేయాలని ఎన్నికల సంఘం ఆదేశించడం పిడుగు పడినట్లుగా ఉంది. ఈ వయసులో సచివాలయాలకు నడిచి ఎలా వెళ్లగలను? పింఛన్ డబ్బులు రాకపోతే మందులు కొనుక్కోవడానికి ఇబ్బందులు పడాలి.

– చిలుకూరి అన్నపూర్ణమ్మ(79), చిలుకూరివారిగూడెం

నా వల్ల కాదు..



నేను ఉయ్యూరులోని ముస్లిం ప్రాంతంలో నివాసం ఉంటున్నా. మంచంలోనే ఉంటున్నా. నా పనులు నేను చేసుకోవటమే కష్టం. జగన్ బాబు ఇస్తున్న వృద్ధాప్య పింఛనే నాకు ఆధారం. ఎక్కడికీ వెళ్లలేని నాకు వలంటీరే నెలలో మొదటి రోజు ఉదయమే వచ్చి పింఛను సొమ్ము అందిస్తున్నారు. ఈనెల రాలేదు. చంద్రబాబు వల్లే వలంటీర్ ఇవ్వలేదని టీవీల్లో చూశా. మాలాంటి వారికి ఎవరొచ్చి పింఛన్ ఇస్తారు.

– ఫాతిమున్నీసా, వృద్ధురాలు, ఉయ్యూరు

చాలా ఇబ్బంది..



నేను మండలంలోని జూపూడిలో జీవిస్తాను. ఏడేళ్లక్రితం పక్షవాతం రావడంతో పింఛన్ మంజూరు చేశారు. గత ప్రభుత్వంలో పింఛన్ తీసుకునేందుకు పంచాయతీ కార్యాలయం వరకు మరొకరి సహాయంతో వెళ్లేవాడిని. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో వలంటీర్లు ఇంటి వద్దకు తెల్లవారు జామున వచ్చి పింఛన్ అందించారు. ఈ ఐదేళ్లు ఇబ్బంది అనేది తెలియలేదు. ఈ నెల పింఛన్ ఇంకా రాలేదు. మాగ్రామం చివరలో సచివాలయం ఉంది. అక్కడ వరకూ నేను ఎలా వెళ్లాలి.

– బాణావత్ బాలాజీ, జూపూడి

పెత్తందారుల పగ – పండుటాకుల వ్యథ

- వృద్ధులు, వికలాంగులు, వితంతువుల నోటికాడ కూడు తీసిన చంద్రబాబు
- వలంటీర్ల సేవలు రద్దు చేయడంతో ఆందోళన
- మళ్లీ ఎండలో క్యూల్లో నిలబడి తీసుకోవాల్సిందేనా అంటూ ఆవేదన
- గత చంద్రబాబు పాలనలోని రోజులను తలచుకొని బెంబేలు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): నెల ఒకటో తేదీ వచ్చింది. కోడి కూయకముందే అవ్వా.. తాతా.. అంటూ వచ్చి తలుపుతట్టి పెన్షన్ డబ్బు ఇచ్చే వలంటీర్ మనువడు ఇంకా రాలేదు.. మూడు బారల పొద్దు ఎక్కినా వలంటీర్ జాడ లేదు. నెల నెలా పెన్షన్ అందుకుంటున్న అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులు గుమ్మంలో కూర్చొని వలంటీర్ రాకకోసం, పెన్షన్ డబ్బుల కోసం ఎదురు చూస్తున్నారు. ఈ రోజు కాకపోతే రేపైనా వస్తాడులే అనుకొని ధైర్యంగా ఉన్నారు. అసలు ఏం జరిగిందో వారికి తెలీదు. కొందరు ఓపిక చేసుకుని తమ ఇళ్ల మధ్యనే ఉండే వలంటీర్ ఇంటి వద్దకు వెళ్లి ఆరా తీశారు. చంద్రబాబునాయుడు వలంటీర్లపై కక్షగట్టారని.. వారు పెన్షన్లు ఇవ్వడానికి వీల్లేదంటూ కేసులు వేసి నిలుపుదల చేయించారని.. ఆ నోట ఈ నోట పడి అసలు విషయం అవ్వా తాతలకు తెలిసింది. ఇంకేముంది వారంతా.. చంద్రబాబు ఐదేళ్ల పాలనలో పెన్షన్ కోసం పడిన వెతలు మళ్లీ తప్పవా? ఎక్కడికో వెళ్లి క్యూలైన్లలో రోజుల తరబడి నిలబడి పెన్షన్లు తెచ్చుకోవాల్సిందేనా అంటూ గతాన్ని గుర్తు చేసుకుంటున్నారు. మళ్లీ పింఛన్.. బాంచెన్ అని అడుక్కోవాల్సిందేనా అంటూ వేదన పడుతున్నారు. మండుటెండలో పింఛన్ కోసం కార్యాలయాల వద్దకు వెళ్లి తాము పడిన ఇబ్బందులు తలచుకుని కన్నీటి పర్యంతమవుతున్నారు. చంద్రబాబు తీరుపై మండి పడుతున్నారు. కరోనా కష్టకాలం పలుకరించే వారే లేకపోయినా ధైర్యంగా ఇళ్లకు వచ్చి పింఛన్లు ఇచ్చిన వలంటీర్లపై ఎందుకంత విషం చిమ్ముతున్నారంటూ అవ్వా తాతలు తమ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లపై చంద్రబాబు విషం..

వలంటీర్ వ్యవస్థ ఏర్పాటైన నాటి నుంచి ప్రతిపక్షాలు, ముఖ్యంగా చంద్రబాబునాయుడు వారిపై విషం చిమ్ముతున్నారు. వారిని ప్రతి సందర్భంలోనూ అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారు. ఎండ, వాన లెక్క చేయలేదు.. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లోనూ ప్రాణాలు సైతం ఫణంగా పెట్టి సేవ చేసిన వలంటీర్లను తీవ్రవాదులుగాను చిత్రీకరించారు. సేవే పరమావధిగా, రాజకీయాలకు దూరంగా ఉంటూ వస్తున్న వలంటీర్లు పెన్షన్లు పంపిణీ చేయకూడదంటూ కోర్టు ద్వారా నిలుపుదల చేయించారు. దీంతో నెల ఒకటో తేదీనే అందాల్సిన పింఛన్లు చేతికి అందలేదు. సచివాలయాలకు వెళ్లి పెన్షన్లు తీసుకోవాల్సిన పరిస్థితి రావడంతో అవ్వా తాతలు, వికలాంగులు వణికి పోతున్నారు. అసలే వేసవి కాలం కావడంతో ఆందోళన చెందుతున్నారు. వలంటీర్ల ద్వారానే పెన్షన్లు ఇంటి వద్ద ఇవ్వాలని వేడుకుంటున్నారు.

ఎన్టీఆర్ జిల్లాలో పరిస్థితి..

మొత్తం పింఛన్ లబ్ధిదారులు :	2,38,157
వృద్ధాప్య పెన్షన్లు:	1,13,785
వితంతువులు :	69,710
విభిన్న ప్రతిభావంతులు :	27,485
ఒంటరి మహిళలు :	8,879
ఇతరులు:	18,298
జిల్లాలో పనిచేస్తున్న మొత్తం వలంటీర్లు :	10,418

ఠంఛన్‌గా ఇచ్చే వారే..



విజయవాడలో ఓ వృద్ధురాలి ఇంటికే వెళ్లి పింఛన్ అందిస్తున్న వలంటీర్(ఫైల్)

ఎన్టీఆర్ జిల్లాలో వివిధ కేటగిరీలకు సంబంధించి మొత్తం 2,38,157 మంది పెన్షనర్లు ఉన్నారు. వీరిలో వృద్ధులు 1,13,785 మంది, వితంతువులు 69,710 మంది, వికలాంగులు 27, 465 మంది ఉన్నారు. మొత్తం పెన్షనర్లలో సగానికిపైగా వృద్ధులే ఉన్నారు. వీరికి వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రతి నెల ఒకటో తేదీనే ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్నారు. జిల్లాలో 10,418 మంది వలంటీర్లు అవ్వాతాతలు, వికలాంగులు, వితంతువులకు సేవలందిస్తున్నారు. ప్రభుత్వం జనవరి నుంచి పెన్షన్ పెంచి రూ. 3వేలు అందిస్తోంది. నెల నెలా ఠంఛన్‌గా వచ్చే పెన్షన్ డబ్బును పండుటాకులు మందులకు వినియోగించుకుంటున్నారు. కొందరు పౌష్టిహాకారం తీసుకుంటున్నారు. 58 నెలలుగా ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఇంటి వద్దకే పెన్షన్ తీసుకుంటున్నారు. జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత అవ్వాతాతలు, వికలాంగుల జీవితాల్లో వెలుగులు నిండాయి. ఏ పరిస్థితుల్లోనూ పింఛన్ డబ్బుల కోసం ఎదురు చూడలేదు. ఇబ్బందులు పడలేదు.

న్యూస్‌రీల్

ప్రారంభమైన 'పది' స్పాట్

పరిశీలించిన విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం ఎన్టీఆర్ జిల్లాలో సోమవారం ప్రారంభమైంది. విజయవాడ నగరంలోని బిషప్ అజరయ్య ఉన్నత పాఠశాల ప్రాంగణంలో పదో తరగతి స్పాట్ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ నెల మొదటి తేదీ నుంచి ఎనిమిదో తేదీ వరకూ ఈ స్పాట్ కొనసాగనుంది. సుమారు 1,69,666 జవాబు పత్రాల మూల్యాంకనం ఇక్కడ జరగనుంది. ఇప్పటికే వివిధ జిల్లాల నుంచి జవాబు పత్రాలు నగరానికి చేరుకున్నాయి. ఈ రెండు మూడు రోజులు మరికొన్ని జవాబు పత్రాలు రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఉపాధ్యాయులు స్పాట్‌లో పాల్గొంటున్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి యూవీ సుబ్బారావు పర్యవేక్షణలో ఈ స్పాట్ కొనసాగుతుంది. ప్రారంభమైన స్పాట్ కేంద్రాన్ని రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్‌కుమార్, ఏపీ ప్రభుత్వ పరీక్షల డైరెక్టర్ డి. దేవానందరెడ్డి, పరిశీలకులు శ్రీనివాసులరెడ్డి సోమవారం పరిశీలించారు. సిబ్బందికి సూచనలు చేశారు.

గురుకులాల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయం (మైనార్టీ బాలికలు)లో 2024–25 విద్యా సంవత్సరానికి ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఏపీ గురుకుల పాఠశాల ఇంగ్లిష్ మీడియం భవానీపురం ప్రిన్సిపాల్ ఎస్. శివకుమారి ఓ ప్రకటనలో తెలిపారు. 5వ తరగతి అన్ని సీట్లకు, 6, 7, 8 తరగతులకు మిగిలి ఉన్న సీట్లకు ఈ నెల 25న అన్ని జిల్లాల ప్రధాన కేంద్రాలలో ప్రవేశ పరీక్ష (ఏపీఆర్ఎస్ క్యాట్ – 2024) నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. భవానీపురం విజయవాడ, ఎన్టీఆర్ జిల్లాతోపాటు కోస్తా జిల్లాలైన శ్రీకాకుళం నుంచి నెల్లూరు జిల్లా వరకు ముస్లిం, మైనార్టీలు అలాగే రిజర్వేషన్ ప్రకారం ఎస్సీ, ఎస్టీ విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 5వ తేదీని తుది గడువుగా నిర్ణయించినట్లు తెలిపారు. మైనార్టీ విద్యార్థినులకు బీసీ–ఈ, బీసీ–బీ దూదేకుల బాలికలకు నేరుగా ప్రవేశం కల్పిస్తారన్నారు. మిగిలిన వివరాలకు 8712625036లో సంప్రదించాలని కోరారు. అభ్యర్థులు https://aprs.apcfss.inలో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

7న జిల్లా స్థాయి చెస్ టోర్నీ

విజయవాడస్పోర్ట్స్: కృష్ణాజిల్లా స్థాయి అండర్–17 ఓపెన్, బాలికల టోర్నమెంట్‌ను ఈ నెల ఏడో తేదీన పోరంకిలోని గ్రీన్ స్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు కృష్ణాజిల్లా చెస్ అసోసియేషన్ కార్యదర్శి ఫణికుమార్ తెలిపారు. ఓపెన్, బాలికల విభాగాల పోటీలు వేర్వేరుగా నిర్వహిస్తామన్నారు. ఆయా విభాగాల్లో మొదటి, రెండో స్థానంలో నిలిచిన క్రీడాకారులు ఈ నెల 20, 21 తేదీల్లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలకు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. అదేవిధంగా జిల్లా స్థాయిలో అండర్–7,9,11,13,15 బాలబాలికల పోటీలను నిర్వహిస్తామన్నారు. www.apchess.org వెబ్‌సైట్‌లో రిజిస్టర్ చేసుకున్న క్రీడాకారులు మాత్రమే ఈ పోటీల్లో పాల్గొనేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 9700775220, 9247153387లో సంప్రదించాలని సూచించారు.

పన్ను వసూళ్లలో వీఎంసీకి ద్వితీయ స్థానం

భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ నగరపాలక సంస్థ తన పరిధిలోని 2,15,446 అసెస్‌మెంట్లకుగానూ మార్చి 31 నాటికి రూ.124.35 కోట్ల వసూళ్లతో రాష్ట్రంలో ద్వితీయ స్థానంలో నిలిచిందని మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. పన్ను చెల్లించి నగరాభివృద్ధికి సహకరించిన నగర ప్రజలు, అధికారులు, సచివాలయ కార్యదర్శులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. మొదటి స్థానంలో విశాఖ నిలిచిందన్నారు. వీఎంసీ రూ.157.26 కోట్ల ప్రైవేట్ డిమాండ్‌కుగాను మార్చి 31 నాటికి రూ.124.35 కోట్లు వసూళ్లు అయ్యాయని పేర్కొన్నారు. పన్ను చెల్లింపునకు చివరి తేదీ అయిన మార్చి 31 రాత్రి 12 గంటల వరకు క్యాష్ కౌంటర్లు పని చేశాయని, తద్వారా ఆ ఒక్క రోజే రూ.3.49 కోట్లు వసూలైందని ఆయన వివరించారు.

వసంత నవరాత్రులకు ఏర్పాట్లు

- ముస్తాబవుతున్న ఇంద్రకీలాద్రి
- 9వ తేదీ నుంచి విశేష పుష్పార్చన



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి వసంత నవరాత్రోత్సవాలకు ముస్తాబవుతోంది. 9వ తేదీ నుంచి 10రోజుల పాటు నిర్వహించే వసంత నవరాత్రోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. ఉత్సవాలలో భాగంగా 10 రోజుల పాటు అమ్మవారికి రోజుకో విశేషమైన సుగంధ పరిమళాలు వెదజల్లే పుష్పాలతో అర్చన నిర్వహిస్తారు. తెలుగు వారి సంవత్సరాది ఉగాది పర్వదినం, వసంత నవరాత్రోత్సవాలు ప్రారంభం నేపథ్యంలో ఉత్సవ ఏర్పాట్లను మరింత కట్టుదిట్టంగా చేయాలని ఆలయ ఈవో కేఎస్ రామరావు ఆలయ అధికారులను ఆదేశించారు.

వేసవి నేపథ్యంలో..

ఉత్సవాలకు భారీగా భక్తులు తరలివచ్చే అవకాశం ఉండటంతో ఎండ తీవ్రత వల్ల ఎవరికీ ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయ ప్రాంగణంలో చలువ పందిళ్లు, తాటాకు పందిళ్లను వేస్తున్నారు. ఆలయంలోని కీలక ప్రాంతాల్లో మంచినీటిని అందించేందుకు వాటర్ కూలర్లకు మరమ్మతులు చేయించడంతో పాటు చలివేంద్రాలను ఏర్పాటు చేస్తున్నారు.

విశేషపుష్పార్చన ఇలా..

9వ తేదీ ఉదయం 9 గంటలకు ప్రత్యేక పుష్పార్చన ప్రారంభం కానుంది. ఆలయ ప్రాంగణంలోని లక్ష్మీ గణపతి ప్రాంగణంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రతిష్టించి పూజా కార్యక్రమాలను నిర్వహించిన అనంతరం విశేష పుష్పార్చన చేస్తారు. ఉత్సవాలలో అమ్మవారికి అర్చన నిర్వహించేందుకు రోజుకు 50 కేజీల పైగానే ఉపయోగిస్తారు. విశేష అర్చనలో ఉపయోగించిన పుష్పాలను భక్తులకు అమ్మవారి ప్రసాదంగా పంపిణీ చేస్తారు. అర్చన నిమిత్తం అవసరమైన పుష్పాలను భక్తులు, ఉభయదాతలు విరాళంగా దేవస్థానానికి అందించే అవకాశాన్ని కల్పిస్తున్నారు.

అర్చనకు వినియోగించే పుష్పాలివి..

ఉత్సవాలలో అమ్మవారికి రోజుకో ప్రత్యేకమైన పుష్పాలను అర్చనకు వినియోగిస్తారు. తొలి రోజైన 9వ తేదీ మంగళవారం మల్లెపూలు, మరువం, రెండో రోజు కనకాంబరాలు, గులాబీలు, మూడో రోజు చామంతి, ఇతర పువ్వులు, నాల్గో రోజు మందార పువ్వులు, ఎర్ర కలువ పూలు, 5వ రోజు తెల్ల జిల్లేడు, మారేడు, తులసీ, మరువం, దవళంతో అర్చన జరుగుతుంది. అలాగే 6వ రోజైన ఆదివారం కాగడా మల్లెలు, జాజులు, మరువం, 7వ రోజు ఎర్ర తామరలు, ఎర్ర గన్నేరు పూలు, సన్న జాజులు, 8వ రోజు చామంతి, సంపెంగలు, 9వ రోజు కనకాంబరాలు, గులాబీలతో అర్చన, 10వ రోజు అన్ని రకాల పుష్పాలతో అర్చన నిర్వహిస్తారు. ఆయా పుష్పార్చనలో పాల్గొనే ఉభయదాతలు ఒక రోజుకు రూ. 2500 టికెట్ కొనుగోలు చేసి సేవలో పాల్గొనవచ్చు.

16, 17న విశేష పూజలు..

చైత్ర శుద్ధ అష్టమిని పురస్కరించుకుని ఇంద్రకీలాద్రి క్షేత్ర పాలకుడైన ఆంజనేయ స్వామి వారికి, ఘాట్ రోడ్డులోని ఆంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 16వ తేదీ ఆంజనేయ స్వామి వారికి పంచామృత అభిషేకాలు, ఆకుపూజ జరుగుతుంది. 17వ తేదీ శ్రీరామ నవమిని పురస్కరించుకుని ఉదయం 10 గంటలకు అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదికపై శ్రీ సీతారామ కల్యాణం జరుగుతుంది. 18వ తేదీ ఉదయం పూర్ణాహుతితో ఉత్సవాలు పరిసమాప్తమవుతాయి.

80లక్షల పనిదినాల కల్పనే లక్ష్యం

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, చిత్రంలో వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్

గాంధీనగర్(విజయవాడ సెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఉపాధి హామీ పథకం ద్వారా 80లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్దేశించినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్ ఢిల్లీరావు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి వివరించారు. ఇందులో భాగంగా ప్రతి రోజు 5లక్షల పనిదినాల కల్పించేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఉపాధిహామీ పథకం, తాగునీటి సరఫరా, పెన్షన్ పంపిణీ తదితర అంశాలపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ జిల్లాలో పని కోరిన ప్రతి ఒక్కరికీ ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. చెరువుల పూడిక తీత, డొంక రోడ్లు, డ్రెయిన్ల అభివృద్ధి, మొక్కలు నాటడం వంటి పనులపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని అన్ని ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు..

జిల్లాలో ప్రస్తుత వేసవిలో తాగునీటికి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రణాళిక రూపొందించుకొని అమలు చేస్తున్నామని కలెక్టర్ చెప్పారు. ప్రకాశం బ్యారేజ్‌లో తాగునీటికి అవసరమైన నిల్వలు ఉన్నాయన్నారు. మంచినీటి చెరువులు, సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను నింపేలా చర్యలు తీసుకున్నామన్నారు. మెట్ట ప్రాంతాలలో బోర్ వెల్స్ పరిశీలించి, అవసరమైన వాటికి మరమ్మతులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు.

పెన్షన్ పంపిణీకి చర్యలు..

పెన్షనర్లకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ఉన్నతాధికారుల సూచనల మేరకు ఈనెల 3వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా పెన్షన్ పంపిణీ చేసేలా చర్యలు తీసుకుటుంటున్నామని కలెక్టర్ వివరించారు. మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డ్వామా పీడీ జె. సునీత, డీఆర్‌డీఏ పీడీ కె. శ్రీనివాసరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ డి. వెంకటరమణ పాల్గొన్నారు.

బాబు కనుసన్నల్లో కూటమి టికెట్లు

- జనసేనలో చేరిన మండలి బుద్ధ ప్రసాద్
- ఆయనకే టికెట్ ఇచ్చేందుకు రంగం సిద్ధం
- విజయవాడ వెస్ట్ సీటు బీజేపీకి కేటాయింపు వెనుక చక్రం తిప్పిన బాబు
- అక్కడ జనసేనకు చెందిన బీసీ అభ్యర్థికి మొండిచేయి
- సుజనా చౌదరి బాబు సన్నిహితుడే
- పవన్‌కల్యాణ్ తీరుపై సైనికుల ఆగ్రహం



సాక్షి ప్రతినిధి, విజయవాడ: ఉమ్మడి కృష్ణా జిల్లాలో జనసేన కార్యకర్తలు తమ అధినేత పవన్‌కల్యాణ్ తీరుపై నిప్పులు చెరుగుతున్నారు. పొత్తులో భాగంగా జిల్లాలో అవనిగడ్డ, విజయవాడ వెస్ట్, మచిలీపట్నం పార్లమెంట్ సీట్లు జనసేనకు దక్కాయి. ఈ సీట్లు పార్టీ కోసం ఆది నుంచి కష్టపడిన వారికి దక్కుతాయని జనసేన నాయకులు, కార్యకర్తలు ఆశించారు. అయితే పవన్ కల్యాణ్ వీరి ఆశలపై నీళ్లు చల్లారు. బాబు తెరవెనుక మంత్రాంగం నడిపి, డబ్బు మూటలతో వచ్చే ఇతర పార్టీ నాయకులకే ప్రాధాన్యత ఇచ్చి వారికే సీట్లు కేటాయించేలా చేశారు. తన సన్నిహితులు, టీడీపీలోని వారికే టిక్కెట్లు దక్కేలా చూసుకున్నారు. ఇదంతా పవన్‌కల్యాణ్‌తో కలిసి బాబు ఆడుతున్న నాటకంగా జనసేన కార్యకర్తలు భావిస్తున్నారు. కాపుల ఓట్లను దండుకొనేందుకు పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ ఇచ్చి పావుగా వాడుకొంటున్నారనే భావన ఇప్పుడు వ్యక్తం అవుతోంది. జనసేనకు రాజ్యాధికారం వస్తుందనే ఆశతో పవన్ వెంట నడిస్తే, ఆయన మాత్రం బాబును అధికారంలోకి తీసుకొచ్చేందుకు టీడీపీ జెండా భుజాన వేసుకుంటున్నాడని జనసేన కార్యకర్తలు మండిపడుతున్నారు.

అవనిగడ్డ సీటుపై బాబు కపట నాటకం..

పైకి అవనిగడ్డ సీటు జనసేనకు కేటాయిస్తున్నట్లు కలరింగ్ ఇచ్చి, లోపల మాత్రం టీడీపీకే టిక్కెట్లు కేటాయించేలా పవన్ బాబుతో ఒప్పందం చేసుకున్నారు. ఇందులో భాగంగా అక్కడ టికెట్ కేటాయింపుపై డ్రామాకు తెరలేపారు. జనసేనకు టికెట్ కేటాయిస్తే సహకరించేది లేదని, అవనిగడ్డ సీటు తెలుగుదేశానికే కేటాయించాలని బాబు డైరెక్షన్‌లో ఆందోళనలు చేయించారు. మండలి బుద్ధ ప్రసాద్‌కు టిక్కెట్టు కేటాయించపోతే పార్టీ పదవులకు రాజీనామా చేయిస్తున్నట్లు హెచ్చరించారు. జనసేన అధినేత కంటితుడుపుగా పలువురి పేర్లతో ఐవీఆర్ఎస్ సర్వే చేయించారు. చంద్రబాబు, పవన్ ఒప్పందం ప్రకారం టీడీపీ మాజీ ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్‌ను పార్టీలో చేర్చుకొని, టికెట్ కేటాయించేందుకు రంగం సిద్ధం చేశారు. ఈ నేపథ్యంలో అవనిగడ్డలో జనసేన కార్యకర్తలు సమావేశమై మండలి బుద్ధ ప్రసాద్‌కు టిక్కెట్టు ఇస్తే మూకుమ్మడిగా పార్టీకి రాజీనామా చేస్తామని హెచ్చరించడం పార్టీలో కలకలం రేపుతోంది.

అవనిగడ్డలో జనసేన అభ్యర్థిని నిలబెట్టేలా..

అవనిగడ్డలో జనసేన అభ్యర్థినే నిలబెట్టేందుకు పోరాడుతున్నామని కృష్ణా జిల్లా జనసేన పార్టీ అధ్యక్షుడు బండ్రెడ్డి రామకృష్ణ పేర్కొన్నారు. మాబిడ్డకు వేరొకరు తండ్రి అవుతారంటే చూస్తూ ఊరుకోబోమన్నారు. పార్టీ కోసం కష్టపడిన ఒకరిని అభ్యర్థిగా ప్రకటించాలని కోరారు. పక్క పార్టీ నాయకులను తీసుకొస్తే అంగీకరించే ప్రసక్తే లేదన్నారు. మమ్మల్ని కాదని వేరొకరికి టిక్కెట్ ఇస్తే ప్రాణ త్యాగం చేస్తామన్నారు.

వెస్ట్‌లో సుజనా బాబు సన్నిహితుడే..

పదేళ్ల జనసేన జెండా మోసి, పార్టీ కోసం కష్టపడిన బీసీ నేత పోతిన మహేష్‌కు చంద్రబాబు, పవన్ కల్యాణ్ ముందస్తు ఒప్పందంలో భాగంగా వెన్నుపోటు పొడిచారు. పొత్తులో భాగంగా విజయవాడ వెస్ట్ సీటు జనసేనకు దక్కుతుందని ప్రచారం సైతం చేసుకోవాలని పవన్ కల్యాణ్ పోతిన మహేష్‌కు సూచించారు. దీంతో ఆయన నియోజక వర్గంలో ఇంటింటి ప్రచారం చేశారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్ పొత్తులో భాగంగా ఆ సీటు బీజేపీకి కేటాయిస్తున్నట్లు ప్రకటించారు. దీంతో అక్కడ జనసేన కార్యకర్తలు పోతిన మహేష్‌కే టికెట్ ఇవ్వాలని రోడ్డెక్కి ఆందోళనలు చేశారు. అవేమీ పట్టించుకోకపోవడంతో ఇండిపెండెంట్‌గా పోటీ చేస్తానని ఆయన హెచ్చరించారు. బీజేపీ తరపున అభ్యర్థిగా రోజుకొక పేరు తెరపైకి తెచ్చారు. చివరకు పక్కా ప్రణాళికతో బాబు సన్నిహితుడు సుజనా చౌదరికి టిక్కెట్టు కేటాయించేలా చక్రం తిప్పారు. ఈ రెండు సీట్లు బాబు కనుసన్నల్లో టీడీపీ నేతలకే దక్కాయి. ఈ సీట్ల కేటాయింపునకు పవన్‌కల్యాణ్ డబ్బునే ప్రాతిపదికగా తీసుకొన్నట్లు జనసేన నాయకులు, కార్యకర్తలు బహిరంగానే పేర్కొంటున్నారు. మచిలీపట్నం పార్లమెంటు సీటు సైతం వైఎస్సార్ సీపీ నుంచి జనసేనలో చేరిన ఎంపీ బాలశౌరికి కేటాయించారు.

సమష్టి కృషితో గెలుపే లక్ష్యంగా పని చేద్దాం

వైఎస్సార్ సీపీ మచిలీపట్నం
ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు


పామర్రులో నూతన పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న ఎంపీ అభ్యర్థి చంద్రశేఖరరావు, ఎమ్మెల్యే కైలే

పామర్రు: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సమష్టి కృషితో గెలుపే లక్ష్యంగా అందరం కలిసి పని చేద్దామని వైఎస్సార్ సీపీ మచిలీపట్నం ఎంపీ అభ్యర్థి సింహాద్రి చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. పామర్రు పట్టణంలో డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం వద్ద పార్టీ నూతన కార్యాలయాన్ని స్థానిక శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్‌తో సోమవారం ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన బూత్ కమిటీ, కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అందించి వారిని ఆర్థిక స్థితిమంతులుగా చేసేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాల లబ్ధి ప్రతీ ఇంటికి చేరిందని చెప్పారు. మీ ఇంట్లో ప్రభుత్వం వలన లబ్ధి పొందితేనే ఓట్లు వేయాలని కోరాలన్నారు. కుల, మత, ప్రాంత, పార్టీ అని బేధాలు లేకుండా అర్హతే ప్రామాణికంగా అందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. ఈ విషయాలను మనం అందరం ప్రతి ఇంటికి వెళ్లి వారికి తెలియజేసి వైఎస్సార్ సీపీకి మద్దతు తెలపాలని కోరాలన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రతి కార్యకర్త ఒక సైనికుడిలా శ్రమించి పార్టీ అధికారంలోకి తీసుకు వచ్చే వరకు కృషి చేయాలని చెప్పారు.

ప్రతిపక్ష నేతల అసత్యప్రచారాలు..

పామర్రు శాసనసభ్యుడు కైలే అనిల్‌కుమార్ మాట్లాడుతూ.. పేదల పక్షాన నిలిచే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మరలా మనం గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. గత ప్రభుత్వాలు గ్రామాల్లో కల్పించలేని మౌలిక వసతులను వైఎస్ జగన్ ప్రభుత్వం కల్పించి గ్రామాల అభ్యున్నతికి ఎంతో కృషి చేసిందని చెప్పారు. గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధికి చూసి ఓర్వలేక ప్రతిపక్ష నేతలు అసత్యప్రచారాలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ప్రజలు వారి అసత్య ప్రచారాలను నమ్మే పరిస్థితిలో లేరని ప్రజలు అన్ని గ్రహిస్తున్నారని చెప్పారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్ర ముఖ్యమంత్రిగా మరలా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని గెలిపించేందుకు ప్రజలు అందరూ సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టిప్పర్ డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు



విజయవాడస్పోర్ట్స్: టిప్పర్ డ్రైవర్లు నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ కె.చక్రవర్తి హెచ్చరించారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని టిప్పర్ డ్రైవర్లతో డీసీపీ సోమవారం సమావేశమయ్యారు. వ్యాస్ భవన్‌లో జరిగిన సమావేశంలో డీసీపీ మాట్లాడుతూ కంకర, గ్రావెల్, ఇసుక, ఇటుకలు, బూడిద తదితర మెటీరియల్‌ను తరలించే టిప్పర్లను నగరంలోని కనకదుర్గ ఫ్లై ఓవర్ మీదకు అనుమతించమన్నారు. ఈ వాహనాలు ఇబ్రహీంపట్నం, గొల్లపూడి వై జంక్షన్, గొల్లపూడి బైపాస్, సీవీఆర్ ఫ్లై ఓవర్, వై.వి.రావు సర్కిల్, పైపుల రోడ్డు, ఐఆర్ఆర్ మీదుగా రాకపోకలు సాగించాలన్నారు. వాహనంపై తప్పనిసరిగా టార్పాలిన్‌ను కప్పాలన్నారు. నిబంధనలు అతిక్రమించి అతి వేగంతో దురుసుగా వాహనాన్ని నడుపుతూ ఇతర ప్రయాణికులను భయభ్రాంతులకు గురి చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్ వాసి మృతి

మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యుదాఘాతంతో ఉత్తరప్రదేశ్ వాసి మృతి చెందిన ఘటన గుణదల పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇజ్రాయిల్ ఖాన్(25) గుంటూరులో ఉంటూ ఐరన్ స్టీల్ వెల్డింగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గుణదల ఫ్లై ఓవర్ సమీపంలోని ఓ విల్లాలో పని కోసం ఆదివారం ఇజ్రాయిల్ ఖాన్ వచ్చాడు. కొంత సేపు పనిచేసిన తరువాత మెషీన్ పనిచేయకపోవటంతో ఇంటికి వెళ్లిపోయాడు. సోమవారం ఉదయం ఇజ్రాయిల్ ఖాన్ తిరిగి పనికి వచ్చాడు. విండోస్‌కు వెల్డింగ్ పని చేస్తుండగా ప్రమాదవశాత్తూ విద్యుత్ షాక్ తగలటంతో కిందపడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఇంటి యజమాని రావర్ల ప్రవీణ్ ఇజ్రాయిల్‌ఖాన్ బంధువు వజూల్‌హాసన్‌కు ఫోన్ చేసి సమాచారం తెలిపాడు. ఆస్పత్రిలో ఇజ్రాయిల్ ఖాన్ మృతి చెందాడు. వజూల్‌హాసన్ ఫిర్యాదు మేరకు గుణదల పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రూ.1.49 లక్షల నగదు స్వాధీనం

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కొత్తపేట పోలీస్ స్టేషన్ పరిధిలోని పాముల కాల్వ వద్ద ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో పోలీసుల తనిఖీల్లో రూ.1.49 లక్షల నగదు పట్టుబడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం తెల్లవారుజామున తెలంగాణా నుంచి వస్తున్న రెండు కార్లలో లెక్క చూపని రూ.70 వేలు, రూ.79 వేలు నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు. నగదు వివరాలను అడగ్గా వారు పొంతన లేని సమాధానం చెప్పడంతో ఆ నగదును సబ్ ట్రెజరీకి అప్పగించినట్లు కొత్తపేట సీఐ గణేష్ పేర్కొన్నారు.

ముగ్గురు ఉద్యోగులకు జీఎం సేఫ్టీ అవార్డులు


డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న ఉద్యోగి

రైల్వేస్టేషన్(విజయవాడపశ్చిమ): విధి నిర్వహణలో అప్రమత్తంగా వ్యవహరిస్తూ, సకాలంలో సమస్యలను గుర్తించి ప్రమాదాలు జరుగకుండా సిబ్బందిని అప్రమత్తం చేసిన విజయవాడ డివిజన్‌కు చెందిన ముగ్గురు ఉద్యోగులకు 'మ్యాన్ ఆఫ్ ద మంత్ జీఎం సేఫ్టీ అవార్డులు' వరించాయి. సోమవారం దక్షిణ మధ్య రైల్వే హెడ్‌క్వార్టర్స్ సికింద్రాబాద్‌లోని రైలు నిలయంలో ఏజీఎం ధనుంజయులు విజయవాడ, గుంటూరు, గుంతకల్లు, సికింద్రాబాద్, హైదరాబాద్, నాందేడ్ డివిజన్‌ల డీఆర్‌ఎంలతో భద్రతా చర్యలపై వర్చువల్ సమావేశం నిర్వహించారు. ముఖ్యంగా భద్రతకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తూ క్రమం తప్పకుండా సేఫ్టీ డ్రైవ్‌లు, రాత్రుళ్లు సెక్షన్‌లలో తనిఖీలు చేపట్టాలన్నారు. విధుల్లో అప్రమత్తంగా వ్యవహరిస్తూ వ్యవస్థలో లోపాలను గమనించి ప్రమాదాల నివారణ చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం మ్యాన్ ఆఫ్ ద మంత్ సేఫ్టీ అవార్డ్స్ ఫిబ్రవరి–2004కి ఎంపికైన ఉద్యోగులను ఏజీఎం ప్రకటించారు. విజయవాడ డివిజన్ నుంచి ఎంపికైన రాజమండ్రిలో టెక్నీషియన్ ఎస్.ఎస్.సుబ్రహ్మణ్యం, కాకినాడ పోర్టులో గూడ్స్ లోకో పైలట్ కె.వి.వి.ఎస్ నారాయణ, విజయవాడ ట్రాలీ మెన్ వి.వీరలింగేశ్వరరావులను డీఆర్‌ఎం నరేంద్ర ఏ పాటిల్ తన కార్యాలయంలో జీఎం అవార్డులను అందజేసి అభినందనలు తెలిపారు.

నిక్కచ్చిగా 'నియమావళి' అమలు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఢిల్లీరావు



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఎన్నికల నియమావళిని సమర్థంగా అమలు చేస్తున్నామని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్. ఢిల్లీరావు అన్నారు. నియమావళికి సంబంధించి ఇప్పటి వరకు 1,235 ఫిర్యాదులు రాగా వాటిలో 1,213 ఫిర్యాదులను పరిష్కరించినట్లు చెప్పారు. మిగిలిన ఫిర్యాదులు పురోగతిలో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. సోమవారం కలెక్టర్ ఢిల్లీరావు వివిధ మార్గాల ద్వారా వచ్చే ఎన్నికల ఫిర్యాదుల పరిష్కార ప్రగతిపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ కోడ్ ఉల్లంఘనలతో పాటు ఎన్నికలకు సంబంధించిన వివిధ అంశాలపై వస్తున్న ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఏప్రిల్ 1వ తేదీ నాటి నివేదిక ప్రకారం ఓటర్ హెల్ప్‌లైన్ (1950) ద్వారా 66 ఫిర్యాదులు రాగా అన్నింటినీ పరిష్కరించామన్నారు. అదే విధంగా నేషనల్ గ్రీవెన్స్ సర్వీసెస్ పోర్టల్ (ఎన్‌జీఎస్‌పీ) ద్వారా 818 ఫిర్యాదులు రాగా.. వాటిలో 815 పరిష్కారం అయ్యాయన్నారు. వాట్సాప్ నంబర్‌కు 17 ఫిర్యాదులు రాగా 14 ఫిర్యాదులు, కాల్ సెంటర్ 18 ఫిర్యాదులు రాగా 18, కంప్లయింట్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ (సీఎంఎస్)కు 27 ఫిర్యాదులు రాగా 24 ఫిర్యాదులు, సీఈవో మెయిల్స్ ద్వారా 26 ఫిర్యాదులు రాగా 15 ఫిర్యాదులను పరిష్కరించినట్లు తెలిపారు.

త్వరగా ఫిర్యాదుల పరిష్కారం..

సీ–విజిల్ ద్వారా 263 ఫిర్యాదులు రాగా 261 పరిష్కారం చేశామన్నారు. మిగిలినవి వివిధ దశలలో ఉన్నాయన్నారు. వ్యవస్థలపై సమీక్షిస్తూ వీలైనంత త్వరగా ఫిర్యాదుల పరిష్కారం పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. మీడియాలో 43 ప్రతికూల వార్తలకు సంబంధించి 31 వార్తలపై ఇప్పటికే తగు చర్యలు తీసుకున్నామన్నారు. ఎన్నికలకు సంబంధించి వివిధ అనుమతుల కోసం ఎన్‌కోర్ ద్వారా వచ్చిన 44 దరఖాస్తుల్లో 30 దరఖాస్తులను ఇప్పటికే పరిష్కరించినట్లు కలెక్టర్ ఢిల్లీరావు తెలిపారు.

అనుమానాస్పద స్థితిలో వివాహిత మృతి

కంకిపాడు: వివాహిత మృతిపై అనుమానాస్పద మృతిగా కంకిపాడు పోలీసుస్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ డి.సందీప్ తెలిపిన కథనం మేరకు.. మండలంలోని తెన్నేరు శివారు కోమటిగుంట గ్రామానికి చెందిన దోకిపర్తి సుమలత కుమార్తె ప్రసన్నకుమారి(28)ని పదేళ్ల క్రితం ఉయ్యూరు మండలం కలవపాముల గ్రామానికి చెందిన కళ్లెం రాజేష్‌కు ఇచ్చి వివాహం జరిపించారు. వీరికి ఒక పాప, ఒక బాబు సంతానం. వ్యాపారం నిమిత్తం కొంతకాలంగా కంకిపాడు వచ్చి ప్రసన్నకుమారి కుటుంబం నివాసం ఉంటోంది. స్థానిక సినిమా హాల్‌సెంటరులో ఫుట్‌వేర్ షాపు నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. వ్యాపారంలో నష్టం రావటంతో అప్పులపాలై మనస్తాపానికి గురై సోమవారం ప్రసన్నకుమారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యులు గుర్తించి వైద్యం నిమిత్తం ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వ్యాపారంలో నష్టాలతో అప్పులపాలైనట్లు తరచూ బాధ పడేదని ప్రసన్నకుమారి తల్లి సుమలత పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉయ్యూరుకు తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ సందీప్ తెలిపారు.

ఆటోలు ఢీ : ఒకరి మృతి



తిరువూరు: మండలంలోని ఎరుకోపాడు – చింతలపాడు గ్రామాల మధ్య సోమవారం సాయంత్రం రెండు ఆటోలు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా, 9 మంది వ్యవసాయ కూలీలకు గాయాలయ్యాయి. గానుగపాడుకు చెందిన కూలీలు పొలం పనుల నిమిత్తం ఎరుకోపాడు వెళ్లి తిరిగి ఆటోలో వస్తున్న క్రమంలో ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో నలుగురికి తీవ్ర గాయాలు కాగా తిరువూరులో ప్రథమ చికిత్స అనంతరం విజయవాడకు తరలించారు. చికిత్స పొందుతూ గానుగపాడుకు చెందిన బంకా ఆనందరావు(50) మృతిచెందగా, మేకల ఎల్లమ్మ పరిస్థితి విషమంగా ఉంది. తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోలో పరిమితికి మించి కూలీలతో వెళ్లడంతో అదుపు తప్పి ప్రమాదానికి గురైనట్లు స్థానికులు తెలిపారు.

పక్కాగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు చర్యలు

- పోలింగ్ సిబ్బంది శిక్షణకు ఏర్పాట్లు
- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఎన్టీఆర్ జిల్లాలో ఈసీఐ, సీఈవో మార్గదర్శకాలకు అనుగుణంగా పక్కాగా పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ ప్రక్రియకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనాకు వివరించారు. సోమవారం రాష్ట్ర సచివాలయం నుంచి రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లాల ఎన్నికల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌కు కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ డాక్టర్ పి.సంపత్ కుమార్, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, కేఆర్‌సీ స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ కిరణ్మయి హాజరయ్యారు.

షెడ్యూల్ కార్యకలాపాల వివరణ

అర్హులైన వారికి పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి జిల్లా స్థాయిలో సన్నద్ధత, ప్రక్రియను సజావుగా పూర్తి చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్ కుమార్ మీనా వివరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో భాగమైన పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్, ఈవీఎం, వీవీప్యాట్ ర్యాండమైజేషన్‌లతో పాటు పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్‌కు సంబంధించి ఏప్రిల్, మే నెలల్లో తేదీల వారీగా నిర్వహించనున్న కార్యకలాపాలను వివరించారు. ఫెసిలిటేషన్ సెంటర్ల ఏర్పాటుకు సంబంధించిన వివరాలను తెలిపారు. పీవోలు, ఏపీవోలు తదితరులతో పాటు ఇతర పోలింగ్ సిబ్బందికి ప్రణాళిక ప్రకారం శిక్షణ ఇవ్వనున్నామని.. ఇందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ ఢిల్లీరావు వివరించారు.

పేదలందరికీ సీఎం వైఎస్ జగన్ పథకాలు

సినీనటుడు సుమన్


సినీనటుడు సుమన్‌తో మిత్రులు, అభిమానులు

ఆటోనగర్(విజయవాడతూర్పు): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని సినీనటుడు సుమన్ పేర్కొన్నారు. సినిమా షూటింగ్‌కు విజయవాడ వచ్చిన ఆయన సోమవారం సాయంత్రం జవహర్ ఆటోనగర్‌లోని కలాం బ్యాటరీ వర్క్స్ అధినేత డాక్టర్ అబ్దుల్ కలాంను కలిశారు. ఈ సందర్భంగా సుమన్ విలేకరులతో మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఐదేళ్లలో పేదలకు సంక్షేమ పథకాలు బాగానే ఇచ్చారన్నారు. తాను 10 భాషల్లో 800 సినిమాల్లో నటించానని చెప్పారు. దీని ద్వారా ఇండియాలో పాపులర్ అయ్యానన్నారు. తల్లిదండ్రులు, అభిమానుల ఆశీస్సులతో ముందుకు వెళుతున్నానని తెలిపారు. విజయవాడ వచ్చిన ప్రతిసారి ఆటోనగర్‌లో కలాంను కచ్చితంగా కలుస్తానన్నారు. అనంతరం కార్మికులను ఆప్యాయంగా పలకరించి, వారితో సెల్ఫీలు దిగారు. కార్యక్రమంలో ముస్లింలు బాజీషరీఫ్, గౌస్‌ఖాన్, ఖాదర్, నూర్, ఐలా మాజీ చైర్మన్ సుంకర దుర్గాప్రసాద్, జమాక్ అధ్యక్షుడు త్రిపురనేని హనుమాన్ నాగచంద్, కుందేటి రమేష్ పాల్గొన్నారు.

'బలవంతంగా టీడీపీ కండువా కప్పారు'

రామన్నగూడెం సర్పంచ్
రెడ్డి వీరాంజనేయులు



సర్పంచ్ వీరాంజనేయులును తిరిగి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న నాయకులు

హనుమాన్‌జంక్షన్ రూరల్: తనకు ఇష్టం లేకపోయినా టీడీపీ గన్నవరం ఎమ్మెల్యే అభ్యర్థి యార్లగడ్డ వెంకట్రావు అనుచరులు బలవంతంగా తెలుగుదేశం పార్టీలో చేర్చారని రామన్నగూడెం సర్పంచ్ రెడ్డి వీరాంజనేయులు చెప్పారు. స్థానిక విజయవాడరోడ్డులోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో సోమవారం ఆయన తిరిగి సొంతగూటికి చేరారు. తన మనస్సాక్షికి విరుద్ధంగా టీడీపీ కండువా కప్పుకుని ఆ పార్టీలో కొనసాగలేనని తెలిపారు. యథావిధిగా వైఎస్సార్ సీపీలోనే కొనసాగుతానని, ఎమ్మెల్యే అభ్యర్థి వల్లభనేని వంశీ గెలుపునకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. యార్లగడ్డ అనుచరుల చేష్టల వల్ల తాను మానసికంగా తీవ్రంగా కుంగిపోయానని చెప్పారు. అంతేకాకుండా యార్లగడ్డ వెంకట్రావు అనుచరులే తన ప్రమేయం లేకుండా సెల్‌ఫోను తీసుకుని అశ్లీల ఫొటోలను వాట్సాప్ గ్రూప్‌ల్లో పెట్టి, అవమానించారని వాపోయారు. అనంతరం రామన్నగూడెం గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు గండికోట రంగారావు చేతుల మీదగా సర్పంచ్ వీరాంజనేయులకు వైఎస్సార్ సీపీ కండువా కప్పి తిరిగి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ మండల అధ్యక్షుడు నక్కా గాంధీ, మాజీ సర్పంచ్ ఢీకొల్లు రమేష్, నాయకులు చెరుకూరి శ్రీనివాస్, కగ్గా డేవిడ్, మూల్పూరు ప్రభుకాంత్, నన్నపనేని చలపతిరావు, కురిమిని శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యుత్ స్తంభంపై నుంచి పడి యువకుడి మృతి

చిల్లకల్లు(జగ్గయ్యపేట): ప్రమాదవశాత్తు విద్యుత్ స్తంభంపై నుంచి కింద పడి యువకుడు అక్కడికక్కడే మృతి చెందిన ఘటన సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే తెలంగాణా రాష్ట్రం నల్గొండ జిల్లా దామచర్ల మండలం గొల్లగూడెం తండానికి చెందిన లాహోరు కిరణ్(32) కేబుల్ వైర్లు పని చేసేందుకు వారం క్రితం గ్రామానికి వచ్చాడు. ఉదయం సమయంలో పెట్రోల్ బంకు సమీపంలోని విద్యుత్ స్తంభానికి నిచ్చెన వేసుకుని కేబుల్ వైర్లు కడుతుండగా ప్రమాదవశాత్తు స్తంభంపై నుంచి కిందపడ్డాడు. ఈ ఘటనలో కిరణ్ తలకు తీవ్ర గాయం కావటంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. ఘటనపై ఎలాంటి కేసు నమోదు కాలేదు.

ఆయుధాలు, మందుగుండు సామగ్రి దుకాణాల్లో తనిఖీలు

విజయవాడస్పోర్ట్స్: గవర్నర్‌పేట, మాచవరం పోలీస్ స్టేషన్ల పరిధిలోని ఆయుధాలు, ముందుగుండు సామగ్రి దుకాణాలను డెప్యూటీ పోలీస్ కమిషనర్(డీసీపీ) అధిరాజ్‌సింగ్ రాణా సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఆయుధాల భద్రతపై పాటించాల్సిన సూచనలను దుకాణాలను యజమానులకు వివరించారు. లైసెన్స్ ఉన్న ఆయుధాలు, మందుగుండు సామగ్రి మాత్రమే ఉంచాలని, వెపన్స్ అన్నింటినీ డిపాజిట్ చేయించాలని యజమానులను ఆదేశించారు. వెపన్స్ డిపాజిట్‌దారుల వివరాలను రికార్డుల్లో క్షుణ్ణంగా నమోదు చేయాలన్నారు. డిపాజిట్ చేసుకున్న ఆయుధాలను బయటకు పంపవద్దన్నారు. దుకాణాల చుట్టూ సీసీ కెమెరాలను, ప్రత్యేక సెక్యూరిటీ సిబ్బందిని ఏర్పాటు చేసి కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేశామని డీసీపీ చెప్పారు.

లాభాల పుట్టగొడుగు

- పుట్టగొడుగుల తయారీ పరిశ్రమలో ప్రగతి సాధిస్తున్న జ్యోత్స్న
- ఔత్సాహిక మహిళా పారిశ్రామికవేత్తగా రాణింపు
- బెస్ట్ ఫార్మర్ అవార్డు, పలు వేదికలపై సత్కారాలు


భద్రపరిచిన యూనిట్‌లో తయారైన పుట్టగొడుగులు


అవార్డులు, సర్టిఫికెట్లతో జ్యోత్స్న

గన్నవరంరూరల్: పుట్టగొడుగుల తయారీలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తగా ఎదుగుతూ పది మందికి ఉపాధి కల్పిస్తున్నారు బండారు జ్యోత్స్న. గన్నవరం మండలం సూరంపల్లి మహిళా పారిశ్రామికవాడలో(ఎలీప్) పుట్టగొడుగుల తయారీపై ప్రత్యేక శిక్షణ పొందిన ఆమె మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెన్యూర్(ఎంఎస్‌ఎంఈ)గా సర్టిఫికెట్ పొంది విజయవాడ రూరల్ మండలం గూడవల్లి, నిడమానూరు మధ్య విశాలమైన ప్రాంగణంలో పుట్టగొడుగుల పరిశ్రమను స్థాపించారు. అక్కడ పుట్టగొడుగుల తయారీకి అనువైన వాతావరణం కల్పించేందుకు ఎంతో కృషి చేశారు. ఎంఎస్సీ, ఎంఈడీ చేసిన ఆమె దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారవుతున్న పుట్టగొడుగులను పరిశీలించారు. కేరళ, కర్నాటక, తమిళనాడులోని పలు ప్రాంతాల్లో పుట్టగొడుగుల తయారీ పద్ధతులను అధ్యయనం చేశారు. ఆరోగ్య సమాజ నిర్మాణం కోసం ఆలోచించే ఆమె పలు యూనివర్సిటీలను సందర్శించి నిపుణుల సలహాలు స్వీకరించారు. పుట్టగొడుగులను ఆహారంగా తీసుకోవడం ద్వారా వైద్య పరమైన లాభాలు ఉంటాయని, హార్మోన్స్‌లో అసమానతలు తొలుగుతాయని, కాల్షియం లోపాలు తగ్గి, డీ విటమిన్ పుష్కలంగా లభిస్తుందని ఆమె గుర్తించారు. తాను ప్రయోగాత్మకంగా పండించిన పుట్టగొడుగులను పలు ఎగ్జిబిషన్లలో ప్రదర్శించారు. ఆమె కృషిని గుర్తించిన ఆచార్య ఎన్‌జీ రంగా అగ్రికల్చర్ యూనివర్సిటీ బెస్ట్ ఫార్మర్ అవార్డును అందజేసింది.

ప్రత్యేక రకాల పుట్టగొడుగుల సాగు

బండారు జ్యోత్స్న కుటుంబ ప్రోత్సాహంతో పలు ప్రత్యేక రకాల పుట్టగొడుగులను సాగుచేస్తున్నారు. పింక్ ఆయిస్టర్స్, ఎల్మ్ మాయిస్టర్, సాజర్‌కాజు, గ్రే ఆయిస్టర్స్, వైట్ ఆయిస్టర్స్, మిల్కీ మష్‌రూమ్స్ వంటి రకాలను ఆమె పండిస్తున్నారు. మార్కెట్‌లో లభించే బటర్ మష్రూమ్స్ మాత్రమే కాకుండా పలు రకాలుగా ఆరోగ్య వరదాయనులుగా ఉపయోగపడే పుట్టగొడుగులను ఆమె సాగుచేస్తున్నారు. ఉత్సాహవంతులైన యువతకు, విద్యార్థులకు పుట్టగొడుగుల తయారీ, ప్రయోజనాలపై అవగాహన కల్పిస్తున్నారు. పలు కళాశాలలు, యూనివర్సిటీలను సందర్శించి పుట్టగొడుగుల పెంపకంపై విద్యార్థుల్లో ఆసక్తి కలిగిస్తున్నారు.

కిచెన్ గార్డెన్‌లో సాగు చేసేలా..

పుట్టగొడుగులకు సంబంధించిన బెడ్స్‌ను రూపొందించి ఒక దశ వరకూ తయారు చేసి ఎవరికి వారు వాటిని తమ కిచెన్ గార్డెన్‌లో పెంచుకునే విధంగా జ్యోత్స్న అందిస్తున్నారు. వినూత్న ఆలోచనలతో రెగ్యులర్ డైట్‌లో పుట్టగొడుగులను భాగం చేయటం ద్వారా బాలల్లో ఎదుగుదలను పెంచటం, కుటుంబాలను ఆరోగ్యంగా తీర్చిదిద్దడం ద్వారా ఆరోగ్య సమాజ నిర్మాణానికి బండారు జ్యోత్స్న కృషిచేస్తున్నారు. ప్రభుత్వం అందించే సహకారంపై దృష్టి సారించి మరింత మంది ఈ రంగంలో ఉపాధి పొందేలా కృషి చేయడమే తన కర్తవ్యమని ఆమె పేర్కొంటున్నారు. ఫైబర్ ఎక్కువగా ఉండే మష్రూమ్స్ వాడకం అందరికీ మంచిదని సూచిస్తున్నారు. అనేక వేదికలపై, ఎగ్జిబిషన్లలో పుట్టగొడుగుల తయారీ, ప్రయోజనాలపై ప్రసంగాలు చేస్తున్నారు. ఇప్పటికే పలు సత్కారాలు అందుకున్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం అందించే సహకారం కొనసాగాలని ఆకాంక్షిస్తున్నారు.

క్లుప్తంగా

నగరానికి ఎన్నికల స్పెషల్ జనరల్ అబ్జర్వర్ మిశ్రా



గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): ఏపీ స్పెషల్ జనరల్ అబ్జర్వర్‌గా నియమితులైన రిటైర్డు ఐఏఎస్ అధికారి రామ్‌మోహన్ మిశ్రా నగరానికి విచ్చేశారు. సోమవారం ఢిల్లీ నుంచి నగరానికి చేరుకున్న ఆయనకు నోవాటెల్ వద్ద రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా, జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఢిల్లీరావు, జాయింట్ కలెక్టర్ పి.సంపత్ కుమార్ స్వాగతం పలికారు.

ఆకట్టుకున్న ధార్మిక ఉపన్యాసం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో డాక్టర్ అనంతలక్ష్మి ధార్మిక ఉపన్యాసం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని ధర్మపథం వేదిక వద్ద భవానీ సేవాధారులు వివిధ పుష్పాలతో శ్రీచక్రాన్ని తీర్చిదిద్దారు. ఆలయ ఈవో కె.ఎస్. రామరావు దంపతులు జ్యోతి ప్రజ్వలన చేసి పూజా కార్యక్రమాలను నిర్వహించారు. ధార్మిక ఉపన్యాసం ఇవ్వగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం ఈవో రామరావు మాట్లాడుతూ ఇటువంటి ఆధ్యాత్మిక కార్యక్రమాలు ఎంతో అవసరమన్నారు. ఆధ్యాత్మికతను పెంచే కార్యక్రమాలను చేపట్టడానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. అనంతరం అనంతలక్ష్మి, భవానీ సేవాధారులకు అమ్మవారి దర్శనం కల్పించారు. కార్యక్రమంలో వైదిక కమిటీ సభ్యులు రంగావజ్ఝుల శ్రీనివాసశాస్త్రి, ఇతర అర్చకులు పాల్గొన్నారు.

దుర్గమ్మ సన్నిధిలో సరస్వతీ హోమం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై సోమవారం సరస్వతీ హోమం చేశారు. మూలా నక్షత్రాన్ని పురస్కరించుకుని మల్లేశ్వరస్వామివారి ఆలయ సమీపంలోని యాగశాలలో అర్చకులు యాగాన్ని జరిపించారు. విద్యార్థులకు విద్యాబుద్ధులు ప్రసాదించాలని, వార్షిక పరీక్షలు, పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు మంచి ఫలితాలను సాధించాలని కాంక్షిస్తూ ప్రతి నెలా మూలా నక్షత్రం రోజున అమ్మవారి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్నామని ఆలయ అర్చకులు తెలిపారు. దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులు హోమంలో పాల్గొనగా, పూర్ణాహుతి కార్యక్రమాన్ని అర్చకులు జరిపించారు.

చెక్‌పోస్టుల ఆకస్మిక తనిఖీ



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): విజయవాడ ఆర్డీఓ, తూర్పు నియోజకవర్గ ఆర్వో బీహెచ్ భవానీశంకర్ సోమవారం చెక్‌పోస్టులను ఆకస్మికంగా తనిఖీ చేశారు. వారధి, ఆటోనగర్, రామవరప్పాడు రింగ్ చెక్‌పోస్టులను తనిఖీలు చేశారు. వాహనాలు తనిఖీ చేస్తున్న తీరును ఆయన పరిశీలించారు. అక్రమంగా నగదు, మద్యం, విలువైన లోహాలు వంటి వాటి రవాణాకు అడ్డుకట్ట వేసేందుకు నిరంతర నిఘా, అప్రమత్తతతో వ్యవహరించాలని సిబ్బందికి సూచించారు. ప్రతి నియోజకవర్గంలో ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఎంసీసీ బృందాలు పని చేస్తున్నాయని తెలిపారు. ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఈఎస్ఎంఎస్) పటిష్ట అమలుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల అధికారులు కృషి చేయాలని భవానీశంకర్ సూచించారు. ఆర్డీఓతో పాటు పోలీస్, మునిసిపల్ తదితర శాఖల అధికారులు ఉన్నారు.

కారు ఢీ.. యువకుడికి గాయాలు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): కారు ఢీకొని యువకుడు గాయపడిన ఘటనపై కొత్తపేట పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అంబాపురం కొత్తవంతెన ప్రాంతానికి చెందిన అమరా వెంకటేష్ తన బైక్‌పై వెళ్తుండగా, వేగంగా వచ్చిన కారు ఢీ కొట్టింది. వెంకటేష్ మణికట్టుకు, తలకు గాయం కావడంతో వెంటనే 108లో నగరంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అభివృద్ధి పరుగులు

- 8వ డివిజన్‌లో 8.20కోట్లతో పనులు
- మెరుస్తున్న రోడ్లు

మొగల్రాజపురం(విజయవాడతూర్పు): ఎనిమిదో డివిజన్ పరిధిలో రాష్ట్ర ప్రభుత్వం అభివృద్ధి పనులను చకచకా చేసింది. డివిజన్‌లో గతుకులమయంగా ఉన్న రోడ్లను మెరిసేలా పనులు జరిగాయి. డివిజన్ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం పెద్ద మొత్తంలో నిధులు మంజూరు చేసింది. డివిజన్‌లో రూ.8.20 కోట్ల అంచనాతో వివిధ అభివృద్ధి పనులు జరిగాయి. ఇక్కడ ఎన్నో సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న పిన్నమనేని పాలీక్లినిక్ రోడ్డులో మదర్ థెరిసా జంక్షన్ నుంచి మైనేని జంక్షన్ వరకు కోటి రూపాయల అంచనాతో ప్రధాన మురుగునీటి కాలువను నిర్మించారు. దీంతో రోడ్డుపై చుక్క వర్షం నీరు కూడా నిలకుండా చర్యలు తీసుకున్నారు.



సిమెంట్ రోడ్డుగా మారిన కంచుకోట వారి వీధి

డివిజన్‌లో సీసీ రోడ్ల నిర్మాణం

- ఈ ప్రాంతంలో ఎప్పుడో వేసిన తారు రోడ్లకు గత ప్రభుత్వ హయాంలో కొద్దిగా తారు వేసిన ప్యాచ్‌వర్క్‌లే దిక్కయ్యాయి. ఈ ప్రాంతంలో రోడ్ల దుస్థితిని స్థానిక నాయకులు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. కంచుకోట వారి వీధి, బాబు టెక్స్‌టైల్స్ రోడ్డు, ఆచార్య రంగానగర్ రోడ్డు, అశోక్ నగర్‌తో పాటుగా డివిజన్‌లో ఉన్న ప్రధాన, అంతర్గత రోడ్లతోపాటు అన్ని రోడ్లను సీసీ రహదారులుగా మార్చారు. రోడ్ల కూడళ్లలో కల్వర్టుల ఎత్తు పెంచి నిర్మించారు. గతంలో వాన కురిస్తే వస్తే రోడ్లపై నిలిచిన నీటిలో నుంచే పాదచారులు, వాహనచోదకులు రాకపోకలు సాగించాల్సిన పరిస్థితి ఉండేది. ఇప్పుడు ఎత్తు పెంచి సిమెంట్ రోడ్లనిర్మాణం చేయడంతో వాహనాలు రయ్ రయ్ మంటూ ఈ రోడ్లపై పరుగులు పెడుతున్నాయి.
- సుమారు రూ.3 కోట్ల నిధులతో డివిజన్‌లోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ స్కూల్‌లో 13 అదనపు తరగతి గదులు నిర్మించారు. పాఠశాలలో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు.
- డివిజన్‌లో ఎస్‌బీఐ కాలనీలో ఉన్న పార్కును సుమారు కోటిన్నర అంచనాతో ఆహ్లాదకర వాతావరణంతో పాటుగా వ్యాయమ పరికరాలను అమర్చడంతో పార్క్ ఆనందాన్ని పంచుతోంది.

అభివృద్ధిని కళ్లారా చూస్తున్నాం




గతంలో డివిజన్‌లో అన్ని గతుకులు పడిన రోడ్లు ఉండేవి, ఇప్పుడు అన్ని సిమెంట్ రోడ్లుగా మారాయి. రోడ్ల అభివృద్ధితో పాటుగా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఇంటికొచ్చి అందజేస్తున్నారు. గతంలో ప్రభుత్వ పథకం పొందాలంటే చాలా కష్టపడేవారం.

–తుమ్మల మల్లికార్జునరావు, అశోక్‌నగర్



ఎస్‌బీఐ కాలనీలో పార్కు



బీఎస్ఆర్‌కే స్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం

పింఛనర్లకు ఆవేదనే..

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఏ ముఖ్యమంత్రి చేయలేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయాలు, వలంటీరు వ్యవస్థను తీసుకువచ్చి ప్రజలకు సేవ చేస్తుంటే గిట్టని వారు కుట్రలు చేసి వలంటీర్లను రాకుండా అడ్డుకున్నారని వృద్ధులు, దివ్యాంగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పింఛన్లకు ఇబ్బంది పడతామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వారి మాటల్లోనే...

ఏం చేయాలో..



కొన్ని నెలల క్రితం రూ.10వేలు అప్పు తీసుకున్నా. సైకిల్‌పై దిండ్లు తీసుకెళ్లి అమ్ముతుంటాను. నాకు నెల నెలా వచ్చే పింఛన్‌లో కొంత చెల్లిస్తుంటాను. నాలుగున్నరేళ్ల నుంచి ఇంటి గుమ్మం తట్టి వలంటీర్లు పింఛన్ ఇస్తున్నారు. టీడీపీకి సంబంధించిన వారి ఫిర్యాదుపై ఎలక్షన్ కమిషన్ ఆదేశాలతో వలంటీర్లు వచ్చి పింఛన్ ఇవ్వరని తెలిసింది. ఏం చేయాలో దిక్కుతోచడంలేదు.

-బాజ్జి, పుట్టరోడ్డు, రామలింగేశ్వరనగర్

చాలా ఇబ్బందే



ప్రతి నెలా ఒకటో తేదీ ఉదయమే వలంటీర్లు వచ్చి పింఛన్ ఇచ్చేవారు. అయితే టీడీపీ మద్దతుదారులు ఫిర్యాదుతో వలంటీర్లు రారని తెలిసింది. మా ఇంటి నుంచి సచివాలయానికి వెళ్లి రావాలంటే ఇబ్బందే. నాకు అసలే నడుంనొప్పి ఉంది. అక్కడకు వెళ్లి ఉండలేను. వలంటీర్లు వచ్చి పింఛన్ ఇవ్వకపోతే నాకు చాలా ఇబ్బంది.

– ఎం పార్వతమ్మ, ఆంజనేయస్వామి గుడి వద్ద, చెల్లారావు రోడ్డు

ప్రజా స్పందన చూసి తట్టుకోలేకే..

- వృద్ధుల ఉసురు టీడీపీ నేతలకు తగులుతుంది
- దేవినేని అవినాష్
- 15వ డివిజన్‌లో ఎన్నికల ప్రచారం



15వ డివిజన్‌లో జరిగిన ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న దేవినేని అవినాష్

ఆటోనగర్(విజయవాడతూర్పు): ప్రజాస్పందన చూసి తట్టుకోలేక టీడీపీ నేతలు పచ్చ రాజకీయాలకు తెరలేపారని వైఎస్సార్ సీపీ 'తూర్పు' ఎమ్మెల్యే అభ్యర్థి దేవినేని అవినాష్ విమర్శించారు. ఎన్నికల సమయంలో వృద్ధులకు నెల నెలా పింఛన్ ఇచ్చే వలంటీర్లను కోర్టుకు వెళ్లి ఆపారని పండుటాకుల ఉసురు చంద్రబాబు, లోకేష్, నిమ్మగడ్డకు తప్పకుండా తగులుతుందని ధ్వజమెత్తారు. సోమవారం 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్ సాయిరాం రోడ్డులో ఎన్నికల ప్రచారం జరిగింది. ఈ సందర్భంగా అవినాష్, డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ ఇంటింటికీ వెళ్లి నవరత్నాలు అందిన తీరుపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా దేవినేని అవినాష్ మాట్లాడుతూ ప్రతి నెలా క్రమం తప్పకుండా అవ్వతాతలు, వితంతువులకు ఇంటికి వచ్చే వలంటీర్లు ఇచ్చే పింఛన్‌కు మోకాలడ్డు పెట్టడంతో నానా ఇబ్బందులు పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. వలంటీర్లు విధులకు రాకుండా టీడీపీ వారు అడ్డుకున్నారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో పడ్డ బాధలు అవ్వతాతలకు గుర్తుకు వచ్చి లబోదిబోమంటున్నారన్నారు. టీడీపీ నాయకుల తీరుతో వలంటీర్లు భయాందోళనకు గురవుతున్నారన్నారు. నిమ్మగడ్డ రమేష్ ద్వారా టీడీపీ నాయకులు వలంటీర్ల వ్యవస్థపై కుట్రపన్నారని ఆరోపించారు. నారా లోకేష్ ఏమైనా ఉద్యమనేతనా.. రాష్ట్రాన్ని ఏమైనా అభివృద్ధి చేశాడాఅని దుయ్యబట్టారు. ఎన్నికల్లో అవ్వతాతలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. డిప్యూటీ మేయర్ బెల్లం దుర్గ, నేతలు ఆళ్ల చెల్లారావు, వెంకటరెడ్డి, వీరయ్య, రాజేష్, చిన్న, నాగబాబు, చెంచయ్య, రామలింగం, బాలాజీ, రెడ్డి, మురళి, దుర్గారావు, వెంకన్న, సురేష్ పాల్గొన్నారు.

దళితులపై టీడీపీ వివక్ష

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు

గుణదల(విజయవాడ తూర్పు): దళితుల పట్ల వివక్ష చూపుతూ టీడీపీ అధినేత చంద్రబాబు నాయకుడు కుల చిచ్చు రేపుతున్నారని వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకులు మండి పడ్డారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు సముచిత స్థానం ఇస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై చంద్రబాబు చేస్తున్న వ్యాఖ్యలను ఖండించారు. ఈ మేరకు గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా 5వ డివిజన్ కార్పొరేటర్ కలపాల అంబేద్కర్ మాట్లాడుతూ, సార్వత్రిక ఎన్నికలు దగ్గర పడుతున్న నేపథ్యంలో టీడీపీ నాయకులకు ఓటమి భయం పట్టుకుందని విమర్శించారు. అందుకే లేనిపోని ఆరోపణలతో ప్రభుత్వాన్ని విమర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి పెరుగుతున్న ప్రజాదరణకు ఓర్వలేక తెలుగు తమ్ముళ్లు చిల్లర రాజకీయాలకు తెరతీస్తున్నారని దుయ్యబట్టారు. వైఎస్సార్ సీపీ హయాంలో దళితులకు సముచిత స్థానం లభిస్తుందన్నారు. ఈ నేపథ్యంలో టిప్పర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న ఓ కార్మికుడికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎమ్మెల్యే టికెట్ ఇవ్వడం హర్షణీయమన్నారు. దీనిని జీర్ణించుకోలేక చంద్రబాబు నాయుడు దళితులపై వివక్ష చూపుతూ విమర్శించడం సరికాదన్నారు. టీడీపీ హయాంలో కేవలం ఒక సామాజిక వర్గానికి మాత్రమే సముచిత స్థానం ఇచ్చి తన వాళ్లను అందలమెక్కించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందన్నారు. అందుకే గత ప్రభుత్వ హయాంలో సామాన్యుల బతుకులు రోడ్డున పడ్డాయని గుర్తు చేశారు. ఎస్సీ ఎస్టీ కులాలను కించపరుస్తూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకుని దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇటువంటి విమర్శలు చేస్తే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు చిత్రం లోకేష్, వి డేవిడ్ రాజు, సుభాషిణి, తదితరులు పాల్గొన్నారు.

దుర్గగుడిలో అర్చకుల అంతర్గత బదిలీలు

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై అర్చకులకు అంతర్గత బదిలీ చేస్తూ ఈవో కె.ఎస్.రామరావు సోమవారం ఆదేశాలు జారీ చేశారు. అంతరాలయంలో మొదటి షిఫ్టు ప్రధాన అర్చకులు ఎల్.దుర్గాప్రసాద్, ఉప ప్రధాన అర్చక ఎం.వి.రామమూర్తి, ముఖ్యఅర్చక పి. రామకృష్ణ, అర్చక నేతి ప్రసాద్‌కు కేటాయించారు. రెండో షిఫ్టులో ప్రధాన అర్చక కె. వెంకట కనక సుందరశర్మ, ముఖ్యఅర్చక పీవీకేఎస్ కామేశ్వరరావు, ముఖ్య అర్చక ఆర్.శ్రీనివాసశాస్త్రి, అర్చక వైఎస్ ఉమాకాంత్‌శర్మకు కేటాయించారు. మూడో షిఫ్టు ప్రధాన అర్చక ఎల్వీఎస్ బద్రీనాథ్ బాబు, ఉప ప్రధాన అర్చక బి.శంకర్ శాండిల్య, ముఖ్య అర్చక కె.హరి వాసుదేవకుమార్, అర్చక బి.ప్రవీణ్‌కుమార్‌కు కేటాయించారు. మల్లేశ్వర స్వామి వారి ఆలయంలో ప్రధాన అర్చకులు వై. మల్లేశ్వర శాస్త్రి, సత్యనారాయణమూర్తితో పాటు మూడు షిఫ్టుల్లో పి. జగన్మోహనరావు, మొవ్వ శ్రీనివాస్, కేవీ శివకుమార్, రెండో షిఫ్టులో జె. మోహన్‌బాబు, పి. శ్రీనివాసశర్మ, ఆర్.దుర్గాప్రసాద్‌లకు మూడో షిఫ్టులో డి. శివ సుబ్బారావు, పీవీఎస్ఎన్ మూర్తి, ఎల్. వెంకటేశ్వర శర్మలకు విధులు కేటాయించారు. వీరితో పాటు ధర్మదర్శనం, శివ కామసుందరీ సమేత నటరాజ స్వామి వారి ఆలయం, నాగేంద్రపుట్ట, గోపూజ, అష్టోత్తరం, అద్దాల మండపం, ఇతర ఉపాలయాల్లో విధులు నిర్వహించే అర్చకులను అంతర్గత బదిలీ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు.

బాటసారుల దాహార్తి తీర్చడానికి..



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న 'అమ్మ' వైస్ ప్రెసిడెంట్ సుబ్బారావు, సభ్యులు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): బాటసారుల దాహార్తిని తీర్చడానికి వేసవిలో చలివేంద్రం ఏర్పాటు చేయడం సంతోషమని ఆంధ్ర మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ) వైస్ ప్రెసిడెంట్ గోనుగుంట వెంకట సుబ్బారావు అన్నారు. సున్నపుబట్టీల సెంటర్‌లోని 'అమ్మ' ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. వెంకట సుబ్బారావు మాట్లాడుతూ సంఘం ఆధ్వర్యంలో ఏటా వేసవి కాలం మొదటి నుంచి ముగిసేంత వరకు చలివేంద్రాన్ని నిర్వహిస్తూ అందులో రక్షిత నీటితో పాటుగా మజ్జిగను కూడా పంపిణీ చేస్తామని చెప్పారు. 'అమ్మ' కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, సంఘ మాజీ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, మిరియాల వెంకటేశ్వరరావు, కృష్ణా జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగు మోతు రాజా, ఎంవీ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. చలివేంద్రం ప్రారంభ సందర్భంగా మజ్జిగను పంపిణీ చేశారు.

టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

మధురానగర్(విజయవాడసెంట్రల్): టెక్నికల్ ఎడ్యుకేషన్‌లో మంచి అవకాశాలు ఉన్నాయని, విద్యార్థులు ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు సూచించారు. మాచవరం ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ కళాశాలలో సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్ ప్రారంభోత్సవ కార్యక్రమం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని పాలిటెక్నిక్ కోచింగ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ పేద విద్యార్థుల సౌకర్యార్థం భారత విద్యార్థి ఫెడరేషన్(ఎస్ఎఫ్ఐ) ఏటా ఉచిత పాలిటెక్నిక్ కోచింగ్‌ను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. 10 పూర్తయిన తర్వాత అనేక అవకాశాలు ఉన్నాయని వాటిలో పాలిటెక్నిక్ చదివితే వెంటనే ఉద్యోగ అవకాశాలు వస్తాయని పేర్కొన్నారు. విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని ఈ నెల 27 తేదీన జరిగే పాలీసెట్ ప్రవేశ పరీక్షలో మంచి ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సీహెచ్ వెంకటేశ్వరరావు, నగర నాయకులు కుమారస్వామి, మాధవ్, భార్గవ, సంతోష్, పృధ్వీ తదితరులు పాల్గొన్నారు.

మద్యం అక్రమంగా విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

పెనమలూరు: యనమలకుదురులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. లంబాడీపేటకు చెందిన జటావత్ భాను అక్రమంగా మద్యం విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 10 మద్యం సీసాలు, రూ.100 సొమ్ము స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

సేవకు ప్రతిరూపం నాగమల్లీశ్వరి

మధురానగర్(విజయవాడసెంట్రల్): సేవకు ప్రతిరూపం కోరంగి నాగమల్లీశ్వరి అని ఆమె చేస్తున్న సేవలను ప్రతీ ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని తోటి వారికి సాయం చేయాలని డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు బీ వసంతకుమార్ అన్నారు. హెల్పింగ్ టుగెదర్ 2009 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కోరంగి నాగమల్లీశ్వరి గౌరవ డాక్టరేట్ అందుకున్న సందర్భంగా సోమవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో డాక్టర్ బ్రహ్మదేశం సోషల్ సర్వీస్ సొసైటీ ఆధ్వర్యాన అభినందన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదలు, బడుగు బలహీన వర్గాల ప్రజల సమస్యలను గుర్తించి వాటికి అనుగుణంగా సేవలు అందించడం అభినందనీయం అన్నారు. సత్కార గ్రహీత నాగమల్లీశ్వరి మాట్లాడుతూ గౌరవ డాక్టరేట్‌తో బాధ్యత మరింత పెరిగిందన్నారు. తాను చేస్తున్న సేవా కార్యక్రమాలకు సహకరిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్టీ సభ్యులు షఫీవుల్లా, హేమంతరావు, సొసైటీ ప్రధాన కార్యదర్శి కొండాయగుంట రాము తదితరులు పాల్గొన్నారు.

సీఎస్ఈ విద్యార్థుల ప్రతిభ



మైలవరం: ఇన్నోవేషన్ ఫెయిర్‌లో మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల సీఎస్ఈ విద్యార్థులు ప్రతిభ కనబర్చి మొదటి బహుమతి పొందినట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు సోమవారం తెలిపారు. మార్చి 27, 28 తేదీలలో జేఎన్‌టీయూ కాకినాడ యూనివర్శిటీ ఇన్నోవేషన్ ఫెయిర్ నిర్వహించిందన్నారు. తమ కళాశాలకు చెందిన సీఎస్ఈ విభాగం నుంచి ఐడియా ఎన్‌హాన్సింగ్ మొబైల్ సెక్యూరిటీ విత్ యాస్ ఆటోమేటెడ్ సిమ్ స్లాట్ ఎజెక్షన్ సిస్టమ్ అండ్ ఆథెంటికేషన్ మెకానిజమ్ అనే అంశంపై ఆఖరి సంవత్సరం విద్యార్థి యు.అర్జున్, తృతీయ సంవత్సరం విద్యార్థినులు బీ గ్రేసీ, ఎల్.మనీషా పాల్గొని మొదటి బహుమతి పొందారన్నారు. విద్యార్థులను కళాశాల ప్రెసిడెంట్ జీ శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కే అప్పారావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ ఎం. శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించొద్దు : డీసీపీ

పెనుగంచిప్రోలు: గ్రామాల్లో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించేవారిపై కఠినచర్యలు తీసుకుంటామని విజయవాడ రూరల్ డీసీపీ కె. శ్రీనివాసరావు హెచ్చరించారు. గ్రామంలో గత రెండు మూడురోజులుగా జరుగుతున్న ఘర్షణ, ఉద్రిక్తత వాతావరణానికి సంబంధించి ఆదివారం రాత్రి స్థానిక బీసీ కాలనీలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల కోడ్ అమలులో ఉందని, ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. ఎవరో ఒకరిద్దరి చర్యల కారణంగా అందరికీ ఇబ్బందులు వస్తాయన్నారు. అందరూ సంయమనంతో ఉండి ప్రశాంత వాతావరణానికి కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నందిగామ ఏసీపీ రవికిరణ్, సీఐలు జానకిరామ్, పి.చంద్రశేఖర్, ఎస్ఐ పి రాంబాబు పాల్గొన్నారు. ప్రత్యేక బలగాలతో పాటు పికెట్ నిర్వహిస్తున్నారు.

సంస్కృత సంభాషణ శిబిరం ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థాన వేద పాఠశాల విద్యార్థులకు సోమవారం నుంచి సంస్కృతి సంభాషణ శిబిరం ప్రారంభించారు. పోరంకిలో వేద పాఠశాలలో సంస్కృత భారతి ఈ శిబిరాన్ని నిర్వహిస్తోంది. దుర్గగుడి ఈవో కె.ఎస్.రామరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని సంస్కృత భారతి ట్రస్ట్ కార్యదర్శి, సంచాలకులు డాక్టర్ యూవీ రమణమూర్తి, సంస్కృత భారతి ఆంధ్ర బాల కేంద్ర ప్రముఖ్ అరుణశ్రీలు ప్రారంభించారు. పది రోజుల పాటు విద్యార్థులకు సంస్కృత భాషపై ప్రాముఖ్యం, ఆవశ్యకత, అమ్మవారి సుప్రభాతం గురించి తెలియజేస్తారని రమణమూర్తి పేర్కొన్నారు. ఈ సందర్భంగా వేద విద్యార్థులకు సంస్కృత పుస్తకాలు, అమ్మవారి సుప్రభాతం పుస్తకాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో వేద పాఠశాల ప్రధానోపాధ్యాయులు షణ్ముఖశాస్త్రి, ఈఈ ఎల్.రమాదేవి, డీఈ రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

బాటసారులకు మజ్జిగ పంపిణీ

రామవరప్పాడు: రామవరప్పాడులోని శ్రీ వెంకమ్మ పేరంటాలమ్మ ఆలయం వద్ద ఉచిత మజ్జిగ పంపిణీ కేంద్రాన్ని కొనసాగిస్తున్నారు. పోతిన వీర నారాయణ జ్ఞాపకార్థం సోమవారం బాటసారులకు మజ్జిగ పంపిణీ చేశారు.

వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయం



స్థానికులతో మాట్లాడుతున్న దేవినేని సుధీర

గుణదల (విజయవాడ తూర్పు): సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ఆ పార్టీ తూర్పు ఇన్‌చార్జి దేవినేని అవినాష్ సతీమణి సుధీర అన్నారు. 4, 8 డివిజన్లలో సోమవారం గడప గడపకు మన అవినాష్ అన్న హామీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజా సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలు ఆమోదయోగ్యంగా ఉన్నాయని తెలిపారు. సంక్షేమ పథకాలే వైఎస్సార్ సీపీని గెలిపిస్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఐదేళ్లలో 'తూర్పు'లోని అన్ని డివిజన్లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి జరిగిందని తెలిపారు. నియోజకవర్గంలో అవినాష్ విజయం సాధిస్తారని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం కరపత్రాలు అందిస్తూ స్థానికులను కలుసుకున్నారు. 13వ డివిజన్‌లో అవినాష్ సోదరి క్రాంతి పర్యటించారు. ఇంటింటికీ తిరిగి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో నాలుగో డివిజన్ అధ్యక్షుడు గల్లా రవికుమార్, ఎనిమిదవ డివిజన్ ఇన్‌చార్జి యలమంచిలి జయప్రకాష్, 13వ డివిజన్ ఇన్‌చార్జి రామాయణపు శ్రీనివాస్, కోఆప్షన్ సభ్యులు ముసునూరి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి చేతివృత్తుల్లో ఉచిత శిక్షణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ నారాయణరావు

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): కేబీఎస్ కళాశాల ఉమెన్ స్టడీ సెంటర్ ఆధ్వర్యంలో ఈ నెల మూడో తేదీ నుంచి మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి.నారాయణరావు అన్నారు. ఈ సందర్భంగా ఆ కళాశాల కార్యాలయ ప్రాంగణంలో శిక్షణ తరగతుల పోస్టర్‌ను డాక్టర్ వి.నారాయణరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 19 ఏళ్ల నుంచి మహిళలకు వివిధ చేతి వృత్తుల్లో శిక్షణనిస్తూ వారిని తీర్చిదిద్దుతున్నట్లు పేర్కొన్నారు. అదే క్రమంలో ఈ ఏడాది ఈ నెల మూడో తేదీ నుంచి శిక్షణ తరగతులను నిర్వహించనున్నట్లు తెలిపారు. కంప్యూటర్ అప్లికేషన్స్, గ్రాఫిక్ డిజైనింగ్, మగ్గం వర్క్, బ్యూటీషియన్, ఫ్యాషన్ స్టైలింగ్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, గ్లాస్, సాండ్, పాట్ పెయింటింగ్, ఇంటీరియర్ డిజైనింగ్, జ్యూవెలరీ మేకింగ్, మెహంది డిజైన్స్, డైయింగ్ అండ్ ట్రైయింగ్, ఆన్‌లైన్ పర్చేజింగ్ తదితర అంశాల్లో శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. బాలబాలికలకు స్పోకెన్ ఇంగ్లిష్, స్పోకెన్ హిందీ, పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, వేదిక్ మ్యాథమెటిక్స్, కంప్యూటర్ బేసిక్స్, క్లాసికల్ సింగింగ్, మ్యాథ్స్ గేమ్స్ అండ్ లెర్నింగ్ మోడల్స్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ గేమ్స్, డ్యాన్స్ తదితర అంశాల్లో శిక్షణ తరగతులను నిర్వహిస్తామని వివరించారు. ఇప్పటికే కళాశాల కార్యాలయంలో దరఖాస్తులు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎం. వెంకటేశ్వరరావు, పీఎల్ రమేష్, డాక్టర్ కె.రామకృష్ణ, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ డాక్టర్ జి.కృష్ణవేణి, అధ్యాపకులు వి.శైలజ, కల్మబేగం తదితరులు పాల్గొన్నారు.

5 వ రోజు స్టార్ క్యాంపెయినర్‌లతో సీఎం జగన్

‘మేమంతా సిద్ధం యాత్ర 5వ రోజు నా స్టార్ క్యాంపెయినర్‌లతో..’ అంటూ సీఎం వైఎస్ జగన్ సోమవారం ‘ఎక్స్’లో కొన్ని ఫొటోలు పోస్ట్ చేశారు. అనారోగ్యంతో ఉన్న ఓ వృద్ధురాలు సీఎం వైఎస్ జగన్‌కు తన చేతిని అందించారు. సీఎం జగన్ ఆమెను ఆప్యాయంగా దగ్గరికి తీసుకుని చెప్పింది విని ఓదార్చారు. అలాగే ఓ మహిళా రైతు తాను పండించిన వేరుశనగ పంటను సీఎం వైఎస్ జగన్‌కు అందివ్వగా.. ఆయన ఆప్యాయంగా తన చేతితో అందుకుని ఆమెతో ముచ్చటించారు.

- సాక్షి, అమరావతి













తనకల్లు-కునకంటి క్రాస్: రాత్రివేళ సీఎం జగన్ కోసం వేచి ఉన్న జనం



రామాపురం: సీఎం వైఎస్ జగన్‌తో అక్కచెల్లెమ్మల కరచాలనం



బత్తలపల్లి: మేమంతా సిద్ధం బస్సుయాత్రకు హాజరైన అశేష జనవాహినికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి



కదిరి: మేమంతా సిద్ధం బస్సుయాత్రకు హాజరైన అశేష జనసందోహంలో ఒక భాగం



పట్నం: సీఎం జగన్‌తో ఆత్మీయంగా మాట్లాడుతున్న వృద్ధురాలు, మహిళలు



పట్నం: సీఎం జగన్‌ని చూసిన ఆనందంలో..

మేమంతా మీ వెంటే..

ముదిగుబ్బ నుంచి కదిరికి వెళ్లే మార్గం మధ్యలో నడిమిపల్లి వద్ద బస్సు దిగిన సీఎం.. ఓ వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడారు. ‘మీకు వలంటీర్ల ద్వారా పెన్షన్ ఇంటి దగ్గర ఇవ్వకుండా చంద్రబాబు అడ్డుకున్నాడు. ఈసీకి ఫిర్యాదు చేసి ఇంటి దగ్గరకు పెన్షన్ పంపిణీ నిలిపి వేయించాడు’ అని చెప్పారు. ఈ క్రమంలో వృద్ధురాలు మాట్లాడుతూ.. ‘చంద్రబాబుతో మాకు పనిలేదు. ఎన్నాళ్లు ఆపుతాడు? మాకు నువ్వే కావాలి. నువ్వుంటే మాకు ఏ కష్టం ఉండదు’ అంటూ ఆమె భావోద్వేగానికి గురైంది.

సీఎం వైఎస్ జగన్ బస్సు యాత్రలో జనగర్జన

(మేమంతా సిద్ధం బస్సు యాత్ర నుంచి సాక్షి ప్రత్యేక ప్రతినిధి)

‘మేమంతా సిద్ధం’ బస్సు యాత్రలో ప్రజాభిమానం పోటెత్తింది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన బస్సు యాత్ర ఐదో రోజు సోమవారం విజయవంతంగా కొనసాగింది. కిలోమీటర్ల కొద్దీ జనం రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. మండు టెండను కూడా లెక్క చేయకుండా బస్సు వెనుక యువత పరుగులు తీయడం గ్రామ గ్రామాన కనిపించింది. శ్రీసత్య సాయి జిల్లా బత్తలపల్లి మండలం సంజీవపురంలోని బస కేంద్రం నుంచి ఉదయం 10.30 గంటలకు బస్సు యాత్ర మొదలైంది. అయితే ఉదయం 6 గంటల నుంచే బస కేంద్రం వద్దకు జనం భారీగా తరలివచ్చారు. అనంతపురం -చెన్నై జాతీయ రహదారిపైకి పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, సాధారణ ప్రజలు చేరుకోవడంతో పండుగ వాతావరణం తలపించింది. రోడ్‌షో బత్తలపల్లి మండల కేంద్రానికి చేరుకునేలోపే రోడ్డుపై ఇసుకేస్తే రాలనంత మంది సీఎం జగన్‌కు ఘన స్వాగతం పలికారు. బత్తలపల్లి జంక్షన్, ప్రభుత్వ పాఠశాల ఎదురుగా భారీ గజమాలలతో ప్రజలు సీఎంను సత్కరించారు. అంజినమ్మ అనే మహిళ తన పొలంలో పండిన వేరుశనగ పంటను సీఎంకు అందించింది. ఈ క్రమంలో ఇన్‌పుట్ సబ్సిడీ, రైతు భరోసా ఇతర పథకాలు అందాయా.. అని ఆమె కుటుంబ యోగ క్షేమాలను సీఎం జగన్ అడిగి తెలుసుకున్నారు. అప్పస్వామి అనే వ్యక్తి సీఎం జగన్‌కు గొంగడి (కంబడి), గొర్రె పిల్లను బహూకరించారు. జన సముద్రాన్ని తలపించిన బత్తలపల్లి జంక్షన్‌లో సీఎం కాన్వాయ్ ఎంతో కష్టంతో ముందుకు వెళ్లాల్సి వచ్చింది. 11.20 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు సీఎం రోడ్‌షో ఆ ఊరిలోనే కొనసాగిందంటే ఎంతగా అభిమాన జనం అడ్డుపడ్డారో అర్థం చేసుకోవచ్చు. పెత్తం దారులతో పోరుకు మీ వెంటే అంటూ జనం నినాదాలు చేశారు. మేమంతా సిద్ధం అంటూ గర్జించారు. కాన్వాయ్‌తో సమాంతరంగా పరుగులు పెట్టారు.

మురిసిన ముదిగుబ్బ

బత్తలపల్లి నుంచి ముదిగుబ్బ మధ్య రామాపురం, కట్టకింద పల్లి, రాళ్ల అనంతపురం సహా పలు గ్రామాల ప్రజలు జాతీయ రహదారిపైకి చేరుకుని సీఎంకు ఘన స్వాగతం పలికారు. రామాపురంలో బస్సు దిగి సీఎం జగన్ ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ముదిగుబ్బకు చేరుకునేలోపే ప్రజలు పెద్ద ఎత్తున రోడ్డుపై బారులు తీరారు. అమ్మ ఒడి, ఆరోగ్యశ్రీ, రైతు భరోసా, జగనన్న చేదోడు తదితర పథకాలను ప్రవేశపెట్టి ఆర్థికంగా తాము నిలదొక్కుకోవడానికి, గౌరవ ప్రదమైన జీవనం కొనసాగించడానికి దోహదపడ్డ నాయకుడిని ఒక్కసారైనా చూడాలనే పట్టుదలతో ఆ ప్రాంత ప్రజలు పోటీపడ్డారు. మధ్యాహ్నం 2.50 గంటలకు ముదిగుబ్బ చేరుకున్న సీఎంకు గజమాలతో స్వాగతం చెప్పారు. పెద్ద ఎత్తున కదలివచ్చిన జనానికి బస్సుపై నుంచి సీఎం అభివాదం చేస్తూ ముందుకు కదిలారు. 3.27 గంటల వరకు సుమారు 37 నిమిషాలు సీఎం జగన్ ముదిగుబ్బ జనంతో మమేకమయ్యారు. అక్కడి నుంచి కదిరికి బయలుదేరిన సీఎం జగన్‌ను గ్రామగ్రామాన ప్రజాభిమానం అడ్డుకుంది. నాగారెడ్డిపల్లి గ్రామస్తులు భారీ గజమాలతో సీఎంకు స్వాగతం పలికారు.

కదం తొక్కిన కదిరి

కదిరి పట్టణంలోకి వస్తున్న సీఎం జగన్‌కు ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. సీఎం రాక నేపథ్యంలో నేల ఈనిందా అన్నట్టు జనంతో కదిరి రోడ్లు కిటకిటలాడాయి. జగన్ ప్రభుత్వానికి మద్దతు తెలుపుతూ ప్రజలు కదం తొక్కారు. సీఎం వస్తున్నారని ఉదయం నుంచే కదిరి పట్టణంలో పెద్ద ఎత్తున కోలాహలం నెలకొంది. ప్రజాభిమానం అడ్డు పడటం వల్ల నిర్దేశించిన షెడ్యూల్ కంటే మూడు గంటలు పైనే ఆలస్యం అయినప్పటికీ, తమ అభిమాన నేతను చూడాలన్న ఆశతో ప్రజలు ఓపికతో వేచి చూశారు. సాయంత్రం 5:45 గంటలకు కదిరిలోకి ప్రవేశించిన సీఎం జగన్ ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు. తమ సెల్‌ఫోన్‌లలోని టార్చ్‌లైట్‌లను ఆన్ చేసి ప్రజలు సీఎం జగన్ యాత్రకు సంఘీభావం తెలిపారు. ఇలా రాత్రి 7.55 గంటల వరకు సీఎం జగన్ రోడ్‌షో రెండు గంటల పాటు కదిరిలోనే కొనసాగింది. అనంతరం బస్సుపై నుంచి రోడ్‌షో నిర్వహించిన సీఎం జగన్.. పీవీఆర్ కళ్యాణ మండపంలో ముస్లిం సోదరులతో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో పాల్గొన్నారు. ‘సాధారణంగా ఎన్నికల సమయంలో మీకు ఫలానా మేలు చేస్తాం.. మాకు ఓటు వేయండి’ అని ప్రజలకు నాయకులు హామీ ఇవ్వడాన్ని చూస్తుంటాం. అయితే బస్సు యాత్రలో సీఎం జగన్‌ను కలిసిన పలువురు ‘మీ పాలనలో ఏదో ఒక రూపంలో మా ఇంటికి మేలు జరిగింది. వచ్చే ఎన్నికల్లో తిరిగి మిమ్మల్నే గెలిపించుకుంటాం’ అని హామీ ఇస్తున్నారు. అటువైపు బీజేపీ, టీడీపీ, జనసేన, ఇలా ఎన్ని పార్టీలు, ఎంత మంది వ్యక్తులు కలిసి వచ్చినా మీ వెంట మేమంతా ఉన్నామంటూ ప్రజలు సీఎంకు భరోసానిచ్చారు. కదిరి నుంచి నల్లచెరువు, తనకల్లు మండల కేంద్రాల మీదుగా రాత్రి 10 గంటలకు చీకటివానిపల్లె విడిది కేంద్రానికి సీఎం జగన్ చేరుకున్నారు. షెడ్యూల్ కంటే నాలుగు గంటలు ఆలస్యమైనా ప్రజలు, మహిళలు దారి పొడవునా వేచి చూశారు.

ఇదే మా హామీ

వితంతు మహిళనైన నాకు ఈ ప్రభుత్వంలో ఇంటి స్థలం ఇచ్చారు. ఇంటి నిర్మాణానికి అండగా నిలిచారు. వితంతు పెన్షన్‌ను నెలనెలా ఒకటో తేదీనే ఇంటికి పంపారు. ఇంత మేలు చేసిన ఆయన్ను గెలిపించుకోకుంటే ఇంకెవరిని గెలిపించుకుంటాం? ఇది జగనన్నకు మా హామీ.

– వెంకటలక్ష్మి, బత్తలపల్లి

మళ్లీ జగన్‌ను గెలిపించుకుంటాం

నాకు 60 ఏళ్లు పైనే ఉన్నాయి. కర్రసాయం లేనిదే నడవలేని పరిస్థితి. నా కొడుకు చనిపోయాడు. ఈ క్రమంలో నెలనెలా రూ.3 వేల పెన్షన్‌ను ఇంటికి పంపి పెద్ద కొడుకులా సీఎం జగన్ నన్ను సాదు కొచ్చాడు. ఆ టీడీపీ వాళ్లు వలంటీర్‌లతో పెన్షన్ పంచకుండా అడ్డుపడ్డారట. ఏం పర్లేదు. ఒకటి రెండు నెలలే గా.. మళ్లీ నా పెద్ద కొడుకు జగన్ ఇంటి దగ్గరకే పెన్షన్ పంపుతాడు. ఆయన్ను మేం గెలిపించుకుంటాం.

– సాకలి చెన్నప్ప, కదిరి శివారు గ్రామం కుటగుళ్ల

ఏమ్మా.. తల్లీ ఎలా ఉన్నారు?

‘ఏమ్మా తల్లీ.. ఎలా ఉన్నారు? ప్రభుత్వ పథకాలు అందరికీ అందుతున్నాయా? వాటిని సద్వినియోగం చేసుకుంటున్నారా’ అంటూ మహిళా కూలీలతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముచ్చటించారు. బస్సు యాత్ర బత్తలపల్లి సమీపంలోకి వచ్చినప్పుడు సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని చూడాలన్న తపనతో పొలంలో వేరుశనగ తొలగిస్తున్న కూలీలు పరుగు పరుగున రోడ్డుపైకి చేరుకున్నారు. వారిని గమనించిన సీఎం వైఎస్ జగన్... బస్సు ఆపించి వారితో మాట్లాడారు. ‘ఆసరా డబ్బులు చేతికి అందాయా తల్లీ.. పొదుపు సంఘాలు ఎలా నడుస్తున్నాయి.. అమ్మఒడి వస్తోందా...’ అని ఆరా తీశారు. తమను అంత ఆప్యాయంగా పలకరించే సరికి సంబరపడిన కూలీలు.. ‘మన ప్రభుత్వంలో అన్నీ అందుతున్నాయి సార్..’ అని బదులిచ్చారు.



బత్తలపల్లి: ‘మేమంతా సిద్ధం’ బస్సుయాత్రకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం



బత్తలపల్లి: సీఎం వైఎస్ జగన్‌పై పూల వర్షం కురిపించి గజమాలతో అభిమానుల ఘన స్వాగతం



ముదిగుబ్బ: సీఎం వైఎస్ జగన్‌కు గజమాలతో సన్మానం చేసేందుకు వేచి ఉన్న అభిమానులు



బాధపడకమ్మా.. నేనున్నా

కుమారుడి కంటి చూపు ఆపరేషన్ కోసం సీఎంను కలిసిన ఓ తల్లి

ఆదుకుంటానని హామీ ఇచ్చిన సీఎం జగన్

వెంటనే స్పందించిన సీఎంవో


సీఎం జగన్‌తో సెల్ఫీ దిగుతున్న అనుదీప్‌కుమార్‌రెడ్డి, అతని తల్లి

బత్తలపల్లి: మేమంతా సిద్ధం బస్సు యాత్రలో భాగంగా శ్రీ సత్యసాయి జిల్లా బత్తలపల్లికి వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌ను అదే గ్రామానికి చెందిన నాగలక్ష్మి, ఆమె కుమారుడు అనుదీప్‌కుమార్‌రెడ్డి కలిశారు. చదువులో రాణిస్తున్న తన కుమారుడు అనుదీప్‌కు ఉన్నట్టుండి కంటిచూపు పోయిందని ముఖ్యమంత్రికి నాగలక్ష్మి తెలియజేసింది. ప్రస్తుతం డిగ్రీ సెకండియర్ చదువుతున్న అనుదీప్ యూట్యూబ్‌లో పాఠాలు వింటూ.. తోటి విద్యార్థి సహకారంతో పరీక్షలు రాస్తున్నాడని తెలిపింది. తన కుమారుడికి కంటి చూపు వచ్చేందుకు తగిన సాయం చేసి ఆదుకోవాలని వేడుకుంది. అర్జీ స్వీకరించిన సీఎం జగన్ స్పందిస్తూ.. బాధపడకమ్మా.. ఆదుకుంటానంటూ భరోసా ఇచ్చారు. కాగా, అర్జీ ఇచ్చిన అరగంటలోనే ముఖ్యమంత్రి కార్యాలయ అధికారుల నుంచి నాగలక్ష్మికి ఫోన్ వచ్చింది. అనుదీప్ ఆరోగ్య పరిస్థితి, కంటి ఆపరేషన్‌కు అయ్యే ఖర్చు, ఆస్పత్రి తదితర వివరాలను వారు అడిగి తెలుసుకున్నారు.


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన రిటైర్డు డీఎస్పీ వేణుగోపాల్, వడ్డెర సామాజికవర్గ నేతలు. చిత్రంలో పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

పుట్టపర్తిలో టీడీపీకి భారీ దెబ్బ

వైఎస్సార్‌సీపీలోకి మాజీ జెడ్పీటీసీ పుట్టా సోదరులు, రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్.. సాదరంగా ఆహ్వానించిన సీఎం జగన్

పుట్టపర్తి: శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి నియోజకవర్గంలో టీడీపీకి భారీ దెబ్బ తగిలింది. 2009 నుంచి ఆ పార్టీలో గట్టి పట్టున్న అమడగూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పుట్టా పురుషోత్తమరెడ్డి, ఆయన సోదరుడు మల్లికార్జునరెడ్డి, టీడీపీ ఎమ్మెల్యే టికెట్ ఆశించి భంగపడిన రిటైర్డ్ డీఎస్పీ వేణుగోపాల్‌తో పాటు పలువురు వడ్డెర సామాజికవర్గ నాయకులు వైఎస్సార్‌సీపీలో చేరారు. సోమవారం వారు పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డితో కలిసి బత్తలపల్లి మండలం సంజీవపురం వద్ద 'మేమంతా సిద్ధం' బస్సుయాత్ర శిబిరంలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని కలిసి పార్టీలో చేరుతున్నట్లు ప్రకటించారు. సీఎం జగన్ వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అమడగూరు మండలంలో పురుషోత్తమరెడ్డికి మంచి సంబంధాలున్నాయి. ఆయన చేరికతో టీడీపీ బలమైన ఓటు బ్యాంకును కోల్పోయినట్లయింది. రిటైర్డు డీఎస్పీ వేణుగోపాల్.. చంద్రబాబు మాటలు నమ్మి తన ఉద్యోగానికి రాజీనామా చేశారు. ఎమ్మెల్యే టికెట్ వస్తుందనే నమ్మకంతో నియోజకవర్గం మొత్తం కలియదిరిగారు. తనను దారుణంగా మోసగించిన చంద్రబాబుకు ఈ ఎన్నికల్లో తమ సత్తా చూపిస్తామని వేణుగోపాల్ ప్రకటించారు. కొత్తచెరువు మండలం వడ్డెర కులానికి చెందిన పెద్దన్న, వెంకటస్వామి, జనసేన నాయకుడు తిరుపతేంద్ర తదితరులు కూడా సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు.


సీఎం జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన పుట్టా పురుషోత్తమరెడ్డి

వైఎస్సార్‌సీపీలోకి హిందూపురం నేతలు

హిందూపురం: హిందూపురం టీడీపీ కీలకనేతలు సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీలో చేరిన వారిలో లేపాక్షి మండల టీడీపీ నేత, మాజీ ఎంపీపీ వి.హనోక్, చంద్రదండు వైస్ ప్రెసిడెంట్ అన్సార్ అహమ్మద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, వైఎస్సార్‌సీపీ శ్రీసత్యసాయి జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్ తదితరులు పాల్గొన్నారు.


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరుతున్న హిందూపురం టీడీపీ నేతలు హనోక్, అన్సార్ అహమ్మద్. చిత్రంలో మంత్రి పెద్దిరెడ్డి, పార్టీ జిల్లా అధ్యక్షుడు నవీన్ నిశ్చల్


ముదిగుబ్బ: 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రకు హాజరైన అశేష ప్రజానీకానికి అభివాదం చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


బత్తలపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై పూలవర్షం కురిపిస్తున్న కార్యకర్తలు, నాయకులు


బత్తలపల్లి: అభిమానులు బహూకరించిన గొర్రెపిల్లతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి


కదిరి: సీఎం వైఎస్ జగన్ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్ వెలిగించగా.. తమ సెల్‌ఫోన్ టార్చ్‌లైట్లను వెలిగించి మద్దతు తెలుపుతున్న అభిమానులు, ప్రజలు

> శ్రీ సత్యసాయి జిల్లా
> **సిద్ధమా..?**
> 'మేమంతా సిద్ధం యాత్రకు.. శ్రీ సత్యసాయి జిల్లా సిద్ధమా..?' అంటూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ట్వీట్ చేశారు.

అడ్వాన్స్‌డ్ ఈద్ ముబారక్

- ఇఫ్తార్ విందులో సీఎం వైఎస్ జగన్

సాక్షి, పుట్టపర్తి/కదిరి అర్బన్/బత్తలపల్లి: అందరికీ మేలు జరగాలని, ముస్లిం సోదరులందరికీ ముందస్తుగా రంజాన్ పండుగ శుభాకాంక్షలు (అడ్వాన్స్‌డ్ ఈద్ ముబారక్) తెలిపారు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. సోమవారం సాయంత్రం శ్రీసత్యసాయి జిల్లా కదిరి పట్టణంలోని పీవీఆర్ ఫంక్షన్ హాలులో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరయ్యారు. ముస్లిం సోదరులతో ఆప్యాయంగా మాట్లాడారు. విందులో డిప్యూటీ సీఎం అంజాద్ బాషా, మంత్రి ఉషశ్రీచరణ్, ఎమ్మెల్సీలు కల్పలతారెడ్డి, జకియా ఖానమ్, పుట్టపర్తి ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, మాజీ మంత్రి షాకీర్, మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా, కదిరి వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బీఎస్ మక్బూల్, సీనియర్ నేతలు వజ్రభాస్కర్‌రెడ్డి, పూల శ్రీనివాసరెడ్డి, పెద్దసంఖ్యలో ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

మెహతాజ్‌కు మెరుగైన వైద్యం

కదిరి మండలం కాళసముద్రం గ్రామానికి చెందిన 28 ఏళ్ల యువతి మెహతాజ్‌కు మెరుగైన వైద్య సాయం అందిస్తామని సీఎం జగన్ మోహన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. కాళసముద్రంకు చెందిన బాబాఫక్రోద్దీన్, షరీఫాబీ దంపతులకు మౌలాలి, మెహతాజ్ అనే ఇద్దరు సంతానం. బాబాఫక్రోద్దీన్ చాలా ఏళ్ల క్రితమే చనిపోయాడు. పిల్లల పోషణ నిమిత్తం పదేళ్ల క్రితం షరీఫాబీ సౌదీకి వెళ్లింది. అక్కడ అనారోగ్యంతో ఆమె కూడా చనిపోయింది. కాగా.. మెహతాజ్‌కు పుట్టుకతోనే అవయవాలు చచ్చుబడిపోయాయి. వీల్ చైర్‌కే పరిమితమైంది. ప్రభుత్వం ఇచ్చే పింఛన్ డబ్బే ఆధారం. ఎలాగైనా సరే ముఖ్యమంత్రి దృష్టికి తన సమస్య తీసుకెళ్తే పరిష్కారం అవుతుందని భావించి సోమవారం తెలిసిన వారి సాయంతో బస్సు యాత్ర ప్రాంతానికి చేరుకుంది. రోడ్డు పక్కన దీనంగా ఉన్న ఈ యువతిని బస్సులో నుంచి చూసిన సీఎం జగన్.. కిందకు దిగి ఆమెతో మాట్లాడేందుకు ప్రయత్నించారు. మెహతాజ్ సరిగా మాట్లాడలేదంటూ పక్కనే ఉన్న ఇస్మాయిల్ అనే కార్యకర్త చెప్పగా.. అతన్ని అడిగి ఆమె సమస్యను తెలుసుకున్నారు. వెంటనే వైద్యసాయం అందేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.


మెహతాజ్


కదిరి: మేమంతా సిద్ధం రోడ్‌షోకు అద్భుత స్వాగతం పలికి, గజమాలతో సన్మానం చేస్తున్న నేతలు, కార్యకర్తలకు సీఎం జగన్ అభివాదం

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నేత అత్తార్ చాంద్‌బాషా

- కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన సీఎం జగన్
- ముఖ్యమంత్రి జగన్ ముస్లింల పక్షపాతి: చాంద్‌బాషా
- ముస్లింలమంతా జగనన్నకు అండగా ఉందాం


సీఎం వైఎస్ జగన్ సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన అత్తార్ చాంద్‌బాషా

కదిరి: తెలుగుదేశం పార్టీ కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. 'మేమంతా సిద్ధం' బస్సు యాత్రలో భాగంగా సోమవారం వైఎస్సార్‌సీపీ అధినేత, సీఎం వైఎస్ జగన్ శ్రీ సత్యసాయి జిల్లా కదిరికి విచ్చేశారు. ఈ సందర్భంగా వేలాది మంది ప్రజల మధ్య సీఎం వైఎస్ జగన్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు.

జీవితాంతం జగనన్న వెంటే ఉంటా: చాంద్‌బాషా

జగనన్నకు ఇన్నేళ్లు దూరంగా ఉండి చాలా తప్పు చేశానని చాంద్‌బాషా చెప్పారు. ఇలాంటి తప్పు ఇంకెన్నడూ చేయనని, జీవితాంతం జగనన్న వెంటే ఉంటానని అల్లా సాక్షిగా చెబుతున్నానని అన్నారు. 2014లో వైఎస్సార్‌సీపీ తరఫున కదిరి ఎమ్మెల్యేగా గెలిచిన తాను చంద్రబాబు మోసపూరిత మాటలు నమ్మి టీడీపీలో చేరి తప్పుచేశానన్నారు. అయినా జగనన్న పెద్ద మనసుతో తిరిగి వైఎస్సార్‌సీపీలో చేర్చుకున్నారని చెప్పారు. నాకు మంత్రి పదవి ఇస్తానని చెప్పి చంద్రబాబు మోసగించారని, ఆఖరుకు ఎమ్మెల్యే టికెట్ కూడా ఇవ్వలేదని అన్నారు. నమ్మకద్రోహం చేయడంలో చంద్రబాబుకు చంద్రబాబే సాటి అని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముస్లిం మైనార్టీలకు ఎంతో మంచి చేశారని తెలిపారు. చంద్రబాబు ఈ ఎన్నికల్లో ముస్లింలకు కేవలం మూడు ఎమ్మెల్యే సీట్లు ఇస్తే.. జగనన్న ఏడు అసెంబ్లీ సీట్లు ఇచ్చి మైనార్టీల పక్షపాతి అని నిరూపించుకొన్నారని కొనియాడారు. వైఎస్ రాజశేఖరరెడ్డి ముస్లింలకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్‌ను ఎత్తేసేందుకు ప్రయత్నిస్తున్న బీజేపీతో చంద్రబాబు జతకట్టారని, సైకిల్‌కు ఓటేస్తే రిజర్వేషన్ ఎత్తేసేందుకు మనం కూడా సహకరించిన వారవుతామని తెలిపారు. అందువల్ల ప్రతి ముస్లిం ఈసారి ఫ్యాన్ గుర్తుకు ఓటేసి జగనన్నకు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.


ములకలచెరువు: సీఎం జగన్‌తో చిన్నారి సెల్ఫీ


పట్నం: వృద్ధురాలితో ఆత్మీయంగా..


రామాపురం: మహిళల సమస్యలు వింటూ..


తంబాపురం: జగనన్నను కలిసిన ఆనందంలో..


రామాపురం: బాలికతో సీఎం జగన్ ముచ్చట్లు

బోసి నవ్వులకు భరోసా ఏదీ?

తెల్లారింది...పింఛన్ మాత్రం లేదు

- ఏప్రిల్ 1న వలంటీర్ల కోసం ఎదురు తెన్నులు
- పింఛన్లు సచివాలయాల్లోనే అంటూ ప్రకటనతో దిగాలు
- చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్న వృద్ధులు
- గంటలకొద్ది క్యూలైన్లలో ఉన్న జ్ఞాపకాలతో ఆందోళనలో పెన్షనర్లు
- తీవ్ర నైరాశ్యంలో వృద్ధులు, దివ్యాంగులు
- చంద్రబాబు కుటిలత్వంపై సర్వత్రా విమర్శలు
- ఎప్పుడు అందజేస్తారో తెలియని దుస్థితి

వేకువజామునే వచ్చి 'అవ్వా.. తాత.. ఇదిగో మీ పింఛన్ సొమ్ము తెచ్చాను. తీసుకోండి' అంటూ అప్యాయంగా పలకరించే వలంటీర్ సేవలను నిర్ధాక్షిణ్యంగా చంద్రబాబు రాక్షసానందం కోసం నిలిపివేయడంతో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నెలకొన్నాయి. వృద్ధులు, వికలాంగులు, వితంతువులు ఆశగా ఎదురు చూసే వలంటీర్లను ఆ సేవల నుంచి తొలగించారనే నిజాన్ని నమ్మలేక దిగాలు పడిపోయారు. వలంటీర్లను తొలగించాలంటూ చంద్రబాబు కుట్రతో ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో వారిని ఆ విధుల నుంచి తప్పించారు. దీంతో ప్రతి నెల మాదిరిగానే ఈ నెల సూర్యుడు పొడవకుండానే వస్తారని వేచి చూసి.. చూసి బారెడు పొద్దెక్కినా రాకపోవడంతో చంద్రబాబు కుటిలత్వం వల్ల పింఛన్ అందలేదని తెలుసుకుని గుండెలు అవిసేలా రోదించారు. ప్రతి నెలా ఒకటో తేదీన బోసి నవ్వులతో ఎదురు చూసే ఆ వృద్ధులు మళ్లీ క్యూ లైన్లలో నిలబడాలా ? అనే చేదు నిజాన్ని జీర్ణించుకోలేకపోతున్నారు. ఒకపక్క ఎండలు మండిపోతున్న తరుణంలో గంటలపాటు సచివాలయాల అరుగులమీద అధికారుల కోసం ఎదురుచూసిన జ్ఞాపకాలను చూసి ఆందోళన చెందుతున్నారు.

సాక్షి, నెట్‌వర్క్

నేను సచివాలయానికి ఎలా వెళ్లేది?



గత రెండేళ్లుగా పక్షవాతంతో కాళ్లు పూర్తిగా చచ్చుబడ్డాయి. లేవలేని దుస్థితి. 24 గంటలు మంచంపైనే ఉండాల్సి వస్తుంది. ప్రతి నెలా ఇంటి వద్దకే వచ్చి వలంటీర్ పింఛన్ ఇచ్చివెళ్లేది. ప్రస్తుతం వలంటీర్లకు పింఛన్ పంపిణీ నిలిపివేయడం చాలా దారుణం. నేను ఏవిధంగా సచివాలయానికి వెళ్లాలి. ఎలా పింఛన్ తీసుకోవాలని, వరుసలో ఎలా నిలబడాలి. గుర్తొస్తేనే భయమేస్తోంది.

– సువార్తమ్మ, క్రిష్టిపాడు గ్రామం, దొర్నిపాడు మండలం, నంద్యాల జిల్లా

ఆ తిప్పలు మాకొద్దు



నాకు 77 ఏళ్లు. ఎవరూ లేరు. చెల్లెలు కొడుకే అన్నం పెడుతున్నాడు. నడవలేని దుస్థితిలో పింఛన్ డబ్బులే ఆసరా. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు పింఛన్ కోసం మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న రాంపురం నడిచి వెళ్లేవాళ్లం. ఇప్పుడు ప్రతి నెల వలంటీర్ ఇంటికొచ్చి పింఛన్ ఇస్తున్నారు. ఈ నెల పింఛన్ డబ్బులు కోసం ఎదురు చూశా. కానీ సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటున్నారు. జీ.ఎర్రగుడి సచివాలయం వెళ్లాలంటే 14 కిలోమీటర్లు. నడవలేని స్థితిలో ఉన్న నేను అంతదూరం వెళ్లి పింఛన్ ఎలా తెచ్చుకోవాలో తెలియడం లేదు. మాలాంటి వాళ్లను ఇబ్బంది పెడితే ఏమొస్తుంది.

– సయ్యద్ గూడమ్మ, తుగ్గలి మండలం, ఆర్.కొట్టాల గ్రామం, కర్నూలు జిల్లా

ఇలాగైతే ఎలా..?



ఈ చిత్రంలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు పాటుకూరి గంగమ్మ. వయస్సు 85 సంవత్సరాలు. అల్లూరి జిల్లా కొయ్యూరు మండలం రాజేంద్రపాలెం పంచాయతీలోని సురేంద్రం. సొంతంగా ఏ పని చేసుకోలేదు. కనీసం లేచి నిలబడలేదు. ప్రతి నెల వలంటీర్ వచ్చి ఈమెకు పింఛన్ నగదు అందచేసేవారు. వలంటీర్ల ద్వారా పింఛన్లు పంపిణీ చేయించకూడదని టీడీపీ అధినేత చంద్రబాబు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయించడంతో ఈ నెల సకాలంలో పింఛన్ అందలేదు. ఈమె పింఛన్ తీసుకోదానికి సచివాలయానికి వెళ్లాలంటే నాలుగు ఫర్లాంగులు దూరం ప్రయాణించాలి. అడుగు తీసి అడుగు వేయలేని దుస్థితిలో ఉంది. ఇద్దరు పట్టుకుని ఆటోలో తీసుకువెళ్లాలి. ప్రస్తుతం సచివాలయానికి వెళ్లి తీసుకోవాలని చెప్పడంతో ఎలా వెళ్లాలి అని ఆందోళన చెందుతోంది.

–పొటుకూరి గంగమ్మ, సురేంద్రం గ్రామం, అల్లూరి సీతారామరాజు జిల్లా

అయ్యో అననివారు లేరు



ఈ ఫొటోలో కనిపిస్తున్న వ్యక్తి పేరు నాళం శివకృష్ణ. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెంగళరావు నగర్‌కు చెందిన ఈయన పుట్టుకతో అంధుడు. పోలియో బారిన పడిన దివ్యాంగురాలు రాజేశ్వరిని వివాహం చేసుకున్నాడు. వారికి ఇద్దరు సంతానం. ఆరేళ్ల క్రితం శివకృష్ణకు రోడ్డు ప్రమాదంలో నడుము దెబ్బతిని స్పర్శ లేకుండా పోయింది. అప్పటి నుంచి మంచానికే పరిమితం అయ్యాడు. దివ్యాంగ (అంధుడు) పెన్షన్ పొందుతున్నాడు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమా అని స్టాండ్ సహకారంతో నడుస్తున్న భార్య రాజేశ్వరికి కూడా పెన్షన్ మంజూరైంది. వచ్చే పింఛన్, అమ్మ ఒడి పథకంతో ఇద్దరు పిల్లల్ని చదివించుకుంటూ జీవితం గడుపుతున్నారు. మంచానికే పరిమితమైన భర్త, స్టాండ్ సహాయంతో నడుస్తున్న భార్య ఇద్దరూ పింఛన్ కోసం కనీసం సచివాలయానికి కూడా వెళ్లలేని పరిస్థితి. ఇంటి నుంచి బయటకు వెళ్లలేని వారికి వలంటీర్ల సహకారంతో ప్రతినెలా 1వ తేదీన ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారు. టీడీపీ నీచ రాజకీయాలకు ఈ కుటుంబం ఇప్పుడు దిక్కుతోచనిస్థితిలో పడిపోయింది.

– అంధుడు శివకృష్ణతో భార్య రాజేశ్వరి వెంగళరావునగర్, గుంటూరు జిల్లా

డయాలసిస్ ఎలా చేయించుకోవాలి ?



68 ఏళ్లు పైబడిన నేను చాలాకాలంగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నా. వారంలో ఒకసారి డయాలసిస్, మరో రోజు వైద్యం చేయించుకుంటున్నా. షుగరు, బీపీ, గుండెకు సంబంధించిన సమస్యలున్నాయి. ప్రతి నెలా వలంటీర్ వచ్చి 1వ తేదీన తెల్లవారకముందు రూ.10 వేలు పింఛన్ అందించేవాడు. వాటిని వైద్యం కోసం ఉపయోగిస్తాను. కానీ వలంటీర్లు పింఛన్ ఇవ్వడానికి వీల్లేదంటూ చంద్రబాబు చేసిన ఇబ్బందికి ఈ నెల పింఛన్ అందలేదు. సచివాలయానికి వెళ్లి క్యూలో నిలబడలేని పరిస్థితి. మా లాంటి రోగులను, వృద్ధులు, దివ్యాంగులను ఇబ్బందులు పెట్టి చంద్రబాబు ఏం సాధిస్తాడు.

– మాతంగి వెంకాయమ్మ, దయాలసిస్ రోగి, హరిశ్చంద్రపురం, తుళ్లూరు మండలం, గుంటూరు జిల్లా

సచివాలయాల్లో పడిగాపులు తప్పవా..?



నాలుగు సంవత్సరాలుగా వలంటీర్ ప్రతి నెల 1వ తేదీన ఇంటికే వచ్చి పింఛన్ అందించేవాడు. నా లాంటి వృద్ధులకు ఎంతో మేలు జరిగేది. ఇప్పుడు సచివాలయాలకు వెళ్లి పింఛన్ తీసుకోవాలంటున్నారు. ఒకపక్క ఎండలు మండిపోతున్నాయి. అక్కడికి వెళ్లి పడిగాపులు కాసి తెచ్చుకొనేందుకు ఇబ్బందిగా ఉంటుంది. పింఛన్ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్నాను, వలంటీర్‌ల ద్వారా పింఛన్ పంపిణీ నిలిపివేయాలనడం చాలా దారుణం. అధికారులు ఎప్పుడు వస్తారో ఎప్పుడు ఇస్తారో తెలియదు. వృద్ధుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని వలంటీర్‌ల ద్వారా పింఛన్ పంపిణీ కొనసాగించాలి.

– సయ్యద్ పెద్దబీబి, ఉరుటూరు, వీరపునాయునిపల్లె మండలం, కడప జిల్లా

అన్నీ తానై చూసేది



ఒకటోతేదీ వస్తే వలంటీర్ మా వీధిలోకి వచ్చి ఇంటింటికి వెళ్లి పింఛన్ ఇచ్చేది. గతంలో పెన్షన్ తీసుకునేందుకు కార్యాలయాల చుట్టూ తిరిగి బాధలు పడేదాన్ని. వలంటీర్ వ్యవస్థ వచ్చిన తరువాత పెన్షన్‌తో పాటు అన్నీ తానై చూసేది. గతంలో భారీ వర్షాలు రావడంతో మా ప్రాంతం వరద ముంపునకు గురైంది. ఇళ్లలోకి నీళ్లు చేరవడంతో ముందుగానే వలంటీరు వచ్చి జాగ్రత్తలు తీసుకుని మాకు పునరావాసం కల్పించి సహాయం చేసింది. అలాంటి వారిని పెన్షన్‌ల పంపిణీ బాధ్యత నుంచి తప్పించడం బాధాకరం.

– గులాబ్‌జాన్, బాపక కాలువ, మదనపల్లె.చిత్తూరు జిల్లా.

ఇక మాకు పస్తులే



కాళ్లు చేతులు సన్నగిల్లి ఒంట్లో సత్తువ లేక మంచం పట్టాను. ఐదేళ్లుగా ఇంటికే పొద్దున్నే వలంటీర్ వచ్చి పెన్షన్ అందించేవారు. మా లాంటి వృద్ధులకు వరంలా ఉండేది. ఇప్పుడు మానవత్వం లేని రాజకీయ స్వార్థంతో మేమంతా సచివాలయం వద్ద పెన్షన్ తీసుకోవాలని చెబుతు న్నారు. వలంటీర్ తెచ్చి పింఛన్ ఇవ్వకుంటే పస్తులతో చావు తప్పదు. ఆర్.కరాపాడులో సచివాల యం వద్దకు వెళ్లేందుకు శరీరం సహకరించదు. మా లాంటి పేదలపై ఇటువంటి కక్షసాధింపు మంచిది కాదు

–హత్తి త్రినాథ్, కన్నుపుట్టుగ, కవిటి మండలం, శ్రీకాకుళం జిల్లా

ఈ పాపం ఊరికే పోదు



నా వయసు 85 సంవత్సరాలు. అనారోగ్యంతో మంచంలో నుంచి లేవాలంటే ఇద్దరు మనుషులు పట్టుకుని లేపాలి. ప్రతి నెలా వలంటీరు ఇంటికి వచ్చి వృద్ధాప్య పింఛన్ ఇచ్చేవాడు. ఈ నెల ఇంకా అందలేదు. సచివాలయానికి వెళ్లి తెచ్చుకోవాలంటే నా వల్ల కాదు. వలంటీర్ నేను ఉండే మంచం దగ్గరికే వచ్చి పింఛను ఇచ్చే వాడు. ఇప్పుడు అక్కడికి తీసుకెళ్లేవారు లేరు. ఈ పాపం ఊరికే పోదు

– షేక్ బదేబీ,కురిచేడు, ప్రకాశం జిల్లా

నడవలేని నేను సచివాలయానికి ఎలా వెళ్లాలి?



ఉదయం నుంచి వలంటీరు వచ్చి పింఛన్ ఇస్తారేమో అని ఎదురు చూశాను. మూడో తేదీ వరకు పింఛన్ ఇవ్వరని తెలిసింది. సచివాలయానికి వెళ్లి నేనే పింఛన్‌ను తెచ్చుకోవాలని చెబుతున్నారు. మోకాళ్ల నొప్పులతో నడవలేని స్థితిలో ఉన్నాను. ఇప్పటి వరకు గ్రామ వలంటీరు ఒకటొవ తేదీనే మా ఇంటికి వచ్చి పింఛన్ అందించారు. ఇప్పుడు వలంటీర్లు పని చేయకూడదని చెప్పడం దారుణం. వలంటీర్లు పనిచేయకపోతే నాలాంటి వాళ్లు చాలా ఇబ్బంది పడతారు. ఈ ఐదేళ్ల నుంచి పింఛన్ కోసం వెళ్లే నరకయాతన తప్పింది. మళ్లీ ఇప్పుడు అదే పరిస్థితులు వచ్చాయి.

– సూరగాని తులశమ్మ, జి.కొండూరు, ఎన్టీఆర్ జిల్లా)

పింఛన్ కటకటే..



కొంతకాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాను. డయాలిసిస్ చేయించుకునే స్తోమత లేకపోయినప్పటికీ సీఎం జగన్ ప్రభుత్వం ఉచిత వైద్యంతోపాటు రూ.10 వేలు పింఛన్‌ను మూడు నెలలుగా అందజేస్తోంది. ప్రతినెలా ఒకటో తేదీనే వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ అందజేసేవారు. వలంటీర్లతో పింఛన్లు పంపిణీ చేయవద్దంటూ ఫిర్యాదు చేయడంతో ఈ నెల సచివాలయం వద్దకు వెళ్లి తీసుకోవాలని అధికారులు చెబుతున్నారు. నేను సచివాలయానికి వెళ్లి పింఛన్ తీసుకోవాలంటే చాలా ఇబ్బంది పడాలి.

– నాబాన వెంకటేష్, గర్భాం గ్రామం, మెరకమూడిదాం మండలం, విజయనగరం జిల్లా

రెండు కిలోమీటర్లు నడవాలి



ప్రతి నెలా ఒకటో తేదీన మా వలంటీరు ఇంటికి వచ్చి పింఛన్ ఇచ్చేది. ఇప్పుడు సచివాలయానికి వచ్చి పింఛన్ తీసుకోమంటున్నారు. మా ఇంటి నుంచి 2.కి.మీ దూరంలో ఉన్న వీరఘట్టం సచివాలయానికి నేను నడిచి వెళ్లాలి. ఓ పక్క ఎండలు విపరీతంగా ఉన్నాయి. ఈ ఎండల్లో పింఛన్ కోసం వెళితే మళ్లీ తిరిగి ఇంటికి వస్తానో రానో అని భయంగా ఉంది. చంద్రబాబు తీరు సరైనదికాదు.

– బిడ్డిక పెద్ద సుంబురు, అచ్చెపువలస గిరిజన గ్రామం, పార్వతీపురం మన్యం జిల్లా

చంద్రబాబుకు కడుపుమంట ఎందుకో?



వలంటీర్లు ఉదయాన్నే తలుపుతట్టి పింఛన్ డబ్బులు ఇచ్చేవారు. అంతే కాదు వలంటీర్ల వల్ల అనేక సమస్యలు పరిష్కారమవుతున్నాయి. ఇపుడు తగుదనమ్మా అని చంద్రబాబు వలంటీర్లను అడ్డుకుని పింఛన్ ఇవ్వకుండా చేస్తే ఎంత ఇబ్బంది. దీనివల్ల ఆయనకు ఒరిగేది ఏమిటి?

– బి.మంగమ్మ, పింఛన్ లబ్ధిదారు, చెందోడు, కోట మండలం, తిరుపతి జిల్లా

మళ్లీ పాత కష్టాలేనా



.నేను దివ్యాంగురాలిని. గతంలో పెన్షన్ కోసం మా నాన్న వెంకటరమణ ప్రతి నెలా ఒకటో తేదీన కె.నగరపాలెం పంచాయతీ కార్యాలయానికి ఆటోలో తీసుకొని వెళ్లేవారు. ఒక్కోసారి నెలకు రెండు మూడు సార్లు తిరగాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ఆ కష్టం తప్పింది.ఈ ఐదేళ్లు ఎక్కడికి వెళ్లకుండానే ఇంటికే పెన్షన్ వచ్చింది. ఇప్పుడు వలంటీర్లు పెన్షన్‌ను అందించకూడదని అంటున్నారు.

– చల్లపల్లి ఎర్నికుమారి, మంగమారిపేట, విశాఖ జిల్లా

పింఛన్ కోసం పక్క ఊరికి వెళ్లాలా..?



వలంటీర్లు నెలనెలా ఠంఛన్‌గా ఇంటికే వచ్చి అందజేసేవారు. ఇకపై పింఛన్ తీసుకునేందుకు పక్క ఊర్లో ఉన్న సచివాలయానికి వెళ్లాలా? నాకు చాలా ఏళ్లుగా ఆరోగ్యం బాగోలేక ఇంట్లో నుంచి కదలలేని పరిస్థితి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏర్పాటు చేసిన వలంటీర్ల వ్యవస్థ ద్వారా నాకు పింఛన్ డబ్బులు ఇంటికి వచ్చి ఇచ్చేవారు. నడవలేని నాకు ఇక ఇబ్బందులు తప్పవు. అక్కడ పడిగాపులు కాసే ఓపిక నాకు లేదు.

– వరికూటి మాలకొండారెడ్డి, చెన్నారెడ్డిపల్లి, పొదలకూరు మండలం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లా

ఆయన బుద్ధే అంత



నాకు పెన్షన్‌ను ప్రతి నెలా ఒకటో తేదీన మా వలంటీర్ తలుపుతట్టి ఇచ్చేవారు. చంద్రబాబు రాజకీయంలో ఇప్పుడు నేను పెన్షన్ తీసుకోవాలంటే మా గ్రామ సచివాలయానికి వెళ్లాలి. ఎక్కడ వడదెబ్బ తగులుతుందోనని భయమేస్తోంది. ఇలా ఇబ్బంది పెడుతున్న చంద్రబాబుకు మా ఉసురు తప్పక తగులుతుంది.

– కోటపాటి పెంచలయ్య, దిగువపేటలోని గాంధీవీధి, సిద్ధవటం, వైఎస్సార్ జిల్లా

తప్పుడు మెయిల్స్‌పై చర్యలు తీసుకోండి

సైబర్ క్రైమ్‌కు మహిళా కమిషన్ చైర్‌పర్సన్ వెంకటలక్ష్మి ఫిర్యాదు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్‌కు వచ్చే తప్పుడు మెయిల్స్‌పై చర్యలు తీసుకోవాలని కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మి సోమవారం సైబర్ క్రైమ్‌కు ఫిర్యాదు చేశారు. మంగళగిరిలోని సీఐడీ ప్రధాన కార్యాలయంలో సైబర్ క్రైమ్ ఎస్పీ మలికాగర్గ్‌ను కలిసిన వెంకటలక్ష్మి ఆధారాలతో సహా ఫిర్యాదును అందించారు. అలాగే సోషల్ మీడియా వేదికగా ఉన్న అసభ్యకర ఆడియోలు, వీడియోలకు అడ్డుకట్ట వేయాలని.. లేకపోతే వాటి తాలూకు దుష్ప్రభావం యువతపై పడే అవకాశం ఉందన్నారు. కాగా, మహిళలను అసభ్యంగా చిత్రీకరిస్తున్న 'స్వాతి' వారపత్రికపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, రికార్డింగ్ డ్యాన్సులను నియంత్రించాలని కోరుతూ అశ్లీల ప్రతిఘటన వేదిక అధ్యక్షుడు ఈదర గోపీచంద్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ గజ్జల వెంకటలక్ష్మికి వినతి పత్రం ఇచ్చారు. ఆమె స్పందిస్తూ.. వీటిపై తగిన చర్యలు తీసుకుంటానని చెప్పారు.

జగన్‌తోనే చేనేతల అభివృద్ధి

జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర కన్వీనర్ నీలారి రుషింగప్ప

మంగళగిరి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేనేత సామాజికవర్గ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నారని జాతీయ చేనేత ఐక్య వేదిక రాష్ట్ర కన్వీనర్ నీలారి రుషింగప్ప తెలిపారు. చేనేత సామాజికవర్గానికి పలు పదవులివ్వడమే కాకుండా.. ఎమ్మెల్యే సీట్లు కేటాయింపులోనూ ప్రాధాన్యత ఇచ్చినందున రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి కృషి చేస్తామని రుషింగప్ప స్పష్టం చేశారు. కర్నూలు జిల్లా ఎమ్మిగనూరు నుంచి సోమవారం మంగళగిరి వచ్చి మురుగుడు లావణ్యకు ఆయన మద్దతు పలికారు. చేనేత సామాజికవర్గాన్ని టీడీపీ చంద్రబాబు ఓటు బ్యాంకుగానే చూశాడని, ఏనాడు చేనేత సామాజికవర్గ అభివృద్ధికి ఏమి చేయలేదని విమర్శించారు. ఎమ్మెల్యే ఆర్కే, ఎమ్మెల్సీ మురుగుడు హనుమంతరావు, మాజీ ఎమ్మెల్యే కాండ్రు కమల, జిల్లా చేనేత విభాగం అధ్యక్షుడు మునగాల మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అవ్వాతాతలపై చంద్రబాబు కక్ష

సాక్షి నెట్‌వర్క్ : పేదవారంటే చంద్రబాబుకు మొదటి నుంచీ చులకన భావమేనని.. ప్రతీనెల ఒకటో తేదీనే వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అవ్వాతాతలకు పింఛన్లు ఇవ్వడాన్ని ఆయన తట్టుకోలేకపోతున్నాడని, అందుకే వారిపై ఆయన కక్ష కట్టాడని పలువురు మంత్రులు మండిపడ్డారు. దీంతో చంద్రబాబు తన జేబు సంస్థ అయిన 'సిటిజన్స్ ఫర్ డెమోక్రసీ'ముసుగులో తన నమ్మినబంటు నిమ్మగడ్డ రమేష్‌కుమార్‌తో ఈసీకి ఫిర్యాదు చేయించి.. దాన్ని వైఎస్సార్‌సీపీపై నెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. నీచ రాజకీయాలు చేస్తూ వలంటీర్లపై ఫిర్యాదు చేయడమంటే.. ప్రజలకు జరుగుతున్న మేలు అడ్డుకోవడమేనన్నారు. వచ్చే ఎన్నికల్లో అవ్వాతాతలే చంద్రబాబుకు బుద్ధిచెబుతారన్నారు. ఎవరెవరు ఏమేన్నారంటే..

ఈసీ ఆదేశాలను పునఃసమీక్షించాలి..



ప్రతీనెలా ఒకటో తేదీన ప్రభుత్వమిచ్చే పెన్షన్లపై ఎన్నో ఆశలు పెట్టుకుని అవ్వాతాతలు జీవిస్తున్నారు. అలాంటి వారికి వలంటీర్ల ద్వారా పెన్షన్లు పంపిణీ చేయరాదని ఈసీ ఇచ్చిన ఆదేశాలను పునఃసమీక్షించాలి. పేదోడు బాగా ఉంటే చంద్రబాబుకు తిన్నది అరగదు. పెన్షన్లు ఇవ్వనీయకుండా.. నిరుద్యోగుల డీఎస్సీని అడ్డుకున్న దుష్టుడు చంద్రబాబు. పెన్షన్ పంపిణీకి ఎటువంటి ప్రత్యామ్నాయం చేసినా ఇబ్బందులు తప్పవు. అది ఒక నెలతో పోయేది కాదు.. మూడునెలల పాటు అవ్వాతాతలకు పెన్షన్లు ఇవ్వకుండా అడ్డుకుంటే ఆ పాపం శాపమై చంద్రబాబుకు చుట్టుకుంటుంది.

– బొత్స సత్యనారాయణ, మంత్రి

వలంటీర్లపై విషం కక్కుతున్నారు



పది మంది జీవితాల బాగు కోసం పాటుపడుతూ.. పారదర్శకంగా ప్రజాసేవకు అంకితమైన వలంటీర్లపై చంద్రబాబు, పచ్చబ్యాచ్ విషం కక్కుతున్నారు. ప్రజల కోసం అహర్నిశలు పాటుపడుతున్న వలంటీర్లంటే ఎందుకంత భయం? చంద్రబాబు ఓటమి భయంతోనే వలంటీర్లపై తప్పుడు ఫిర్యాదులు చేయించి కక్ష సాధిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే.. మొత్తం వలంటీరు వ్యవస్థనే తీసేసే హెచ్చరికగానే దీన్ని భావించాలి. అవ్వాతాతలు పింఛన్ల కోసం ఇబ్బందులు పడాల్సి వస్తుందని తెలిసినా అమానవీయంగా ఎన్నికల కమిషనర్‌కు టీడీపీ ఫిర్యాదు చేసింది. చంద్రబాబుకు వారి ఉసురు తగులుతుంది.

– విడదల రజిని, మంత్రి

బాబుకు అవ్వాతాతల శాపనార్థాలు



అవ్వాతాతలు, వితంతువులు, దివ్యాంగులు, కిడ్నీ బాధితులు 1వ తేదీ ఉ.5 గంటల నుంచి ఇంటిగుమ్మంలో పింఛను కోసం ఎదురుచూస్తారు. పెత్తందార్లకు వెన్నుదన్నుగా నిలబడి ప్యాకేజీలు గుంజుకునే చంద్రబాబు పేదలను ఎప్పుడూ ఇబ్బందులు పెడుతూనే ఉన్నాడు. ముందునుంచీ వలంటీరు వ్యవస్థపై పడి ఏడుస్తున్నాడు. ఇప్పుడు తన నమ్మినబంటు నిమ్మగడ్డ రమేష్‌తో ఎన్నికల అధికారికి పిటిషన్ ఇచ్చి వలంటీర్లను విధుల నుంచి తప్పించి పాపం మూటగట్టుకున్నాడు. అవ్వాతాతల శాపనార్థాలు ఆయనకు తగులుతాయి. వారు పడే బాధ నువ్వు కూడా అనుభవించే రోజు వస్తుంది.

– కారుమూరి నాగేశ్వరరావు, మంత్రి

చంద్రబాబు నరరూప రాక్షసుడు



అవ్వాతాతలపై ఎటువంటి కనికరం లేకుండా టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు నరరూప రాక్షసుడిలా వ్యవహరించాడు. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థపై చంద్రబాబు మొదటి నుంచీ కడుపు మంటతోనే ఉన్నాడు. ప్రతినెలా ఒకటో తేదీన అవ్వాతాతలకు, దివ్యాంగులకు, దీర్ఘకాల రోగుల ఇళ్లకు వలంటీర్లు వెళ్లి, ఆప్యాయంగా పలకరిస్తూ రూ.3 వేల పెన్షన్ ఇస్తుంటే చంద్రబాబు చూడలేకపోయారు. దీంతో వలంటీర్ల విధులపై కేంద్ర ఎన్నికల సంఘం ఆంక్షలు విధించేలా చేశారు. దీనివల్ల తీవ్రంగా నష్టపోయేది, ఇబ్బందులు పడేది పెన్షన్‌దారులే.

– మార్గాని భరత్‌రామ్, ఎంపీ

చంద్రబాబుది రాక్షసానందం



అవ్వాతాతలు, వికలాంగులు, వ్యాధిగ్రస్తుల ఇంటికి వలంటీర్లు రాకుండా అడ్డుకున్న పాపం చంద్రబాబుదే. గ్రామ వలంటీర్ వ్యవస్థను అడ్డుకుని ఆయన రాక్షసానందం పొందుతున్నారు. ఆయన కుట్రతో అవ్వాతాతలు పింఛన్ల కోసం ఇకపై మండుటెండల్లో ఎన్ని కష్టాలు పడాల్సి ఉంటుందో? వలంటీర్లను అడ్డుకుని ఇప్పుడు పింఛన్లు పంపిణీ చేయాలంటూ చంద్రబాబు మొసలికన్నీరు కారుస్తున్నారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే తమ బతుకులు ఏవిధంగా ఉంటాయోనని పేదలు బెంబేలెత్తిపోతున్నారు. టీడీపీ కూటమికి వారు బుద్ధిచెప్పడం ఖాయం.

– ఆదిమూలపు సురేష్, మంత్రి

పెన్షనర్లే టీడీపీ కూటమికి బుద్ధిచెబుతారు



పింఛన్‌దారులను ఇబ్బంది పెట్టడం దారుణం. చంద్రబాబునాయుడు, రాష్ట్ర ఎన్నికల మాజీ కమిషనర్ నిమ్మగడ్డ రమేష్ ద్వారా వలంటీర్లతో పింఛన్లను పంపిణీ చేయవద్దని ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేయడం సరి కాదు. వచ్చే ఎన్నికల్లో పెన్షనర్లే తెలుగుదేశం కూటమికి బుద్ధిచెబుతారు. చంద్రబాబు ఎన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా వైఎస్సార్‌సీపీ గెలుపు ఖాయం.

– ఏకుల రాజేశ్వరిరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి

టీడీపీ కుట్రల వల్లే పింఛన్ల పంపిణీలో జాప్యం

- చంద్రబాబు టక్కు టమారాలు పనిచేయవు
- తొలిరోజు ఎన్నికల ప్రచారంలో మంత్రి ధర్మాన ప్రసాదరావు



సభలో ప్రసంగిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రతి ఎన్నికల్లో చంద్రబాబు చేసే టక్కు టమారాలు, దొంగవిధానాలు, అబద్ధపు హామీలు, బూటకపు కూటములు ఈ ఎన్నికల్లో పనిచేయబోవని రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు స్పష్టం చేశారు. శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని 50వ డివిజన్ ఆదివారం పేట పరిసర ప్రాంతంలో సోమవారం ఎన్నికల ప్రచారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. వలంటీర్లపై టీడీపీ నేతలు ఎన్నికల కమిషన్‌కి ఫిర్యాదు చేసి, కుట్రలు కుతంత్రాలు పన్నిన కారణంగా పంపిణీలో జాప్యం చోటుచేసుకుందని మండిపడ్డారు. లబ్ధిదారులంతా ఇప్పుడు సచివాలయాల వద్దకు వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడిందని దుయ్యబట్టారు.

జాతీయ సంస్థల సర్వేల్లో ఏపీ బెస్ట్

2019 నుంచి 2024 వరకు జరిగిన అభివృద్ధిపై జాతీయ సంస్థలు అనేక సర్వేలు చేశాయని, జీఎస్‌డీపీ టీడీపీ హయాంలో 22వ స్థానంలో ఉంటే ఈ ఐదేళ్లలో 5వ స్థానానికి వచ్చిందన్నారు. తలసరి ఆదాయం 17 నుంచి 9వ స్థానానికి, ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో దేశంలోనే 3వ స్థానంలో నిలిచిందన్నారు. ఇవన్నీ అభివృద్ధి సూచికలు కాదా అని ప్రశ్నించారు. ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా పేరాడ తిలక్‌ను గెలిపించాలని కోరారు.

ఫ్యాన్ గుర్తుకే ఓటు

మంత్రి ధర్మాన ప్రసంగిస్తున్న సమయంలో 70 ఏళ్ల వృద్ధురాలు కూర్మాపు లక్ష్మమ్మ మధ్యలో లేచి మైక్ దగ్గరికి వెళ్లి మాట్లాడారు. 'మీ అందరికీ దండంబాబు.. ఏ దిక్కు మొక్కులేని నాకు జగన్‌బాబు దయవల్ల వలంటీర్ ఇంటికొచ్చి పెన్షన్, బియ్యం ఇస్తున్నారు. నాకు భర్త లేదు. కోడలు చనిపోయింది. నా కొడుక్కి, ఇద్దరు మనవళ్లకు నేనే గంజి పోస్తున్నాను. తప్పనిసరిగా ఫ్యాన్ గుర్తుకే ఓటేసి జగన్‌బాబును, పెసాదుబాబును గెలిపిస్తా' అంటూ తన యాసలో చెప్పి అందరినీ ఆకట్టుకుంది.

వలంటీర్‌పై టీడీపీ నాయకుల దాడి



బాధితురాలు సంధ్య

హిందూపురం అర్బన్: శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని 28వ వార్డు వలంటీరు సంధ్యపై సోమవారం రాత్రి టీడీపీ నాయకులు దాడిచేశారు. స్థానిక సూరప్ప కట్టకింద (బోయపేట) ప్రాంతంలోని వలంటీర్ సంధ్య ఇంటివద్దకు సోమవారం రాత్రి కొందరు అవ్వాతాతలు వచ్చి పింఛన్ విషయమై ఆరాతీశారు. ఈ నెల 3వ తేదీ నుంచి వార్డు సచివాలయంలో ఇస్తారని ఆమె చెబుతుండగా.. సమీపంలోనే ఉన్న టీడీపీ నాయకులు నవీన్, అనిల్, అశోక్, విజి తదితరులు ఆమెపై దాడిచేశారు. గర్భిణి అని కూడా చూడకుండా దాడిచేయడంతో ఆమెను కుటుంబసభ్యులు ఆస్పత్రికి తీసుకెళ్లారు. టీడీపీ వర్గీయులు అక్కడికి కూడా వెళ్లి గొడవ చేశారు. తరువాత సంధ్య స్థానిక రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదుపై విచారిస్తున్నామని సీఐ రియాజ్ అహమ్మద్ తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ

విజయవాడ

మంగళవారం ॥ 2-4-2024

కుండల తయారీలో మనమదురై మహిళలు



సీజన్

ప్రతి ఊరిలో కుండలు చేస్తారు.
కాని కుండలు చేయడానికి మాత్రమే
ఒక ఊరు ప్రసిద్ధం అయ్యింది.
అదే తమిళనాడులోని 'మనమదురై'.
అక్కడ పారే వైగై నది తెచ్చే ఒండ్రు మట్టితో
తయారయ్యే ఈ కుండలు
చల్లదనానికి ప్రతీకలు.
స్త్రీలు ఈ కుండల తయారీలో సరి సమాన
శ్రమ చేస్తారు.
ఘటాలు కూడా తయారు చేస్తారు.
ఈ కుండల ప్రత్యేకత వల్ల వీటికి
'జియోగ్రాఫికల్ ఇండికేషన్' (జిఐ)
ట్యాగ్ దక్కింది.

కుండలు చేసే ఊరు

వేసవి రాగానే కుండలు గుర్తుకొస్తాయి. ప్రతి ఇంటిలో కుండలోని చల్లటి నీళ్లు తాగడానికి ఇష్టపడతారు. ఫ్రిజ్‌లోని నీళ్లలో ఉండే కృత్రిమ చల్లదనం కుండ నీళ్లలో ఉండదు. అందుకే కొత్త కుండలు వేసవిలో ప్రతి ఇంటికి చేరుతాయి. చలివేంద్రాలు పెట్టేవారు పెద్ద పెద్ద కుండలు కొని దాహార్తి తీర్చి పుణ్యం కట్టుకుంటారు. పక్షులకు నీరు పెట్టాలనుకునేవారు మట్టి పాత్రల్లో నీళ్లు నింపి పెడతారు. ఒకప్పుడు పల్లెల్లో పాలకుండ, పెరుగు కుండ, నెయ్యి కుండ ఉండేవి. పెరుగు కుండలో తోడు పెడితే చాలా రుచి. స్టీలు, ప్లాస్టిక్ దెబ్బకు కుండలు కొన్నాళ్లు వెనుకబడినా మళ్లీ ఇప్పుడు ఆరోగ్యస్పృహ వల్ల పుంజుకున్నాయి. ముఖ్యంగా కొన్ని ప్రత్యేక కుండలకు గిరాకీ తగ్గలేదు. వాటిలో మనమదురై కుండలు మరీ ప్రత్యేకం.

కుండల ఊరు

తమిళనాడులోని శివగంగ జిల్లాలోని చిన్న ఊరు మనమదురై. యాభై వేల జనాభా ఉంటుంది. ఇది మదురై నుంచి 60 కిలోమీటర్ల దూరం. ఇక్కడ పారే వైగై నది ఈ ఊరికి ఇచ్చిన అనుకోని వరం కుండలు తయారు చేయడానికి అవసరమైన ఒండ్రుమట్టి. నది ఒడ్డు నుంచి తెచ్చుకున్న ఒండ్రుమట్టి కాల్షియం లైమ్, బూడిద, సోడియం సిలికేట్, మాంగనీస్, ఐరన్ మిశ్రమాలను కలిపి కుండలు తయారు చేస్తారు. మనమదురై కుండను గుర్తించడం ఎలా అంటే దాని అడుగు పరిపూర్ణమైన గుండ్రంగా ఉంటుంది. అదే సమయంలో నేల మీద సరిగ్గా కూచుంటుంది. ఈ కుండల తయారీలో పంచభూతాలు ఉంటాయి అంటారు ఈ ఊరి వాళ్లు. నేల, నీరు, అగ్ని తయారీలో ఉపయోగిస్తే మట్టిలోని సూక్ష్మరంధ్రాలు గాలి రాకపోకలను సూచిస్తాయి. కుండ లోపలి ఖాళీ (శూన్యం) ఆకాశాన్ని సూచిస్తుంది. వేసవి కోసం ఇక్కడ విశేష సంఖ్యలు కుండలను స్త్రీ, పురుషులు కలిసి తయారు చేస్తారు. కుటుంబాలన్నీ కుండల మీదే ఆధారపడి బతుకుతాయి. వీటికి ఎంత డిమాండ్ ఉన్నా దూరప్రాంతాలకు పంపడం ఖర్చుతో, రిస్క్‌తో కూడుకున్న పని. కుండలు పగిలిపోతాయి. అందుకే స్థానికంగా తప్ప ఇవి ఎక్కువగా దొరకవు.

ఘటం ఎలా తయారు చేస్తారు?

మనమదురై కుండలకే కాదు ఘటాలకు కూడా ప్రసిద్ధి. నీరు పోస్తే కుండ. సంగీతం పలికిస్తే ఘటం. కాని అది సంగీతం పలికించాలంటే కొంచెం ప్రత్యేకంగా తయారు చేయాలి. మనమదురై ఘటాలు చాలా ప్రసిద్ధి. ఇక్కడ మీనాక్షి కేశవన్ అనే మహిళ ఘటాలు తయారు చేయడంలో ఖ్యాతి పొందింది. పెద్ద పెద్ద విద్వాంసులు ఆమె తయారు చేసిన ఘటాలనే వాయించేవారు. ఘటం తయారు చేయాలంటే కుమ్మరి చక్రంపై కుండ తయారయ్యాక ఒక రోజు ఉంచేస్తారు. మర్నాడు దానిని ప్రత్యేక చెక్కమెత్తతో మెత్తుతారు. ఒక పచ్చికుండ కాల్చడానికి ముందు ఘటంగా మారాలంటే ఆ కుండలోని ప్రతి అంగుళాన్ని మెత్తాలి. అలా 3000 సార్లు మెత్తి ఆ తర్వాత కాల్చుతారు. అప్పుడే ఘటం తయారవుతుంది. ఇది ఓపికతో కూడిన పని కాబట్టి స్త్రీలు ఎక్కువగా చేస్తారు. వీటి కోసం వేల కిలోమీటర్ల నుంచి వచ్చి కొనుక్కెళ్లేవారు ఉన్నారు. కుండలు చేసే కుటుంబాలు ఉన్నా ఘటాలు చేసే కుటుంబాలు అంతరించిపోతున్నాయని ఇటీవల సాంస్కృతిక, సంగీత అభిమానులు క్రౌడ్ ఫండింగ్ చేసి ఘటాల తయారీని పునరుద్ధరించేలా చూశారు.

హెల్త్ టిప్స్



- కడుపులో పుళ్లు, గ్యాస్ వంటి సమస్యలు ఉన్నవారు రోజూ ఒక పచ్చిక్యారట్‌ను తినడం అలవాటు చేసుకుంటే ఆ సమస్యలు అదుపులో ఉండడంతోబాటు చర్మానికి మంచి రంగు కూడా వస్తుంది.
- రక్తహీనతతో బాధపడేవారు ఆహారంలో మునగాకును తరచు తీసుకోవడం వల్ల వంటికి బాగా రక్తం పడుతుంది.
- పంటినొప్పి ఉన్నవారు, ఏమైనా తాగినా, తిన్నా పళ్లు జివ్వుమని లాగేవారు పుదీనా ఆకులను నీడపట్టున ఎండబెట్టి చేసిన పొడిలో కాస్త ఉప్పు కలిపి దానితో పళ్లు తోముకుంటూ ఉంటే పంటి సమస్యలు ఉండవు.
- నడుంనొప్పితో బాధపడేవారు పుదీనా ఆకుల రసంలో పచ్చకర్పూరం పొడిని చేర్చి, నడుముకు పట్టులా వేసే సమస్య నుంచి ఉపశమనం లభిస్తుంది.



గెలుపు దారి

కల ఉన్న చోట కష్టం ఉంటుంది.
'మరింత కష్టపడతాను' అంటూ
ముందుకువెళ్లాలి.
లక్ష్యం ఉన్న చోట సవాలు ఎదురొస్తుంది.
సరియైన జవాబు చెప్పి ఆ సవాలును
వెనక్కి పంపించాలి.
ఇందుకు నిలువెత్తు ఉదాహరణ
శృతి మల్హోత్రా.
జార్ఖండ్‌లోని రాంచికి చెందిన శృతి
ఎన్నో చిన్న బ్రాండ్‌లను పెద్ద సక్సెస్ చేసింది.
సక్సెస్‌కు సరియైన అడ్రస్‌గా
పేరు తెచ్చుకుంది...

సక్సెస్ స్పెషలిస్ట్



శృతి మల్హోత్రా

శృతి మల్హోత్రా బాల్యంలోకి వెళితే...

ప్రతిరోజు రాత్రి నలుగురు అక్కాచెల్లెళ్లు వార్తలు వినడానికి రేడియో ముందు కూర్చునేవారు. కొత్త విషయాలు, ఆసక్తికరమైన విషయాలను రూల్ నోట్ ప్యాడ్‌లో రాసుకునేవారు. మరుసటి రోజు తండ్రితో వాటి గురించి చర్చించేవారు. తండ్రి వాటి గురించి మరిన్ని కొత్త విషయాలు వివరంగా చెప్పేవాడు. శృతి తండ్రి పిల్లలకు తరచుగా చెప్పే మాట...

'స్వతంత్రంగా ఉండండి' 'పెద్ద కలలు కనడానికి వెనకాడ వద్దు' 'ఈ ప్రపంచంలో మీకు అత్యున్నత స్నేహితుడు... విద్య'

తండ్రి మాటలు అక్షరాలా ఆచరించడం వల్లే పదిమందీ మెచ్చుకునే స్థాయికి ఎదిగింది శృతి మల్హోత్రా. మిషనరీ స్కూల్ నుంచి దిల్లీ యూనివర్శిటీలో చదువుకోవడం వరకు 'స్వతంత్రంగా ఉండడం' అనే లక్షణాన్ని ఎప్పుడూ వదులుకోలేదు. దీనివల్ల ఆమె చాలామందికి 'రెబెల్'గా కనిపించేది.

'ఏదైనా చేయాలి. అది ఇతరుల కంటే భిన్నంగా ఉండాలి' అనే లక్ష్యాన్ని కాలేజీ రోజుల్లోనే నిర్దేశించుకుంది మల్హోత్రా.

నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫ్యాషన్ టెక్నాలజీలో చదువు పూర్తయిన తరువాత ఫ్యాషన్ కంపెనీ 'బెనెటన్'తో ప్రొఫెషనల్ ఇన్నింగ్స్ ప్రారంభించింది.

నైకీ, ప్లానెట్ స్పోర్ట్స్‌లో కూడా అద్భుతమైన ఇన్నింగ్స్‌ను ప్రదర్శించింది.

స్థూలంగా చెప్పాలంటే ఫ్యాషన్, లైఫ్ స్టైల్ డిజైనింగ్‌లలో ప్రత్యేకమైన పేరు తెచ్చుకుంది.

2007లో ఎథికల్ బ్యూటీబ్రాండ్ 'ది బాడీ షాప్'లో చేరింది. ఇది తన ప్రయాణ గతిని మార్చేసింది.

రిటైల్, సేల్స్, డిస్ట్రిబ్యూషన్‌లలో అడుగడుగునా పురుషాధిక్యత కనిపించే కాలంలో మహిళలు అడుగు వేసి నిలదొక్కుకోవడం అంత సులభం కాదు. 'వేరే వారి కంటే ఒక మెట్టుకింద ఉండడానికి నేను ఎప్పుడూ ఇష్టపడలేదు. సవాలుగా తీసుకున్నాను. రెట్టింపు కష్టపడ్డాను' అంటుంది మల్హోత్రా.

ఆ కాలంలో బ్యూటీ ప్రాడక్ట్స్‌కు సంబంధించిన రిటైల్ బిజినెస్ ఫార్మసీ, డిపార్ట్‌మెంటల్ స్టోర్‌లలో మాత్రమే కనిపించేది. దీన్ని దృష్టిలో పెట్టుకొని 'జీరో నుంచి ప్రయాణం ప్రారంభించాను' అంటుంది మల్హోత్రా.

'ఈ రంగాన్ని ఎందుకు ఎంచుకున్నావు?' అనే సన్నాయి నొక్కుల నుంచి 'ఈ రంగంలో పెద్ద పేరున్న మహిళ' అనే ప్రశంస వరకు శృతి మల్హోత్రా ఎంతో ప్రయాణం చేసింది. ఎన్నో పాఠాలు నేర్చింది. ఎందరికో గుణపాఠాలు చెప్పింది .'క్వెస్ట్ రిటైల్' గ్రూప్ సీయీవోగా ఎంతో పేరు తెచ్చుకుంది.

'శృతి మల్హోత్రా సీయీవో మాత్రమే కాదు ఎన్నో బ్రాండ్స్‌ను విజయవంతం చేసిన డ్రైవింగ్ ఫోర్స్'అంటాడు ఫ్యాషన్ కంపెనీ లకోస్టే ఇండియా మేనేజింగ్ డైరెక్టర్, సీయీవో రాజేష్ జైన్.

తన సక్సెస్‌కు కారణం తల్లిదండ్రులు అని చెబుతుంది మల్హోత్రా. చదువు చెప్పించడం నుంచి కలల సాధనలో వెన్నుదన్నుగా నిలవడం వరకు వారి పాత్ర ఎంతో ఉందని చెబుతోంది.

'వృత్తి జీవితంలో ఎంతోమంది మేల్ కొలీగ్స్‌తో పనిచేశాను. ఎప్పుడూ ఎవరితోటీ సమస్య రాలేదు. పురుషులతో సమానంగా స్త్రీలకు అవకాశం లేకపోవడమే అసలు సమస్య. మహిళలకు సమానావకాశాలు కల్పించడం విషయంలో ఎన్నోసార్లు పోరాడాను' అంటుంది మల్హోత్రా.

'మీరు ఎక్కడి నుంచి వచ్చారు అనేది ముఖ్యం కాదు. మీరు ఎక్కడికి వెళుతున్నారన్నది ముఖ్యం'అనేది శృతి మల్హోత్రాకు ఇష్టమైన మాట.

సాగుబడి

రేవతి కార్తె: మార్చి 31 నుంచి

నేలపైన కాదు.. నేరుగా వేర్లకే తడి

- భూగర్భ డ్రిప్‌తో 50% నీరు, 30% విద్యుత్తు ఆదా
- మామిడి, బత్తాయి తదితర పండ్ల, కూరగాయ తోటలకు రక్షణ



'స్వర్' డ్రిప్ వ్యవస్థ ఇలా ఉంటుంది.

దీర్ఘకాలం మనుగడ సాగించే పండ్ల, పూల తోటల నుంచి కొద్ది నెలల్లో పంటకాలం ముగిసే సీజనల్ కూరగాయల సాగు వరకు నీటిని పొదుపుగా వాడుకోవటం అంటే వెంటనే అందరికీ గుర్తొచ్చేది చెట్ల దగ్గర మట్టిపై నీటిని చుక్కలు చుక్కలుగా వదిలే డ్రిప్ లైన్లు! అయితే, అధిక ఉష్ణోగ్రతలు, తీవ్ర వడగాడ్పుల కాలంలో బోర్లు ఎండిపోతూ ఉంటే.. పండ్ల, పూల తోటలను, కూరగాయ తోటలను రక్షించుకోవడానికి దీనికన్నా మెరుగైన మరో మార్గం ఉంది. అదే.. భూగర్భ డ్రిప్! నేల మీద నీరివ్వటం కాదు, భూమిలో వేర్లకే నేరుగా నీటి తేమ అందించటం!



మల్లె తోట



దానిమ్మ తోట

భూతాపం ఏటేటా పెరిగిపోతున్న దశలో నీటి సవాళ్లు మరింత తీవ్రమవుతున్నాయి. దీనికి తగినట్లు నీటిని మరింత సమర్థవంతంగా వాడుకోవాల్సిన అవసరం వస్తోంది. ఇంతకుముందెన్నడూ ఎరుగని రీతిలో అధిక ఉష్ణోగ్రతలు, వడగాడ్పులు పెచ్చుమీరుతుంటే.. ఉద్యాన తోటల సాగుకు నీటి లభ్యత తగ్గిపోతూ ఉంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌కు చెందిన కె.ఎస్. గోపాల్ 'స్వర్' (సిస్టం ఆఫ్ వాటర్ ఫర్ అగ్రికల్చర్ రిజునవేషన్) పేరుతో వినూత్న డ్రిప్‌ను ఆవిష్కరించారు. సాధారణ డ్రిప్ భూమి పైనే నీటిని వదులుతూ ఉంటే.. ఈయన రూపొందించిన డ్రిప్ నేలపైన కాకుండా చెట్లు/మొక్కల వేర్ల దగ్గర భూగర్భంలో నీటి తేమను అతి పొదుపుగా వదులుతుంది. సాధారణ డ్రిప్‌తో పోల్చితే కూడా సగానికి సగం నీరు ఆదా కావటంతో పాటు.. అతి తక్కువ నీరు అందుబాటులో ఉండే కరువు కాలపు మండు వేసవిలోనూ పండ్ల తోటలను కంటికి రెప్పలా కాపాడుకోవటానికి, తద్వారా వ్యవసాయాన్ని పునరుజ్జీవింపజేసుకోవడానికి ఈ భూగర్భ డ్రిప్ 'స్వర్' రైతులకు చక్కగా ఉపయోగపడుతోందని గోపాల్ 'సాక్షి సాగుబడి'తో చెప్పారు. 2019 మొదలుకొని ఇప్పటికి 8 రాష్ట్రాల్లో స్వర్ భూగర్భ డ్రిప్‌ను అనేక పండ్ల, కూరగాయ తోటల్లో అనేక సంస్థలతో కలిసి ప్రయోగాత్మకంగా ఉపయోగించి చూస్తూ సత్ఫలితాలు పొందుతున్నామన్నారాయన.

'స్వర్' ఎలా పనిచేస్తుంది?

భూగర్భంలో చెట్లు/ మొక్కల వేర్లకే నీటి తేమను అందించటమే 'స్వర్' భూగర్భ డ్రిప్ ప్రత్యేకత. సాధారణ ఆన్‌లైన్ డ్రిప్ లేటరల్ పైపునకు ఉండే డ్రిప్పర్‌ను తొలగించి, 'స్వర్' భూగర్భ డ్రిప్ బాక్సులను అమర్చితే సరిపోతుంది. దీని నిర్మాణం ఎలా ఉంటుందంటే.. అరచేతి సైజులో ఉండే ఒక ప్లాస్టిక్ బాక్స్ ఉంటుంది. దానికి నిండా సన్నని బెజ్జాలుంటాయి. 5 ఎం.ఎం. మైక్రో ట్యూబ్‌తో ఒక చివర్న ఈ బాక్స్‌ను జోడించి.. మరో చివర భూమిపైన ఉండే డ్రిప్ లేటరల్ పైపులకు అమర్చాలి. ఆ తర్వాత బాక్స్‌ను చెట్టు/ మొక్క దగ్గర మట్టిని తవ్వి భూమి లోపల వేర్ల దగ్గర్లో పెట్టి, మట్టి కప్పెయ్యాలి. ఆ విధంగా ఈ భూగర్భ డ్రిప్ భూమి లోపల వేరు వ్యవస్థకు నీటి తేమను అందుబాటులోకి తెస్తుంది. మట్టి లోపల వేరు వ్యవస్థ దగ్గర ఉండే ఈ బాక్స్‌లో క్వార్ట్జ్ స్టోన్ గ్రాన్యూల్స్ ఉంటాయి. అవి నిరంతరం నీటి తేమను మట్టి ద్వారా వేరు వ్యవస్థకు క్రమబద్ధంగా అందిస్తుంటాయి. బయటి నుంచి వేర్లు ఈ బాక్స్ లోపలికి అల్లుకొని దాని పనితీరును దెబ్బ తీయకుండా ఉండేలా దీన్ని రూపొందించటం విశేషం.

తోటలు ఎండిపోకుండా కాపాడుకోవచ్చు!

సాధారణ డ్రిప్ వాడినప్పుడు చెట్టు/మొక్క దగ్గర ఉపరితలం నుంచి వేర్ల దగ్గరకు మట్టిని తడుపుకుంటూ నీరు వెళ్లాల్సి ఉంటుంది. 'స్వర్' భూగర్భ డ్రిప్ బాక్సులు ఏర్పాటు చేసుకుంటే ఆ అవసరం ఉండదు. నేరుగా వేర్లకే నీటి తేమను అందించవచ్చు. దీనివల్ల, నీటి వాడకం సగానికి సగం తగ్గిపోతుంది. మండు వేసవిలోనూ 3 నుంచి 5 రోజులకు ఒకసారి నీరిస్తే సరిపోతుంది. అడుగు లోతులో నీటి తేమ ఎంత ఉందో సెన్సార్ ఆధారంగా తెలుసుకుంటూ.. నీటి అవసరం ఉన్నప్పుడు మాత్రమే, తగినంత నీటి తేమను, నెమ్మదిగా అందించటం వీలవుతుంది. తద్వారా తక్కువ నీటితోనే పండ్ల, పూల తోటలను, కూరగాయ తోటలను అధిక వేడి, హీట్ వేవ్ కష్టకాలంలోనూ రక్షించుకోవటానికి అవకాశం ఉంది. భూగర్భ డ్రిప్ బాక్సు ధర గతంలో రూ. 50 ఉండేది. ఇజ్రేల్ కంపెనీ సహాయంతో దీన్ని రూ. 25కి తగ్గించగలిగాం.

– కె.ఎస్.గోపాల్ (98481 27794),
'స్వర్' భూగర్భ డ్రిప్ ఆవిష్కర్త,
డైరెక్టర్, సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్‌సర్న్స్, హైదరాబాద్.



మామిడి, బత్తాయికి 4 డ్రిప్ బాక్సులు

ఉద్యాన తోటల్లో చెట్ల వయసును, ఎత్తును బట్టి, మట్టి తీరును బట్టి ఒక్కో చెట్టుకు ఎన్ని డ్రిప్ బాక్సులను ఏర్పాటు చేసుకోవాలో, వేరు వ్యవస్థ వద్ద నేలలో ఎంత లోతులో ఏర్పాటు చేసుకోవాలో నిర్ణయించుకోవాల్సి ఉంటుంది. చెట్టు మొదలు దగ్గర కాకుండా.. దాని కొమ్మలు విస్తరించిన చివరిలో పీచువేళ్ల అందుబాటులో ఉండే చోట్ల ఈ డ్రిప్ బాక్సులను ఏర్పాటు చేసుకోవటం ముఖ్యం.

ఎమ్మెస్ స్వామినాథన్ ఫౌండేషన్, వైజాగ్ కృషి విజ్ఞాన కేంద్రం, అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ అయోవా, జిఐజెడ్ వంటి సంస్థలతో కలిసి స్వర్ భూగర్భ డ్రిప్, లివింగ్ కంపోస్టుపై ప్రయోగాలు చేసి సత్ఫలితాలు సాధించామని గోపాల్ తెలిపారు. పెద్ద మామిడి చెట్టుకు 4 (12–16 అంగుళాల లోతులో) స్వర్ డ్రిప్ బాక్సులు, జామ చెట్టుకు 2 (12 అంగుళాల లోతులో), బత్తాయి చెట్టుకు 4 (12 అంగుళాల లోతులో), నిమ్మ చెట్టుకు 2 (6 అంగుళాల లోతులో), దానిమ్మ చెట్టుకు 2 (భగువ చెట్టుకు 4–5, గణేశ్ చెట్టుకు 6–7 అంగుళాల లోతులో), కొబ్బరి చెట్టుకు 4 (4–5 అంగుళాల లోతులో), మల్లె మొక్కకు 1 డ్రిప్ బాక్సు ఏర్పాటు చేసుకుంటే చాలని ప్రయోగాత్మక సాగులో తేలింది. రెండు చెరకు మొక్కలకు ఒకటి చొప్పున ఏర్పాటు చేసి ప్రయోగాత్మకంగా సాగు చేస్తున్నామని గోపాల్ తెలిపారు.

50% నీరు, 30% విద్యుత్తు ఆదా

భూగర్భ డ్రిప్ బాక్సుల ద్వారా వేరు వ్యవస్థకు నీటిని అందించటం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయి. వర్షాకాలంలో తప్ప కలుపు సమస్య ఉండదు. కాబట్టి రైతుకు శ్రమ, ఖర్చు తగ్గుతాయి. సాధారణ డ్రిప్‌తో పోల్చితే 50% నీరు, 30–40% విత్యుత్తు ఆదా అవుతుంది. డ్రిప్ ద్వారా ఇచ్చే ద్రవరూప ఎరువులు కూడా 30% ఆదా అవుతాయి. సౌర విద్యుత్తు ద్వారా నడిచే 5 హెచ్‌పి మోటారుకు బదులు 1.5 హెచ్.పి. మోటారు సరిపోతుంది. 10% అదనంగా పంట దిగుబడి వస్తుంది. అంతేకాదు, త్వరగా పూత వస్తుందని గోపాల్ చెబుతున్నారు.

అవార్డుల పంట

సెంటర్ ఫర్ ఎన్విరాన్‌మెంట్ కన్‌సర్న్స్ (సిఇసి) తరఫున 'స్వర్' భూగర్భ డ్రిప్ వ్యవస్థను ఆవిష్కరించిన కె.ఎస్.గోపాల్‌కు 2023 అవార్డుల పంట పండించింది. న్యూఢిల్లీలోని ఐఎఆర్‌ఐలో పూసా కృషి పురస్కారం (రూ. 5 లక్షలు), ఫిక్కి ఉత్తమ నీటి సాంకేతికత పురస్కారం, రూ. 50 లక్షల యాక్ట్ గ్రాంటు లభించాయి. కేంద్ర జలశాఖ, యుఎన్‌డిపి, తెరి ఉమ్మడిగా 2024 ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలో 'స్వర్' ప్రథమ బహుమతిని గెల్చుకుంది.

నిర్వహణ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

మార్కెట్‌ను బట్టి సేద్యం.. నేరుగా ప్రజలకే అమ్మకం..



ఖర్బూజ తోటలో రైతు దంపతులు వెంకటేష్, విజయ

రైతు దంపతులు బండారి వెంకటేష్, విజయకు ప్రయోగాలంటే ప్రాణం. చదివింది పదో తరగతే అయినా, ఉద్యాన పంటల సాగులో భేష్ అనిపించుకుంటున్నారు. ఇతర రైతులకు భిన్నంగా మార్కెట్‌కు తగిన పంటలు పండించడం, దళారులకు విక్రయించకుండా నేరుగా మార్కెటింగ్ చేయటం వారి సక్సెస్‌కు ముఖ్య కారణాలుగా నిలిచాయి.

వెంకటేష్, విజయ దంపతులది జగిత్యాల జిల్లాలోని సారంగాపూర్ మండలం పెంబట్ల గ్రామం. ఖర్బూజ (పుచ్చ) పంటను తమకున్న 3 ఎకరాల్లో నవంబర్ నుండి మే నెల వరకు గత మూడేళ్లుగా సాగు చేస్తున్నారు. దీని పంట కాలం 90 రోజులు. ఒకేసారి పొలం మొత్తంలో విత్తనాలు వేయకుండా, కొన్ని రోజుల వ్యవధిలో ఐదు దఫాలుగా విత్తుతారు. శివరాత్రి నుంచి ఎండలు ముదురుతాయి. అప్పటి నుంచి మే వరకు పుచ్చ కాయలు మార్కెట్‌కు వచ్చేలా సాగు చేస్తారు. ప్రతి రోజు టన్ను నుంచి టన్నున్నర కాయలు జగిత్యాల మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తుంటారు. మార్కెట్‌లో డిమాండ్ ఉన్న ఖర్బూజ రకాలను సాగుచేస్తుంటారు.


ఈ ఏడాది ఐదు రకాల ఖర్బూజ పండ్లను సాగు చేశారు. సాధారణ ఖర్బూజ (సూపర్ క్వీన్ రకం), లోపల పసుపు పచ్చగా బయట ఆకుపచ్చగా ఉండే విశాల్ రకం, లోపల ఎర్రగా బయట పసుపు పచ్చగా ఉండే అరోహి రకం, గుండ్రంగా ఉండే జన్నత్ రకం, మస్కమిలన్ (జ్యూస్ రకం) సాగు చేశారు. ఈ విత్తనాలను బెంగళూర్ నుంచి తెప్పించారు.

ఖర్బూజ విత్తనాలు వేయక ముందు భూమిలో కోళ్ల ఎరువు, పశువుల పేడ వేసి, రెండు సార్లు దున్నిస్తారు. తర్వాత, బెడ్ మేకర్‌తో బెడ్ తయారు చేసి, మల్చింగ్ షీట్ వేసి, డ్రిప్ ద్వారా సాగు నీరు అందిస్తుంటారు. రసాయన ఎరువులు, పురుగు మందులు పెద్దగా వాడకుండా సమగ్ర సస్యరక్షణ చర్యలు తీసుకుంటారు.

3 నెలలు కష్టపడి పంట పండించి, ఆ పంటను దళారులకు విక్రయిస్తే కిలోకు రూ. 5–6 ధర కూడా రాదు. అందుకని ఈ రైతు దంపతులు తామే నేరుగా వినియోగదారులకు అమ్ముతారు. విజయ సాయంత్రం తోటకు వెళ్లి కూలీల సాయంతో కాయలను తెంపుతుంటారు. వెంకటేష్ ఉదయం ఐదు గంటలకే నిద్ర లేచి, ఒకర్రిద్దరి సహాయంతో కాయలను ట్రాక్టర్‌లో లోడ్ చేస్తారు. ఇంటి వద్ద భోజనం చేసి ఉ. 8 గంటలకు జగిత్యాలకు వచ్చి, ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల వద్ద అమ్ముతారు. ఈ సమాచారం సోషల్ మీడియాలో ప్రచారం కావడంతో మంచి గిరాకీ వస్తోంది. కిలో రూ. 25 నుంచి 49 వరకు రకాన్ని బట్టి విక్రయిస్తున్నారు. మార్కెట్ కంటే తక్కువ ధరకు ఇవ్వడంతో పాటు కాయలు నాణ్యతగా, రంగురంగుల్లో ఉండటంతో వినియోగదారులు సైతం ఈ రైతు దగ్గర కొనటానికి ఆసక్తి చూపుతున్నారు.

ఖర్బూజ సాగుతో పాటు ఏడాది పొడవునా ఏదో రకం కూరగాయలు, పండుగలప్పుడు పూలు కూడా సాగు చేస్తున్నారు. ఏ పంట పెట్టినా, అందులో అధిక దిగుబడులు సాధిస్తారు. వ్యవసాయాన్ని వ్యాపారంలా మార్చితేనే రైతులకు లాభం అనే మాటను వీరు చేసి చూపిస్తున్నారు. పలువురు యువ రైతులు వీరిని అనుసరిస్తున్నారు.

– పన్నాల కమలాకర్ రెడ్డి,
సాక్షి, జగిత్యాల అగ్రికల్చర్



జగిత్యాలలో ఖర్బూజ కాయలు అమ్ముతున్న వెంకటేష్

డిమాండ్‌ను బట్టి పంట మార్చుతాం!

ఐదారు రకాల ఖర్బూజ కాయలు పండించేందుకు చాలా కష్టపడుతున్నాం. ఆ పంటను దళారులకు విక్రయిస్తే విత్తనాల ఖర్చు కూడా రావడం లేదు. మార్కెట్‌లో డిమాండ్‌ను బట్టి రకాన్ని మార్చుతాం. నా పంటకు నేనే రాజును. నేరుగా అమ్ముతున్నాను. ఫేస్‌బుక్, వాట్సాప్ వంటి సోషల్ మీడియా ద్వారా ప్రచారం చేస్తున్నాం. ప్రజలు మా దగ్గర కొనుగోలు చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. మార్కెట్‌ను గమనించుకుంటూ.. భార్యభర్త కలిసి పనిచేస్తే వ్యవసాయం తృప్తిగా ఉంటుంది. మంచి ఆదాయమూ వస్తుంది.

– బండారి వెంకటేష్, విజయ
(62818 13273)



సినెర్ ఖాతాలో మయామి మాస్టర్స్ టైటిల్...

ఆస్ట్రేలియన్ ఓపెన్ చాంపియన్, ఇటలీ టెన్నిస్ స్టార్ యానిక్ సినెర్ మూడో ప్రయత్నంలో మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. ఫ్లోరిడాలో జరిగిన పురుషుల సింగిల్స్ ఫైనల్లో సినెర్ 6-3, 6-1తో దిమిత్రోవ్ (బల్గేరియా)పై గెలిచాడు. 2021, 2023లలో రన్నరప్‌గా నిలిచిన సినెర్ ఈసారి మాత్రం టైటిల్‌ను వదల్లేదు. సినెర్‌కు 11 లక్షల డాలర్ల (రూ. 9 కోట్ల 16 లక్షలు) ప్రైజ్‌మనీతో పాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. ఈ టైటిల్‌తో సినెర్ ఏటీపీ సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ రెండో ర్యాంక్‌కు చేరుకున్నాడు. ఈ ఘనత సాధించిన తొలి ఇటలీ ప్లేయర్‌గా నిలిచాడు.

పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా



స్లో ఓవర్ రేట్ కారణంతో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు కెప్టెన్ రిషభ్ పంత్‌కు రూ. 12 లక్షల జరిమానా విధించారు. ఆదివారం విశాఖపట్నంలో చెన్నై సూపర్‌కింగ్స్‌తో జరిగిన ఢిల్లీ హోం మ్యాచ్‌లో క్యాపిటల్స్ బౌలర్లు నిర్ణీత సమయంలో కోటా ఓవర్లు పూర్తి చేయలేదు. దీంతో ఐపీఎల్ నియమావళి ప్రకారం జట్టు కెప్టెన్ పంత్‌పై జరిమానా పడింది. ఈ సీజన్‌లో మూడు మ్యాచ్‌లాడిన ఢిల్లీ ఆదివారం నాటి మ్యాచ్‌లో గెలుపు బోణీ కొట్టింది.

ఐపీఎల్‌లో నేడు

బెంగళూరు X లక్నో
వేదిక: బెంగళూరు

రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	3	3	0	6	1.249
కోల్‌కతా	2	2	0	4	1.047
చెన్నై	3	2	1	4	0.976
గుజరాత్	3	2	1	4	-0.738
హైదరాబాద్	3	1	2	2	0.204
లక్నో	2	1	1	2	0.025
ఢిల్లీ	3	1	2	2	-0.016
పంజాబ్	3	1	2	2	-0.337
బెంగళూరు	3	1	2	2	-0.711
ముంబై	3	0	3	0	-1.423

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ముంబై 'మూడు'పోయింది

ముంబై ఇన్నింగ్స్... తొలి 21 బంతుల్లో 20 పరుగులు, 4 వికెట్లు... ఇందులో రోహిత్ శర్మ సహా ముగ్గురు తొలి బంతికే డకౌట్... ముంబై ఇన్నింగ్స్ మొదలవడంతోనే ముగిసినట్లు అనిపించింది... బౌల్ట్ కొట్టిన ఈ దెబ్బ తర్వాత కొంత కోలుకున్నా 125 పరుగుల స్కోరు ఏమాత్రం సరిపోలేదు... రాజస్తాన్ రాయల్స్ అలవోకగా మరో 27 బంతులు మిగిలి ఉండగానే మ్యాచ్‌ను ముగించేసింది... సొంతగడ్డపై కూడా బోణీ చేయలేకపోయిన ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో ఇంకా గెలుపు ఖాతా తెరవని ఏకైక జట్టుగా నిలిచింది.

వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఓటమి
- రాజస్తాన్ 'హ్యాట్రిక్' విజయం
- గెలిపించిన బౌల్ట్, చహల్, పరాగ్




రోహిత్, హార్దిక్

ముంబై: ఐదుసార్లు ఐపీఎల్ చాంపియన్ ముంబై ఇండియన్స్ ఈ సీజన్‌లో పరాజయాల 'హ్యాట్రిక్' నమోదు చేసింది. వరుసగా మూడో మ్యాచ్‌లోనూ ఆ జట్టు ఓటమి పాలైంది. సోమవారం జరిగిన పోరులో రాజస్తాన్ రాయల్స్ 6 వికెట్ల తేడాతో ముంబైను ఓడించి విజయాల 'హ్యాట్రిక్' సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన ముంబై 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 125 పరుగులే చేసింది. హార్దిక్ పాండ్యా (21 బంతుల్లో 34; 6 ఫోర్లు), తిలక్ వర్మ (29 బంతుల్లో 32; 2 సిక్స్‌లు) మాత్రమే ఫర్వాలేదనిపించారు. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ట్రెంట్ బౌల్ట్ (3/22) పదునైన బౌలింగ్‌తో ప్రత్యర్థిని ఆరంభంలోనే దెబ్బ తీయగా... చహల్‌కు కూడా 3 వికెట్లు దక్కాయి. అనంతరం రాజస్తాన్ 15.3 ఓవర్లలో 4 వికెట్లకు 127 పరుగులు చేసి గెలిచింది. రియాన్ పరాగ్ (39 బంతుల్లో 54 నాటౌట్; 5 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్ధ సెంచరీతో గెలిపించాడు.

టపటపా...

రాజస్తాన్ బౌలింగ్ ధాటికి ముంబై బ్యాటింగ్ ఆరంభంలోనే కకావికలమైంది. బౌల్ట్ ధాటికి రోహిత్ శర్మ (0) తొలి బంతికే అవుట్ కాగా, తర్వాతి బంతికే నమన్ ధీర్ (0) వెనుదిరిగాడు. ఐపీఎల్‌లో అతి 'తొందరగా' రెండో ఓవర్లోనే ఇంపాక్ట్ సబ్‌గా వచ్చిన బ్రెవిస్ (0) కూడా తన తొలి బంతికే పెవిలియన్ చేరాడు. మరోవైపు ఇషాన్ కిషన్ (16) వికెట్ బర్గర్ ఖాతాలో పడింది. స్కోరు 20/4కు చేరిన దశలో తిలక్, పాండ్యా కొద్ది సేపు నిలిచి జట్టును ఆదుకున్నారు. బర్గర్ ఓవర్లో 3 ఫోర్లతో పాండ్యా ధాటిని ప్రదర్శించాడు. అయితే ఐదో వికెట్‌కు 36 బంతుల్లో 56 పరుగులు



బౌల్ట్

జోడించిన తర్వాత ముంబైని చహల్ దెబ్బ తీశాడు. తక్కువ వ్యవధిలో అతను పాండ్యా, తిలక్‌లను అవుట్ చేయడంతో ముంబై పరిస్థితి మరింత దిగజారింది. తిలక్ వెనుదిరిగాక జట్టు కోలుకోలేక పోయింది. అతను అవుటైన తర్వాత 40 బంతుల్లో 30 పరుగులే వచ్చాయి. టిమ్ డేవిడ్ (17) కూడా ప్రభావం చూపలేకపోయాడు.

రాణించిన పరాగ్...

లక్ష్యం చిన్నదే అయినా రాయల్స్ ఇన్నింగ్స్ కాస్త తడబాటుకు లోనైంది. తొలి ఓవర్లోనే యశస్వి (10) వెనుదిరగ్గా... సంజూ సామ్సన్ (12), బట్లర్ (13) కూడా విఫలమయ్యారు. అయితే పరాగ్ జాగ్రత్తగా ఆడి జట్టును విజయం దిశగా నడిపించాడు. అశ్విన్ (16)తో కలిసి అతను ఐదో వికెట్‌కు 40 పరుగులు జత చేశాడు. విజయానికి 15 పరుగులు కావాల్సిన దశలో పరాగ్ వరుసగా 6, 6, 4 బాది ముగించాడు. ఈ క్రమంలో 38 బంతుల్లో అతని అర్ధసెంచరీ పూర్తయింది.

అభిమానులు...అదే తీరు!

హార్దిక్ పాండ్యాకు ముంబై సొంత మైదానం వాంఖెడేలోనూ ఫ్యాన్స్ నుంచి నిరసన ఎదురైంది. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడంతో ఆగ్రహంగా ఉన్న అభిమానులు గత రెండు మ్యాచ్‌ల తరహాలోనే ఈసారి కూడా పాండ్యా పేరు వినిపించినప్పుడల్లా గేలి చేశారు. టాస్‌కు వచ్చినప్పుడు మాట్లాడకుండా అంతరాయం కలిగించారు. చివరకు వ్యాఖ్యాత సంజయ్ మంజ్రేకర్ 'మర్యాద పాటించండి' అని చెప్పినా జనం పట్టించుకోలేదు. అనంతరం ముంబై ఫీల్డింగ్ సమయంలో ఒక అభిమాని నేరుగా గ్రౌండ్‌లో రోహిత్ వద్దకు వెళ్లి కౌగిలించుకోవడం భద్రతా సిబ్బంది వైఫల్యాన్ని చూపించింది. అనూహ్యంగా దూసుకొచ్చిన ఫ్యాన్ రోహిత్ కూడా ఒక్కసారిగా భయపడిపోయాడు!

స్కోరు వివరాలు

ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్: ఇషాన్ కిషన్ (సి) సామ్సన్ (బి) బర్గర్ 16; రోహిత్ (సి) సామ్సన్ (బి) బౌల్ట్ 0; నమన్ (ఎల్బీ) (బి) బౌల్ట్ 0; బ్రెవిస్ (సి) బర్గర్ (బి) బౌల్ట్ 0; తిలక్ (సి) అశ్విన్ (బి) చహల్ 32; పాండ్యా (సి) (సబ్) పావెల్ (బి) చహల్ 34; చావ్లా (సి) హెట్‌మైర్ (బి) అవేశ్ 3; డేవిడ్ (సి) బౌల్ట్ (బి) బర్గర్ 17; కొయెట్జీ (సి) హెట్‌మైర్ (బి) చహల్ 4; బుమ్రా (నాటౌట్) 8; ఆకాశ్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం (20 ఓవర్లలో 9 వికెట్లకు) 125. వికెట్ల పతనం:** 1-1, 2-1, 3-14, 4-20, 5-76, 6-83, 7-95, 8-111, 9-114. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-22-3, బర్గర్ 4-0-32-2, అవేశ్ ఖాన్ 4-0-30-1, చహల్ 4-0-11-3, అశ్విన్ 4-0-27-0.

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి) డేవిడ్ (బి) మఫాకా 10; బట్లర్ (సి) చావ్లా (బి) ఆకాశ్ 13; సామ్సన్ (బి) ఆకాశ్ 12; పరాగ్ (నాటౌట్) 54; అశ్విన్ (సి) తిలక్ (బి) ఆకాశ్ 16; శుభమ్ (నాటౌట్) 8; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం (15.3 ఓవర్లలో 4 వికెట్లకు) 127. వికెట్ల పతనం:** 1-10, 2-42, 3-48, 4-88. **బౌలింగ్:** మఫాకా 2-0-23-1, బుమ్రా 4-0-26-0, ఆకాశ్ మధ్వాల్ 4-0-20-3, కొయెట్జీ 2.3-0-36-0, పీయూష్ చావ్లా 3-0-18-0.

మీరాబాయికి 'పారిస్' బెర్త్ లాంఛనమే!

వరుసగా మూడోసారి ఒలింపిక్స్‌లో పోటీపడనున్న భారత స్టార్ వెయిట్‌లిఫ్టర్



బ్యాంకాక్: భారత స్టార్ మహిళా లిఫ్టర్ మీరాబాయి చాను పారిస్ ఒలింపిక్స్‌కు అర్హత సాధించడం దాదాపు ఖరారైంది. అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ సమాఖ్య (ఐడబ్ల్యూఎఫ్) ప్రపంచకప్‌లో సోమవారం జరిగిన మహిళల 49 కేజీల ఈవెంట్‌లో టోక్యో ఒలింపిక్స్ రజత పతక విజేత మీరాబాయి మూడో స్థానంలో నిలిచింది. 6 నెలల విరామానంతరం బరిలోకి దిగిన ఆమె గ్రూప్ 'బి'లో పోటీపడి మొత్తం 184 కేజీల (81+103) బరువెత్తింది. తద్వారా మీరా మూడో స్థానంలో నిలిచింది. ఫలితమిలా ఉన్నప్పటికీ తప్పనిసరి టోర్నీల్లో పాల్గొనడంతో పాటు, 49 కేజీల కేటగిరీలో ఆమె ఒలింపిక్ క్వాలిఫికేషన్ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉంది. చైనా లిఫ్టర్ జియాన్ హుయ్‌హువా అగ్రస్థానంలో ఉండగా, ప్రతి కేటగిరీ నుంచి టాప్-10 లిఫ్టర్లకు పారిస్ ఒలింపిక్స్ బెర్త్‌లు లభిస్తాయి. దీంతో 2017 ప్రపంచ చాంపియన్ మీరాబాయి జూలైలో జరిగే ఒలింపిక్స్‌కు అర్హత పొందడం లాంఛనం కానుంది. ప్రపంచకప్ ముగిశాక క్వాలిఫయర్ల జాబితాను అధికారికంగా ప్రకటిస్తారు. మణిపూర్‌కు చెందిన మీరాబాయికివి వరుసగా మూడో ఒలింపిక్స్ క్రీడలు కానున్నాయి. రియో ఒలింపిక్స్‌లో మీరాబాయి విఫలంకాగా, టోక్యో ఒలింపిక్స్‌లో రజత పతకం సొంతం చేసుకుంది.

శాసించే స్థితిలో శ్రీలంక



చట్టోగ్రామ్: బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో టెస్టులో శ్రీలంక మూడో రోజే శాసించే స్థితిలో నిలిచింది. తద్వారా క్లీన్‌స్వీప్ దిశగా సాగుతోంది. ఓవర్‌నైట్ స్కోరు 55/1తో సోమవారం తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన బంగ్లా 68.4 ఓవర్లలో 178 పరుగులకే కుప్పకూలింది. లంక పేసర్లు అసిత ఫెర్నాండో 4, విశ్వ ఫెర్నాండో, లహిరు కుమార చెరో 2 వికెట్లు తీశారు. లంకకు తొలి ఇన్నింగ్స్‌లో 353 పరుగుల ఆధిక్యం లభించింది. రెండో ఇన్నింగ్స్ ఆరంభించిన శ్రీలంక ఆట ముగిసే సమయానికి 25 ఓవర్లలో 6 వికెట్లకు 102 పరుగులు చేసింది. మాథ్యూస్ (39 బ్యాటింగ్; 3 ఫోర్లు), ప్రభాత్ (3 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం లంక 455 పరుగుల భారీ ఆధిక్యంలో ఉంది.



మళ్లీ నంబర్‌వన్‌గా బోపన్న

ఫ్లోరిడా: అసోసియేషన్ ఆఫ్ టెన్నిస్ ప్రొఫెషనల్స్ (ఏటీపీ) డబుల్స్ ర్యాంకింగ్స్‌లో భారత వెటరన్ స్టార్ రోహన్ బోపన్న మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్‌ను దక్కించుకున్నాడు. గతవారం రెండో ర్యాంక్‌లో నిలిచిన 44 ఏళ్ల రోహన్ బోపన్న తన భాగస్వామి మాథ్యూ ఎబ్డెన్ (ఆస్ట్రేలియా)తో కలిసి మయామి ఓపెన్ మాస్టర్స్ సిరీస్ టైటిల్‌ను సొంతం చేసుకున్నాడు. దాంతో సోమ వారం విడుదల చేసిన ఏటీపీ తాజా ర్యాంకింగ్స్‌లో బోపన్న ఒక స్థానం మెరుగుపర్చుకొని టాప్ ర్యాంక్‌ను అందుకున్నాడు. పురుషుల సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో భారత ప్లేయర్ సుమిత్ నగాల్ కెరీర్ బెస్ట్ 95వ ర్యాంక్‌కు చేరుకున్నాడు. గత వారం 97వ ర్యాంక్‌లో నిలిచిన సుమిత్ రెండు స్థానాలు పురోగతి సాధించాడు. భారత్‌కే చెందిన రామ్‌కుమార్ రామనాథన్ 61 స్థానాలు ఎగబాకి 349వ ర్యాంక్‌లో నిలిచాడు.

సినిమా



● త్రిష ● సమంత

కథ వినగానే మా నాన్న గుర్తొచ్చారు

''మనకు ఏ కష్టం వచ్చినా నేనున్నానంటూ ధైర్యం చెప్పే వ్యక్తి కుటుంబంలో ఒకరు ఉంటారు. ఆ ఒక్కరే ఫ్యామిలీ స్టార్. మా కుటుంబంలో ఫ్యామిలీ స్టార్ మా నాన్న గోవర్ధన్. 'ఫ్యామిలీ స్టార్' కథ వింటున్నప్పుడు నాకు మా నాన్న గుర్తొచ్చారు. అందుకే ఈ సినిమాలో హీరో పాత్రకి గోవర్ధన్ అనే పేరు పెట్టమని పరశురామ్‌కి చెప్పాను. ఈ నెల 8న మా నాన్న పుట్టినరోజు. 'ఫ్యామిలీ స్టార్' చిత్రం విషయంలో ఆయన గర్వపడతారని ఆశిస్తున్నాను'' అని హీరో విజయ్ దేవరకొండ అన్నారు. - విజయ్ దేవరకొండ

పరశురామ్ పెట్ల దర్శకత్వంలో విజయ్ దేవరకొండ, మృణాల్ ఠాకూర్ జంటగా నటించిన చిత్రం 'ఫ్యామిలీ స్టార్'. 'దిల్' రాజు, శిరీష్ నిర్మించారు. వాసు వర్మ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించిన ఈ సినిమా ఈ నెల 5న తెలుగు, తమిళ, హిందీ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన ప్రీ రిలీజ్ ప్రెస్‌మీట్‌లో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ– ''రాజుగారి బ్యానర్‌లో నేను 'కేరింత' సినిమా ఆడిషన్‌కు వెళ్లి, సెలెక్ట్ కాలేదు. ఇప్పుడు 'ఫ్యామిలీ స్టార్' చేశాను. లాక్ డౌన్‌లో నా స్టాఫ్ జీతాలు, మెయింటెనెన్స్‌కి ఇబ్బంది కలిగింది. అప్పుడు రాజుగారే పంపించారు.. ఆయనకు సినిమా చేయాలని అప్పుడే అనుకున్నా. ఈ సినిమాకి నాకు పేరొస్తే ఆ క్రెడిట్ పరశురామ్‌కి ఇస్తాను'' అన్నారు. 'దిల్' రాజు మాట్లాడుతూ– ''విజయ్, పరశురామ్ కలిసి 'గీత గోవిందం' వంటి బ్లాక్ బస్టర్ చేశారు. 'ఫ్యామిలీ స్టార్' కూడా సక్సెస్ అవుతుందనే నమ్మకం ఏర్పడింది. విజయ్ ఈ సినిమాలో 360 డిగ్రీస్ క్యారెక్టర్ చేశాడు. నిర్మాతల గురించి ఆలోచించే హీరో విజయ్. అందుకే అతనితో మరో రెండు సినిమాలు చేయబోతున్నా'' అన్నారు. ''ఫ్యామిలీ స్టార్'లో ఇందు పాత్రను పోషించగలనా? లేదా అని భయపడ్డాను. కానీ, విజయ్, 'దిల్' రాజు, డైరెక్టర్‌గార్లు సపోర్ట్ ఇచ్చారు'' అన్నారు మృణాల్ ఠాకూర్.



● మృణాల్, విజయ్ దేవరకొండ, 'దిల్' రాజు

కష్టాల్లో మంకీ మేన్?

'స్లమ్ డాగ్ మిలియనీర్' ఫేమ్ నటుడు దేవ్ పటేల్ తొలి ప్రయత్నంగా దర్శకత్వం వహించిన చిత్రం 'మంకీ మేన్'. ఈ చిత్రంలో కిడ్ అనే లీడ్ రోల్‌లోనూ నటించారు దేవ్. కాగా ఈ నెల 5న యూఎస్‌లో ఈ చిత్రం విడుదల కానుంది. ఇండియాతో పాటు పలు దేశాల్లో ఈ నెల 19న విడుదల చేయాలనుకున్నారు. అయితే ఇండియాలో 'మంకీ మేన్' కష్టాలు ఎదుర్కొంటోందని టాక్. ఇప్పటికే ఈ చిత్రం పలు విదేశీ చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కాగా వీక్షకుల నుంచి మంచి స్పందన లభించింది. తొలి చిత్రం అయినా దేవ్ అద్భుతంగా తీశాడనీ, కాన్సెప్ట్ బాగుందనీ అక్కడివారు అంటున్నారు. అయితే కాన్సెప్ట్ విషయంలోనే ఇండియాలో 'మంకీ మేన్'కి కష్టాలు ఎదురవుతున్నాయనే వార్త ప్రచారంలోకి వచ్చింది. తన తల్లిని చంపినవారిపై పగ తీర్చుకోవడానికి హీరో హనుమంతుడి వేషంలోకి మారడం అనేది ఈ చిత్రం ప్రధానాంశం. ఆ వేషంలో అతను చేసే మారణకాండ మరీ హింసాత్మకంగా ఉందని, కొందరి ప్రేక్షకుల మనోభావాలను దెబ్బతీసే అవకాశం ఉందని ఇక్కడి సెన్సార్ బోర్డ్ భావిస్తోందట. అందుకే ఈ నెల 19న ఇండియాలో 'మంకీ మేన్' రిలీజ్ కాకపోవచ్చని భోగట్టా. సెన్సార్ చెప్పిన మార్పులు చేసి, 25న విడుదల చేస్తారని సమాచారం. ఇక ఈ చిత్రం ద్వారా తెలుగు అమ్మాయి శోభితా ధూళిపాళ హాలీవుడ్‌కి పరిచయం అవుతున్నారు. ఇంకా మకరంద్ దేశ్‌పాండే, సికందర్ ఖేర్, అశ్వినీ కల్సేకర్ వంటి పలువురు భారతీయ తారలు కూడా ఈ చిత్రంలో నటించారు.



● 'మంకీ మేన్' పోస్టర్

ఉగాదికి టైటిల్

అభిషేక్ పిక్చర్స్ బ్యానర్‌లో ప్రొడక్షన్ నంబర్ 9గా ఓ సినిమా రూపొందనుంది. ఈ చిత్రం టైటిల్‌ను ఈ నెల 9న ఉగాది సందర్భంగా ప్రకటించనున్నట్లు పేర్కొని ప్రీ లుక్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. పుర్రెలు, అగ్ని, మంచు పర్వతాల మధ్య నడుస్తున్న అఘోరా లుక్ పోస్టర్‌లో ఉంది. పోస్టర్‌పై స్మరామి నారాయణన్ తత్వమవ్యయం అని రాసి ఉంది. ''లార్జర్ దెన్ లైఫ్ కథతో, ఆధ్యాత్మిక నేపథ్యంలో భారీ ఎత్తున ఈ సినిమాని రూపొందించనున్నాం. పూర్తి వివరాలను త్వరలో తెలియజేస్తాం'' అని నిర్మాణ సంస్థ ప్రతినిధులు పేర్కొన్నారు.

అల్లు అర్జున్‌కి జోడీగా..?

'పుష్ప: ది రైజ్' వంటి బ్లాక్‌బస్టర్ మూవీతో పాన్ ఇండియా స్థాయిలో క్రేజ్ సొంతం చేసుకున్నారు హీరో అల్లు అర్జున్. ప్రస్తుతం ఆయన 'పుష్ప: ది రూల్' సినిమా చేస్తున్నారు. ఆ చిత్రం పూర్తయిన తర్వాత తమిళ దర్శకుడు అట్లీ దర్శకత్వంలో ఓ సినిమా చేయనున్నారంటూ కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమాకి సంబంధించిన స్క్రిప్ట్ వర్క్ జరుగుతోంది. అందులో భాగంగానే హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులను ఫైనల్ చేసే పనిలో పడ్డారట అట్లీ. కాగా ఈ మూవీలో అల్లు అర్జున్‌కి జోడీగా నటించే హీరోయిన్ల జాబితాలో సమంత, త్రిష పేర్లు వినిపిస్తున్నాయి. తొలుత త్రిష పేరు తెరపైకి వచ్చింది. అల్లు అర్జున్‌కి ఆమె జోడీగా నటించనున్నారనే వార్తలు కోలీవుడ్‌లో హల్‌చల్ చేశాయి. అయితే తాజాగా సమంత పేరు వినిపిస్తోంది. అట్లీ దర్శకత్వం వహించిన 'తేరి' సినిమాలో విజయ్‌కి జోడీగా నటించారు సమంత. అలాగే 'సన్నాఫ్ సత్యమూర్తి' చిత్రంలో అల్లు అర్జున్‌తో జతకట్టారీ బ్యూటీ. అలాగే 'పుష్ప: ది రైజ్' మూవీలో 'ఊ అంటావా...' అంటూ ప్రత్యేక పాట చేశారు. తాజాగా వీరి జోడీ రిపీట్ కానుందనే వార్తలు నెట్టింట వైరల్‌గా మారాయి. మరి అల్లు అర్జున్ సరసన నటించేది సమంతా? త్రిషా? లేకుంటే ఇద్దరూ నటిస్తారా? ఈ ఇద్దరూ కాకుండా వేరే కథానాయిక నటిస్తారా? అనే విషయం తెలియాలంటే మరి కొన్ని రోజులు వేచి చూడాలి. ఈ అక్టోబర్‌లో అల్లు అర్జున్–అట్లీ మూవీ సెట్స్ మీదకు వెళ్లనుందని టాక్.

టాక్సిక్‌లో ఫిక్స్?

'కేజీఎఫ్'తో పాన్ ఇండియా స్టార్‌గా మారిపోయిన యశ్ హీరోగా రూపొందనున్న తాజా చిత్రం 'టాక్సిక్'. ఈ చిత్రం గురించి ఏదో ఒక వార్త ప్రచారంలోకి వస్తోంది. మలయాళ దర్శకురాలు గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహించనున్న ఈ చిత్రంలో కథానాయిక ఎవరు? అనేది ఎప్పటికప్పుడు హాట్ టాపిక్ అవుతోంది. ఈ చిత్రంలో యశ్‌కి సోదరిగా కరీనా కపూర్ ఫిక్స్ అనే వార్త వచ్చిన నేపథ్యంలో తాజాగా కథానాయికలుగా శ్రుతీహాసన్, కియారా అద్వానీ ఫిక్స్ అనే వార్త వైరల్‌గా మారింది. ఈ ఇద్దరూ దాదాపు ఖరారైనట్లేనని భోగట్టా. ముఖ్యంగా 'టాక్సిక్'లో శ్రుతి ఎంట్రీ షురూ అనడానికి ఓ ఉదాహరణ కూడా ఉంది. ఈ చిత్రం టైటిల్ సాంగ్‌ను శ్రుతీహాసన్ పాడారు. సో... సినిమాలో ఓ కథానాయికగా ఆమె నటించే చాన్స్ ఉందని భోగట్టా. త్వరలో ఈ చిత్రం ఆరంభం కానుంది. మరి.. హీరోయిన్లుగా శ్రుతి, కియారా ఫిక్స్ అయ్యారా? అనేది త్వరలోనే తెలిసిపోతుంది. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపొందనున్న ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 10న రిలీజ్ కానుంది.



● కియారా ● శ్రుతీహాసన్

థ్రిల్లింగ్ కేస్

అజయ్, రవి ప్రకాశ్, హర్షిణి, మాండవియా సెజల్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కేస్ నంబర్ 15'. తడకల వంకర్ రాజేశ్ స్వీయ దర్శకత్వంలో బీజీ వెంచర్స్‌పై నిర్మించిన ఈ సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రం టీజర్‌ని తెలంగాణ ఫిల్మ్ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, ట్రైలర్‌ని నిర్మాత సి. కల్యాణ్ విడుదల చేయగా, ప్రొడ్యూసర్ కౌన్సిల్ సెక్రటరీ ప్రసన్న కుమార్ లిరికల్ వీడియోను లాంచ్ చేశారు. చిత్ర దర్శక–నిర్మాత తడకల వంకర్ రాజేశ్ మాట్లాడుతూ–''సస్పెన్స్, క్రైమ్, థ్రిల్లర్‌గా రూపొందిన చిత్రం 'కేస్ నంబర్ 15'. ఇందులోని సన్నివేశాలు ప్రేక్షకులను ఉత్కంఠకు గురి చేస్తాయి'' అన్నారు.



● అజయ్

లక్ష్యం ఏంటి?

''భరతనాట్యం' సినిమా కథ ఫ్రెష్‌గా అనిపిస్తుంది. పాత్రలకు ఎదురైన పరిస్థితులు ప్రేక్షకులని నవ్విస్తాయి. చాలా పాత్రలున్నప్పటికీ వాటి లక్ష్యం ఒకటే ఉంటుంది. అది ఏంటి? అన్నది సినిమాలో చూడాలి'' అన్నారు డైరెక్టర్ కేవీఆర్ మహేంద్ర. సూర్యతేజ ఏలే, మీనాక్షీ గోస్వామి జంటగా నటించిన చిత్రం 'భరతనాట్యం'. పాయల్ సరాఫ్ నిర్మించిన ఈ మూవీ ఈ నెల 5న విడుదలవుతోంది. కేవీఆర్ మహేంద్ర మాట్లాడుతూ– ''నేను తీసిన 'దొరసాని' దర్శకుడిగా తృప్తినిచ్చింది. ఆ సినిమా తర్వాత ఓ ప్రముఖ హీరోతో క్రైమ్ కామెడీ మూవీ అనుకున్నా. కొన్ని కారణాల వల్ల ఆగిపోయింది. సూర్యతేజ చెప్పిన 'భరతనాట్యం' ఐడియా నచ్చడంతో స్క్రిప్ట్ వర్క్ చేసి, ఆ తర్వాత ఈ మూవీ చేశాం. 'భరతనాట్యం' లాంటి ఎలిమెంట్‌తో ఇప్పటివరకూ సినిమా రాలేదు'' అన్నారు.



● కేవీఆర్ మహేంద్ర

సాక్షి బిజినెస్
మంగళవారం
2-4-2024

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సూచీ	మార్పు	ముగింపు
సెన్సెక్స్ ▲	363	74,015
నిఫ్టీ ▲	135	22,462

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)

సూచీ	విలువ	మార్పు
నాస్‌డాక్	16,360	▽ 19
డోజోన్స్	39,539	▽ 269
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,953	▲ 21
డాక్స్	18,492	▲ 15
షాంఘై	3,077	▲ 36
నికాయ్	39,803	▽ 566

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై

బంగారం (99.9 స్వచ్ఛత)	68,663
బంగారం (99.5 స్వచ్ఛత)	68,388
వెండి (కేజీ)	75,111

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

	కరెన్సీ		కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్		81.57	85.25
£	బ్రిటన్ పౌండ్		102.78	107.69
€	యూరో		87.75	92.21
¥	జపాన్ ఎన్ (100)		42.00	68.00
AU$	ఆస్ట్రేలియా డాలర్		51.94	56.82
S$	సింగపూర్ డాలర్		59.47	64.19
SAR	సౌదీ రియాల్		21.33	22.91
UAE D	యూఏఈ దిర్హామ్		21.81	23.60
¥	చైనా యువాన్		10.41	12.49



ఆర్థికాభివృద్ధి ప్రాధాన్యత కావాలి!

90 సంవత్సరాల స్మారకోత్సవ కార్యక్రమంలో ఆర్‌బీఐకి ప్రధాని మోదీ పిలుపు

ముంబై: ఆర్థిక వ్యవస్థ స్థిరత్వం, విశ్వాసాన్ని పెంపొందించడంసహా వచ్చే దశాబ్ద కాలంలో దేశాభివృద్ధే రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) ప్రధాన ప్రాధాన్యత కావాలని ప్రధాని నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. ఆర్‌బీఐ 90 సంవత్సరాల స్మారకోత్సవ కార్యక్రమాన్ని ముంబైలో ప్రారంభించిన సందర్భంగా మోదీ ప్రసంగించారు. భారత్ తన లక్ష్యాన్ని చేరుకోవడానికి రాబోయే దశాబ్దం ఎంత ముఖ్యమో, ఆర్‌బీఐ 2035 నాటికి 100 సంవత్సరాల విజయవంతమైన ప్రయాణం కూడా అంతే ముఖ్యమని పేర్కొన్నారు. దేశ ఆర్థిక స్వావలంబన, అంతర్జాతీయంగా రూపాయికి మరింత ఆమోదయోగ్యత వంటి అంశాలను ఈ సందర్భంగా ప్రస్తావించారు. ప్రధానికి ఈ సందర్భంగా ఆర్‌బీఐ గవర్నర్ శక్తికాంతదాస్ ఒక జ్ఞాపికను అందజేశారు. భారత దేశ ఆర్థిక ప్రగతికి మూలస్తంభంగా పనిచేసే స్థిరమైన, బలమైన ఆర్థిక వ్యవస్థను పటిష్టపరచడంపై ఆర్‌బీఐ దృష్టి సారిస్తుందని గవర్నర్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఆర్‌బీఐ అపార అనుభవం, నైపుణ్యతలు అంతర్జాతీయ అనిశ్చితులను ఎదుర్కొనడంలో దోహదపడిందని ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ కార్యక్రమంలో పేర్కొన్నారు. మహారాష్ట్ర గవర్నర్ రమేష్ బెయిస్, ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ షిండే, ఉప ముఖ్యమంత్రులు దేవేంద్ర ఫడ్నవీస్, అజిత్ పవార్, ఆర్థిక శాఖ సహాయ మంత్రులు భగవత్ కిషన్‌రావ్ కరాడ్, పంకజ్ చౌదరి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

బంగారం మెరుపులు

- న్యూఢిల్లీలో ఒకేరోజు 1,070 అప్
- ఆల్‌టైమ్ హై రూ. 68,420కి చేరిక



న్యూఢిల్లీ: అమెరికా సెంట్రల్ బ్యాంక్– ఫెడ్ ఫండ్ రేటు తగ్గుతుందన్న అంచనాలు, ఈజీ మనీ విశ్లేషణలు, ద్రవ్యోల్బణం భయాలు బంగారం ధరను గరిష్ట స్థాయిలకు తీసుకువెళుతున్నాయి. చైనా డిమాండ్ కూడా పసిడి పరుగుకు కారణమవుతోంది. దేశ రాజధాని న్యూఢిల్లీలో పూర్తి స్వచ్ఛత 10 గ్రాముల ధర సోమవారం ఒకేరోజు రూ.1,070 ఎగసి, రూ.68,420కి ఎగసింది. ఇక వెండి కూడా కేజీకి రూ.1,120 ఎగసి రూ.78,570కి చేరింది. మరోవైపు తెలుగు రాష్ట్రాల్లో చూస్తే.. హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల ధర రూ.68,800కు చేరింది. 22 క్యారెట్లు 10 గ్రాముల ధర రూ.63,296కు ఎగసింది. విజయవాడలో ఈ ధరలు వరుసగా రూ.70,700, రూ.65,000గా నమోదయ్యాయి. విశాఖలో వరుసగా రూ.71,000, రూ.64,000 వరకూ ఎగశాయి. దేశీయంగా మల్టీ కమోడిటీ ఎక్స్ఛేంజ్ ఫ్యూచర్స్‌లో జూన్ కాంట్రాక్ట్ ధర ఒక దశలో రూ.978 ఎగసి రూ.68,679కి చేరింది. విదేశీ మార్కెట్లలో స్పాట్ కామెక్స్ బంగారం ధరలు ఔన్స్‌కు (31.1గ్రాములు) 2,266 డాలర్లకు పెరిగింది.

ఏపీలో అరబిందో ప్లాంట్లు ప్రారంభం



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: అరబిందో ఫార్మా అనుబంధ కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో నెలకొల్పిన ప్లాంట్లు ప్రారంభం అయ్యాయి. కాకినాడ సెజ్‌లో లైఫియస్ ఫార్మా నెలకొల్పిన 15,000 మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యంగల పెన్–జీ ప్లాంటుతోపాటు 1.8 లక్షల మెట్రిక్ టన్నుల గ్లూకోజ్ ఫెసిలిటీలో ఉత్పత్తి ప్రారంభం అయింది. ఇదే సెజ్‌లో క్యూల్ ఫార్మా స్థాపించిన 3,600 మెట్రిక్ టన్నుల వార్షిక తయారీ సామర్థ్యంగల 6–అమినో పెనిసిలానిక్ యాసిడ్ (6–ఏపీఏ) కేంద్రంలో కార్యకలాపాలు మొదలయ్యాయి. పూర్తిగా ఎగుమతుల కోసం అనకాపల్లి జిల్లాలోని తాడి వద్ద యూజియా స్టెరైల్స్ ఏర్పాటు చేసిన 28.5 కోట్ల యూనిట్ల వార్షిక ఉత్పత్తి సామర్థ్యంగల ఆంపూల్స్, వయల్స్ ప్లాంటు షురూ అయింది. శ్రీకాకుళం జిల్లాలో ఆరోయాక్టివ్ ఫార్మాకు చెందిన ఏటా 13,200 మెట్రిక్ టన్నులు ఉత్పత్తి చేయగల రెడీ టు కంప్రెస్ గ్రాన్యులేటెడ్ ప్రొడక్ట్స్ ప్లాంటులోనూ కార్యకలాపాలు ప్రారంభం అయ్యాయి.

జీఆర్‌టీ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్' విజేతలకు బహుమతులు

హైదరాబాద్: పండుగ సీజన్ సందర్భంగా జీఆర్‌టీ జ్యువెలర్స్ నిర్వహించిన 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్'లో పాల్గొన్న కస్టమర్లలో 1,062 మంది విజేతలుగా ఎన్నికయ్యారు. గతేడాది డిసెంబర్ 23 నుంచి ఈ జనవరి 31 మధ్య జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూంల్లో రూ.5వేలకు పైగా కొనుగోలు చేసిన కస్టమర్లకు బహుమతులు గెలుచుకునే అవకాశం అందించింది. మొత్తం 1062 విజేతల్లో 24 మంది మహీంద్రా ఎక్స్‌యూవీలు, 47 మంది రూ.2 లక్షల విలువైన వజ్రాల నెక్లెస్‌లు, 47 మంది టీవీఎస్ జూపిటర్ 125 సీసీ బైకులు, 236 మంది (ఒక్కొక్కరికి) 10 గ్రాముల బంగారు నాణేలు, 708 మంది (ఒక్కొక్కరికి) 100 గ్రాముల వెండి నాణేలు అందుకున్నారు.

42 లక్షల వాహన విక్రయాలు

2023– 24లో రికార్డు స్థాయి అమ్మకాలు ● 2022–23తో పోల్చితే 9 శాతం అధికం



న్యూఢిల్లీ: 2023–24 ఆర్థిక సంవత్సరం ఆటో పరిశ్రమకు కలిసొచ్చింది. మొత్తం అన్ని కంపెనీలు కలిపి 42.30 లక్షల ప్యాసింజర్ వాహనాలు విక్రయించాయి. 2022–23లో అమ్ముడైన 38.9 లక్షల వాహనాలతో పోలిస్తే ఇవి 9% అధికం. ప్రయాణికుల వాహనాల వాటాలో స్పోర్ట్స్ యుటిలిటీ వాహనాల వాటా 43% నుంచి 50.04 శాతానికి పెరిగింది. మారుతీ సుజుకీ, హ్యుందాయ్, టాటా మోటార్స్, మహీంద్రాఅండ్‌మహీంద్రా(ఎంఅండ్ఎం), ఎంజీ మోటార్స్, టయోటా, ఐషర్ మోటార్స్, టీవీఎస్ మోటార్స్ కంపెనీలు డీలర్లకు రికార్డు స్థాయిలో వాహనాలను సరఫరా చేశాయి.

➡ మారుతీ సుజుకీ 2022–23లో మొత్తం 19,66,164 వాహనాలను విక్రయించగా, ఈ సంఖ్య 8% పెరిగి 21,35,323 లక్షలకి చేరింది. ఇందులో దేశీయ సరఫరాలే 17,59,881 యూనిట్లు. కాగా ఒక్క మార్చిని తీసుకుంటే, కంపెనీ వార్షికంగా 10 శాతం వృద్ధితో 1.87 లక్షల వాహనాలను విక్రయించింది.

➡ ద్విచక్ర వాహన విభాగంలో 2023–24లో టీవీఎస్ మోటార్స్ 41.91 లక్షల యూనిట్లను, సుజుకీ మోటార్‌సైకిల్ ఇండియా 11.33 లక్షల వాహనాలు, రాయల్ ఎన్‌ఫీల్డ్ 8.34 లక్షల వాహనాలను విక్రయించాయి.

ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్

కొత్త నిబంధన అమల్లోకి



న్యూఢిల్లీ: 'ఒక వాహనానికి ఒకే ఫాస్టాగ్' నిబంధన ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది. పలు వాహనాలకు ఒకే ఫాస్టాగ్‌ను వాడటం లేదా ఒకే వాహనానికి పలు ఫాస్టాగ్‌లను వాడటం వంటి ధోరణులను నివారించేందుకు దీన్ని ప్రవేశపెట్టినట్లు ప్రభుత్వ రంగ నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా అధికారి ఒకరు తెలిపారు. ఎలక్ట్రానిక్ టోల్ కలెక్షన్ వ్యవస్థను మరింత సమర్థమంతంగా తీర్చిదిద్దేందుకు, టోల్ ప్లాజాల దగ్గర రద్దీని తగ్గించి.. వాహనాలు నిరాటంకంగా రాకపోకలు సాగించే వీలు కల్పించేందుకు ఎన్‌హెచ్ఏఐ 'ఒక వాహనం ఒక ఫాస్టాగ్' విధానాన్ని ప్రతిపాదించింది.

మార్చిలో జీఎస్‌టీ వసూళ్ల సునామీ

న్యూఢిల్లీ: భారత్ ఎకానమీ చక్కటి పనితీరుకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) వసూళ్లు అద్దం పడుతున్నాయి. 2023–24 ఆర్థిక సంవత్సరం చివరినెల మార్చిలో అంతక్రితం ఏడాది ఇదే నెలతో పోల్చితే వసూళ్లు 11.5 శాతం ఎగశాయి. విలువలో రూ.1.78 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. ఇక 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకూ చూస్తే జీఎస్‌టీ వసూళ్లు వార్షికంగా 11.7 శాతం వృద్ధితో రూ.20.14 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నెలవారీ వసూళ్లు సగటున రూ.1.68 లక్షల కోట్లు. గత ఏడాది ఇదే కాలంలో ఈ సగటు రూ. 1.5 లక్షల కోట్లు. ఇక తాజా సమీక్షా నెల్లో వసూళ్లు కొత్త పరోక్ష పన్నుల వ్యవస్థ ప్రారంభమైన తర్వాత (2017 జూలై 1) అతి పెద్ద రెండవ భారీ వసూళ్లు. గత ఆర్థిక సంవత్సరం మొదటి నెలలోనే (2023 ఏప్రిల్) రికార్డు స్థాయిలో జీఎస్‌టీ వసూళ్లు (రూ.1.87 లక్షల కోట్లు) నమోదయిన సంగతి తెలిసిందే.

కొత్త ఆర్థిక సంవత్సరానికి లాభాల స్వాగతం

- ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాలు నమోదు చేసిన సూచీలు
- 74 వేల స్థాయిపైన సెన్సెక్స్
- 135 పాయింట్లు పెరిగిన నిఫ్టీ
- 3 రోజుల్లో రూ.10.58 లక్షల కోట్లు పెరిగిన ఇన్వెస్టర్ల సంపద

ముంబై: కొత్త ఆర్థిక సంవత్సరానికి(2024–25) దేశీయ స్టాక్ సూచీలు సరికొత్త రికార్డుతో స్వాగతం పలికాయి. దలాల్ స్ట్రీట్‌లో మూడోరోజూ బుల్ జోరు కొనసాగడంతో సోమవారం ఇంట్రాడేలో జీవితకాల గరిష్టాన్ని నమోదు చేశాయి. ఫెడ్ వడ్డీరేటు తగ్గుతుందన్న అంచనాలుసహా ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం లాభాలతో మొదలయ్యాయి. ట్రేడింగ్ ప్రారంభంలోనే బ్యాంకింగ్, ఫైనాన్షియల్, మెటల్, ఐటీ షేర్లు రాణించడంతో సెన్సెక్స్ 602 పాయింట్లు పెరిగి 74,253 వద్ద, నిఫ్టీ 203 పాయింట్లు బలపడి 22,530 వద్ద జీవితకాల గరిష్టాలను నమోదు చేశాయి. అయితే సరికొత్త రికార్డుల స్థాయిల వద్ద ఎఫ్ఎంసీజీ, ఐటీ షేర్లలో లాభాల స్వీకరణ చోటు చేసుకోవడంతో సూచీలు దాదాపు సగం లాభాలు కోల్పోయాయి. ట్రేడింగ్ ముగిసే సరికి సెన్సెక్స్ 363 పాయింట్లు పెరిగి 74,015 వద్ద, నిఫ్టీ 135 పాయింట్ల లాభంతో 22,462 వద్ద నిలిచాయి. చిన్న, మధ్య తరహా షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో బీఎస్ఈ మిడ్, స్మాల్ సూచీలు వరుసగా 1.64%, 2.98% చొప్పున రాణించాయి. బ్యాంకుల వార్షిక ఖాతా ముగింపు సందర్భంగా ఫారెక్స్ మార్కెట్ పనిచేయలేదు. ఈస్టర్ రోజు కావడంతో యూరప్ మార్కెట్లు పనిచేయలేదు.

మార్కెట్లో మరిన్ని సంగతులు



➡ ఆర్థిక రికవరీకి సంకేతంగా చైనా తయారీ రంగ పీఎంఐ గణాంకాలు మెప్పించడంతో దేశీయ మెటల్ షేర్లు మెరిశాయి.

➡ మార్కెట్ ర్యాలీలో భాగంగా అదానీ గ్రూప్ షేర్లు రాణించాయి.

➡ గడిచిన మూడు రోజుల్లో సెన్సెక్స్ 1,544(2.13%) ర్యాలీతో బీఎస్ఈలో రూ.10.58 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ కంపెనీల మొత్తం విలువ రూ. 393.24 లక్షల కోట్లకు చేరింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
2-4-2024	
విశాఖ	415–00
చిత్తూరు	458–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	403–00
విజయవాడ	403–00
హైదరాబాద్	380–00
వరంగల్	382–00

తిరుగుబాటుతో తత్తరపాటు

▶ మొదటి పేజీ తరువాయి


పని చేస్తున్న రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్ నిమ్మగడ్డ రమేష్‌కుమార్ నేతృత్వంలో కొత్తగా పుట్టుకొచ్చిన 'సిటిజన్ ఫర్ డెమోక్రసీ' వరుస ఫిర్యాదులతో ఇంటివద్ద పింఛన్ల పంపిణీకి బ్రేక్ పడింది. ఆ సంస్థ ఈ ఏడాది ఫిబ్రవరి 23, 25వ తేదీల్లో రెండు విడతలుగా ఇచ్చిన ఫిర్యాదుల మేరకు పింఛన్ల పంపిణీ నుంచి వలంటీర్లను దూరంగా ఉంచడంతోపాటు వారి వద్ద ఉన్న మొబైల్ ఫోన్లను సైతం స్వాధీనం చేసుకోవాలని కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశించింది. వాస్తవాలు ఇవి కాగా ఇందులో అధికార పార్టీ కుట్ర దాగి ఉందంటూ ఈనాడు రామోజీ తన విద్వేషాన్ని కుమ్మరించారు.

ఆపాలని అడిగి ఆపై నాటకాలు..


వలంటీర్ల ద్వారా ఇంటివద్ద పింఛన్ల పంపిణీని వ్యతిరేకిస్తూ టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు కె.అచ్చెన్నాయుడు ఈ ఏడాది ఫిబ్రవరి ఒకటో తేదీన కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేయడం గమనార్హం. మరోవైపు టీడీపీ నాయకులు 'ఛలో సచివాలయం' పేరుతో మీడియా ముందు హడావుడి చేస్తూ రాజకీయ డ్రామాను రక్తి కట్టిస్తున్నారు.

అన్నీ ఆలోచించాకే..


సచివాలయాల ఉద్యోగులు ఇన్నాళ్లూ విధి నిర్వహణలో భాగంగా లబ్ధిదారుల ఇళ్ల వద్దకు వెళ్లేందుకు వలంటీర్లపై ఆధారపడే పని చేస్తూ వచ్చారు. ఇప్పుడు పింఛన్ల పంపిణీ బాధ్యతను వారికి అప్పగించినా లబ్ధిదారుల పేర్లు తెలుస్తాయి కానీ ఇళ్ల వివరాలు తెలిసే అవకాశం ఉండదు. మళ్లీ వారు తిరిగి గ్రామంలో ఎవరో ఒకరిపై ఆధారపడే పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల అభిమానులు వారిని ప్రభావితం చేసే అవకాశం ఉంటుంది. దీనిపై అధికారులు తర్జనభర్జన పడిన అనంతరమే గ్రామ, వార్డు సచివాలయాల వద్ద పింఛన్ల పంపిణీకి నిర్ణయం తీసుకున్నట్లు అధికార వర్గాలు చెబుతున్నాయి. చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడు 2019 ఎన్నికల సమయంలో స్వచ్ఛంద పదవీ విరమణ చేసిన నాన్ ఐఏఎస్ అధికారిని తొలుత ఓఎస్‌డీగా నియమించుకొని తరువాత సెర్ప్ సీఈవోగా బాధ్యతలు అప్పగించారు. అదే అధికారి నేతృత్వంలో ఎన్నికల వేళ మహిళా ఓటర్లను ప్రభావితం చేసేలా పొదుపు మహిళలకు పసుపు కుంకుమ తాయిలాలు విడుదల చేయడం గమనార్హం.




గత ఏడాది డిసెంబర్‌లో సుప్రీం కోర్టులో నిమ్మగడ్డ వేసిన పిటిషన్



ఈ ఏడాది జనవరి 12న వలంటీర్లకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో వేసిన పిటిషన్



వలంటీర్లకు వ్యతిరేకంగా ఏపీ హైకోర్టులో వేసిన పిటిషన్



ఎన్నికల కమిషనర్ హోదాలో నిమ్మగడ్డ ఇచ్చిన ఆదేశాలకు వ్యతిరేకంగా గతంలో హైకోర్టు ఇచ్చిన స్టే



వలంటీర్లకు వ్యతిరేకంగా టీడీపీ ఎలక్షన్ కమిషన్‌కు ఇచ్చిన ఫిర్యాదు


ఏప్రిల్ 3 నుంచి పింఛన్ల పంపిణీ
- బ్యాంకులకు 1న ఆర్థిక సంవత్సరం ముగింపు సెలవు.. 2వ తేదీ ఆదివారం
- దీంతో 3వ తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేయాలని సెర్ప్ ఆదేశం

గత ఏడాది ఏప్రిల్‌లో 3వ తేదీ నుంచి పింఛన్‌లు పంపిణీ చేయనున్నట్లు అప్పట్లో సెర్ప్ నిర్ణయం

పది రోజుల క్రితమే నిర్ణయం..

ఈ నెలలో పింఛన్ల పంపిణీని మూడో తేదీ నుంచి చేపట్టనుండటంపైనా టీడీపీ, ఈనాడు దుష్ప్రచారానికి దిగాయి. ఆర్థిక సంవత్సరం ముగింపుతో పాటు బ్యాంకులకు వరుసగా సెలవులు రావడంతో ఏప్రిల్ 3వ తేదీ నుంచి అవ్వాతాతలకు పింఛన్ల పంపిణీ ప్రారంభించాలని పది రోజుల కిత్రం ఎన్నికల కోడ్ వచ్చాకే అధికారుల స్థాయిలో నిర్ణయం జరిగింది. ఈ విషయాన్ని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి జవహర్‌రెడ్డి కలెక్టర్ల వీడియో కాన్ఫరెన్స్‌లో అప్పుడే వివరించారు. పింఛను డబ్బులను సచివాలయాల సిబ్బంది ఏప్రిల్ రెండో తేదీన డ్రా చేసుకునేందుకు వెసులుబాటు కల్పించగా మూడో తేదీ నుంచి పంపిణీ ప్రారంభించేందుకు అన్ని ఏర్పాట్లు చేయాలని అప్పుడే జిల్లా అధికారులకు సమాచారమిచ్చారు. ఆర్థిక సంవత్సరం ముగింపు, సెలవుల కారణంగా ఏటా ఏప్రిల్ నెలలో మూడో తేదీ తర్వాత పంపిణీ కొనసాగడం ఆనవాయితీగా జరుగుతోంది. గతేడాది కూడా ఏప్రిల్‌లో మూడో తేదీ నుంచే పింఛన్ల పంపిణీ కొనసాగినట్లు అధికారులు గుర్తు చేస్తున్నారు.

నిమ్మగడ్డ నిర్వాకాలు..



- రాష్ట్ర ఎన్నికల కమిషనర్ పదవిలో ఉన్నప్పుడు నిమ్మగడ్డ రమేష్ రాజ్యాంగ విరుద్ధంగా, వివాదాస్పదంగా ప్రవర్తించారు. స్థానిక సంస్థల్లో ఏర్పడే ఖాళీలకు చట్ట ప్రకారం ఆర్నెల్లలోగా ఎన్నికలు నిర్వహించాలి. చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు ప్రకాశం జిల్లా దర్శి నియోజకవర్గంలో ఓ జెడ్పీటీసీ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించాల్సి ఉండగా దీనివల్ల ఆ జిల్లా పరిషత్ చైర్మన్ హోదాలో ఉన్న తమ సామాజికవర్గం నేత పదవికి ఎసరు వస్తుందని ఉప ఎన్నిక జరపలేదని నిమ్మగడ్డపై విమర్శలున్నాయి.
- వలంటీర్లకు వ్యతిరేకంగా 2023 డిసెంబరు నాలుగో తేదీన నిమ్మగడ్డ రమేష్ కుమార్ నేతృత్వంలోని సిటిజన్ ఫర్ డెమోక్రసీ సంస్థ సుప్రీం కోర్టులో కేసు వేసి మధ్యలోనే ఉపసంహరించుకుంది.
- మళ్లీ 2024 జనవరి 12న అదే సంస్థ వలంటీర్లకు వ్యతిరేకంగా ఢిల్లీ హైకోర్టులో కేసు వేసింది. ఆంధ్రప్రదేశ్ హైకోర్టుపై తమకు నమ్మకం లేదన్నట్టు పిటిషన్‌లో నిమ్మగడ్డ తదితరులు పేర్కొన్నారు. అయితే ఢిల్లీ హైకోర్టు ఆ విషయాన్ని ఏపీ హైకోర్టులోనే తేల్చుకోవాలంటూ పిటిషన్‌ను కొట్టివేసింది.
- తర్వాత నిమ్మగడ్డకు చెందిన సంస్థ 2024 మార్చి 13న వలంటీర్లకు వ్యతిరేకంగా రాష్ట్ర హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. హైకోర్టు దీన్ని కేంద్ర ఎన్నికల సంఘం నిర్ణయానికే వదిలివేస్తూ తీర్పు ఇచ్చినట్లు అధికారులు చెబుతున్నారు.
- 2021లో స్థానిక సంస్థల ఎన్నికల సందర్భంగా వలంటీర్ల వద్ద నుంచి ఫోన్లను స్వాధీనం చేసుకోవాలంటూ నిమ్మగడ్డ ఆదేశాలు జారీ చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టును ఆశ్రయించడంతో స్టే ఇచ్చినట్టు అధికారులు గుర్తు చేస్తున్నారు. అప్పుడు నిమ్మగడ్డ జారీ చేసిన ఆదేశాలనే అచ్చెన్నాయుడు వలంటీర్లకు వ్యతిరేకంగా ఈసీకి అందజేసిన వినతిపత్రంలో పొందుపరిచారు.
- సచివాలయాల ఉద్యోగులు ప్రభుత్వ శాశ్వత ఉద్యోగులే అయినప్పటికీ వారికి ఎన్నికల నిర్వహణపై అనుభవం లేదని, వారికి ఎన్నికల విధులు అప్పగించవద్దని నిమ్మగడ్డ సంస్థ ఈసీని కోరింది. మరోవైపు సచివాలయాల ఉద్యోగుల ద్వారానే లబ్ధిదారుల ఇళ్ల వద్ద పింఛన్ల పంపిణీ చేపట్టాలంటూ టీడీపీ, ఈనాడు ప్రేమ ఒలకబోస్తున్నాయి.

శ్రీవారిపై సిరుల వర్షం

- ఎన్నికల కోడ్‌తో సిఫారసు లేఖలు స్వీకరించని టీటీడీ
- దీంతో పెద్ద ఎత్తున తరలివస్తున్న సామాన్య భక్తులు
- త్వరగా దర్శన భాగ్యం
- 16 రోజుల్లోనే టీటీడీకి రూ.64 కోట్ల ఆదాయం



శ్రీవారి దర్శనం కోసం ఆలయం వెలుపల వేచి ఉన్న భక్తులు

తిరుమల: ఎన్నికల కోడ్ నిబంధనల అమలుతో తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) సిఫారసు లేఖల స్వీకరణ నిలిపేయడంతో సామాన్య భక్తులు పెద్ద ఎత్తున తిరుమలకు వస్తున్నారు. దీంతో భక్తులకు సులభంగా స్వామివారి దర్శనభాగ్యం కలగడమే కాకుండా శ్రీవారిపై పెద్ద ఎత్తున సిరుల వర్షం కురుస్తోంది. వీఐపీ బ్రేక్ దర్శనాలు నిలిపివేసిన తర్వాత టీటీడీకి 16 రోజుల్లోనే రూ.64 కోట్ల ఆదాయం లభించింది. సిఫార్సు లేఖలపై జారీ చేసే వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు కలిగిన భక్తులకు టీటీడీ నిత్యం 4 గంటల వరకు సమయాన్ని కేటాయిస్తోంది. అయితే ఎన్నికల కోడ్‌తో సిఫార్సు లేఖల స్వీకరణను టీటీడీ మార్చి 16 నుంచి జూన్ 4 వరకు రద్దు చేసింది. దీంతో ప్రొటోకాల్ పరిధిలోని వ్యక్తులు స్వయంగా విచ్చేస్తే మాత్రమే వారికి బ్రేక్ దర్శనం టికెట్లను టీటీడీ జారీ చేస్తోంది. దీంతో వీరికి రోజూ కేటాయించే దర్శన టికెట్ల సంఖ్య 300కు మించడం లేదు. దాదాపుగా అరగంట వ్యవధిలోనే బ్రేక్ దర్శనాలు పూర్తవుతున్నాయి. దీంతో మిగిలిన సమయాన్ని టీటీడీ సర్వదర్శనం భక్తులకు కేటాయిస్తోంది. దీంతో భక్తులకు గంటలోపే స్వామివారిని దర్శించుకునే అవకాశం లభిస్తోంది.

శ్రీవాణి ట్రస్టు ద్వారా 15 రోజుల్లోనే రూ.22.75 కోట్ల ఆదాయం

సిఫార్సు లేఖల స్వీకరణ రద్దుతో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు ఆశించే భక్తులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయంగా శ్రీవాణి ట్రస్ట్ ద్వారా కేటాయించే టికెట్ల సంఖ్యను టీటీడీ పెంచింది. దీంతో ఇప్పటివరకు రోజుకి ఆన్‌లైన్ విధానంలో 500, ఆఫ్‌లైన్ విధానంలో మరో 500 టికెట్లను టీటీడీ జారీ చేస్తోంది. ప్రస్తుతం ఆఫ్‌లైన్ విధానంలో జారీచేసే టికెట్ల సంఖ్యపై నియంత్రణ తొలగించింది. సిఫార్సు లేఖ స్వీకరణ రద్దుతో శ్రీవాణి ట్రస్ట్‌కి భక్తుల నుంచి డిమాండ్ పెరిగింది. దీంతో శ్రీవాణి ట్రస్ట్ ద్వారా రోజుకి 1,000 టికెట్ల నుంచి 1,800 టికెట్ల వరకు భక్తులు కొనుగోలు చేయడం ప్రారంభించారు. ఇలా మార్చి 16 నుంచి 15 రోజుల వ్యవధిలో 22,752 టికెట్లను విక్రయించింది. దీంతో టీటీడీకి రూ.22.75 కోట్ల ఆదాయం లభించింది.

గణనీయంగా పెరిగిన హుండీ ఆదాయం..

శ్రీవారి ఆలయంలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేసినా స్వామివారి హుండీ ఆదాయం ఏమాత్రం తగ్గలేదు. పైపెచ్చు గతంతో పోలిస్తే గణనీయంగా పెరిగింది. సాధారణంగా స్వామివారి హుండీ ఆదాయం బ్రేక్ దర్శనాలతో ముడిపడి ఉంటుంది. శ్రీవారికి రోజువారీగా వచ్చే హుండీ ఆదాయంలో వీఐపీ బ్రేక్ దర్శన సమయంలోనే 35 నుంచి 40 శాతం ఆదాయం లభిస్తోంది. ఎన్నికల కోడ్‌తో వీఐపీ బ్రేక్ దర్శనాలను టీటీడీ రద్దు చేసింది. దీంతో హుండీ ఆదాయం తగ్గుముఖం పడుతుందని భావించారు. అయితే అందుకు విరుద్ధంగా ఆదాయం పెరుగుతూ వస్తోంది. ఇందుకు శ్రీవాణి దర్శన టికెట్లే కారణమని టీటీడీ భావిస్తోంది. మార్చిలో వీఐపీ బ్రేక్ దర్శన టికెట్లు జారీ చేసిన మొదటి 15 రోజుల్లో స్వామివారికి హుండీ ద్వారా రూ.54 కోట్ల ఆదాయమే వచ్చింది. వీఐపీ బ్రేక్ దర్శనాలు నిలిపివేశాక 16 రోజుల్లో రూ.64 కోట్ల ఆదాయం లభించడం విశేషం. దీంతో మొత్తంగా మార్చిలో స్వామివారికి రూ.118 కోట్ల ఆదాయం లభించింది.

మాటల రచయిత శ్రీరామకృష్ణ కన్నుమూత



తమిళ సినిమా : సీనియర్ దర్శకుడు, అనువాద మాటల రచయిత శ్రీరామకృష్ణ (75) సోమవారం రాత్రి 8.30 గంటలకు చెన్నై అపోలో ఆస్పత్రిలో తుదిశ్వాస విడిచారు. గత కొద్దికాలంగా ఆయన వృద్ధాప్య సంబంధ సమస్యలు, అనారోగ్యంతో బాధపడుతున్నారు. ఆంధ్రప్రదేశ్‌లోని తెనాలి ఆయన జన్మస్థలం. 1980 దశకంలో చెన్నైకి వచ్చారు. తొలుత దర్శకుడు దొరై వద్ద, అనంతరం అనువాద రచయిత రాజశ్రీ,, వసంతకుమార్ వద్ద సహాయకుడిగా పనిచేశారు. సమాజంలో స్త్రీ, బాలమురళి ఎంఏ సినిమాలకు దర్శకత్వం వహించారు. అనువాద రచయితగా 100 పైగా చిత్రాలకు పనిచేశారు. వీటిలో ముంబై, జెంటిల్మన్, చంద్రముఖి లాంటి భారీ చిత్రాలున్నాయి. దర్శకులు మణిరత్నం, శంకర్ అన్ని చిత్రాలకు మాటలు రాసిన శ్రీరామకృష్ణ, రజనీకాంత్ దర్బార్ చిత్రానికి చివరిగా మాటలు అందించారు. ఈయన సతీమణి స్వాతి. శ్రీరామకృష్ణ అంత్యక్రియలు మంగళవారం చెన్నైలో నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'దాసి' సుదర్శన్ కన్నుమూత

మిర్యాలగూడ, నాగార్జునసాగర్: సాహితీవేత్త, ప్రముఖ చిత్రకారుడు దాసి సుదర్శన్ (72) సోమవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడలోని ఆయన నివాసంలో గుండెపోటుతో మరణించారు. నాగార్జునసాగర్ హిల్ కాలనీలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ఆయన డ్రాయింగ్ మాస్టర్‌గా పనిచేశారు. ఎందరో విద్యార్థులను కళలు, సాహిత్యం వైపు మళ్లించి వారిని నిష్ణాతులుగా తీర్చిదిద్దారు. చిత్రకారుడు, సాహితీవేత్తగానే కాకుండా జర్నలిస్టుగా పలు పత్రికలకు వ్యాసాలు రాశారు. కొన్ని దినపత్రికల్లో పనిచేశారు. సినీరంగంలో డిజైనర్‌గా పనిచేసి జాతీయ అవార్డు పొందారు. దర్శకుడు బి.నర్సింగరావు తీసిన చాలా సినిమాలకు క్యాస్టూమ్ డిజైనర్‌గా పనిచేశారు. నర్సింగరావు తీసిన దాసి సినిమాకు ఐదు జాతీయ అవార్డులు లభించగా ఆ చిత్రానికిగాను క్యాస్టూమ్ డిజైనర్‌గా సుదర్శన్ జాతీయ అవార్డు అందుకున్నారు. జాతీయ చలనచిత్ర అవార్డుల జ్యూరీ ప్యానల్ సభ్యుడిగానూ ఆయన పనిచేశారు. సుదర్శన్ అంత్యక్రియలు మంగళవారం మిర్యాలగూడలో జరగనున్నాయి.

క్లుప్తంగా...

తెలుగు రాష్ట్రాల జీఎస్టీ వసూళ్ల వృద్ధిలో ఏపీ టాప్

ఏపీలో 16 శాతం, తెలంగాణలో 12 శాతం వృద్ధి

సాక్షి, న్యూఢిల్లీ: తెలుగు రాష్ట్రాల్లో వస్తు, సేవల పన్ను వసూళ్ల వృద్ధిలో ఆంధ్రప్రదేశ్ టాప్‌లో నిలిచింది. ఏపీలో 2022–23 మార్చి నాటికి జీఎస్టీ వసూళ్లు రూ. 3,532 కోట్లు కాగా.. 2023–24 మార్చి నాటికి 16 శాతం వృద్ధితో రూ. 4,082 కోట్లకు పెరిగింది. తెలంగాణలో గత ఏడాది రూ. 4,804 కోట్లు కాగా.. ఈ ఏడాది 12 శాతం వృద్ధితో రూ. 5,399 కోట్లకు పెరిగింది. ఈ మేరకు సోమవారం కేంద్ర ఆర్థిక శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కాగా.. దేశవ్యాప్తంగా మార్చి నెలలో జీఎస్టీ వసూళ్లు రూ. 1.78 లక్షల కోట్లుగా నమోదైంది.

మాదిగలను చంద్రబాబుకు తాకట్టు పెట్టడం సిగ్గుచేటు

మంద కృష్ణమాదిగపై ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యుల ఆగ్రహం



నాగులుప్పలపాడు: మాదిగ జాతిని అడుగడుగునా మోసం చేయడంతోపాటు అవమానపరుస్తూ హేళనచేసి మాట్లాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబుకు మంద కృష్ణమాదిగ బహిరంగంగా మద్దతుపలకడం యావత్ మాదిగ జాతిని తాకట్టుపెట్టడమేనని ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక సభ్యులు ఇంటూరి రోశయ్య, కొమ్మూరి హైమారావు ఆగ్రహం వ్యక్తంచేశారు. కృష్ణమాదిగ చర్యల పట్ల వారు సోమవారం ప్రకాశం జిల్లా నాగులుప్పలపాడు మండలం ఈదుమూడి గ్రామంలో మాదిగ అమర వీరుల స్తూపం వద్ద నిరసన తెలిపారు. చంద్రబాబును కృష్ణమాదిగ కలిసి బహిరంగ మద్దతు పలికినట్లు పత్రికల్లో వచ్చిన వార్తల క్లిప్పింగులను దహనం చేశారు. ఈ సందర్భంగా హైమారావు, రోశయ్య మాట్లాడుతూ మాదిగల త్యాగాల మీద ఏర్పడిన ఎంఆర్‌పీఎస్ ఉద్యమాన్ని కృష్ణమాదిగ తన స్వార్థం కోసం ఉపయోగించుకుంటున్నారని మండిపడ్డారు. కేంద్రం పరిధిలోని వర్గీకరణ అంశాన్ని రాష్ట్రంలో కూటమికి ముడిపెట్టి జాతి మొత్తం తన మాట వింటుందనే భ్రమలో కృష్ణమాదిగ బతకడం బాధాకరమన్నారు. మాదిగల పట్ల చిత్తశుద్ధి ఉంటే ఇప్పటి వరకు చంద్రబాబు మాదిగ జాతికి చేసిన మేలేంటో కృష్ణమాదిగ చెప్పాలన్నారు. ఎలాంటి రాజకీయ అండదండలు లేకపోయినప్పటికీ వీరాంజనేయులు, ఈర్ల లక్కప్పలకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పిలిచి మరీ ఎమ్మెల్యే టికెట్లు ఇస్తే.. లారీ డ్రైవర్లు, కూలోళ్లు అని హేళన చేసే చంద్రబాబు మాటలు మంద కృష్ణ చెవులకు వినిపించడం లేదా... ఒకవేళ వినిపించినా ప్యాకేజీ మూటల మాటున చెవికెక్కడం లేదా.. అని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఎంఆర్‌పీఎస్ యువకులు పాల్గొన్నారు.

ఏపీ పీజీసెట్ నోటిఫికేషన్ విడుదల

మే 4 వరకు దరఖాస్తుల స్వీకరణ..
జూన్ 10 నుంచి పరీక్షలు

ఏయూక్యాంపస్: రాష్ట్రవ్యాప్తంగా పీజీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే ఏపీ పీజీ సెట్-2024 నోటిఫికేషన్‌ను ఆంధ్రా యూనివర్సిటీ వైస్ చాన్సలర్ ఆచార్య పీవీజీడీ ప్రసాదరెడ్డి, సెట్ కన్వీనర్ ఆచార్య జి.శశిభూషణరావు సోమవారం విడుదల చేశారు. ఆన్‌లైన్ విధానంలో దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమైందని, మే 4వ తేదీ వరకు స్వీకరిస్తామని కన్వీనర్ తెలిపారు. మే 5 నుంచి 15వ తేదీ వరకు రూ.500 అపరాధ రుసుముతో, మే 16 నుంచి 25 వరకు వెయ్యి రూపాయలు అపరాధ రుసుముతో దరఖాస్తులను స్వీకరించనున్నట్లు వివరించారు. మే 27 నుంచి 29 వరకు దరఖాస్తుల్లో తప్పులను సరిచేసుకునే అవకాశం కల్పిస్తామని, మే 31 నుంచి హాల్ టికెట్లను డౌన్‌లోడ్ చేసుకోవచ్చని, రాష్ట్రవ్యాప్తంగా జూన్ 10 నుంచి 14వ తేదీ వరకు ఏపీ పీజీసెట్-2024 పరీక్షలను నిర్వహిస్తామని తెలిపారు. పూర్తి వివరాల కోసం ఏపీపీజీ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. దరఖాస్తు రుసుముగా ఓసీ విద్యార్థులు రూ.850, బీసీ విద్యార్థులు రూ.750, ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు రూ.650 చొప్పున చెల్లించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏయూ ఇంజనీరింగ్ కళాశాల ఓఎస్డీ డి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

'గురుకుల' అడ్మిషన్లకు దరఖాస్తు గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాల కోసం దరఖాస్తు గడువును పొడిగించినట్లు ఏపీ గురుకులం సంస్థ కార్యదర్శి ఆర్.నరసింహారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరంలో 5 నుంచి 8 తరగతులలో మిగిలిన సీట్లు, ఇంటర్, డిగ్రీ కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన ఏపీఆర్ఎస్ సెట్-2024, ఏపీ ఆర్‌జేసీ అండ్ డీసీ సెట్-2024లకు దరఖాస్తు గడువును ఈ నెల 5వ తేదీ వరకు పొడిగించినట్లు ఆయన పేర్కొన్నారు. అర్హతగల అభ్యర్థులు నిర్ణీత గడువులోపు https://aprs.apcfss.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని నరసింహారావు సూచించారు.

చంద్రబాబూ.. పింఛన్లను ఆపడం

మీ తరం కాదు!

రాష్ట్రంలోని పేదోళ్ల ఉసురు పోసుకుని నువ్వేమి బాగుపడతావ్?

సాక్షి, అమరావతి: చంద్రబాబూ.. నువ్వు కాదు.. నీ తల్లో జేజమ్మ దిగి వచ్చినా పింఛన్లను ఆపడం మీ తరం కాదు అని మాజీ మంత్రి పేర్ని వెంకట్రామయ్య (నాని) ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని పేదోళ్ల ఉసురు పోసుకుని నువ్వేమి బాగుపడతావ్ అని ప్రశ్నించారు. చంద్రబాబును చూస్తే అసహ్యం వేస్తోందన్నారు. పేర్ని నాని సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'వలంటీర్ల వ్యవస్థ విచ్ఛిన్నమే చంద్రబాబు ప్రయత్నం. 55 నెలలుగా వలంటీర్ల ద్వారా సీఎం వైఎస్ జగనే పింఛన్లు పంపిస్తున్న సంగతి ప్రజలకు తెలీదా? బాబు రాజకీయ స్వార్థం కోసం ఇప్పుడు పెన్షనర్ల పొట్ట కొట్టారు. వలంటీర్లు వద్దు అని కేంద్ర ఎన్నికల సంఘం వద్ద పైరవీ చేసింది ఆయన వదిన పురందేశ్వరే. గంటకు లక్షల్లో ఫీజులు తీసుకునే ఢిల్లీ ప్లీడర్లను పెట్టుకొని ఈ వలంటీర్ వ్యవస్థను నిలువరించడానికి ప్రయత్నం చేసింది చంద్రబాబే. నిమ్మగడ్డ రమేష్ కుమార్, పురందేశ్వరి ఎవరో ప్రజలకు తెలియదా? ఎన్నికల సంఘం వలంటీర్లను పక్కన పెట్టండి అనగానే వీళ్లంతా సంబరాలు చేసుకున్నారు. ఈ విషయం ప్రజలకు తెలిసి తిరుగుబాటు వచ్చేసిందని తెలిసి తలుపు సందులో తోక పడ్డ కోతిలా చంద్రబాబు తన్నుకులాడుతున్నారు. 65 లక్షల మంది కైమా కొట్టేస్తారని బాబు అండ్ కోకు కంగారు పుట్టింది. చంద్రబాబు విషం చిమ్మి రెండు నెలలు పింఛన్ ఆపితే సీఎం జగన్‌పై వ్యతిరేకత వస్తుందా? సీఎం జగన్ అంటేనే నమ్మకం. చంద్రబాబు అంటే అబద్ధాల కోరు. ఇది అందరికీ తెలుసు' అని చెప్పారు.



వలంటీర్లపై పవన్‌కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలను చూపుతున్న ఎమ్మెల్యే పేర్ని వెంకట్రామయ్య (నాని)

భీమవరంలో పవన్ ఇల్లు కట్టారా?

'భీమవరంలో ఇల్లు కట్టుకుంటా అని గతంలో పవన్ కళ్యాణ్ చెప్పారు కదా! కట్టారా? ఇప్పుడు పిఠాపురంలోనే ఇల్లు కట్టుకుంటా అంటున్నారు. జలుబు చేస్తే మాత్రం మందేసుకోడానికి హైదరాబాద్ వెళ్తారు. ఇతన్నీ ప్రజలు ఎలా నమ్ముతారు? 2014 నుంచి నిఖార్సుగా జనసేన జెండా మోస్తున్న ఎంత మందికి పవన్ టికెట్లు ఇచ్చారో చెప్పాలి. లోకేశ్ సెక్యూరిటీ తెచ్చుకున్నారు. ఆయనకు రాలేదే అని పవన్ బ్లేడ్ దాడి నాటకం ఆడారు' అంటూ ధ్వజమెత్తారు.

చంద్రబాబువి సిగ్గుమాలిన మాటలు

'చంద్రబాబు మేలు కోసమే ఎల్లో ఎలక్షన్ వాచ్ అనే సంస్థను ఏర్పాటు చేసి, మాజీ ఐఏఎస్‌లు, మేధావుల ముసుగులో బయల్దేరిందీ పచ్చ బ్యాచ్. ఈ అర్జీలన్నీ వారిచ్చినవే. రాష్ట్ర ఎన్నికల కమిషనర్ హోదాలో ఉండి నిమ్మగడ్డ చేసిన కార్యక్రమాలు ప్రజలందరూ చూశారు. 14 ఏళ్లు సీఎంగా ఉన్న చంద్రబాబుకు ఏ రోజైనా వృద్ధులు, వికలాంగుల ఇంటికి వెళ్లి పింఛన్ ఇద్దామనే ఆలోచన వచ్చిందా? 2.60 లక్షల మంది వలంటీర్ల ద్వారా 65 లక్షల మందికి పింఛన్ ఇస్తుంటే దాన్ని ఆపేయడానికి కాలికి బలపం కట్టుకుని తిరిగారు. సీఎం జగన్ ఇచ్చే రూ. 3 వేల పింఛన్‌పై ఆధారపడి జీవిస్తున్న వృద్ధుల్లో ఎంత మంది ఇవాళ మంచాల్లో ఉన్నారో తెలుసా? వాళ్లందరి ఉసురు బాబుకు తగలకుండా పోదు. వలంటీర్ల వ్యవస్థ నడుం విరగ్గొడతామని, కోర్టులో సవాలు చేస్తామని గతంలో పవన్ కళ్యాణ్ అన్నారు. ఊళ్లలో వలంటీర్ల న్యూసెన్స్ అంటూ చంద్రబాబు తూలనాడారు. మళ్లీ మాట మార్చి వలంటీర్ల వ్యవస్థను కొనసాగిస్తానంటూ మాట్లాడితే ఎవరూ నమ్మరు' అని అన్నారు.

మాటల ఎర వేసి వేటాడతారు...

'1999లో బీజేపీతో దోస్తీ. చచ్చిపోయేంత వరకూ పొత్తు పెట్టుకోనని 2004లో అన్న చంద్రబాబు.. 2014కి వచ్చే సరికి మళ్లీ పొత్తు పెట్టుకున్నాడు. 2019కి వచ్చే సరికి బీజేపీతో కుస్తీ. మళ్లీ 2024లో దోస్తీ. ఇలాంటి బతుకు ఏ రాజకీయ నాయకుడికైనా అవసరమా? జన్మభూమి కమిటీలు ఈ సమాజానికి చేటని హైకోర్టుకు వెళ్లాం. మేం వచ్చిన తర్వాత జన్మభూమి కమిటీలను బంగాళాఖాతంలో కలిపాం. జన్మభూమి కమిటీలపై 2014 నుంచి ఈ రోజు వరకూ ఒకటే స్టాండ్‌పై ఉన్నాం. స్టాండ్ అంటే సీఎం జగన్‌దే. జన్మభూమి కమిటీలు పేదలను దోచుకునే అవినీతి వ్యవస్థ. చంద్రబాబు ఒక వేటగాడు. మాటల ఎర వేసి వేటాడతారు' అని దుయ్యబట్టారు.

మొదలైన టెన్త్ మూల్యాంకనం

- మొత్తం 47,88,738 జవాబు పత్రాల వేల్యూయేషన్
- ఈ నెల 8 నాటికి ప్రక్రియ పూర్తి


విజయవాడలో మూల్యాంకన ప్రక్రియను పరిశీలిస్తున్న కమిషనర్ సురేష్‌కుమార్

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం (వేల్యూయేషన్) సోమవారం ప్రారంభమైంది. ఇందుకోసం 26 జిల్లా కేంద్రాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేసిన విద్యా శాఖ అవసరమైన సదుపాయాలను కల్పించింది. 47,88,738 జవాబు పత్రాల వేల్యూయేషన్ కోసం 25 వేల మంది సబ్జెక్టు ఉపాధ్యాయులను నియమించింది. ఒక్కో ఉపాధ్యాయుడు రోజుకు సగటున 40 జవాబు పత్రాలను మాత్రమే కేటాయిస్తారు. మొత్తం మూల్యాంకన ప్రక్రియను 8 రోజుల్లో పూర్తి చేసేలా విద్యా శాఖ ప్రణాళిక సిద్ధం చేసింది. గత ఏడాది అనుభవాల రీత్యా ఆరు చోట్ల వేల్యూయేషన్ సెంటర్లను మార్చారు. ఉమ్మడి జిల్లాల్లో ఒక్కో వేల్యూయేషన్ సెంటర్‌లో సుమారు 2 వేల మంది ఉపాధ్యాయులు విధులు నిర్వర్తించేవారు. దాంతో స్థలాభావ సమస్యతో ఇబ్బందులు తలెత్తేవి. ఈ ఏడాది మొత్తం 26 జిల్లా కేంద్రాల్లో మూల్యాంకన కేంద్రాలను ఏర్పాటు చేయడంతో ఒక్కో సెంటర్‌లో గరిష్టంగా 900 మంది వేల్యూయేటర్లు లేరు. దాంతో ప్రక్రియ సాఫీగా కొనసాగేందుకు ఆస్కారం ఏర్పడింది. పెరుగుతున్న వేసవి ఉష్ణోగ్రతలను దృష్టిలో ఉంచుకుని సెంటర్లలో తగినంత తాగునీరు, గదుల్లో ఫ్యాన్లు, నిరంతర విద్యుత్ సదుపాయం కల్పించారు. జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియను సోమవారం ఉదయం పాఠశాల విద్యా శాఖ కమిషనర్ సురేష్‌కుమార్ పరిశీలించారు. విజయవాడలోని బిషప్ అజరయ్య స్కూల్‌లోని కేంద్రాన్ని ఆయన సందర్శించారు. మూల్యాంకన కార్యక్రమం ఈ నెల 8వ తేదీ వరకు కొసాగుతుందని తెలిపారు. ఉపాధ్యాయుల సౌకర్యం కోసం వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది సహకారం తీసుకున్నట్టు వెల్లడించారు. ఆయన వెంట పదో తరగతి పరీక్షల డైరెక్టర్ డి.దేవానందరెడ్డి, పరిశీలకుడు శ్రీనివాసులురెడ్డి ఉన్నారు.

విష్ణు రాకతో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం

నెల్లూరు ఎంపీ అభ్యర్థి విజయసాయిరెడ్డి


విష్ణువర్ధన్‌రెడ్డితో మాట్లాడుతున్న విజయసాయిరెడ్డి

కావలి: 'మాజీ ఎమ్మెల్యే కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి మరికొద్ది రోజుల్లో వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారు. ఆయన రాకతో పార్టీకి మరింత బలం చేకూరుతుంది' అని నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేణంబాక విజయసాయిరెడ్డి అన్నారు. సోమవారం శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా అల్లూరులోని విష్ణువర్ధన్‌రెడ్డి నివాసానికి విజయసాయిరెడ్డి వెళ్లి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం మీడియాతో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో చేరాలని విష్ణును ఆహ్వానించగా ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. కొద్దిరోజుల్లోనే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో చేరుతారని తెలిపారు. ఆయన చేరిక కావలి నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీకి మరింత బలాన్నిస్తుందన్నారు. విష్ణువర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ కార్యకర్తలు, అనుచరులు, ఆత్మీయులతో సమావేశం అనంతరం వైఎస్సార్‌సీపీలో చేరాలని నిర్ణయించుకున్నట్లు తెలిపారు. కావలిలో పార్టీ విజయానికి కృషి చేస్తానని చెప్పారు. కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ విష్ణు రాకతో ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, అఫ్కాఫ్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తదితరులున్నారు.

టీడీపీ వాళ్లను చూసి నేర్చుకోండి.. వాళ్లను ఫాలో అవ్వండి!

- పిఠాపురం జనసేన నేతలతో పవన్
- రోజుకు 200 మంది ఓటర్లతో ఫొటోలు దిగుతా..


జనసేనలో చేరిన మండలి బుద్ధప్రసాద్

పిఠాపురం: 'టీడీపీ వాళ్లను చూసి నేర్చుకోండి.. వాళ్లను ఫాలో అవ్వండి' అని తన పార్టీ నేతలకు జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ సూచించారు. పిఠాపురం పర్యటనను ఆదివారం అర్ధాంతరంగా ముగించుకుని హైదరాబాద్ వెళ్లిపోయిన ఆయన.. సోమవారం మళ్లీ ప్రత్యక్షమయ్యారు. ఈ సందర్భంగా జనసేన నేతలతో సమావేశమయ్యారు. పార్టీ విజయం కోసం అనుసరించాల్సిన వ్యూహాలపై నేతలకు దిశానిర్దేశం చేశారు. జనసేన నేతలందరూ టీడీపీ మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ ఆధ్వర్యాన ఆ పార్టీ నాయకులతో కలిసి పనిచేయాలని సూచించారు. నియోజకవర్గంలో ఉన్న ప్రతి ఓటరుతో ఫొటో దిగాలని ఉందని, పరిస్థితులు అనుకూలించగానే రోజుకు 200 మందితో ఫొటోలు దిగాలని భావిస్తున్నట్టు తెలిపారు. తన విజయం కోసం స్థానిక జనసేన నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పని చేయాలని సూచించారు. మెజారిటీ ఎంత తీసుకురావాలనేది వారిపైనే వదిలేస్తున్నానని, వారు పడే కష్టం మీదే తన మెజారిటీ ఆధారపడి ఉంటుందని చెప్పారు. ఈ సందర్భంగా అవనిగడ్డ మాజీ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, రైల్వే కోడూరు అభ్యర్థి అరవ శ్రీధర్, పాలకొండకు చెందిన నిమ్మక జయకృష్ణ తదితరులు జనసేనలో చేరారు. సాయంత్రం పవన్ తిరిగి హైదరాబాద్ వెళ్లిపోయారు. అంతా టీడీపీ నేతలతోనే అని పవన్ అంటుంటే.. ఇక తామెందుకు అంటూ జనసేన నేతలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎప్పటి నుంచో పార్టీకి కట్టుబడి పనిచేస్తుంటే ఎవరి కిందో పని చేయాలనడం ఎంత వరకూ సమంజసమంటూ పవన్ తీరుపై వారు రుసరుసలాడుతున్నారు.

హోమ్ ఓటింగ్.. పోలింగ్ స్టేషన్..

- హోమ్ ఓటింగ్ కావాలనుకుంటే ముందుగా ఫాం 12డీ ఇవ్వాలి
- ఇంటివద్దే ఐదుగురు పోలింగ్ సిబ్బందితో ఓటు నమోదు
- మొత్తం ప్రక్రియ వీడియోతో రికార్డు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా


వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న మీనా

సాక్షి, అమరావతి: వచ్చే సాధారణ ఎన్నికల్లో తొలిసారిగా మన రాష్ట్రంలో కల్పిస్తున్న ఇంటి వద్ద నుంచే ఓటింగ్ హక్కుపైన, పోస్టల్ బ్యాలెట్ వినియోగంపైన జాగ్రత్తలు తీసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా అధికారులను ఆదేశించారు. ఈ ఎన్నికల్లో 85 ఏళ్లు దాటిన వృద్ధులు, 40 శాతానికిపైగా అంగవైకల్యం ఉన్నవారు పోలింగ్‌స్టేషన్‌కు వచ్చిగానీ, ఇంటివద్ద నుంచే ఓటు హక్కు వినియోగించుకునే అవకాశాన్ని కల్పించారు. పోస్టల్ బ్యాలెట్ అండ్ హోం ఓటింగ్‌కు సన్నద్ధత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సోమవారం సచివాలయం నుంచి మీనా జిల్లాల ఎన్నికల అధికారులకు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకోవాలనుకునేవారు ముందుగా రిటర్నింగ్ ఆఫీసరుకు ఫారం 12డీ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఒకసారి ఇంటివద్ద నుంచే ఓటువేసే అవకాశం పొందితే వారు నేరుగా పోలింగ్ స్టేషన్‌కు వచ్చి ఓటుహక్కు వినియోగించుకునే అవకాశం కోల్పోతారన్న విషయంపై ఓటర్లకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటివద్దే ఓటుహక్కు వినియోగించుకునేవారి కోసం వీడియో గ్రాఫర్‌తో, అయిదుగురు సభ్యులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసుకోవాలని, ఇందుకు ముందస్తు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని చెప్పారు. పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకునే వివిధ శాఖల ఉద్యోగులు, సర్వీసు ఓటర్లకు సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఇందుకోసం ప్రతి రిటర్నింగ్ కార్యాలయంలో ప్రత్యేకంగా ఫెసిలిటేషన్ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ జిల్లాల కలెక్టర్లు హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్లకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, అదనపు సీఈవో ఎం.ఎన్.హరేంధిరప్రసాద్ పాల్గొన్నారు.

నేడు ఏపీ కాంగ్రెస్ జాబితా విడుదల

సాక్షి, న్యూఢిల్లీ: ఏపీలో 114 అసెంబ్లీ, ఐదు లోక్‌సభ నియోజకవర్గాలకు కాంగ్రెస్ అభ్యర్థుల ఎంపిక పూర్తయింది. ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయంలో సోమవారం జరిగిన కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) ఈ జాబితాకు ఆమోదముద్ర వేసింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అధ్యక్షతన జరిగిన ఈ భేటీలో కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్, ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్కం ఠాగూర్, ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల, రఘువీరారెడ్డి, కొప్పుల రాజు ఏపీ కాంగ్రెస్ స్క్రీనింగ్ కమిటీ ఖరారు చేసిన జాబితాను మంగళవారం ప్రకటించనున్నారు.

'క్రీడల్లోనూ ఆసక్తిని పెంచాలి'

సాక్షి, అమరావతి: విద్యార్థులకు చదువుతోపాటు క్రీడలపైనా ఆసక్తిని పెంచేందుకు వ్యాయామ ఉపాధ్యాయులు కృషి చేయాలని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ కోరారు. ప్రతి ఒక్కరూ తమ నిత్య జీవితంలో వ్యాయామాన్ని ఒక భాగంగా చేసుకోవాలన్నారు. 'వ్యాయామ ఉపాధ్యాయులకు మాడ్యూల్ రూపకల్పన'పై ఐదు రోజుల వర్క్‌షాప్ సోమవారం విజయవాడలో ప్రారంభమైంది. సురేష్ కుమార్ మాట్లాడుతూ..జాతీయ స్థాయిలో అత్యుత్తమ ప్రతిభ చూపినక్రీడాకారులను గుర్తించి వారిని జిల్లా బ్రాండ్ అంబాసిడర్‌గా ప్రోత్సహించాలని సూచించారు. సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి భానుమూర్తి రాజు,జిల్లా కార్యదర్శులు పాల్గొన్నారు.

మాపై నీకెందుకింత కక్ష?

- టీడీపీ అధినేత చంద్రబాబుపై పింఛన్‌దారుల ఆగ్రహం
- రాష్ట్రంలో పలుచోట్ల లబ్ధిదారుల ఆందోళన
- బాబు పాలన, జన్మభూమి కమిటీలను తలుచుకుంటేనే భయమేస్తోందంటూ ఆవేదన


వలంటీర్ల సేవలు కొనసాగించాలని గోమంగి సచివాలయం వద్ద పింఛన్‌దారుల నిరసన


రాజమహేంద్రవరంలో ఆందోళన చేస్తున్న పింఛనుదారులు

రాజమహేంద్రవరం సిటీ/పెదబయలు(అల్లూరి సీతారామరాజు జిల్లా): 'మాపై నీకెందుకింత కక్ష? వృద్ధుల విషయంలో కనీస మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నావ్. పింఛన్లు ఇవ్వనీయకుండా వలంటీర్లను అడ్డుకుంటావా?' అంటూ టీడీపీ అధినేత చంద్రబాబుపై వైఎస్సార్ పింఛన్ కానుక లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలోని జాంపేట గణేష్ చౌక్ వద్ద వందలాది మంది పింఛన్‌దారులు సోమవారం ఆందోళన చేశారు. ఎంపీ, వైఎస్సార్‌సీపీ రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే అభ్యర్థి మార్గాని భరత్‌ను కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన వలంటీర్లు తమ ఇళ్ల వద్దకు వచ్చి పింఛన్ డబ్బులు చేతిలో పెట్టేవారని చెప్పారు. కానీ ఈ దుర్మార్గపు చంద్రబాబు చేసిన పని వల్ల ఈరోజు ఇంటి వద్ద పింఛన్ అందుకోలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. చంద్రబాబు పాలనలో అసలు పింఛన్ మంజూరవ్వడానికే కాళ్లరిగేలా తిరగాల్సి వచ్చేదని.. పింఛన్ కోసం ఎండలో క్యూ లైన్లలో గంటల తరబడి పడిగాపులు పడేవాళ్లమంటూ గుర్తు చేసుకున్నారు. ఆకలి వేసినా, వడదెబ్బ కొట్టి పడిపోయినా, అనారోగ్యం వచ్చినా ఎవ్వరూ పట్టించుకునే వారు కాదన్నారు. అధికారం నుంచి దించేసినా చంద్రబాబుకు సిగ్గురాలేదని మండిపడ్డారు. కనీస మానవత్వం లేకుండా ప్రవర్తిస్తున్నాడని.. పింఛన్లు ఇవ్వనీయకుండా వలంటీర్లను అడ్డుకున్నాడని మండిపడ్డారు. చంద్రబాబు పాలన, ఆ జన్మభూమి కమిటీలను తలుచుకుంటేనే భయమేస్తోందన్నారు. టీడీపీ పాలనలో పింఛన్ కోసం కూడా జన్మభూమి కమిటీలకు లంచం ఇవ్వాల్సి వచ్చేదని ఆవేదన వ్యక్తం చేశారు. వైఎస్ జగన్ పాలన వచ్చాక ప్రతి నెలా క్రమం తప్పకుండా వలంటీర్లు ఇంటికే వచ్చి పెన్షన్ ఇస్తున్నారని.. ఇంత చక్కని పాలన ఇంకెవ్వరూ అందించలేరన్నారు. తమకు మళ్లీ జగన్ ప్రభుత్వమే కావాలంటూ నినాదాలు చేశారు. కాగా, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రభుత్వం ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తోందని ఎంపీ భరత్ చెప్పారు.

బాబు నిర్వాకంతో 10 కిలోమీటర్లు నడవాలి

అల్లూరి సీతారామరాజు జిల్లా పెదబయలు మండలం గోమంగి, గుల్లేలు పంచాయతీల పరిధిలోని పింఛన్‌దారులు సోమవారం సచివాలయం ఎదుట ఆందోళనకు దిగారు. సీఎం వైఎస్ జగన్ తెచ్చిన వలంటీర్ వ్యవస్థ వల్ల ఎంతో సంతోషంగా ఉన్నామన్నారు. ప్రతి నెలా ఒకటో తేదీన తెల్లవారుజామునే వలంటీర్లు తమ ఇళ్లకు వచ్చి పింఛన్ ఇచ్చేవారని చెప్పారు. కానీ చంద్రబాబు చేసిన పని వల్ల ఏజెన్సీలో ఉండే తాము ఎంతో బాధపడాల్సి వస్తోందన్నారు. గుల్లేలు పంచాయతీ కించూరు, బూరుగువీధి, పెదవంచరంగి, జంగంపట్టు గ్రామాలకు సుమారు 10 కిలోమీటర్ల దూరమని, గోమంగి పంచాయతీ కరుగొండ, బొండ్డాపుట్టు, కుంతురుపుట్టు, వన్నాడ, వంకరాయి గ్రామాలకు కూడా 9 కిలోమీటర్ల దూరం ఉంటుందని తెలిపారు. చంద్రబాబు నిర్వాకం వల్ల తాము 10కిలోమీటర్లు నడిచి వచ్చి సచివాలయంలో పింఛన్ తీసుకోవడం కష్టంతో కూడుకున్నదని వాపోయారు. చంద్రబాబు తప్పుడు ఫిర్యాదులను నమ్మవద్దని ఎన్నికల కమిషన్‌ను కోరారు.

మా పార్టీకి కామన్ సింబల్ కేటాయించేలా ఆదేశాలివ్వండి

హైకోర్టును అభ్యర్థించిన ప్రజా శాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్

సాక్షి, అమరావతి: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తమ పార్టీకి కామన్ సింబల్ కేటాయించేలా కేంద్ర ఎన్నికల సంఘాన్ని(ఈసీఐ) ఆదేశించాలని కోరుతూ ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ దాఖలు చేసిన వ్యాజ్యంలో వాదనలు ముగిశాయి. హైకోర్టు తన తీర్పును రిజర్వ్ చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. అంతకు ముందు కేఏ పాల్ వాదనలు వినిపిస్తూ తమ పార్టీకి కామన్ సింబల్ కేటాయించాలని కోరుతూ వినతి పత్రం ఇచ్చానని, అయితే ఎన్నికల సంఘం ఇప్పటి వరకు నిర్ణయం తీసుకోలేదన్నారు. తన వినతిపత్రంపై ఏం నిర్ణయం తీసుకున్నారో కూడా తనకు చెప్పలేదన్నారు. ఎన్నికల సంఘం తరఫున సీనియర్ న్యాయవాది అవినాష్ దేశాయ్, న్యాయవాది శివదర్శన్ వాదనలు వినిపిస్తూ.. కామన్ సింబల్ కోసం నిబంధనల ప్రకారం నిర్దేశిత నమూనాలో దరఖాస్తు సమర్పించాల్సి ఉంటుందని, అయితే పాల్ సమర్పించిన దరఖాస్తు నిర్దేశిత నమునాలో లేనందున తిరస్కరించినట్టు తెలిపారు. తిరిగి నిర్దేశిత నమూనాలో దరఖాస్తు సమర్పించారని, అది తమ పరిశీలనలో ఉందన్నారు. దీనిపై ఈ నెల పదో తేదీలోపు తగిన నిర్ణయం వెలువరిస్తామని కోర్టుకు నివేదించారు. పాల్ సమర్పించిన దరఖాస్తు నిర్దేశిత నమూనాలో ఉంటేనే శాసనసభ ఎన్నికల్లో కామన్ సింబల్ కేటాయిస్తామని, అయితే పార్లమెంట్‌కు మాత్రం ఎన్నికల షెడ్యూల్ విడుదలైనందున కామన్ సింబల్ కేటాయించడం సాధ్యం కాదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి తీర్పును రిజర్వ్ చేశారు.

ఎంపీ రఘురామ పిటిషన్ విచారణ వాయిదా

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కేసులు తెలంగాణ హైకోర్టు నుంచి బదిలీ చేయాలని, బెయిలు రద్దు చేయాలంటూ ఎంపీ రఘురామకృష్ణరాజు దాఖలు చేసిన వేర్వేరు పిటిషన్లపై విచారణను సుప్రీం కోర్టు వాయిదా వేసింది. ఆ పిటిషన్లు సోమవారం జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ముందుకొచ్చాయి. తొలుత రెండు పిటిషన్లు వేర్వేరుగా చూస్తామని ధర్మాసనం తెలిపింది. బదిలీ పిటిషన్ ఈ మేటర్‌లో సర్వైవ్ అవుతుందా అని ప్రశ్నించింది. ఎన్నికలయ్యే వరకూ ఈ అంశంపై వేచి చూడాలని ధర్మాసనం పేర్కొంది. కేసుల విచారణ ఎందుకు ఆలస్యం అవుతుందో చెప్పాలని దర్యాప్తు సంస్థను ప్రశ్నించింది. డిశ్చార్జి పిటిషన్ల కారణంగా ఆలస్యం అవుతోందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు ధర్మాసనానికి తెలిపారు. వాయిదాలు కోరకుండా ఉండేలా చూడాలన్నారు. ఆలస్యానికి కారణాలు తెలుపుతూ నాలుగు వారాల్లో అఫిడవిట్ దాఖలు చేయాలని దర్యాప్తు సంస్థను ధర్మాసనం ఆదేశించింది. బదిలీ పిటిషన్‌కు మెయింటైనబిలిటీ లేదని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాది ముకుల్‌రోహత్గి ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. ఆ విషయాలు తర్వాత చూస్తామని, ప్రస్తుతం దర్యాప్తు ఎందుకు ఆలస్యం అయిందో దర్యాప్తు సంస్థ కారణాలు తెలపాలని, బదిలీ పిటిషన్, బెయిలు రద్దు పిటిషన్ కలిపి విచారణ చేస్తామని జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పష్టం చేశారు. 2024 ఆగస్టు 5 తో ప్రారంభమయ్యే వారంలో విచారిస్తామని పేర్కొన్నారు. దర్యాప్తు వేగవంతం చేయాలని దర్యాప్తు సంస్థను ఆదేశించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijayawada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.